వాడ్రేవు చినవీరభద్రుడు

సంతోషం
ఒక క్రియాపదం

సత్యశోధకులూ సన్మార్గసాధకులూ

వాడ్రేవు చినవీరభద్రుడు

సంతోషం

ఒక క్రియాపదం

సత్యశోధకులూ సన్మార్గసాధకులూ

SAMTOSHAM OKA KRIYAPADAM

Occassional Writings on Philosophy and Spirituality

CHINAVEERABHADRUDU VADREVU

e-book released in June, 2025

Cover page painting in watercolor &
Cover design, Composing and Lay out
Chinaveerabhadrudu Vadrevu

e book released by
Vadrevu Ch Veerabhadrudu
First Floor, House No.56,
Navodaya Colony, Mehdipatnam
Hyderabad 500 028
Telangana State, India

Mobile: +91 94909 57129
chinaveera@gmail.com
www.chinaveerabhadrudu.in

పరమయోగి శ్రీ వై. హనుమంతరావుగారి

దివ్యస్మృతికి

వరసగా

అజేయులు	7
ఋగ్వేదానికే ప్లేటో ఒక ఫుట్ నోటు	10
మరొక గంగావతరణం	14
ఏడు ధర్మాలు	26
గాసిప్పు ఉన్నచోట బుద్ధుడుండడు	30
ఉదానపాలి	34
తెలుగువాళ్ల భాగ్యం	38
నిజమైన జీవితాశయం	49
పులికన్నా ప్రమాదకరమైంది	54
కన్ఫ్యూసియసు	56
ఈ పుస్తకం ఒక దీపం	60
ఊ తావో జూ	66
పావనదర్శనం	70
ఆవిరిపూల కొమ్మ	79
నిజమైన సంతోషం క్రియాపదం	83
కృపావర్షధార	88

అత్యున్నత రూపకాలంకారం 92
సుమనస్వీ, దయాళువూ 98
రిక్తహస్తాలూ, స్వచ్ఛ హృదయమూ 102
వాల్డెను-1 106
వాల్డెను-2 114
కిర్కెగార్డు అవునంటే సార్త్ర కాదంటాడు 121
నువ్వింకా ప్రజలకి బాకీ పడి ఉన్నావు 125
మరో పూలప్రేమికుడు 129
నీరస తథ్యాల్ని తిరస్కరించడం 136
మన కాలపు మార్కసు అరీలియసు 143
ప్రతి వాక్యం ఒక వివేక చూడామణి 146
శ్రీ అరవింద సరిత్ సాగర 149
ముళ్ళదారి 153
సత్యశోధన 156
అనాసక్తి యోగం 160
కళాత్మక సత్యం 164
కృష్ణమూర్తి నోటుబుక్కు 170
భారతీయ రచయిత 173
సచ్చిదానందమూర్తి-1 178
సచ్చిదానందమూర్తి-2 186
ఒక యోగి ఆత్మకథ 192
ఒక సాధన కథ 196
లోపలి దారి 202
పరమయోగి 205

అజేయులు

నేనెక్కడో చదివాను, గొప్ప గురువులు ఏదీ ప్రత్యేకంగా నేర్పరు, నేర్చుకోవడమెట్లానో మటుకే నేర్పుతారు అని. ఆ మాట మా తాడికొండ పాఠశాలకి అక్షరాలా అన్వయిస్తుంది. ఆ పాఠశాల మా ముందు ఎన్నో జీవితాశయాలు పెట్టింది కాని, అన్నిటినీ మరిపింపచేసే ఒక జీవితాదర్శాన్ని కూడా మా ముందుంచింది. అదేమంటే, నేర్చుకోవడం, నేర్చుకుంటూ ఉండటం, తెలుసుకుంటూ ఉండటం, తెలిసినవాళ్ళని కలుసుకోవడం, వాళ్ళ మాటలు వినడం, వాళ్ళలాగా ఆలోచించడం, మాట్లాడటం అనుకరించడం, వారిని మనలోకి అనువదించడం.

మా స్కూల్లో చదువుకున్నవాళ్ళు ఎంతమంది ఈ ఆశయపాశానికి చిక్కుకున్నారో తెలియదుగాని, కన్నెగంటి రామారావు మాత్రం నా కళ్ళముందు కనిపిస్తున్నాడు. అతడూ నేనూ ఆ స్కూల్లో ఒక బాచిలో కలిసి చదువుకోలేదు, కాని ఆ సంస్కారవిశేషం వల్ల, ఇప్పుడతణ్ణి ఎక్కడ చూసినా, అతడి మాటలు,వ్యాఖ్యలు, ఎక్కడ చదివినా, నాకు మేమిద్దరం ఒకే తరగతిగదిలో కలిసి చదువుకుంటున్నట్టే అనిపిస్తుంది.

నిన్న వేదవతిగారి ఇంట్లో జరిగిన సాహిత్య సభలో అతణ్ణి కూడా మాట్లాడమని అడిగినప్పుడు, విదురనీతిలోంచి ఒక భావాన్ని గుర్తుచేస్తూ, ఒక్కసారిగా నా దృక్పథాన్ని ఆకాశమంత విస్తరింపచేసాడు. కుటుంబం కోసం వ్యక్తినీ, గ్రామం కోసం కుటుంబాన్నీ, దేశం కోసం గ్రామాన్నీ త్యాగం చెయ్యాలనే సుభాషితంలో మనకి గుర్తుండని చివరి వాక్యం, ఆత్మకోసం ప్రపంచాన్నే త్యాగం చెయ్యాలనే వాక్యాన్ని ఉదాహరిస్తూ, ఆత్మ అంటే ఏమిటి, నీకోసం ప్రపంచాన్ని వదులుకోవడమంటే ఏమిటి అంటూ చెప్తూ, అది గాంధీ చేసిన పోరాటాల్నీ, పౌరహక్కుల ఉద్యమాల్నీ, మైనారిటీ హక్కుల్నీ బలపరిచే వాక్యం కాదా అన్నాడు.

ఆ మాట వినగానే వేల ఏళ్ళ కిందటి ఆ సంస్కృత సుభాషితం ఒక్కసారిగా, ఊహించని, politico-legal significance తో ఆవిష్కృతమైంది.

ఆ క్షణాన, మెహిదిపట్నంలో ఆ గోకుల కృష్ణ అపార్ట్మెంట్సు ప్రాంగణం నాకు మా తాడికొండ పాఠశాలగా మారిపోయింది. దీపం దీపాన్ని వెలిగించాక, జరిగేదేమిటి, రెండు దీపాలూ వెలగడమే కదా.

రామారావు మాటలు వినగానే నాకు నారదుడికీ, సనత్కుమారుడికీ మధ్య జరిగిన సంభాషణ గుర్తొచ్చింది. ఆ సంవాదాన్ని ఎంతో సవివరంగా నమోదు చేసిన ఛాందోగ్య ఉపనిషత్తు ఇట్లా అంటున్నది:

యో వై భూమా తత్ సుఖం, నా అల్పే సుఖం అస్తి,భూమైవ సుఖం,
భూమాత్వేత విజిజ్ఞాసితవ్య, ఇతి భూమానం భగవో విజిజ్ఞాస (7:23.1)

'అన్నిటికన్నా విస్తరించిన ఆ మహావిషయమేదో, అందులోనే సుఖమున్నది, అల్ప విషయాల్లో సుఖం లేదు' అని సనత్కుమారుడు చెప్పినప్పుడు ఆ మహావిషయాన్ని తెలుసు కోవాలనే కోరిక కలుగుతున్నదని నారదుడు అన్నాడు.

ఆ మహావిషయం, దాన్నే ఉపనిషత్తు 'భూమం' అంది, దాన్ని తెలుసుకునే విద్యని 'భూమవిద్య' అంది. భూమవిద్య అంటే, ఈ ప్రపంచం కన్నా కూడా మిన్నదైనదేదో దాన్ని తెలుసుకోవడం, తెలుసుకోగలగడం.

ఉపనిషద్వాక్యంతో పాటు నాకు ఆస్ట్రేలియా ఆదివాసులు వార్ల్పిరి తెగవాళ్ళు గుర్తొచ్చారు. మధ్య ఆస్ట్రేలియాలో నివసించే వార్ల్పిరి ఒక అతిప్రాచీనమైన తెగ. వాళ్ళ నమ్మకం ప్రకారం వాళ్ళు జీవిస్తున్న చోటు నిజానికి వాళ్ళ పితృదేవతలు సంచరిస్తున్న చోటు. ఆ పితృదేవతలు ఏ అతీత కాలంనుంచో అక్కడ సంచరిస్తూ, స్వప్నిస్తూ ఉన్నారు. ఆ స్వప్నక్రియ, దాన్ని వాళ్ళు, 'జుకుర్ప' అంటారు, ఇంకా కొనసాగుతూనే ఉంది. అందువల్ల ఆ తెగ వాళ్ళ కాలం మన ప్రాపంచిక కాలం కాదు, అది వాళ్ళ పితృదేవతల స్వప్నకాలం dream time. ఈ లోకంలో పుట్టిన ప్రతి మనిషీ పాటలద్వారా, కథలద్వారా, క్రతువులద్వారా ఆ స్వప్నగాథని కొనసాగిస్తూనే ఉండాలి. ఉపనిషత్తులు ఏ పితృఋణం గురించి మాట్లాడేయో, అట్లాంటి ఋణమే. అయితే ఉపనిషత్తులు ఆ ఋణాన్ని పంచ-యజ్ఞాల ద్వారా తీర్చాలన్నాయి. వార్ల్ పిరి తెగ వారు కథలు చెప్పడం ద్వారా, చెప్పుకోవడం ద్వారా ఆ ఋణాన్ని తీర్చుకోవాలనుకుంటారు.

దాదాపుగా వార్ల్‌పిరి లాంటి నమ్మకాలే కలిగిన నగ్రిన్యేరి తెగవాళ్ళలో స్త్రీల dream time వేరు. పురుషుల dream time వేరు. స్త్రీల కథారహస్యం ఎవరితోటీ పంచుకోకూడదని ఒక నియమం. కొన్నాళ్ళ కిందట, వాళ్ళ పవిత్రస్వప్నభూమిలో గూల్వా, కుమారంక్ అనే రెండు గ్రామాల మధ్య ఒక వంతెన కట్టవలసివచ్చింది. కాని ఆ వంతెన తమ పూర్వీకుల స్వప్నాన్ని భంగపరుస్తుంది కాబట్టి ఆ వంతెన కట్టవద్దని నగ్రిన్యేరి స్త్రీలు అడ్డుపడ్డారు. అదొక పెద్ద న్యాయపోరాటంగా మారిపోయింది. ఆస్ట్రేలియా మొత్తం రెండు శిబిరాలుగా విడిపోయింది. ఆ కట్టబోయే వంతెన ఆ స్వప్నభూమిని ఏ విధంగా భంగపరుస్తుందో చెప్పమని కోర్టు ఆ ఆదివాసి స్త్రీలని ప్రశ్నించింది. వాళ్ళొక ధర్మసంకటంలో పడ్డారు. వంతెన కడితే తమ పూర్వీకుల స్వప్నప్రక్రియ భంగపడుతుంది. కాని ఎందుకో చెప్తే, తమ కథారహస్యాల్ని తామే భంగపరుచుకున్నవాళ్ళవుతారు. ఏం చేయాలి? పితృదేవతలకోసం ప్రపంచాన్నే వదులుకున్నవాళ్ళు, ఇప్పుడు పితృదేవతలకోసం, పితృదేవతలు పెట్టిన నియమాల్ని వదులుకోవాలా? మరొక వైపు, ఆ కథలూ, రహస్యాలూ ఏమీ లేవనీ, అదంతా అభూతకల్పనలేననీ తెల్లవాడి లాయర్లు వాదించడం మొదలుపెట్టారు. ఆ జాతి ఆత్మగౌరవమే ప్రశ్నార్థకమైంది.

మనమైతే ఏమి చేసి ఉండేవాళ్ళం?

కాని ఆ ఆదివాసిస్త్రీలు తమ వ్రతాన్ని భంగపరుచుకోడానికి ఇష్టపడలేదు. ఆ రహస్యాన్ని కోర్టుకి చెప్పడానికి ఇష్టపడలేదు. వాళ్ళు వ్యాజ్యం నష్టపోయారు. ఆ నది మీద వంతెన కట్టారు. కొన్ని మహాయుగాలుగా అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వస్తున్న వాళ్ళ పితృదేవతల స్వప్నం ముగిసిపోయింది.

కాని నేనేమనుకుంటానంటే, ఆ స్త్రీలు తమ అంతరాత్మ కోసం ప్రపంచాన్నే కాదు, తమ ఆకాశాన్నీ, భూమినీ కూడా వదులేసుకున్నారని. వారు చట్టం ముందు ఓడిపోయారు గానీ, అంతరాత్మ ఎదట అజేయంగా నిలబడ్డారని!

20-12-2015

ఋగ్వేదానికే ప్లేటో ఒక ఫుట్‌నోటు

ఇంటికొచ్చేటప్పటికి కొరియరు పాకెట్టు బల్ల మీద ఎదురుచూస్తూ ఉంది. ఆ అర్థరాత్రే దాన్ని ఆతృతతో విప్పి చూసాను. ఆంటోనియో.డి.నికలస్ రాసిన Meditations through Rigveda: Four Dimensional Man (2003). 1976 లో మొదటిసారిగా వెలువడ్డ రచనకి కొత్త ఎడిషను.

ఆ పుస్తకాన్నట్లానే చేతుల్తో ఆప్యాయంగా తడిమి చూసుకున్నాను. అట్టవెయ్యకుండా కొత్త పుస్తకంలోకి మనసుపెట్టలేను గానీ, ఆ రాత్రే, ఆ మొదటి క్షణాల్లోనే, ఆ పుస్తకంలో రెండుపేజీల ముందుమాట చదవకుండా ఉండలేకపోయాను.

ఆ ముందుమాట రాసిన పాట్రిక్ ఐడాన్ హీలన్ (1926-2015) ఒక ఐరిష్–అమెరికను జెసూటు, భౌతికశాస్త్రవేత్త, సైన్సు ఫిలాసఫరు. క్వాంటం మెకానిక్సులో, హెర్మెన్యూటిక్ ఫిలాసఫీ ఆఫ్ సైన్సులో జీవితకాలం కృషి చేసినవాడు, సుప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త హైసన్‌బర్గ్‌కి మిత్రుడు కూడా. ఆయన రాసిన ఆ రెండు పేజీల ముందుమాటనీ యథాతథంగా మీతో పంచుకోవాలనిపించింది.

ఆయనిట్లా రాసాడు:

> మానవ భాష, ఆలోచన, భావవ్యక్తీకరణల గురించిన ఈ అసాధారణమైన రచన చదవగానే, మనకి దివ్య 'సోమ'రసపానంతో మత్తెక్కినట్టనిపిస్తుంది. ఈ రచన మన దృక్పథంలో తీసుకువచ్చే మార్పు ఒక వైపు కలతపరిచేదిగానూ, మరొకవైపు ఉద్రేకించేదిగానూ కూడా ఉంటుంది. ఎందుకంటే, ఇంతదాకా పరీక్షకు నిలవకుండా కొనసాగుతున్న నీరసతథ్యాల్ని మోసుకొస్తున్న భావచట్రాల్ని (frame works) ఈ రచన సవాలు చేస్తున్నది, మరొకవైపు

ఆ చట్రాలకు ఆధారమైన ప్రాతీపదికల్నీ, వాటి తర్కాల్నీ, వాటి మధ్య ఉండే పారస్పరిక సంబంధాల్నీ (mutual relations) కూడా ప్రశ్నిస్తున్నది.

భాష గురించీ, ఆలోచన గురించీ అన్వేషించడం ప్రమాదంతో కూడుకుని ఉన్న పని. ఎందుకంటే, మనం ఆ క్రమంలో, భాష అంటేనూ, ఆలోచన అంటేనూ, పాశ్చాత్యసంస్కృతి దేన్ని భాషగా, ఆలోచనగా అర్థం చేసుకుంటున్నదో, అదే భాష, ఆలోచన అనే భ్రమకు లోనవుతాము కనుక. పాశ్చాత్యచింతన మూలాల్ని అన్వేషిస్తూ, మౌలికంగా చింతనమూలాల్నే అన్వేషిస్తున్నామని పియాగి లానే మనం కూడా భావించే ప్రమాదముంది.

కాని ఋగ్వేదం ప్లేటో కన్నా ఎంతో ప్రాచీనమైనదే కాకుండా, చింతనకి ప్లేటో దేన్ని మూలాధారంగా ప్రతిపాదించాడో, ఆ ప్రతిపాదనలకి అత్యంత ప్రాచీన ఆధారం కూడా. కానీ అది మూలాధారమనే విషయం విస్మృతిలో పడిపోయింది. ప్లేటోనుంచి పాశ్చాత్యచింతన వారసత్వంగా గ్రహించిన రేఖీయచింతన (linearity) కన్నా, డి నికొలస్ చెప్తున్న ఋగ్వేదీయ బహుళపార్శ్వ చింతన (multi dimensionality) పూర్తిగా భిన్నమైనది.

వైవిధ్యం (variety), పారస్పరికత (interrelation), విడివిడిగా మనగలుగుతున్న (mutual exclusivity) తార్కిక ఆలోచనావ్యవస్థలకు సంబంధించిన అత్యంత క్లిష్టమైన సమకాలీన తాత్త్వికప్రశ్నల్ని పరిశోధిస్తున్న తీరువల్ల ఈ ఉత్తేజశీలమైన రచన పాశ్చాత్య తత్త్వవేత్తలకు ఆవశ్యకమవుతున్నది. సైన్సుచరిత్రను అధ్యయనం చేసే వాళ్ళనీ, భాష గురించి పరిశోధిస్తున్న మానవశాస్త్రవేత్తల్నీ, మతాల్నీ, పురాణగాథల్నీ అధ్యయనం చేస్తున్న విద్యార్థుల్నీ ఈ ప్రశ్నలు వేధిస్తుండటమే కాక, పాశ్చాత్యచింతనలోని పరిమితులు అటువంటి అధ్యయనాలకు అడ్డుపడుతున్నవి కూడా. పాశ్చాత్య ప్రపంచంలో, సైంటిఫిక్ పరిశోధన మొదణ్ణుంచీ ఒకే గాటన కొనసాగుతూండటమే కాక (essentially linear), చాలాసార్లు సైన్సుకి సంబంధించిన చారిత్రిక సంప్రదాయం సందర్భంతో నిమిత్తం లేకుండా (non contextual historical tradition) ఊహాగానాలు చేస్తూంటుంది.

అటువంటి సంప్రదాయం నుంచి మనం అంతకన్నా సమూలంగా విరుద్ధమైన మరొక సంస్కృతిలోకి (radically different culture) దూకినప్పుడు,

ఉదాహరణకి, ఋగ్వేదాన్నే తీసుకోండి, అందులో కనవచ్చే ఆలోచనా-ధోరణులకీ, మనకీ మధ్య ఉన్న అగాధం ఎంత పెద్దదంటే, దాన్ని అర్థం చేసుకోవడానికి పాశ్చాత్య హేతుశీలత్వానికున్న సాధనసంపత్తి ఎంతమాత్రం చాలదనిపిస్తుంది. ఆ రచనలో అంతర్భాగంగా దానికే సంబంధించిన హేతుసూత్రాల్ని, 'దాని context లో ఒదిగి ఉన్న text' ని అర్థం చేసుకోవడానికి ధ్యానంతో ప్రయత్నించవలసి ఉంటుంది. ఇటువంటి పద్ధతి, డి నికొలస్ చెప్తున్నట్లుగా, అంతిమంగా, non-linear లేదా contextual గా పరిణమిస్తుంది.

క్వాంటమ్ మెకానిక్సు ఈ విధంగానే రూపొందిందని అతడు మనకు గుర్తు-చేస్తున్నాడు. అక్కడ, కొలమానానికి సంబంధించిన వివిధ ప్రాథమికవ్యవస్థలు (complementary frameworks) ఒకదానికొకటి సంబంధం లేనివి కాబట్టి (non-linear) ఒక అల్లికలాగా ఒకదానికొకటి పొదుగుతూ క్వాంటం మెకానిక్సు రూపొందిందని మనకు తెలుసు. కాబట్టి ఆ వ్యవస్థలని పూరక-వ్యవస్థలంటున్నాం.

ఏదైన ఒక విషయాన్ని తెలుసుకోవాలనుకునే ఒక జ్ఞాతలో అంతర్గతంగా ఉండే ఆత్మాశ్రయత్వం embodied subjectivity of a knower) లో మార్పులు వచ్చినప్పుడల్లా, అతడు తెలుసుకోదలచుకున్న వస్తుగత సత్యాల్లోనూ, దృశ్యదిగంతాల్లోనూ కూడా తప్పని మార్పుల్ని బట్టే ఆ పూరకవ్యవస్థలు రూపొందుతాయి.

వేదగానంలోనూ, వేదక్రతువుల్లోనూ కనవచ్చే ఆత్మాశ్రయత (subjectivity embodied in chant and ritual) ప్రపంచంలో కనవచ్చే బహుముఖీ-నతనీ, వివిధత్వాన్నీ వెల్లడి చేస్తుంది. అయితే, ఒక రేఖీయ క్రమంలోనో, లేదా ఒకదానికొకటి కూడితే వచ్చే వివిధత్వం ద్వారానో కాదు, ఒక 'పూర్ణాహుతి' (sacrifice) ద్వారా మాత్రమే సాధ్యమవుతుందది.

అక్కడ ప్రతి ఒక్కరూ తమ తమ ఆత్మాశ్రయిత్వంలో కుదురుకున్న ఉమ్మడిభూమికకీ, తామంతా కలిసి పంచుకుంటున్న 'దర్శనాని' కీ సాపేక్షంగా అనుసంధానమై (relativized) ఉంటారు. అట్లాంటి ఉమ్మడి భూమిక కేవలం ఒకరికొకరిని కూడుకుంటూ పోతే కలిగేది కాదు.

భాష్యపూర్వకమైన, వ్యాఖ్యానరూపకమైన ఈ రచనను చదివి తీరాలని సిఫార్సు చేస్తున్నాను. వైట్‌హెడ్‌ని నమ్ముతూ, తత్త్వశాస్త్రమంతా ప్లేటోకి ఫుట్‌నోటు మాత్రమేనని భావించేవాళ్ళు మరీ తప్పకుండా చదవాలి. ఎందుకంటే, ఆ మాట బహుశా పాశ్చాత్య తత్త్వశాస్త్రం విషయంలో నిజంకావచ్చునేమోగాని, మొత్తం తత్త్వశాస్త్రానికి మాత్రం కానేకాదు.

ప్లేటో వెనక, ప్లేటోకి నేపథ్యాన్ని సమకూరుస్తూ ఋగ్వేదమున్నది. బహుశా డి నికొలస్ చెప్పే మాటలు నిజమే అనుకుంటే, అనేక పార్శ్వాలకు– లేదా నాలుగు పార్శ్వాలకు –సంబంధించిన దర్శనాన్ని ప్రతిపాదిస్తున్న ఋగ్వేదానికే ప్లేటో, పాశ్చాత్యతత్త్వశాస్త్రమూ కూడా ఫుట్‌నోట్లుగా కొనసాగుతున్నారని చెప్పవలసిఉంటుంది.

6-11-2016

మరొక గంగావతరణం

సికింద్రాబాదు రైల్వేస్టేషను. కాకినాడ వెళ్ళడానికి ఆ రాత్రి నేనూ, విజయభాస్కర్ గౌతమీ ఎక్స్‌ప్రెస్సు ఎక్కవలసి ఉంది. రైలు రెండున్నరగంటలు లేటు. కిక్కిరిసిపోయిన ఆ స్టేషన్లో, ఊపిరాడనివ్వని ఆ రొదలో, విజయభాస్కర్ 'నేనొకటి చదువుతాను, వింటారా' అనడిగాడు.

గత రెండుమూడేళ్ళుగా తాను ఉపనిషత్తుల్ని అధ్యయనం చేస్తూ వచ్చాననీ, వాటిని తెలుగులో తనదైన మాటల్లో తిరిగి రాసుకున్నాననీ చెప్పాడు. అలాగని అనువాదం కాదు, వ్యాఖ్యానమూ కాదు. తిరిగి చెప్పడం. తిరిగి చెప్పుకోవటం. తనకి తాను చెప్పుకునే క్రమంలో మనకి చెప్పుకోవడమని చెప్పాడు.

'సరే చదవండి, వింటాను' అని అన్నానేగాని, ఆ రైల్వేస్టేషను వాతావరణానికీ, ఉపనిషత్తులకీ ఎక్కడ పొసగుతుందన్న అనుమానం నాకుండనే ఉంది.

ఆయన వినిపించడం మొదలుపెట్టాడు.

కారకఋషి ప్రోక్తమైనదీ శ్రేష్ఠతర ఉపనిషత్తు
ఆత్మవిద్యను అస్పష్టత లేకుండ తెల్లపర్చినది.

అర్థమయింది. కఠోపనిషత్తు. బాగానే ఉందనుకున్నాను. నరకలోకంలో వినబడ్డ జ్యోతిర్విద్యని ఆ రైల్వేస్టేషన్లో అలా వినడంలో ఏదో దగ్గరి పోలిక ఉందనిపించింది. ఆ అనౌన్సుమెంట్ల మధ్య, వచ్చీపోయే రైళ్ళ చప్పుళ్ళమధ్య, నా ఒళ్ళంతా చెవులుగా మార్చుకుని వినడం మొదలుపెట్టాను.

కానీ కొంతసేపటిలోనే ఆ చప్పుళ్ళన్నీ అణగిపోయేయి. విశాలమైన ఆశ్రమాల్లో, హోమాగ్ని ముందు, గురుశిష్యులు, తమ తేజస్సుని ఒకరికొకరు పంచుకుంటూ,

పరమోత్కృష్టమైన ఒక జీవనవిద్యను కలిసి కూచుని అభ్యసిస్తున్న కాలానికి వెళ్ళిపోయాను. అక్కడ నా ముందు ఒక ఋషి తెలుగులో ఇలా చెప్తున్నాడు:

> శరీరమందుండిన నశరీరమది, నశ్వర వస్తుసముదాయ సాంగత్యప్రభావం
> సోకని చిరస్థావరమది, ఆదిమధ్యాంతరహిత కిరణమది, సృష్టి సహజాత
> మది, అజాతమది, పూర్వాపూర్వమెరుగని ప్రబలపదార్థ పలుప్రభలప్రకాశమది
> అనంత ఆకాశపు సరిహద్దుల్లో ఆవరించిన నిరూపణలేని అవ్యక్తసత్యస్వరూపమది

ఇంకా ఇలా చెప్తున్నాడు:

> అనుభవించినవాడు నిత్యం కాదు, అనుభూతి సత్యం కాదు, ఈ విలాస
> క్రియను చూచు సాక్షి ఎవ్వడో వాడు నిత్యసత్యములు, నిర్గుణుడు, నిరాపేక్షుడు
> నిరవధిక అస్తిత్వముతో అలరారువాడు. అట్టివాని ఉనికి తెలియవలయునన్న
> మనిషి లోయాత్ర చేయవలెను, ఇంద్రియములకు లోచూపు నేర్పవలెను.

అప్పటిదాకా నా మనసుమీద పేరుకున్న దైనందిన జీవితపు దుమ్ము చెదిరిపోయింది. నా చుట్టూ రొద అణగిపోయింది. నా ముందు ఒక అజరామర వాక్కు నా మాతృభాషలో ఇలా ఘోషిస్తున్నది:

> నువ్వు జీవుడవు, జీవి మాత్రమే కాదు. నీ కొరకే దేవుదున్నది, నీ కొరకే దేవుడన్నది.
> నీది విశ్వవ్యాపకత్వం, నీది పరిశుద్ధ ఆకాశతత్త్వం, అదృశ్యరూపము దాల్చి
> సమస్తక్రియలకు ఏది ఆధారమౌతున్నదో అది నువ్వే. వికలంగా కనిపించే
> సకలం నువ్వు. ప్రాణులుగా విడివడిన ఏకత నువ్వు, నింగిన చైతన్యకేతనం నువ్వు.

ఇది మంత్రమా! కవిత్వమా! గంభీరమైన ప్రసంగమా! నువ్వు పడిపోకుండా చేతులడ్డుపెట్టి నిలకడగా నీకు అందిస్తున్న ఉపదేశమా! బహుశా, నేను జీవించినంతకాలం, ఆ రాత్రి ఆ రైల్వేస్టేషన్లో, ఆ ప్లాట్‌ఫారం మీద నేను విన్న ఆ కఠోపనిషత్తు పాఠం నా స్మృతిలోంచి చెదరదు.

2

వేదవాఙ్మయం మూడు భాగాలనీ, మొదటిది సంహిత, రెండవది బ్రాహ్మణాలు, మూడవది ఆరణ్యకాలు అనీ, అందులో ఆరణ్యకాల్లో ఉపనిషత్తులు ఒక భాగమనీ మనకు తెలుసు. అలాగే బ్రాహ్మణాలు క్రతుప్రధానాలనీ, కాబట్టి వాటిని కర్మకాండ అనీ, ఉపనిషత్తులు

జ్ఞాన వివేచన చేసాయి కాబట్టి వాటిని జ్ఞానకాండ అని వ్యవహరిస్తున్నారనీ కూడా మనం విన్నాం. తరువాత రోజుల్లో మీమాంసకులు కర్మప్రాధాన్యాన్ని ఉగ్గడిస్తే, ఉత్తర మీమాంసకులు జ్ఞానం ప్రధానమని వాదించారనీ, దాన్నే వేదాంతమని వ్యవహరించారనీ కూడా మనకు తెలుసు.

కానీ అనూచానంగా మనదాకా వచ్చిన ఈ కథనంలో కొన్ని గమనించవలసిన విషయాలున్నాయి. మొదటిది, వేదసంహితల్ని కూర్చేనాటికే, ఆ వేదమంత్రాలు ఎంతో కాలంగా ప్రచలితంగా ఉన్నాయి. వాటిని ఒకచోట కూర్చడమంటేనే వాటి మంత్రపాఠాన్ని స్థిరీకరించడం. ఆ అర్థాల్ని కూడా దాదాపుగా ఒక నిర్దిష్టస్ఫురణకు చేర్చడం. అంటే ఆ మంత్రాల్ని ఋషులు దర్శించిన ఎన్నో వందల ఏళ్ళ తరువాత వాటిని సంహితలుగా కూర్చారనుకుంటే, ఆ తరువాత మరికొంతకాలంపాటు బ్రాహ్మణాల రచన జరిగి ఉండాలి. ప్రతి ఒక్క వేదసంహితకీ బ్రాహ్మణాలు ఉన్నప్పటికీ, యజుర్వేద బ్రాహ్మణమైన శతపథబ్రాహ్మణమే వైదికయజ్ఞస్వభావాన్ని నిర్దేశించిదని చెప్పవచ్చు. అంటే అక్కడే బ్రాహ్మణాలు ఋగ్వేదప్రధానంగా కాక, యజుర్వేదప్రధానంగా ఆలోచన చేసాయని చెప్పవచ్చు. అలాగని యజుర్వేదం నిర్వహించిన పాత్రని తక్కువచేయలేం. ఒక ఉత్తేజం, ఒక ఉద్యమస్ఫూర్తి కలకాలం నిలబడాలంటే దాన్నొక కార్యాచరణప్రణాళికగా మార్చాలనుకోవడం సహజం. ఋగ్వేదం ఒక ఉజ్జ్వలస్ఫూర్తి అనుకుంటే యజుర్వేదం ఒక కార్య–నిర్వహణప్రణాళిక.

కాబట్టి యజుర్వేద, సామవేదాలకు కూడా ఋగ్వేదమే స్ఫూర్తి. ఋగ్వేదం ఒక సమష్టిప్రార్థన కాగా, యజుర్వేదం ఒక సమష్టికర్మ, సామవేదం ఒక సమష్టిగానం. కాని, ఋగ్వేదసూక్తాల్ని చదువుతున్నప్పుడు మనకి ఎంతో ఆరోగ్యవంతమైన ఒక ప్రాచీన మానవ సమాజం కనిపిస్తుంది. వారు తమకి లభించిన ఈ జీవితాన్ని, తమ అనుభవంలోకి వస్తున్న సంతోషాన్ని, తమకి 'కనిపిస్తున్న' లోకాన్ని, తాము 'దర్శిస్తున్న' ఒక వెలుగుతో అనుసంధానపరుచుకుంటూ తమ జీవితాన్నొక నిత్యక్రతువుగా జీవించారు. వారికి జీవితమంటే ఒక ప్రార్థన, ఒక యజ్ఞం, ఒక సత్యం, ఒక ఋతం. వారి ఊహలూ, మాటలూ, చేతలూ అన్నీ సమష్టి. అక్కడ వ్యష్టికి తావులేదు.

అది ఎప్పుడో ఏ ప్రాగైతికహాసకాలంలోనో సంభవించిన ఒక గణజీవితోత్సవం. అయితే అటువంటి స్ఫూర్తివంతమైన, సమ్యక్ స్ఫురణతో కూడిన ఒక సమష్టికర్మగా జీవితాన్ని గడిపిన ఆ ఉత్తేజాన్ని అంతే నిరంతరాయంగా కొనసాగించడమెలాగు అన్నదే ఋగ్వేదానంతర వైదికమానవుడి తపన. దాన్నే మన చరిత్రకారులు మలివేద కాలం

అన్నారు. తొలివేదకాలంలో దేవతలు, యజ్ఞాలు, దానాలు ఉన్నప్పటికీ, వాటన్నిటినీ అనుసంధానపరుచుకున్న ఒక అఖండ జీవనోత్తేజముంది. ఆ ఉత్తేజాన్ని తిరిగి తమ మధ్య ప్రతిష్ఠించుకోవడమెలాగు?

ఆ ఋగ్వేద ఋషులు ఏ యజ్ఞాన్ని ప్రస్తుతించారో ఆ యజ్ఞాల్ని నిర్దుష్టంగా నిర్వహిస్తే ఆ అగ్ని చల్లారకుండా చూసుకోవచ్చని యజుర్వేదమూ, బ్రాహ్మణాలూ భావించాయి. కాని బ్రాహ్మణాల కాలం నాటికి వైదికసమాజంలో అంతరాలేర్పడ్డాయి. వర్ణాలు విస్పష్ట-మయ్యాయి. ఋగ్వేదంలోని స్ఫూర్తి స్థానంలో రాజీలేని క్రతునిర్వహణ వచ్చిచేరింది. సమతలసమాజం సోపానసమాజంగా మారింది.

ఉదాహరణకి ఒక జాతి ఉందనుకుందాం. అది ఒక రాజకీయ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిందనుకుందాం. అలా పోరాటం చేస్తున్న రోజుల్లో ఆ జాతి తనలో ఎటువంటి అంతరాల్నీ పట్టించుకోక, తను మొత్తం ఒకే దేహంగా, ఒకే మనస్సుగా పోరాటం చేస్తుంది. అప్పుడు దాన్ని నడిపించేది ఒకే ఒక్క ఉత్తేజం. ఆ జాతి స్వాతంత్ర్యం పొందాక, తమని తాము పరిపాలించుకోడం కోసం ఒక సంవిధానాన్ని రాసుకున్నారనుకుందాం. కాలం గడిచేకొద్దీ, ఆ స్వాతంత్ర్యపోరాటం నాటి స్ఫూర్తి కనుమరుగవుతూ, ఎటువంటి రాజీ పడకుండా ఆ సంవిధానాన్ని అమలు చేయడమే ముఖ్యమనే ధోరణి బలపడుతూ ఉంటుంది. జాతి తన రాజకీయస్వాతంత్ర్యం కోసం పోరాడినప్పుడు కనిపించని తరతమ భేదాలు రాజ్యాంగనిర్వహణ మొదలవగానే తలెత్తడమేకాక, నానాటికీ బలపడుతుంటాయి కూడా.

వైదిక ప్రాపంచిక దృక్పథంలో ఈ మార్పు మనకి స్పష్టంగా కనిపిస్తుంది. ఎందుకంటే నిర్దుష్టంగా యజ్ఞాలు జరపడం ద్వారా మాత్రమే ఋగ్వేదసూక్తాల్లోని స్ఫూర్తిని కొనసాగించ-గలమని బ్రాహ్మణాలు భావించాయి. ఇది ఎంతవరకూ పోయిందంటే, తర్వాతి రోజుల్లో మీమాంసకులు మంత్ర, బ్రాహ్మణాలూ రెండూ కలిస్తేనే వేదమని నిర్వచించేదాకా.

వేదాన్ని బ్రాహ్మణాలు యజ్ఞప్రధానంగా నిర్వచించడం మొదలుపెట్టాక, మరెన్నో ఏళ్ళకి, అసలు వేదార్థం ఏమిటి? ఋగ్వేద ఋషులు దర్శించిందేమిటి? మానవజీవిత పరమార్థమేమిటి? అనే ప్రశ్నలు తలెత్తడం సహజమే కదా. ఆ ఆలోచనలు ఎప్పుడో రెండుమూడు వేల ఏళ్ళ కిందట మొదలై ఇప్పటిదాకా కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఆ ప్రశ్నల్ని అందరికన్నా ముందు లేవనెత్తి, ఆ క్రమంలో, మానవజీవిత ప్రయోజనం గురించి ఒక సరికొత్త వివేచనకు అంకురార్పణ చేసినవిగా ఉపనిషత్తులు భారతీయ చరిత్రలో నిలబడిపోతాయి.

నిజానికి ఋగ్వేదకాలం నాటికే, వైదిక, అవైదిక దృక్పథాల మధ్య ఒక సంఘర్షణ, ఆ సంఘర్షణలోంచి ఒక సమన్వయం సాధించుకోవడం కనిపిస్తుంది. కాని బ్రాహ్మణాలు తమ దృక్పథానికి భిన్నమైన ఎటువంటి ఆలోచననీ స్వీకరించడానికి ఇష్టపడలేదు. అవి యాగప్రధానంగానే ఉండటానికి ఇష్టపడ్డాయి. కాని మరొకవైపు ప్రాచీన భారతదేశంలోని ఎన్నో శ్రమణదర్శనాలు యోగప్రధానాలుగా ఉన్నాయి. యాగం సమష్టికర్మ కాగా, యోగం వ్యక్తిని సంస్కరించే ఒక శారీరిక-మానసిక క్రమశిక్షణ. బ్రాహ్మణాలు మాట్లాడుతున్న యాగంలో అగ్ని ఉంది. కాని అది ritual fire గానే మిగిలిపోయింది. మరొకవైపు యోగం మాట్లాడుతున్న అగ్ని నిత్యాగ్ని. మననశీలమానవుడిలో సదా రగులుతుండే వివేచనాగ్ని. ఉపనిషత్తులు చేసిందేమంటే, బ్రాహ్మణాలు మాట్లాడుతున్న యాగాగ్నిని యోగాగ్నితో విశ్లేషించడం. అలా తమ చింతనతో ఆ అగ్నిని ప్రజ్వరిల్లచేసుకోవడం ద్వారా అవి ఋగ్వేదకాలం నాటి స్ఫూర్తిని తిరిగి పునఃప్రతిష్ఠించుకోగలమని భావించాయి. ఈ ప్రయత్నాలకు సమాంతరంగా బుద్ధుడు, బ్రాహ్మణ కేంద్రకమైన, యజ్ఞప్రధానమైన, క్రతుదర్శనం స్థానంలో, ఒక శ్రమణసంఘాన్నీ, ధర్మాన్నీ, అష్టాంగయోగాన్నీ తీసుకొచ్చాడు. ఆ ప్రయాణంలో ఉపనిషత్తుల నుంచి బుద్ధుడూ, బుద్ధుడి నుంచి ఉపనిషత్తులూ కూడా ఇచ్చిపుచ్చుకున్నది ఎంతో ఉంది.

కాని సోక్రటీసు, కన్ఫ్యూసియసు, లావోత్సే, బుద్ధుడు, మహావీరుడు మొదలైనవారి దర్శనాలకీ ఉపనిషత్తులకీ మధ్య ఒక ప్రధానమైన తేడా ఉంది. తక్కినదర్శనాలన్నీ ఒక ప్రవక్త కనుగొన్న సత్యం మీదా, అతడు ప్రతిపాదిస్తున్న దర్శనం మీదా ఆధారపడినవికాగా, ఉపనిషత్తులు ఒకరు రాసినవి కావు. ఒక కాలంలో ప్రభవించినవి కూడా కావు. ఏదో ఒక వేదశాఖకి చెందినవి కూడా కావు. అలాగే ఒక ప్రాంతానికి చెందినవి కూడా కావు. ఒక పరిశోధకుడు చెప్పినట్టుగా, తొలి ఉపనిషత్తుల్లోనే ఒక ఉపనిషత్తుకీ, మరొక ఉపనిషత్తుకీ మధ్య, గాంధారజనపదానికీ, విదేహజనపదానికీ మధ్య ఉన్నంత దూరముంది. అంతే కనీసం రెండువేల మైళ్ళ దూరం ఉంది.

కాబట్టి అవి బహుళదర్శనాలు. ఆ బహుళత కూడా 'సత్యమొక్కటే, విద్వాంసులు వేరువేరుగా దర్శిస్తారు' అనే ఋగ్వేద స్ఫూర్తికి అనుగుణంగా ఉన్నదే. కాబట్టి ఉపనిషత్తులన్నీ ఒకే సత్యం గురించి అన్వేషించాయని చెప్పవచ్చుగాని, అన్నీ ఒకే సత్యాన్ని ప్రతిష్ఠించాయని చెప్పలేం. నిజానికి వాటి దృష్టి ఏదో ఒక సత్యాన్ని నిలబెట్టడంలేదు. అసలు సత్యమేమిటని అన్వేషించడం వాటికి ప్రధానం. బ్రాహ్మణాలు మాట్లాడుతున్న యజ్ఞాలు ఆ సత్యానికి మనల్ని చేరువగా తీసుకుపోగలవా? మరోలా చెప్పాలంటే, బ్రాహ్మణాలు మాట్లాడుతున్న

యజ్ఞఫలమూ ఋగ్వేద ఋషులు ఆశించిందీ ఒకటేనా? అయి ఉంటే ఏ మేరకు? ఏదైనా సారూప్యం ఉందా? సంబంధం ఉందా?

ఈ ప్రశ్నలకి ఒక్కొక్క ఉపనిషత్తు ఒక్కొక్క విధంగా జవాబులు వెతుక్కుంది. అన్నిటి కన్నా ప్రాచీనమైన బృహదారణ్యకం మనిషి శ్వాసక్రియనే నిజమైన అశ్వమేధయాగంగా భావిస్తే, తొలి ఉపనిషత్తుల్లో చివరిదని చెప్పదగ్గ ముండకోపనిషత్తు అసలు యజ్ఞయాగాదుల్నే పక్కనపెట్టేసింది. తర్వాత రోజుల్లో బౌద్ధం ప్రభావం వల్ల ఉపనిషత్తుల్ని పూర్తి జ్ఞానకాండగా భావించిన వేదాంతం తొలి ఉపనిషత్తుల స్ఫూర్తికి మరింత దూరంగా జరిగిపోతూ వచ్చింది.

కానీ ఉపనిషత్తుల్లో కనవచ్చే వివేచనా, విచారణలూ ఎంత జ్ఞానప్రధానాలో అంత కర్మప్రధానాలు కూడా. అసలు కర్మని ఉపనిషత్తులు ఒక యాంత్రిక యాజ్ఞికకర్మగా కాక, మనిషి తనని తాను ఆహూతిగా సమర్పించుకునే సమష్టి త్యాగకర్మగా దర్శించాయి. కాబట్టి అవి ఇహలోక జీవితాన్ని నిరాకరించకపోగా, 'అదమ్' ఎంత పూర్ణమో 'ఇదమ్' కూడా అంతే సంపూర్ణమని ఘోషించాయి.

ఉపనిషత్తుల ప్రధాన ఇతివృత్తం మానవుడు. అతడి దేహం, అతడి ఇంద్రియాలు, అతడి శ్వాస, అతడి మనస్సు, అతడిలో రగిలే అగ్ని. అతడిలోనే మూడులోకాలూ ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే బయట ఉన్నదే అతడిలో ఉన్నది. అది, అంటే ఆ బ్రహ్మాన్, ఆ పరమసత్యం, అది నువ్వే. 'తత్ త్వమ్ అసి'.

అవి పరలోకాన్ని కోరుకోలేదు. ఇహలోక జీవితాన్నే భయరహితంగా, ఆనంద–మయంగా జీవించడమెలా అన్నది వాటి తపన. ఉపనిషత్తుల అన్వేషణ మొత్తాన్ని మూడు మాటలకి కుదించమంటే అభయం, అమృతం, ఆనందం అని చెప్తాన్నేను.

ఇటీవలి కాలపు ఒక పరిశోధకుడు, Patrick Olivelle అనే ఆయన ఇలా రాస్తున్నాడు (The Early Upanishads,1998,పే .22).

> యజ్ఞమూ, బ్రహ్మాన్ గురించిన ఆలోచనలూ ఉపనిషత్తులంతటా ఉన్నప్పటికీ, వాటి వివేచన ప్రధానంగా మానవుడి గురించే. అతడి దేహనిర్మాణం, అతడి ప్రాణశక్తులూ, ఇంద్రియధర్మాలూ, అతడి ప్రజ్ఞాన ప్రక్రియ, అసలు ఒకడు మానవుడిగా ఉండటంలోని అసలైన అంతస్సారం. మానవుడి ఆలోచనకి మానవుడే ముఖ్యవిషయం కావడంలో ఆశ్చర్యం లేదు.

3

ఉపనిషత్తుల్లో ఉన్న విశేషమేటంటే అవి ఎన్నో యుగాల తర్వాత కూడా, ఇప్పుడు ఒక పాఠకుడు వాటిని తన చేతుల్లోకి తీసుకున్నా కూడా అవి అతడితో నేరుగా సంభాషించగలవు. అతడిలో అగ్నిని పునఃప్రజ్వరిల్ల చేయగలవు. ఉపనిషత్తులు తనతో నేరుగా మాట్లాడుతున్న–దేమిటో అర్థం చేసుకోవడానికి అతడికి మరే ఉపకరణాలూ ముఖ్యం కాదని కూడా చెప్పవచ్చు. భాషాపరిజ్ఞానం, వ్యాకరణం, వ్యాఖ్యానాలు– ఇవేవీ ముఖ్యం కాదు. తనకి వినబడుతున్న ఉపనిషత్సందేశాన్ని స్పష్టపరుచుకోడానికి ఉపనిషత్తుల దృష్టిలో అవసరమైన ఉపకరణాలు రెండే: ఒకటి తపస్సు, రెండవది స్వాధ్యాయం.

తపస్సు అంటే నిరంతర ప్రజ్వలన. ఉపనిషత్తులు ఏమి చెప్తున్నాయో తెలుసుకోవాలనే తపన అందులో చిన్న భాగం. కాని అసలైన తపన– నేనెవర్ని, ఈ ప్రపంచంలో నా స్థానం ఏమిటి? నేను చేయవలసిన పని ఏమిటి? ఏమి చెయ్యడం ద్వారా లేదా ఏమి చెయ్యకపోవడం ద్వారా నేను ఈ జగత్తు ఈశావాస్యమనే సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకో గలుగుతాను? నా మెలకువనీ, కలల్నీ, నిద్రనీ దాటిన ఒక అపరిమిత, అసీమిత సత్యంలో నేను సదా స్థిరంగా ఉండకుండా నాకు అడ్డుపడుతున్నమేమిటి? ఏది, ఆ ఒక్కటీ, దేన్ని తెలుసుకుంటే, సమస్తమూ తెలుసుకున్నట్టు అవుతుందో ఆ విద్య ఏమిటి? ఏమి చెయ్యడం ద్వారా నాలోపలి ప్రజ్ఞని నేను నా చుట్టూ ఉన్న ప్రజ్ఞతో అనుసంధానించుకోగలుగుతాను?– ఈ చింతన, ఎప్పటికీ ఆగని, ఎన్నటికీ ఆరని ఈ చింతననే ఉపనిషత్తులు తపస్సు అన్నాయి.

ఒకసారి ఆ చింతన మొదలయ్యాక, తన ఆలోచనల్ని ముందుకు తీసుకువెళ్ళడానికి తాను పఠించే మంత్రాలు, చదివే పుస్తకాలూ, కలుసుకునే మిత్రులూ, దారి చూపే గురువులూ స్వాధ్యాయంలో భాగమవుతారు. ఆ దారి ఎవరికి వారు వెతుక్కోవలసిందే. ఆ దారిలో ఎవరికి వారు తమ ప్రయాణం తామే కొనసాగించవలసిందే. నీ బదులు ఆ ప్రశ్నలు మరొకరు వేసుకోలేరు. బాహ్యయజ్ఞమైతే నీ తరఫున ఒక ఋత్విజుడు నిర్వహించ గలడు. కానీ ఈ అంతర్యాగంలో ఎవరికి వారే ఋత్విజులు. అలా తాను స్వాధ్యాయం చేపట్టిన తరువాత తన అనుభవాన్ని, ఎప్పటికప్పుడు తనకి అవగతమవుతున్న సత్యాన్ని అతడు తన తోటిమనుషుల్తో పంచుకోవాలి. ఉపనిషత్తు దాన్ని ప్రవచనం అంది.

కాని తపస్సు, స్వాధ్యాయమూ, ప్రవచనమూ మనిషి ఏకాకిగా చేసే పనులు కావు. తైత్తిరీయ ఉపనిషత్తు (9.1.1) స్వాధ్యాయ ప్రవచనాలు ఋతంతో, సత్యంతో, తపస్సుతో,

దమంతో, శమంతో, అగ్నితో, అగ్నిహోత్రంతో, అతిథుల్తో, మానుషత్వంతో, ప్రజలతో, ప్రజోత్పత్తితో, ప్రజాతితో కలిసి చేపట్టవలసిన కలీసి చేపట్టవలసిన కర్తవ్యాలుగా పేర్కొంది.

అప్పుడు మాత్రమే వేదసూక్తాలు మాట్లాడిన యజ్ఞం సమ్యక్‌కర్మ అవుతుంది. అంతే తప్ప బ్రాహ్మణాలు నిర్దేశించినట్టుగా మూడు అగ్నుల్తో, నలుగురు ఋత్విజుల్తో నిర్వహించే క్రతువు కాదు. అలాగని ఉపనిషత్తులు బ్రాహ్మణాల్నీ, యజ్ఞాల్నీ నిరాకరించేయని కాదు. క్రతువు కూడా సమ్యక్‌కర్మ కాగలదు. ఎప్పుడు? అక్కడ తపస్సు అగ్ని అయినప్పుడు, స్వాధ్యాయం ఆహూతి అయినప్పుడు, ప్రవచనం మంత్రపాఠమైనప్పుడు.

ఋగ్వేదస్ఫూర్తిని తిరిగి సమాజంలో ప్రతిష్ఠించుకోవడమెలా అన్నదే బ్రాహ్మణాల అన్వేషణా, ఉపనిషత్తుల అన్వేషణా కూడా. కాని ఆ ప్రయత్నంలో బ్రాహ్మణాలు మార్చడానికి వీల్లేని manuals గా మారిపోగా, మననశీలమైన living exercises గా ఉపనిషత్తులు తమని తాము తీర్చిదిద్దుకున్నాయి. మనిషిని తోటిమనిషితో, చరాచరాలతో, త్రిలోకాలతో కలపడానికి అన్నిటికన్నా ముందు అతడిలోని జ్ఞానాగ్ని నిత్యం ప్రజ్వరిల్లుతూ ఉండాలన్నది ఉపనిషత్తులు కనుగొన్న సత్యం. ఆ అర్థంలో వాటిని మనం ఒక సోక్రటీయ విచారణతో, కన్‌ఫ్యూసియను ఆచరణతో, లావోత్సే మెలకువతో, బుద్ధుడు కోరుకున్న శీల-సమాధి ప్రజ్ఞలతో పోల్చవచ్చు. కానీ సోక్రటీయ విచారణ అకడెమిక్ ఫిలాసఫీగా, బుద్ధుడి బోధనలు బౌద్ధంగా, కన్‌ఫ్యూసియనీయ ఆచరణ కన్‌ఫ్యూసియనిజంగా మారిపోయాయిగాని, ఉపనిషత్తులు ఉపనిషన్మతంగా ఘనీభవించలేదు. అవి ఎప్పటికీ తెరిచిపెట్టిన పుస్తకాలే. వేదాంతులు వాటిని ఎంతగా ఒకే ఒక్క సత్యానికి కుదించాలని ప్రయత్నించినప్పటికీ, అవి అన్ని రకాల పరిమితుల్నీ దాటి ఎప్పటికప్పుడు తమని చేరవచ్చినవారికి గొప్ప జ్యోతిర్మయలోకాన్ని చూపిస్తూనే ఉన్నాయి, ఉత్తేజపరుస్తూనే ఉన్నాయి, ముందుకు నడిపిస్తూనే ఉన్నాయి.

ప్లేటో సంభాషణల మీంచి వికసించిన యూరపియను తత్త్వశాస్త్రం నెమ్మదిగా ఒక academic course గా మారిపోయింది. సోక్రటీసు మాట్లాడిన సత్యాన్ని మనం అర్థం చేసుకోవాలంటే, ఆ సంభాషణలకు ఒక series of footnotes గా ప్రభవించిన తదనంతర తత్త్వవేత్తల్ని చదవకతప్పదనే ఒక భయం కలిగించడంలో పాశ్చాత్య విశ్వవిద్యాలయాలు సఫలమవుతూ వచ్చాయి. కాని ప్లేటో రచనల్ని ఒక సాహిత్యంలాగా నేరుగా చదివినా కూడా ఆయన మనకు ఎంతో కొంత బోధపడతాడని వైట్‌హెడ్ చెప్పినమాటలు నేను నమ్ముతాను. ఆ మాటల్నే మనం ఉపనిషత్తుల విషయంలో కూడా చెప్పుకోవచ్చును. కావలసిందల్లా శ్రద్ధ. ఆపైన తపస్సు, నిరంతరం కొనసాగే స్వాధ్యాయం. అప్పుడు ఆ

సత్యస్ఫురణ తన సంతోషాన్ని నలుగురితో పంచుకోకుండా ఉండలేని ప్రవచనంగా ఎలాగూ మారుతుంది.

అలా ఉన్నాయి అనటానికి, ఇదుగో, ఇప్పుడు మన చేతుల్లో ఉన్న ఈ పుస్తకమే సరికొత్త ఉదాహరణ.

4

ఎవరైనా ఒక జిజ్ఞాసి అత్యంతశ్రద్ధతో ఉపనిషత్తుల్ని సమీపిస్తే అతడు ఎటువంటి జ్యోతిర్మయ లోకాన్ని సందర్శించగలడో ఈ పుస్తకంలో ప్రతి ఒక్క పుట మనకి నిరూపణగా నిలబడు తున్నది. ఉపనిషన్మంత్రాల్ని ఈ సాధకుడు యాంత్రికంగా అనువదించలేదనడానికి, వాటిని అనుభవించి, ఆ సంతోషాన్ని పలవరించాడనడానికీ వాక్యాలకు వాక్యాలు ఉదాహరణలుగా ఎత్తిచూపాలని ఉంది. లేదా మొత్తం పుస్తకం బిగ్గరగా మీకు వినిపించాలని ఉంది. అయినా నా ఉత్సాహం ఆపుకోలేక కొన్ని వాక్యాలు ఎత్తి చూపకుండా ఉండలేకపోతున్నాను. ఈ మాటల్లో కొన్ని ఉపనిషత్తుల మాటలు. మరికొన్ని ఆ మాటల్ని ఆ మననం చేసినందువల్ల రచయిత మనసులో వెలిగిన మాటలు. చూడండి:

'నిండునీరమున్న సరసుల భ్రాంతిగొలిపిన
యెండమావుల నెండగట్టిన నిండు జ్ఞానమిది.'

'వేదమాగిన చోట విశ్వవివేచన పుట్టె
పరమసత్యశోధన పరమార్థమయ్యే.'

'భీరులు కావద్దు, ధీరులు కావాలని ప్రబోధించే
తాత్త్వికదృఢత్వమే ఉపనిషత్తుల సందేశసారం.'

'ఈ ప్రకృతిపై అనుభవ అవకాశం తప్ప హక్కులు
యే ఒక్కడికి లేవని మనిషి చేసే నిర్ద్వంద్వప్రకటన.'

'యజ్ఞయాగాల స్థానంలో అనుభవత్యాగాలు వచ్చినవి.'

'కర్మ ముగియ ఆ జన్మ ముగియు. జన్మ కర్మల లంకె.'

'ఉపనిషత్తు దేవతాపరిషత్తు వేదిక కాదు.'

'వాయువుగా ప్రవేశించి జీవినందు ఆయువుగా
వసించు విధానము కన్న విశిష్టవిద్య ఏది?'

'విడివడి కనబడు మానవులు అనేకమనుకొనుట అవివేకపు మాట.'

'లోకములోని వారందరు ఒకరికొకరు బాగా తెలిసినవారే. అదృష్టహీనము వలన ఎవరెవరో గుర్తుకు రాక ఒకరికొకరు పరాయి వారిగా ప్రవర్తించు చున్నారు.'

'దేహమొక యజ్ఞశాల.'

'మనుజుడు ఋత్విజుడై నిర్విఘ్న జీవనయాగం నిర్వహించుటే యజ్ఞం.'

'ప్రపంచమంత ఈశ్వరమహిమ అని ఎరిగినవాడు దుఃఖరహితుడగును.'

'అతడు లోకమందు వెలుగు శోకదీపం కాడు.'

'మాటే కదా మనిషిని మృగజాతినుండి వేరు చేయు. ఆ మాట
కొందరినోట ఆర్పలేని మంట, మరికొందరి నోట అదే మాట
విరిసిన పూదోట.'

'బాహ్యవేషము చూసి భయపడనివాడు నిర్భయుడు.'

'పదార్థప్రయోజనము తప్ప పరమార్థప్రభావము తెలియనివాడు భయకంపితు డగును.'

'తర్కమాగిన చోట తాత్త్వికత పుట్టు. తాత్త్వికతకు ధ్యానం ఆయువుపట్టు.'

'చెరువునందు ఈత నేర్చువాడు చేతులతో తన చుట్టు ఉన్న నీటిని తొలగించు కొని ముందుకు పోవునట్లు ఆధ్యాత్మిక ప్రయాణంలో సాధకుడు నేతి, నేతి, ఇదికాదు, ఇది కాదని చుట్టూ కమ్మిన మాయావరణాన్ని తొలగించుకుని తురీయస్థితిని పొందుతాడు. అది నిస్సంగ నిరాసక్త నిర్భయ స్థితి.'

'ఋగ్వేదయజ్ఞం అమృతం నిండిన ఒక పరమసుందరమైన పుష్పం.'

'మాటను మంత్రముగా వాడు విధమును చూసి తెలియనగును మహిన మహితాత్ములున్న చోటు.'

'వాక్కునే కదా వ్యక్తి సంస్కారం తెలుపునట్టు ప్రథమ ప్రమాణసూచి.'

'ఆత్మ ఒక వంతెన. ఇహ పరముల మధ్య ఒక వంతెన.'

'మనుషులెంతమంది ఉన్నా మానవత్వానికి పూరించలేని లోటు అన్నం లేక మరణం సంభవించిన చోటు.'

'ఇతరులకు అన్నం పెట్టడం గృహస్థధర్మం. అన్నం సంపాదించుకునే అవకాశం కల్పించడం రాజధర్మం.'

'ఆకలి కడుపుకు అన్నం అమృతం.'

ఈ చివరి వాక్యాలు చదవగానే 'నేను ఆకలితో ఉండకూడదు, నా ఇంటికి వచ్చిన–వాడు ఆకలితో ఉండకూడదు' అని కబీరు అన్న మాటలు, 'ఒక అన్నార్తుడి ముందుకు దేవుడు రొట్టె రూపంలో మాత్రమే కనిపించడానికి సాహసిస్తాడు' అని గాంధీ అన్న మాటలు గుర్తుకు రాకుండా ఉండవు.

అంతే కాదు, ఈ అనువాదంలో మరో విశేషముంది. తొలి ఉపనిషత్తుల్లో ఒకటిగా లెక్కించకపోయినప్పటికీ, వజ్రసూచికోపనిషత్తుని కూడా తొలి ఉపనిషత్తులతో కలిపి అనువదించడం. ఎందుకంటే మనం ముందే చెప్పుకున్నట్టుగా, నలుగురికీ స్ఫూర్తిదాయకమై సమష్టికర్మ కావలసిన ఒక సమ్యక్‌కర్మని ఒక పురోహితవర్గానికి మాత్రమే పరిమితం చెయ్యడాన్నే ఉపనిషత్తులు ప్రశ్నించాయి. ఆ ప్రశ్ననే ఎంతో బిగ్గరగా, ఎంతో బలంగా, ఎంతో ఆత్మవిశ్వాసంతో లేవనెత్తిన ఉపనిషత్తు వజ్రసూచిక. దాన్ని తొలి ఉపనిషత్తులతో కలిపి అనువదించడం ద్వారా ఉపనిషత్సందేశానికి స్పష్టమైన సామాజికపార్శ్వం సమకూడిందని చెప్పవచ్చు.

ఉపనిషత్తుల్లో చాలాచోట్ల ఎన్నో రహస్యాల్ని క్షత్రియులు కనుగొని బ్రాహ్మణులకి ఉపదేశించారని చెప్పిన ఉదాహరణలున్నాయి. కాని వాటిని ఇండాలజిస్టులు బ్రాహ్మణ–క్షత్రియ ప్రాధమ్యానికి సంబంధించిన విషయంగానే చూసారు. కాని నేనేమనుకుంటానంటే, ఒక ఆశ్రమవాసి, లేదా యజ్ఞవేత్త అయిన బ్రాహ్మణుడికన్నా కూడా ఒక క్షత్రియుడు ప్రజాసామాన్యానికి ఎక్కువ సన్నిహితంగా ఉంటాడు. ఉండవలసిన అవసరం అతడికి ఉంది. ప్రజలతో కలిసి మెలిసి జీవించడం వల్ల ఒక కర్మని సమ్యక్ కర్మగా మార్చడమెలానో అతడు అనుభవం ద్వారా గ్రహించి ఉంటాడు. అలాగని ప్రజాప్రేమికుడైనంతమాత్రాన, సంక్షేమపాలకుడైనంతమాత్రాన కర్మని సమ్యక్ కర్మగా మార్చుకునే విద్య ఒక క్షత్రియుడికి కూడా పూర్తిగా పట్టుబడుతుందని అనుకోవద్దని కూడా ఉపనిషత్తు హెచ్చరిస్తుంది. కాబట్టే, జానశ్రుతి వంటి రాజు కూడా ఒక రైక్వుడి దగ్గరికి, ఆ రైక్వుడు ఎంతగా సమాజపు అంచుల్లో జీవిస్తున్నప్పటికీ, పోయి నేర్చుకోకతప్పదని ఉపనిషత్తు చెప్తున్నది.

కాబట్టి జ్ఞానం ఏ ఒక్కరిదో కాదు. అది సమస్త ప్రజానీకానిదీను. ఎవరు తనలో ఎల్లలోకాల్నీ, ఎల్లలోకంలో తననీ చూడగలరో, అతడే జ్ఞాని. అతడికి కులం లేదు, వర్ణం లేదు, లింగం లేదు, వయోపరిమితుల్లేవు.

వజ్రసూచి ఈ అంశాన్నే ఇలా నిర్ద్వంద్వంగా చెప్తున్నది:

'మరి ఎవడు బ్రాహ్మణుడు? బ్రాహ్మణుడెవ్వడనిన ఎవడు తన అర చేతిలో పరమాత్మను కరతలామలకం వలె చూడగలడో వాడు నిజమైన స్వచ్ఛ బ్రాహ్మణుడు. ఆ పరమాత్మ అద్వితీయుడు. జాతిగుణక్రియారహితుడు జరా, మరణ, మోహ, క్షుత్, పిపాసలనే షడూర్ములు లేని వాడు.'

'అటువంటి మహానుభావుడు మహామనీషి మానవమూర్తి ఏ వర్ణమందు ఐనను జనించవచ్చు, ఏ తావునందయినను తల ఎత్తవచ్చు. ఏ వృత్తిలోనైనను ఆకృతి దాలవచ్చు.'

'జన్మ వలన జాతకం వలన జపతపాదుల వలన బంధము వలన బాహ్య రూపము వలన రాని బ్రాహ్మణత్వం బ్రహ్మమెరుగుట వలన వచ్చు. సాక్షాత్తు బ్రహ్మపదార్థము నేను అను ఎరుక వలన వచ్చును.'

5

దీర్ఘాసి విజయభాస్కర్ కవిగా, రచయితగా, నాటకకర్తగా, సమర్థుడైన అధికారిగా ఇప్పటికే తెలుగుప్రపంచానికి పరిచయం. ఎన్నో ప్రతికూల పరిస్థితుల్ని దాటి ఆయన ఈ స్థితికి చేరుకోవడమే ఒక జయగాథ, అతడు పుట్టిపెరిగిన ప్రాంతానికీ, ఆ కుటుంబాలకీ మాత్రమే కాదు, మనందరికీ కూడా. కానీ అతడు ఇంతదాకా అధిరోహించిన ఎత్తులు ఒక ఎత్తు. ఈ పుస్తకం ద్వారా చేపట్టిన ఆరోహణ మరొక ఎత్తు. ఈ రచన ద్వారా ఆయన దేవగంగని ఒక మరుభూమిమీద ప్రవహింపచేసిన భగీరథుడిగా మారాడు. మరొకసారి గంగ భువికి అవతరించింది. అతడికి జయం. అతడికి తపస్సుకు జయం. అతడి తపోఫలితానికి జయం, జయం.

25-11-2024

ఏడు ధర్మాలు

అయిదారేళ్ళ కిందట, నా మిత్రుడు, ఒక విశ్వవిద్యాలయ ఆచార్యుడు, ప్రాచీన భారతీయ సాహిత్యంలో రాజనీతి పైన ప్రస్తావనలనుంచి ఒక సంకలనం చేయబోతున్నాడనీ, నాకు తెలిసిన కొన్ని గ్రంథాలు కానీ లేదా ప్రాచీనసాహిత్యంలో ప్రస్తావనలు కానీ చెప్పమన్నాడు. రామాయణం, మహాభారతం, రఘువంశం వంటి గ్రంథాల్లో రాజనీతి ప్రస్తావనల గురించి చెప్పి, 'మహా పరినిబ్బాణ సుత్త' కూడా చూడమని చెప్పాను.

ఆయన ఆ రచన గురించి తానప్పటిదాకా వినలేదన్నాడు. నేను ఆశ్చర్యపోయాను. కాని, ఒక క్షణం తర్వాత, నా ఆశ్చర్యానికి అర్థం లేదనిపించింది. మనకి ప్లేటో సంభాషణలు పరిచయమైనంతగా, బుద్ధుడి దీర్ఘసంభాషణలతో పరిచయం లేదుకదా అనిపించింది. మీరు ఏ పుస్తకాల దుకాణానికి వెళ్ళినా ఏథెన్సులో ఒకప్పటి సోక్రటీసు సంభాషణల కొత్త ప్రతి ఒకటి కనిపిస్తూంటుంది. కాని, అదే కాలంలో భారతదేశంలో శ్రావస్తిలో, వైశాలిలో బుద్ధుడు మాట్లాడిన మాటలు మనకి అందుబాటులో ఉండనే ఉండవు.

నేను ఆ సంభాషణలు రైస్‌డేవిసు దంపతులు చేసిన ఇంగ్లీషు అనువాదం (1910) లో చదివాను. అప్పటికి అన్నపురెడ్డి వెంకటేశ్వర రెడ్డి చేసిన తెలుగు అనువాదం 'బుద్ధుడి దీర్ఘసంభాషణలు' (2003) అందుబాటులోకి రాలేదు. కాని, ఇప్పుడు, తెలుగువాళ్ళ అదృష్టం వల్ల బుద్ధుడి దీర్ఘసంభాషణలు భిక్కు ధమ్మరక్షిత అనువాదంతో మరొకమారు గత ఏడాది వెలువడ్డాయి. 'మహాబోధి బుద్ధ విహార' వారు ఇప్పటిదాకా 'దీఘనికాయం' రెండుభాగాలు, 'సుత్తపిటకం' వెలువరించారు. ఈ అనువాదాలు సులభంగానూ, సరళంగానూ ఉండటమే కాకుండా, పాలీ మూలాన్ని కూడా పక్కపక్కనే పొందుపరుచుకున్నాయి.

బుద్ధుడి సంభాషణలుగా మనకి లభ్యమవుతున్న సుత్తనికాయంలోని అయిదు సంకలనాలు– దీఘనికాయం, మజ్జిమ నికాయం, సంయుత్తం, అంగుత్తరం, ఖుద్దక

నికాయాల్లో– 'దీర్ఘసంభాషణలు' అత్యంత ప్రాచీనమైనవి, చాలా వరకు బుద్ధుడి మాటల్ని యథాతథంగా గుర్తుపెట్టుకుని మనకి అందిస్తున్నవీను. కాబట్టి, బుద్ధుడు ఏమి చెప్పాడు, ఆయన దృక్పథం ఏమిటి అనేది స్వయంగా తెలుసుకోదలచుకున్నవాళ్ళు, దీర్ఘసంభాషణలు ఒక్కటీ చదివినా సరిపోతుంది. అందులో ఉన్న 34 సంభాషణల్లోనూ, 'మహాపరినిబ్బాణ సుత్త' (మహాపరినిర్వాణసూక్తం) తక్కినవాటన్నిటికన్నా పెద్దదీ, అనేక కారణాల వల్ల ప్రత్యేకమైందీను. అందులో దాదాపు మూడవవంతు మాత్రమే మౌలికమైందీ, ప్రాచీన మైందనీ, రైస్‌డేవిసు, ఓల్డెన్‌బర్గ వంటి పండితులు వాదించినప్పటికీ, ఆ మూడవవంతు మౌలికభాగాలు చూసినా కూడా మనకళ్ళముందొక మనముందొక మానవీయ బుద్ధుడు ప్రత్యక్షమవుతాడు. బుద్ధుడి చివరిరోజులు, ఆయన ఈ లోకంలో తన కర్తవ్యం ముగించు–కుని, ప్రశాంతంగా, ఈ లోకాన్ని వదిలిపెట్టిన వివరణ అది. ఒక కథలాగా, ఆఖ్యాన రూపంలో అత్యంత ఆసక్తిదాయకంగా నడిచే ఒక వృత్తాంతం కూడా.

తనని శిలువ వేసే ముందు రాత్రి గెస్తమని తోటలో క్రీస్తు అనుభవించిన ఆత్మవేదన వంటిది ఈ సుత్తంలో కూడా బుద్ధుడు అనుభవించడం కనిపిస్తుంది. ఆయన సంబోధి పొందినప్పుడు, ఈ లోకంలోకి తిరిగిరావాలా వద్దా అన్న మీమాంసకి లోనయ్యాడు. అప్పుడు మారుడు ఆయన్ని ఈ లోకం వదిలిపెట్టెయ్యమని సలహా ఇచ్చాడు. కాని, తాను కనుగొన్న సత్యాన్ని తన తోటిమనుషులకి చెప్పి, వారు కూడా తనలాగే విముక్తి చెందేవరకు తాను ఈ లోకాన్ని విడవాలనుకోవడం లేదనీ, తన కర్తవ్యం పూర్తయ్యాక తనంత తనే ఈ లోకాన్ని వదిలిపెడతాననీ బుద్ధుడు మారుడికి మాట ఇచ్చాడు. ఇప్పుడు ఎనభై ఏళ్ళ వయసులో, తీవ్ర అనారోగ్యానికి పాలయ్యాక, బుద్ధుడు ఆనందుడితో అన్నాడు: 'ఆనందా, భిక్షుసంఘం నానుంచి ఇంకా ఏమి ఆశిస్తుంది? నాలోపల ఉన్న ధర్మాన్నంతా, నేను వెల్లడి చేసాను. నా పిడికిలి ఎప్పటికీ మూసిపెట్టింది లేదు. నేనిప్పుడు జీర్ణుణ్ణయ్యాను, ముసలివాణ్ణయ్యాను, పెద్దవాణ్ణయ్యాను, వయసుపైబడింది, ఇప్పుడు నాకు ఎనభై ఏళ్ళు, ఏదో పాతబండికి అతుకులు వేసి నడిపిస్తున్నట్టు నడిపిస్తున్నాను..ఇప్పుడు మీకు మీరే దీపాలు కావాలి' అని. ఆ మాటలు విని మారుడు ఆయన్ని మరొక మారు సమీపించి, 'అయితే, పద, ఈ లోకాని వదిలిపెట్టు, సమయం ఆసన్నమైంది' అని గుర్తు చేసాడు. కాని బుద్ధుడు తొందరపడవద్దనీ, తాను మూడునెలల్లో ఈ లోకాన్ని వదిలిపోగలననీ చెప్పాడు.

ఆ మూడు నెలల విరామం ఎందుకు కోరాడు? దానిమీద బౌద్ధపండితుల మధ్య ఎంతో చర్చ జరిగింది. కాని, చాలామంది అంగీకరించిన ఒక కారణమేమిటంటే, బుద్ధుడు

మగధసామ్రాజ్య భూమిలో తన తనువు వదలాలని అనుకోలేదనీ, ఏదో ఒక గణతంత్ర పరిధిలోనే తనువు చాలించాలనుకున్నాడనీ. రాజగృహం నుంచి కుసీనారకు చేరడానికి, రెండువందల మైళ్ళ దూరం, కనీసం మూడు నెలలు పడుతుంది, అందుకని ఆయన మూడునెలల గడువు అడిగాడనీ.

ఇక్కడ బుద్ధుడి రాజనైతికత మనకి స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన సామ్రాజ్యవాదాన్ని అంగీకరించలేకపోయాడనీ, గణతంత్రాల పట్లనే ఆయన హృదయం కొట్టుకుపోయేదనీ మనకి అర్థమవుతుంది. బహుశా, ప్రపంచంలో మరే ప్రవక్తా, కవీ, రచయితా, రాజకీయ నాయకుడూ కూడా ఇలా ప్రజాస్వామ్యపరిధిలోనే తనువు చాలించాలని కోరుకున్నవారు మరెవరూ కనిపించరు. బుద్ధుడి జీవితకాలపు దర్శనం, బోధలు, ఆయన చూపించిన కారుణ్యం మొదలైనవాటన్నింటినీ పక్కన పెట్టినా కూడా, ఈ ఒక్క సంఘటన చాలు, ఆయన మానవజాతిలో ప్రభవించిన అత్యున్నత మానవుడు అని చెప్పడానికి. ఇటువంటి గణతంత్రసంస్కారాన్ని ఇంత స్పష్టంగా చూపించిన తర్వాత కూడా, ఎందుచాతనో, మన పాఠ్యపుస్తకాల్లోగాని, మన సాహిత్యంలో గాని, ఈ సంఘటన గురించిన ప్రస్తావన ఎక్కడా కనిపించదు.

'మహాపరినిబ్బాణ సుత్త' మొదలవుతూనే ఒక ఆసక్తికరమైన సంఘటనతో మొదలవు–తుంది. ఒకరోజు మగధరాజు అజాతశత్రు 'వజ్జి' గణతంత్రాన్ని నాశనం చెయ్యాలనుకుని తన ప్రతినిధిని ఒకణ్ణి బుద్ధుడి దగ్గరికి పంపించాడు. వజ్జి గణతంత్రాన్ని తుదముట్టించాలనే తన సంకల్పం విని బుద్ధుడేమంటాడో తెలుసుకుని రమ్మన్నాడు. రాజప్రతినిధి బుద్ధుడిదగ్గరికి వచ్చి ఆ సంగతి నివేదించాడు. కాని ఆ మాటలు వినగానే బుద్ధుడు ఆ రాజప్రతినిధి వైపు కాకుండా ఆనందుడి వైపు తిరిగి ఏడు ప్రశ్నలు అడిగాడు.

- ఆనందా, వజ్జియులు క్రమం తప్పకుండా సమావేశమై తమ సమస్యలు చర్చించుకుంటూ ఉంటారా?

- వారు కలిసి సమావేశమవుతూ, కలిసి చేయవలసిన పనులు చేస్తున్నారా?

- వారు తాము పెట్టుకున్న నియమాల్ని పాటిస్తూ, సాంప్రదాయికంగా వస్తున్న గణతంత్రాన్ని అనుసరిస్తున్నారా?

- వారు తమ పెద్దల్ని గౌరవిస్తున్నారా, పూజిస్తున్నారా, వాళ్ళ మాటలు వినాలను–కుంటున్నారా?

- వారు స్త్రీలనీ, కన్యల్నీ, పిల్లల్నీ ఎత్తుకుపోయి బలాత్కరించడం లేదుకదా!

- వారు దేశంలోనూ, బయటనూ ఉన్న ప్రార్థనాస్థలాల్ని గౌరవిస్తున్నారు కదా, దోచుకోవడం లేదు కదా!

- తమ గ్రామాలకు ఎవరేనా సజ్జనులు వస్తే వాళ్ళకి ఆశ్రయమిచ్చి వాళ్ళ నివాసానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు కదా!

ఆ ప్రశ్నలన్నిటికీ ఆనందుడు అవునని జవాబిచ్చాడు, 'ఎంతకాలమయితే వజ్జియులు ఈ ఏడు ధర్మాలూ పాటిస్తారో అంతకాలం వాళ్ళని ఎవరూ నాశనం చేయలేరని చెప్పు' అన్నాడు బుద్ధుడు.

ఈ హితబోధ, 2500 ఏళ్ళ కిందట వజ్జి గణతంత్రానికి ఎంత వర్తిస్తుందో, ఇప్పటి భారతప్రజాస్వామ్యానికి కూడా అంతే వర్తిస్తుందనుకుంటున్నాను.

29-4-2018

గాసిప్పు ఉన్నచోట బుద్ధుండడు

సాధారణంగా డ్రాయింగురూముల్లో, ఆఫీసుగదుల్లో, చివరికి దుకాణాల్లో, విమానా-శ్రయాల్లో కూడా బుద్ధుడి బొమ్మలో, విగ్రహాలో కనిపిస్తూండటం ఈ మధ్య పరిపాటి అయిపోయింది. ఇంటి యజమానులూ, ఆఫీసర్లూ, రాజకీయనాయకులూ తమ సంపదని ప్రదర్శించుకునే క్రమంలో బుద్ధుడు కూడా చక్కటి అలంకరణ సామగ్రిగా మారిపోయేడు. తమ జీవితానికీ మతానికీ సంబంధంలేదనీ, అయినా తామొక ఉన్నత ఆదర్శాన్ని ఆరాధిస్తూ ఉంటామనీ చెప్పుకోడానికి బుద్ధుడికన్నా మించిన ఐకను ప్రస్తుత సమాజానికి మరొకటి కనిపించడం లేదు. అదీకాక మతమంటే, మనకు తెలిసిన కర్మకాండ పాటించే, బౌద్ధమతస్థులెవరూ మనకి పెద్దగా కనిపించనందువల్ల కూడా మతంతో సంబంధంలేని ఒక ఆధ్యాత్మికతను లేదా స్వీయపరిశీలనను లేదా శీలనిర్మాణాన్ని తాము ఇష్టపడుతున్నామని చెప్పుకోడానికి చాలామందికి బుద్ధుడు సౌకర్యవంతమైన పేరుగా, ప్రతీకగా, ప్రభావంగా మారిపోయాడు.

కాని ఏ కొద్దిగా తరచి చూసినా, బుద్ధుడి సంభాషణలు ఏ మాత్రం చదివినా, బుద్ధుడి మార్గాన్ని అనుసరించడం ఎంత కష్టమో మనకి తెలియవస్తుంది. నీకంటూ ఒక దేవుడెవరూ లేకుండా, నీ తప్పొప్పుల్ని ఎప్పటికప్పుడు క్షమించుకుంటూ, నీ ప్రార్థనల్ని, నైవేద్యాల్ని కోరుకుంటూ, నువ్వు మరెవర్నీ ఆశ్రయించకుండా తననే నమ్మినంతకాలం నీ యోగక్షేమాల్ని చూసుకుంటాననే ఒక 'పర్సనలీశ్వరుడు' లేకుండా కేవలం నీ స్వీయ క్రమశిక్షణ వల్ల మాత్రమే నువ్వు దుఃఖం నుంచి విముక్తి పొందుతావని చెప్పే బుద్ధుడి మాటలు అనుసరించడం ఎంత దుస్సాధ్యమో తెలిసి వస్తుంది. నిజానికి ఆ పర్సనలీశ్వరుడు కూడా మనల్ని కఠినాతికఠినమైన నైతికక్రమశిక్షణ వైపే నడిపిస్తాడనేది ఏ సాధకుడికైనా అనుభవంలోకి వచ్చే విషయమే.

బుద్ధుడు మన మనసుమీద కలిగించే నైతికమైన ఒత్తిడి మామూలు ఒత్తిడి కాదు. దాన్ని తప్పించుకోడానికి చాలామందికి దొరికిన ఏకైక మార్గం ఆయన విగ్రహాన్ని ఆఫీసు టేబులు మీదనో, డ్రాయింగు రూములో టీపాయి మీదనో పెట్టుకోడం. కొద్దిగా వాస్తు కూడా కలిసి వస్తుందనుకుంటే 'లాఫింగు బుద్ధా' బొమ్మ కూడా పెట్టుకోవడం.

ఈ మధ్య భారతదేశంలో హిందూమతోన్మాదం పెరుగుతున్నకొద్దీ, చాలామంది మేధావులకి బుద్ధుడి గురించి ప్రస్తావించడమూ, ఆయన తత్త్వశాస్త్రం గురించీ, ఆయన రచనల గురించీ రాయడమూ కూడా ఒక అలవాటుగా మారింది. వారిలో ఎంతమంది నిజంగా బుద్ధుడి సంభాషణలు చదివి ఉంటారో నాకు తెలియదు. ఆ చదివినవారిలో కూడా ఎంత మంది ఆ బోధనల్ని తమ దైనందిన జీవితంలో అనుష్ఠిస్తూ ఉంటారో నాకు తెలియదు. నిజానికి ఏ ఋషివాక్యమైనా, ప్రవక్త బోధలైనా వాటిని అనుసరించి, అనుష్ఠించే వాటివల్లనే బతుకుతాయి, వెలుగుతాయి. ఒట్టి మాటల్లో ఏ బలమూ ఉండదు. వాటికవి శుష్కాలు, నిరర్థకాలూ కూడా.

ఉదాహరణకి ఈ మధ్యనే నిర్వాణం చెందిన వియత్నమీయ బౌద్ధసన్యాసి థిక్ నాట్ హన్‌ని చూడండి. నాకు ఆయన రచనలు చదువుతూ ఉంటే బుద్ధుణ్ణి ప్రత్యక్షంగా చూస్తున్నట్టూ, వింటున్నట్టూ అనిపిస్తుంది. ఎందుకంటే ఆయన బుద్ధుడు చెప్పిన ప్రతి మాటనీ నమ్మాడు. తన చుట్టూ ఉన్న జీవితం, సమాజం, దేశం, ప్రపంచం యుద్ధాగ్నిలో రగిలిపోతున్నప్పుడు కూడా ఆయన బుద్ధుడి మాటల్ని సందేహించలేదు. అందుకని ఆయన ఎక్కడ ఉంటే అక్కడ ఎంతో కొంత ప్రశాంతిని ఆవరింపచెయ్యగలిగాడు. ఆయన ప్రసంగాల వీడియోలు కొన్ని చూసాను. అక్కడ, అంటే ఆయన మాట్లాడుతున్న గదుల్లోగాని, లేదా తోటల్లోగాని ఎక్కడా ఒక్క బుద్ధప్రతిమ కూడా నాకు కనబడలేదు. కాని అక్కడ బుద్ధుడు కనిపించాడని చెప్పగలను.

బుద్ధుడి పేరు చెప్పడం, బుద్ధుడి కొటేషన్లు షేరు చెయ్యడం ఒక ఫాషనుగా మారిపోయిన కాలంలో ఆయన మాటల్ని నిజంగా అర్థం చేసుకున్నవాళ్ళూ, నమ్మినవాళ్ళూ ఎవరైనా ఉన్నారా అని వెతుక్కుంటూనే ఉన్నాను. బౌద్ధసాహిత్యం మీద రాయగలిగిన వాళ్ళూ, మాట్లాడగలిగినవాళ్ళూ, ఆ వంకన బ్రాహ్మణధర్మాన్ని ఎద్దేవా చేసేవాళ్ళూ కాదు నాకు కావలసింది. బుద్ధుడు చెప్పిన అష్టాంగమార్గంలో కనీసం ఒక్క సమ్యక్‌శీలాన్ని అనుష్టించినా చాలు, నేను వారి పాదాల దగ్గర కూచోడానికి సిద్ధంగా ఉన్నాను.

బుద్ధుడు తన జీవితకాలమంతా గాసిప్పుని నిరసిస్తూనే ఉన్నాడు. అన్నిటికన్నా ముందు పొలిటికలు గాసిప్పుని పూర్తిగా దూరంపెట్టాడు. ఉదాహరణకి, కుద్దక నికాయంలోని, 'ఉదానపాలి' (2.2) లోని ఈ సన్నివేశం చూడండి:

నేనిలా విన్నాను. ఒకప్పుడు భగవానుడు శ్రావస్తిలో అనాథపిండకుడి జేత వనంలో విహరిస్తూ ఉన్నాడు. అప్పుడు భిక్షకు వెళ్ళి తాము గ్రహించిన భిక్షను ఆరగించి వనంలో సేదతీరుతున్న భిక్కుల మధ్య ఒక సంభాషణ తలెత్తింది. 'మిత్రులారా, ఆ ఇద్దరు రాజుల్లో, అంటే మగధరాజు బింబిసారుడు, కోసలరాజు ప్రసేనజిత్తు, ఆ ఇద్దరిలో ఎవరు ఎక్కువ ధనవంతుడు? ఎవరు గొప్ప సుఖాల్ని అనుభవిస్తూ ఉన్నారు? ఎవరికి గొప్ప కోశాగారం ఉంది. ఎవరికి గొప్ప సామ్రాజ్యాన్ని ఏర్పాటుచెయ్యగలిగారు? ఎవరికి ఎక్కువ రథాలున్నాయి? ఎవరికి ఎక్కువ శక్తి సామర్థ్యాలున్నాయి- ఇలా నడుస్తున్నది సంభాషణ.

ఆ సాయంకాలం, భగవానుడు తన ఏకాంతం వీడి ఆ సమావేశ ప్రాంగణానికి వచ్చి, అక్కడ తనకోసం సిద్ధపరిచిన ఆసనం మీద కూచున్నాడు. అప్పుడు ఆయన ఆ భిక్కుల్ని చేరబిలిచి, 'భిక్కులారా, నేను వచ్చేటప్పటికి మీరంతా ఏదో సంభాషణలో ఉన్నట్లుగా తెలుస్తున్నది. దేని గురించి మాట్లాడుకుంటున్నారు మీరు? అనడిగాడు.

అప్పుడు వారు, 'భగవన్, మేము భిక్షాయాత్రనుండి తిరిగివచ్చి వనంలో కూచున్నప్పుడు మా మధ్య ఒక సంభాషణ తలెత్తింది. 'మిత్రులారా, ఆ ఇద్దరు రాజుల్లో, అంటే మగధరాజు బింబిసారుడు, కోసలరాజు ప్రసేనజిత్తు, ఆ ఇద్దరిలో ఎవరు ఎక్కువ ధనవంతుడు? ఎవరు గొప్ప సుఖాల్ని అనుభవిస్తూ ఉన్నారు? ఎవరికి గొప్ప కోశాగారం ఉంది. ఎవరికి గొప్ప సామ్రాజ్యాన్ని ఏర్పాటుచెయ్యగలిగారు? ఎవరికి ఎక్కువ రథాలున్నాయి, ఎవరికి ఎక్కువ శక్తి సామర్థ్యాలున్నాయి- ఇలా నడుస్తున్నది మా సంభాషణ' అన్నారు.

అప్పుడు భగవానుడు ఇలా అన్నాడు: 'భిక్కులారా, ఇటువంటి సంభాషణ మీకు సముచితం కాదు. మీరంతా గౌరవప్రదమైన కుటుంబాల్ని వదిలిపెట్టి, ఇళ్ళు వదిలిపెట్టి, ఈ నిరాశ్రయ జీవితాన్ని ఎంతో నమ్మకంతో స్వీకరించిన వారు. మీరు ఇట్లాంటి సంభాషణలు సాగిస్తుండటం సముచితం కాదు. భిక్కులారా, ఒకసారి ఇక్కడకు చేరుకున్నాక, మీకు ఉండవలసింది రెండే కర్తవ్యాలు. అయితే, ధర్మాన్ని అనుష్ఠించడం ఎలా అన్నదాని గురించి మాట్లాడుకోండి లేదా మౌనంగానైనా ఉండండి.

ఆ పైన ఆయన ఈ పద్యం చెప్పాడు:

అక్కడ ప్రపంచంలో ఏ ఇంద్రియసుఖం ఉందో
ఇక్కడ ఏ దైవిక సంతోషం ఉందో,
తృష్ణాక్షయమిచ్చే సుఖంతో పోలిస్తే
ఆ రెండూ కాసుకి కొరగావు.

నేను బుద్ధుడి మాటలు నమ్ముతాను కాబట్టి, నేనిది కూడా నమ్ముతున్నాను, అదేమంటే గాసిప్పు ఉన్నచోట బుద్ధుడుండడు.

16-5-2022

ఉదానపాలి

తెల్లవారుజామున ఒక కల. ఎవరికో ఒక కవిత చదివి వివరిస్తున్నాను. ఆ కవి పరిచయం గురించి చూడబోతే, ఒక వాక్యం కనిపించింది. 'నన్ను కవి అనడం చిన్నమాట, నేను మనిషికీ, భగవంతుడికీ మధ్య ఒక సంకేతభాష నిర్మిస్తున్నవాణ్ణి' అన్న వాక్యం కనిపించింది. అది కూడా ఇంగ్లిషులో. Architect of a sign language అని!

Sign అనే ఇంగ్లిషు పదానికి సంకేతం అని మాత్రమే కాక, బైబిలు భాషలో చెప్పాలంటే సూచక కృత్యం అనే అర్థం కూడా ఉంది. అంటే ఒక నిదర్శనం. భగవంతుడి ఉనికిని నువ్వు గ్రహిస్తున్నావనడానికి ఒక నిదర్శనం. ఒక దృష్టాంతం. ఒక గుర్తు. నాకు మెలకువ వచ్చేసింది. ఆ వాక్యమే నా మనసులో మెదులుతూ ఉంది. కొంతసేపటికి, నెమ్మదిగా సంతోషం ఆవరించింది. అంతరంగం ఏదో ఒక మేరకు శుద్ధపడితే తప్ప అటువంటి కలలు రావని కూడా గుర్తొచ్చింది.

ఎందుకు నా అంతరంగం తేటపడి ఉంటుంది? నిన్న రాత్రి బౌద్ధవాఙ్మయానికి చెందిన 'ఉదానపాలి' చదువుతూ పడుకుని పోయాను. బహుశా, బుద్ధవాక్యాలు రాత్రంతా నా మనోకల్మషాన్ని శుభ్రపరుస్తున్నట్లున్నాయి.

'ఉదాన' అంటే పంచప్రాణాల్లో ఒకటి. మనం శ్వాసించేటప్పుడు గాలి గట్టిగా లోపలకి పీల్చుకోవడం కూడా ఉదానమే. కాని బౌద్ధపరిభాషలో అదొక ఆశ్చర్యార్థకం. ఒక భావోద్వేగపూరిత వాక్యం. పట్టరాని సంతోషంలోనో, దుఃఖంలోనో పలకకుండా ఉండలేని ఒక పద్యం. ఆ రచనని ఇంగ్లిషులోకి అనువదించినవాళ్ళు inspired utterance అన్నారు.

ఉదానపాలి బుద్ధుణ్ణి ఒక కవిగా పరిచయం చేసే పుస్తకం కూడా. అందులో మొత్తం ఎనిమిది వర్గాలకు చెందిన ఎనభై సూక్తాలు ఉన్నాయి. ప్రతి సూక్తానికీ చివర

ఒక పద్యం, కొన్నిసార్లు గద్యోక్తి కూడా ఉంటుంది. పద్యాలు గాయత్రి, బృహతి, త్రిష్టుప్, అనుష్టుప్ లాంటి ఛందస్సుల్లో ఉన్నాయి. ప్రతి పద్యానికీ ముందు ఆ పద్యం ఏ సందర్భంలో బుద్ధుడు చెప్పాడో ఆ సన్నివేశాన్ని వివరించే పరిచయవాక్యాలుంటాయి. ఆ పరిచయాల్లో బుద్ధుడి వ్యక్తిత్వం, ఆనాటి సమకాలిక రాజకీయ, సాంఘిక పరిస్థితులు కూడా మనకి పరోక్షంగా తెలుస్తూనే ఉంటాయి.

బుద్ధుడు జ్ఞానోదయం పొందిన తరువాత, తాను అనుభవంలోకి తెచ్చుకున్న సత్యాన్ని నలుగురితో పంచుకోవడం కోసం శ్రావస్తిలో, రాజగృహంలో, కుండికలో, కోశాంబిలో, ఉరువేలలో విహరిస్తూ ఉన్నప్పుడు తన శిష్యులతో మాట్లాడిన మాటలు, వారితో తన భావోద్వేగాల్ని పంచుకోవడానికి చెప్పిన పద్యాలు అవి. ఆయన్ను అటువంటి భావోద్వేగానికి లోను చేసిన సన్నివేశాలు కొన్నిసార్లు చాలా సాధారణమైనవి, కొన్నిసార్లు చాలా ప్రత్యేకమైనవి, కొన్నిసార్లు ఆయనతో మాట్లాడించడం కోసమే ఆయన శిష్యులు ఏర్పాటు చేసుకున్నవి. అయితే చాలా సార్లు ఆ పద్యాలు ఆ సంఘటనలు చెప్తున్నవాటికన్నా లోతైన భావాన్నేదో మనకి వినిపించడానికి ప్రయత్నిస్తున్నటుగా మనకి అర్థమవుతుంది. నిజానికి అవి చదువుకుంటూ పోయేవి కావు, లోతుగా, పదే పదే మననం చేయదగ్గవి.

బుద్ధుడు చెప్పినట్టుగా తరువాతి రోజుల్లో సంకలనకర్తలు గుర్తు చేసుకున్న ఆ ఎనభై సూత్రాల్లో, కొన్ని మనకు ఉపనిషత్తుల్లో కూడా కనిపిస్తాయి. కొన్ని జైనగ్రంథాల్లో కూడా కనిపిస్తాయని పండితులు చెప్పారు. చాలావరకూ దమ్మపదంలోనూ, తక్కిన బౌద్ధ గ్రంథాల్లోనూ కూడా కనిపిస్తాయని బౌద్ధపండితులు గుర్తుపట్టారు. కొన్ని దేశ, కాల పరిమితుల్ని దాటి అత్యున్నత రూపకాలంకారాలుగా ప్రపంచమంతా వ్యాపించినవి. ఉదాహరణకి, నలుగురు గుడ్డివాళ్ళు ఏనుగుని తడిమి చూసి, ఏనుగు ఒక స్తంభంలాగా ఉంటుందనీ, ఒక చేటలాగా ఉంటుందనీ, ఏనుగు రోలులాగా ఉంటుందనీ, ఏనుగు రోకలిలాగా ఉంటుందనీ చెప్పిన కథ ఈ ఉదానపాలిలోనిదే (6: 4). (భారతీయ తత్త్వశాస్త్రం పైన ఒక పుస్తకం రాయాలని నేను చాలా కాలంగా అనుకుంటూ ఉన్నాను. ఆ పుస్తకమంటూ రాస్తే దానిమీద ముఖచిత్రంగా ఈ బొమ్మ గియ్యాలని అనిపిస్తూంటుంది నాకు.)

కొన్ని ఉదానగాథలు మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. ఉదాహరణకి, ఒకరోజు భిక్షువులంతా భిక్ష గ్రహించి, ఆరగించి, తోటలో కూచున్నప్పుడు వారి మధ్య ఏ విద్య గొప్పది అనే చర్చ వచ్చిందట (3:9). కొందరు హస్తివిద్య గొప్పది అనీ, కొందరు కత్తివిద్య గొప్పది అనీ, కొందరు లోకవిద్య గొప్పది అనీ, కొందరు లోకాయతన విద్య గొప్పది

అనీ, మరికొందరు పాలనావిద్య గొప్పది అనీ మాట్లాడుకుంటున్నారు. ఇంతలో బుద్ధుడు వచ్చి వారు దేనిగురించి మాట్లాడుకుంటున్నారని అడిగాడు. వాళ్ళు తాము చర్చించు–కుంటున్నది చెప్పారు. బుద్ధుడు వారి మాటలు విని, 'మీరిక్కడికి వచ్చింది ఇటువంటి నిరర్థకచర్చలకోసమా, మీరు చెయ్యవలసింది ధర్మాన్ని పాటించడమెలా అన్నదాని గురించి మాట్లాడుకోవడం, లేకపోతే మౌనంగా ఉండటం' అని చెప్పాడట.

మరొక సారి, ఒక శిష్యుడొకడు మాటిమాటికి అడవిలోనో, చెట్టుమొదటనో లేదా శూన్యగృహంలోనో నిల్చుని 'అహో సుఖం అహో సుఖం' అని పాటపాడుకునేవాడట. కొంతమంది శిష్యులు అతడి ప్రవర్తనను కనిపెట్టి, పోయి బుద్ధుడికి ఫిర్యాదు చేసారట. ఇతగాడు సన్న్యాసాన్ని, బ్రహ్మచర్యాన్ని స్వీకరించినా సంతోషపడుతున్నట్టులేదు, ఎంతసేపూ తన గతసుఖాల్నే తలుచుకుంటూ ఒక్కడూ ఉన్నప్పుడు అహో సుఖం, అహో సుఖం అంటున్నాడు అని. బుద్ధుడు అతడికి కబురు చేసి విషయమేమిటి అని అడిగాడట. అప్పుడు ఆ శిష్యుడిట్లా చెప్పాడట:

'భన్తే, నేనింతకుముందు, ఇంటిలో ఉండి రాజ్యం చేస్తూ ఉన్నప్పుడు అంతఃపురం లోపలా, బయటా తగినంత రక్షణ ఉండేది, నగరంలోపల కూడా కావలసినంత రక్షణ ఉండేది. నగరంలోనూ, జనపదంలోనూ రక్షణ ఉండేది. జనపదానికి బయట కూడా రక్షణ ఉండేది. నేను భన్తే, అలా రక్షణలో ఉన్నా, దాచబడినా, భీతుడను, ఉద్విగ్నుడను, శంకితుడను అయి విహరించేవాడను. కాని ఇప్పుడు భన్తే, అరణ్యంలో ఉన్నా, వృక్షమూలం–లో ఉన్నా, శూన్యాగారంలో ఉన్నా, ఏ భయం లేకుండా, శంకలేకుండా, ఉత్సుకత లేకుండా, లోపాలను వదిలి, అరణ్యంలో లేడిలా స్వేచ్ఛగా విహరిస్తున్నాను. ఇందువల్లనే భన్తే, నేను అరణ్యంలో ఉన్నా, వృక్షమూలంలో ఉన్నా, శూన్యాగారంలో ఉన్నా ఎల్లప్పుడూ 'అహో సుఖం, అహో సుఖం' అంటూ ఉదానాన్ని పాడుతున్నాను.'

బహుశా ఈ మాటలు నిన్నటిదాకా రాజోద్యోగిగా ఉండి నేడు విముక్తుణ్ణయిన నాలాంటివాడికి ఎంత సత్యంగా గోచరిస్తాయో వేరే చెప్పనక్కర్లేదు కదా.

మరొక సూక్తం (6: 8) చాలా ఆశ్చర్యం కలిగించింది. ఒకప్పుడు రాజగృహంలో రెండు వర్తకవర్గాలు ఒక గణిక కోసం రక్తాలు కారేటట్టు కొట్టుకున్నారట. ఆ సంగతి విన్నప్పుడు బుద్ధుడు ఇలా అన్నాడట:

'మార్గంలో ఉన్నవారికి, నేర్చుకునేవారికీ పొందినవీ, పొందవలసినవీ రెండూ దుమ్ముగలవే. ఒకరు శీలవ్రతం, బ్రహ్మచర్యం, ఇవే సారం అనుకుంటారు. ఇది ఒక

కొస. మరికొందరు కామాలలో దోషం లేదు అంటారు. ఇంకొక కొస. ఈ రెండూ స్మశానాల్ని పెంచేవే. స్మశానదృష్టిని పెంపొందించేవే. ఈ రెండు అంతాల గురించి తెలియని వారిలో కొందరు వెనుకబడిపోతారు. కొందరు అతిగా పరుగెత్తుతారు. వాటి గురించి తెలిసినవారు అక్కడ ఉండరు. వాటిని గౌరవించరు. వాటి గురించి తెలిసినవారికి సంసార చక్రం లేదు.'

ఒకసారి భగవానుడు శ్రావస్తిలో అనాథపిండకుడి జేతవనంలో చీకటిరాత్రి ఆరుబయట నూనెదీపపు వెలుగులో కూర్చున్నప్పుడు అనేక మిడతలు, దీపంపురుగులు ఆ నూనెదీపాల పైకి చుట్టూ ఎగురుతూ దురదృష్టం పాలయ్యాయట. బుద్ధుడు ఆ దృశ్యాన్ని చూసి, ఈ పద్యం చెప్పాడట (6:9):

> చూసినవాటిని విన్నవాటిని పట్టుకున్నవారు
> ఎంత పరుగెత్తినా సారం పొందలేరు.
> కొత్త కొత్త బంధనాలు పొందుతారు
> దీపం మంటలో పడే మిడతల్లా దుఃఖం పొందుతారు.

మరొక ఆశ్చర్యకరమైన సన్నివేశం 'యసోజ సూత్రం' (3:3) లో కనిపిస్తుంది. ఒకరోజు బుద్ధుడు వగ్గుముదా నదీతీరంలో ఉండి ప్రార్థనలు చేసుకుంటున్న అయిదువందల మంది భిక్షువుల్ని తన దగ్గరకు ఆహ్వానించేడు. వారికి ఆ రాత్రి బుద్ధుడు గొప్ప బోధ ఏదో వినిపించబోతున్నాడని అనుకున్నారందరూ. ఆ రాత్రి బుద్ధుడు నిర్మలసమాధిలో కూచున్నాడు. ఆ భిక్షుసంఘం కూడా ఆయనతో పాటే అక్కడ కూచున్నారు. ఆ రాత్రి మొదటి జాము గడిచిన తరువాత ఆనందుడు బుద్ధుడితో 'భన్తే, రాత్రి మొదటి జాము గడిచింది, ఆగంతుక భిక్షువులు చాలాసేపటినుండి కూర్చున్నారు. భన్తే, ఆగంతుక భిక్షువుల్ని పలకరించండి' అన్నాడు. కాని బుద్ధుడు మౌనంగా ఉన్నాడు. అలా ఆనందుడు రెండవ, మూడవ, నాలుగవ జాము గడిచిపోయినప్పుడు కూడా హెచ్చరిస్తూనే ఉన్నాడు. చివరికి, తూరుపు ఎర్రబడ్డాక, భగవానుడు ఆ సమాధి నుండి లేచి, ఆయుష్మంతుడు ఆనందుణ్ణి పలకరిస్తూ 'అలా అయితే ఆనందా, నేనూ ఈ అయిదువందలమంది భిక్షువులూ నిర్మల సమాధిలో కూర్చున్నట్లుగా నీకు అర్థం కాలేదా' అన్నాడు.

2500 ఏళ్ళ కిందటి ఆ రాత్రీ, ఆ నిర్మలసమాధీ నాక్కూడా కొద్దికొద్దిగా అనుభవం లోకి వస్తున్నట్లు ఉన్నాయి.

18-5-2022

తెలుగువాళ్ల భాగ్యం

తెలుగు నేలకు బౌద్ధం కొత్త కాదు. అతి ప్రాచీనకాలం నుండీ బౌద్ధం వికసించిన ప్రాంతాల్లో తెలుగునేల కూడ ఒకటి. ఒకప్పుడు అమరావతిలో, నాగార్జునకొండలో బౌద్ధంలోని పద్ధెనిమిదిశాఖలకు చెందిన ఉపాసకులూ ఉండేవారని చరిత్రకారులు చెప్తున్నారు. వైశాలిలో జరిగిన రెండవ బుద్ధసంగీతిలో థేరవాదులనుండి వేరుపడ్డ మహాసాంఘికులు ఆంధ్రప్రాంతానికి చెందినవారే అని కూడా అంటారు. బుద్ధుడి బోధనల్ని విస్తృత ప్రజానీకానికి అందించడంకోసం వారు మహాయానాన్ని ముందుకు తీసుకువచ్చారని కూడా చరిత్ర సాక్ష్యం చెప్తున్నది.

తెలుగు సంస్కృతిలో కావ్యసాహిత్యదశ మొదలయిన తరువాత దాదాపు వెయ్యేళ్ల కాలం బౌద్ధం వెనకబడి వైదికధర్మానికి ప్రాముఖ్యం లభించిందని మనకు తెలుసు. తిరిగి ఇరవయ్యవశతాబ్దంలో ఆధునికసాహిత్యం వికసించడం మొదలుపెట్టాక బుద్ధుడికీ, బౌద్ధ దర్శనానికీ తెలుగులో కొత్త ఆదరణ లభించడం మొదలయ్యింది. గురజాడ అప్పారావు బౌద్ధం పట్ల తన అభిమానాన్ని స్పష్టంగా ప్రకటించగా, తిరుపతివెంకటకవులు, పింగళి–కాటూరి, కరుణశ్రీ, జాషువ, దాశరథి వంటి కవులు బుద్ధుడి మీద కావ్యాలు అల్లారు. కాని ఇరవయ్యవశతాబ్దిలో బౌద్ధం పైన వెలువడ్డ కావ్యాలు బౌద్ధదర్శనాన్ని లోతుగా చదివి, ఆకళింపు చేసుకుని వెలువడ్డవి అని చెప్పలేం. అవి ప్రధానంగా అమేయమైన బుద్ధుడి వ్యక్తిత్వం పట్ల ఆరాధనాపూర్వకంగా రాసినవి మాత్రమే.

కాగా మరొకవైపు బౌద్ధదర్శనాన్ని ఎంతో లోతుగా మథించి గ్రంథాలూ, వ్యాసాలు వెలువరించిన తెలుగువారు కూడా గత శతాబ్దంలో ఎందరో కనిపిస్తారు. డా.బి.ఆర్. అంబేద్కరు దృష్టిని బౌద్ధం పట్ల మళ్ళించిన ఆచార్య పి.లక్ష్మీనరసు తెలుగువాడేనని అందరికీ తెలుసు. డా.రాధాకృష్ణన్, ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి, ఆచార్య కె.బి.కృష్ణ, డా.

బి.ఎస్.ఎల్.హనుమంతరావు, సంజీవదేవ్ వంటి వారెందరో బౌద్ధం పైన లోతైన పరిశీలన చేసి విలువైన రచనలు చేసారు. కాని సాధారణ తెలుగుపాఠకుడికి వారి రచనలు ఇంకా దూరంగానే ఉన్నాయి.

అయితే, ఇరవైఒకటవ శతాబ్దం మొదలయ్యాక, తెలుగు సాహిత్యచర్చల్లో మాత్రమే కాక, సామాజికచర్చల్లో బౌద్ధం గురించిన కొత్త జాగృతి కనిపిస్తున్నదని చెప్పాలి. ముఖ్యంగా, దళితపక్షపాతులైన కవులు రచయితలు ప్రస్తుత సమాజంలోని దళితులు సాంఘికంగా ఆర్థికంగా అనుభవిస్తున్న వివక్షకు కారణాలు బ్రాహ్మణీయ, హిందూ భావజాలంలో వెతుకుతూ, వాటికి ప్రత్యామ్నాయంగా, బౌద్ధదర్శనాన్ని ముందుకు తీసుకువస్తున్నారు. కాని ఈ రచయితలు బౌద్ధదర్శనాన్ని ఎంతవరకు క్షుణ్ణంగా చదివి ఆకళింపు చేసుకున్నారన్నది పరిశీలించవలసిన విషయం. మరీ ముఖ్యంగా, ఇటీవలి కాలంలో బుద్ధుడి గురించి, బౌద్ధం గురించి వెలువడే చాలా రచనలు బౌద్ధ మూలగ్రంథాలు చదివి రాసినవి కాక, ఆ గ్రంథాల గురించి రాసిన గ్రంథాల్ని, అంటే secondary sources ని చదివి రాస్తున్నవి కావడంతో, చాలాసార్లు అవి తాత్త్వికంగా అస్పష్టంగానూ, ఎన్నోసార్లు బ్రాహ్మణ, హిందూ దృక్పథాల పట్ల దూషణగానూ మాత్రమే కనిపిస్తున్నవి.

ఇదే సమయంలో బౌద్ధదర్శానికి చెందిన మూలగ్రంథాలు మునుపెన్నడూ లేనంత విరివిగా పాఠకులకి అందుబాటులోకి వస్తున్నవి. శ్రావకయానానికీ, మహాయానానికీ, వజ్రయానానికీ చెందిన ప్రాచీనగ్రంథాలేకాక, సింహళం, టిబెట్టు, చీనా, జపాను, థాయి, వియత్నాములకు చెందిన వివిధ బౌద్ధశాఖలకు చెందిన అపారమైన వాఙ్మయం ఇంటర్నెట్టు ద్వారా అందుబాటులోకి వస్తున్నది. చాలా బౌద్ధసంస్థలు బౌద్ధసాహిత్యాన్ని ఉచితంగా కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నాయి.

కాబట్టి ఇప్పుడొక విచిత్ర పరిస్థితి తెలుగులో కనిపిస్తున్నది. ఒకవైపు బౌద్ధదర్శనానికి చెందిన మూలగ్రంథాలు, సంస్కృత, పాళీ, ప్రాకృతం, సింహళం, చైనీసు, జపనీసులతో పాటు ఎన్నో ఇంగ్లిషు అనువాదాల్లో లభ్యమవుతూ ఉండగా, వాటిని ఏ మాత్రం చదవకుండానే, మరెవరో వాటి గురించి రాసిన పుస్తకాలు చదివి, తెలుగులో బౌద్ధం గురించి తామరతంపరగా వ్యాసాలు వెలువడుతూ ఉన్నవి. ఈ అగాధాన్ని ఎట్లా పూడ్చటం?

2

అలాగని బౌద్ధ ధర్మానికీ, దర్శనానికీ చెందిన మూలగ్రంథాల సంఖ్య చిన్నదేమీ కాదు. వాటిని ఒక వ్యక్తి తన జీవితకాలంలో పూర్తిగా చదవడం సాధ్యం కాదని కూడా చెప్పవచ్చు.

వాటిలో మహాయానం, వజ్రయానం, జెన్ బౌద్ధం లాంటి శాఖలకు చెందిన గ్రంథాల్ని పక్కన పెట్టి, థేరవాదానికి చెందిన గ్రంథాలనే చదువుదాం అనుకున్నామనుకోండి. అది కూడా ఏమంత సులభసాధ్యంగా కనిపించదు.

శ్రావకయానం, థేరవాదంగా పిలవబడే మూలబౌద్ధరచనలు ప్రధానంగా పాలీ భాషలో ఉన్నాయి. వాటిని మూడు పిటకాలుగా సంకలనం చేసారు. బుద్ధుడి బోధలు, జాతకకథలు మొదలైనవాటితో కూడుకున్నది సుత్తపిటకం. బుద్ధుడు స్థాపించిన సంఘ నిర్వహణకు సంబంధించిన నియమనిబంధనలను, పద్ధతుల్నీ వివరించేది వినయపిటకం. బుద్ధుడి సంభాషణల్లోని తాత్త్విక అంశాల్ని వివరించేది అభిదమ్మ పిటకం. ఈ మూడింటి లోనూ, బుద్ధుడు ఏమి మాట్లాడేడు, ఆయన ఆలోచన ఏ విధంగా ఉంది అని తెలుసు-కోవడానికి నిజమైన కరదీపిక సుత్తపిటకం. అయితే, ఆ సుత్తపిటకం ఒక్కదాన్నే అధ్యయనం చెయ్యాలన్నా కూడా సామాన్యమైన కృషి సరిపోదు.

ఎందుకంటే సుత్తపిటకంలో మళ్ళా అయిదు నికాయాలున్నాయి. మొదటిదైన దీర్ఘనికాయంలో బుద్ధుడి దీర్ఘసంభాషణలు 34 ఉన్నాయి. వాటికన్నా కొద్దిగా చిన్నవి, మధ్యస్థంగా ఉండే సంభాషణలు 152 మజ్జిమనికాయంలో ఉన్నాయి. సంయుత్త నికాయంలో 2889 సంభాషణలు ఉన్నాయి. ఇందులో ఎన్నో అంశాల మీద బుద్ధుడి విలువైన అభిప్రాయాలు ఉన్నాయి. ఇవి కాక అంగుత్తర నికాయం అనే పేరిట సంకలమైన సంభాషణల సంఖ్య మీద ఏకాభిప్రాయం లేదు. అవి రెండువేల నుంచి దాదాపు పదివేల దాకా ఉన్నాయి.

ఈ నాలుగు నికాయాలూ కాక, కుద్దక నికాయం పేరిట సంకలనమైన అయిదవ భాగంలో పద్దెనిమిది గ్రంథాలు ఉన్నాయి. బౌద్ధధర్మ సారాంశంగా పరిగణించబడే దమ్మపదం, సుత్తనిపాతం, మిళిందపన్హ వంటి గ్రంథాలతో పాటు బౌద్ధ జాతకకథలు కూడా ఈ నికాయంలోనే ఉన్నాయి. వీటితో పాటు తొలి బౌద్ధకవులు చెప్పిన కవిత్వం థేరగాథలు, థేరీగాథలు పేరిట కూడా ఈ విభాగంలో ఉన్నాయి.

కాబట్టి ఈ అయిదు నికాయాలూ, కనీసం మొదటి మూడు నికాయాలూ చదివినా కూడా బౌద్ధదర్శన మూలసూత్రాలు, మౌలిక తాత్త్వికత మనకి పరిచయమవుతుందని చెప్పవచ్చు. కాని ఒకరు తన చిన్న వయసులో ఏదేనా బౌద్ధ ఆరామంలో విద్యార్థిగా చేరి గురుముఖతః నేర్చుకోడానికే ఎంతో కాలం పట్టే ఈ అయిదు నికాయాల్నీ ఒక సాధారణ పాఠకుడికి ఎలా సన్నిహితంగా తీసుకుపోవడం?

అలా తీసుకువెళ్ళ వలసిన అవసరం ఉందని అందరికన్నా ముందు గుర్తించినవాడు అశోకుడు. ఆయన 'బ(భ్రు' శిలాశాసనంలో ప్రతి ఒక్కరూ పఠించి తీరవలసిన కొన్ని ముఖ్యమైన సూత్రాలను పేర్కొన్నాడు. రాజస్థానులో లభించిన ఈ శిలాశాసనంలో మజ్జిమ, అంగుత్తర, సంయుత్త నికాయాలనుంచి కొన్ని సూత్రాలను ఆయన పేర్కొన్నాడు.

బౌద్ధవాఙ్మయం ఇంగ్లిషు అనువాదాలద్వారా ప్రపంచం దృష్టికి రావడం మొదలైనప్పటి నుంచీ ఎందరో పండితులు, పరిశోధకులు సుత్తపిటకం నుంచి కొన్ని ముఖ్యమైన భాగాల ఇంగ్లిషు అనువాదాల్ని ఒక సంకలనంగా విస్తృతపాఠకలోకానికి అందించే ప్రయత్నాలు చేస్తూ వచ్చారు.

పందొమ్మిదో శతాబ్దంలో పాల్ కారస్ వెలువరించిన The Gospel of Buddha (1894) అటువంటి సంకలనాల్లో మేలిమి రత్నం అని చెప్పవచ్చు.

ఇరవయ్యవశతాబ్దంలో హెన్రీ.సి.వారెన్ వెలువరించిన Buddhism in Translations (1900), ఇ.జె.థామస్ సంకలనం Buddhist Scriptures (1913), ఆనందకుమార స్వామి సంకలనం చేసిన The Living Thoughts of Gotama the Buddha (1948), న్యంథిలోక థేర వెలువరించిన The Buddha's Path to Deliverance (1952), ఎడ్వర్డ్ కాంజ్ వెలువరించిన Buddhist Texts through Ages (1954), స్టెఫన్ బెయెర్ వెలువరించిన The Buddhist Experience, Sources and Translations (1974) అటువంటి కోవకు చెందిన విలువైన సంకలనాలు.

ఇరవై ఒకటవ శతాబ్దంలో పాశ్చాత్యప్రపంచం, ముఖ్యంగా అమెరికా, బౌద్ధం పట్ల మరింత ఆసక్తి పెంచుకోవడం మొదలుపెట్టాక మూలరచనల అనువాదాలు విరివిగా రావడంతో పాటు, ఇటువంటి సంకలనాలు కూడా కొత్తగా వస్తూనే ఉన్నాయి. వాటినన్నిటినీ పేర్కోవడం కష్టం. కానీ ముఖ్యంగా ఎంచదగ్గవి భిక్కు బోధి వెలువరించిన In the Buddha's Words (2005), సారా షా సంకలనం Buddhist Meditation (2006) గ్లెన్ వాలిస్ వెలువరించిన Basic Teachings of the Buddha (2007), ఆక్స్‌ఫర్డు యూనివెర్సిటీ ప్రెస్సు కోసం రూపర్ట్ గెథిన్ సంకలనం చేసిన Sayings of the Buddha (2008). ఇవికాక లోతైన అవగాహనతో థానిస్సారో భిక్కు వెలువరించిన Handful of Leaves (2017) ఇటీవల వెలువడ్డ సంకలనాల్లో అత్యుత్తమమైంది అని చెప్పవచ్చు.

కనీసం పద్దెనిమిదో శతాబ్దందాకా తమకు అంతగా పరిచయం లేని బౌద్ధదర్శనం గురించి పాశ్చాత్యప్రపంచం చూపిస్తున్న ఈ ఉత్సాహంతో, ఈ కృషితో పోల్చదగ్గ కృషి ఏదైనా తెలుగులో ఉందా?

ఒకప్పుడు కృష్ణానదీ పరీవాహకప్రాంతంలో పూర్వ, అపర శైలాలమీద మహా-యానాన్ని, కళింగదేశపు అడవుల్లో వజ్రయానాన్నీ వికసింపచేసిన ఆంధ్రబౌద్ధం ఈ రెండు మూడు శతాబ్దాలుగా ఎంత కృషి చేసి ఉండాలి? బౌద్ధ మూలగ్రంథాలకు ఎన్ని అనువాదాలు వచ్చి ఉండాలి? ఎంత లోతైన తాత్త్వికచర్చ కొనసాగుతూ ఉండాలి? పోనీ కనీసం మూల-గ్రంథాల్లోని ముఖ్యమైన భాగాలతోనైనా ఇంగ్లిషులో వచ్చినట్టుగా ఎన్ని సంకలనాలు వచ్చి ఉండాలి?

3

ఇటువంటి ఆవేదనకు చాలాకాలంగా లోనవుతూ వస్తున్న నాకు అన్నపురెడ్డి బుద్ధఘోషుడి పేరిట అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డిగారు చేస్తూ వచ్చిన అనువాదాలు ఒక ఊరటగా ఉండేవి. కాని ఆ అనువాదాల్లోని జటిలత నన్ను కొంత ఇబ్బందిపెడుతూ ఉండేది. అటువంటి పరిస్థితుల్లో నాలుగైదేళ్ళ కిందట హైదరాబాదు పుస్తకప్రదర్శనలో మహాబోధి బుద్ధవిహార వారు సుత్తపిటకానికి వెలువరిస్తున్న అనువాదాలు నా కంట పడ్డాయి. భిక్షు ధమ్మరక్షిత చేస్తున్న ఆ అనువాదాలు అత్యంత మూలవిధేయంగా ఉంటూనే ఎంతో పాఠక సన్నిహితంగా కూడా ఉన్నాయనిపించింది.

ఆ అనువాదకుడు నిజామాబాదుజిల్లాలో ఒక గ్రామసీమలో ఆశ్రమవాసం చేస్తున్నాడని తెలిసి మిత్రుడు గంగారెడ్డిని ఆయన దగ్గరకు తీసుకువెళ్ళమని అడిగాను. ఇద్దరం వెళ్ళాం. ఒక రాత్రి చాలాసేపు ఆయన సన్నిధిలో గడిపాం. ఆయన సాధన గురించీ, అనువాదాల గురించీ మాట్లాడుకున్నాం. ఆయన చేసిన అనువాదాలు ఇప్పటిదాకా వెలువడినవన్నీ ఆంజనేయరెడ్డిగారు నాకు కానుక చేసారు. వాటిని పఠించడం మొదలు పెట్టాను. కాని ఒక తెలుగువాడు పూర్వకాల తెలుగు బౌద్ధశ్రమణుల కోవలో, పాలీ భాషని అభ్యసించి, బౌద్ధ మూలగ్రంథాల్ని ఇంత ఉదారంగా తెలుగులోకి అందిస్తున్నందుకు, సామాన్యపాఠకలోకంలో కనబడవలసిన సంచలనం నాకిప్పటిదాకా కనిపించలేదు. బహుశా, ఈ మూలగ్రంథాలకూ, పాఠకులకూ మధ్య మరొక సేతువు కూడా నిర్మించవలసిన అవసరం ఉందేమో అనిపించింది.

అది రెండు రకాలుగా చెయ్యవచ్చు. ఒకటి, ఆయన చేసిన అనువాదాల్లో ప్రతి ఒక్క సంభాషణనీ పాఠకులకి మళ్ళా వివరంగా పరిచయం చేస్తూ రావడం. ఆ పని చెయ్యాలనే నేను చాలారోజులుగా అనుకుంటూ ఉన్నాను. మరొక పద్ధతి, ఆ మూలగ్రంథాలనుంచి ముఖ్యమైన భాగాలు తీసుకుని ఇంగ్లిషులో వెలువరించినట్టుగా,

ఒక సంకలనం వెలువరించడం. అదిగో, ఆ పని ఇప్పుడు భిక్షు ధమ్మరక్షిత తానే స్వయంగా ఈ 'స్వర్ణహంస' పేరిట చేయడం నిజంగా తెలుగువాళ్ళ భాగ్యం.

ఇది అద్వితీయమైన గ్రంథం అనీ, రెండువేల ఏళ్ళకు పైబడ్డ తెలుగు బౌద్ధచరిత్రలో ఇటువంటి సంకలనం రాలేదనీ చెప్పవచ్చు. కానీ, గత రెండువందల ఏళ్ళుగా ఇంగ్లిషులో వస్తున్న సంకలనాలకన్నా కూడా ఇది విశిష్టమైన సంకలనం అని కూడా చెప్పవలసి ఉంటుంది.

ముఖ్యంగా రెండు కారణాల వల్ల.

ఇంతదాకా ఇంగ్లిషులో వెలువడ్డ సంకలనాలు బుద్ధుడి జీవితానికి సంబంధించిన భాగాల్నీ, దర్శనానికి సంబంధించిన భాగాల్నీ వేరు వేరు అధ్యాయాలుగా సంకలనం చేసాయి. కానీ ఈ సంకలనకర్త బుద్ధుడి జీవితకథనీ, ఆయన జీవితకాలం పొడుగునా ప్రవచిస్తూ వచ్చిన సూత్రాల్నీ ఒకేదారానికి గుచ్చి మాలలాగా అల్లాడు. అందువల్ల మనకి ఏకకాలంలో బుద్ధుడి జీవితానికీ, దర్శనానికీ సంబంధించిన సమగ్రకథనం చదివిన అనుభవం లభిస్తుంది.

రెండవది, ఇంతదాకా ఇంగ్లిషు సంకలనాల్లో లేనిదీ, ఒకవేళ ఉన్నా స్పష్టంగా కనిపించనదీ, కాలపట్టిక. బుద్ధుడి జీవితసంఘటనల కాలపట్టికతో ఆయన ప్రవచించిన సూత్రాలను అనుసంధానపరిచి ఈ సంకలనకర్త మనముందుకు తీసుకురావడంతో బుద్ధుడి ఆలోచనల్లో ఒక క్రమపరిణామాన్ని కూడా మనం గుర్తుపట్టగలుగుతాం.

బుద్ధుడి సంభాషణలు 'ధర్మచక్రప్రవర్తన సూత్రం' (సంయుత్త నికాయం, 56) తో మొదలై 'మహాపరినిర్వాణ సూత్రం' (దీర్ఘనికాయం,16) తో పూర్తవుతాయని మాత్రమే మనకు తెలుసు. కాని ఆ మధ్యలో సంభాషణల్ని ఈ సంకలనకర్త ఒక కాలక్రమపట్టికలో అమర్చిన తీరు నిజంగా అద్వితీయం.

ఇక ఏ సంకలనమైనా సంకలనకర్త సొంత ఎంపిక. సముద్రమంత సుత్తపిటకం నుంచి నువ్వు అది ఎందుకు ఎంపికచేసావు, ఇది ఎందుకు వదిలిపెట్టావు అని సంకలన–కర్తను అడగడంలో ప్రయోజనం లేదు. అంతకన్నా కూడా ఆయన తాను ఎంపిక చేసిన భాగాలద్వారా బుద్ధుడి గురించీ, ఆయన దర్శనం గురించీ మనకు ఎటువంటి అవగాహన కల్పిస్తున్నాడు అన్నది చూడాలి. ఇందులో సంకలనకర్త దీర్ఘ, మజ్జిమ, సంయుత్త, అంగుత్తరనికాయాలనుంచే కాక, సుత్తనిపాతం, ఉదానపాలి వంటివాటితో పాటు వినయ–పిటకం నుంచి కూడా కొన్ని భాగాలు ఎంపికచేసాడు.

బుద్ధుడి సంభాషణలన్నిటిలోనూ దీర్ఘసంభాషణలు ఆయన మాటలకు ఎక్కువ సన్నిహితంగా ఉన్నవిగా నమ్మవచ్చునని చరిత్రకారులు అంటారు. ఇందులో కూడా 'మహాసతిపట్టాన సుత్త' (దీ.ని.22), 'మహానిదాన సుత్త' (దీ.ని.15), 'పోట్టపాదసుత్త' (దీ.ని.9), 'కూటదంత సుత్త' (దీ.ని.5), 'సామంజఫలసుత్త' (దీ.ని.2), 'మహాపరినిబ్బాణ సుత్త' (దీ.ని.16) లను సంకలనకర్త చేర్చడమే కాక, వాటిలోని అంశాలను మన ముందుంచడానికి ఎక్కువ పుటలు కేటాయించాడు. వీటితో పాటు నేటికాలపు సమాజానికి ఎంతో ప్రాసంగికంగా కనిపించే 'కేశముత్తియ సుత్త' లాంటి ముఖ్య సంభాషణల్ని కూడా ఇతర నికాయాలనుంచి ఎంపికచేసాడు.

ఆయా సంభాషణల్ని ఆయన ఇప్పటికే ఆయా మూలగ్రంథాల్ని అనువదించినప్పుడు పూర్తిగా అనువదించినప్పటికీ, ఈ గ్రంథంలో, వాటిని ఎంతవరకూ అవసరమో అంతవరకూ మాత్రమే ఉల్లేఖించడంతో ఈ కథనం ఎక్కడా పాఠకుడికి ఎక్కడా విసుగు పుట్టించదు.

మొదట్లో బుద్ధుడి జీవితకథని కూడా, కోశాంబి వంటివారు పునర్నిర్మించిన పద్ధతిలో కాక, పాళీగ్రంథాల్లో, జాతకకథల్లో ఏ విధంగా ఉందో ఆ విధంగానే ప్రతిపాదించడం గమనించదగ్గది. ఒక్క ఎంపికలో తప్ప మరెక్కడా సంకలనకర్త తన స్వంతనిర్ణయాల బరువు మనమీద మోపకపోవడం గమనార్హం.

4

ఈ పుస్తకమంతా చదివిన తరువాత మనకేమనిపిస్తుంది? శ్రావస్తితో జేతవనంలోనో, లేదా వేణువనంలో ఉడతలకు ఆహారం ఇచ్చే చోటనో లేదా పావారికుడి మామిడితోటలోనో బుద్ధుడు మాట్లాడుతుండగా మనం స్వయంగా వింటున్నట్టు అనిపిస్తుంది. మధ్యలో ఏ వ్యాఖ్యాతలతోనూ పనిలేకుండా, ఆయన తాను కనుగొన్న సత్యాల్ని విడమర్చిచెప్తుంటే, 'బోర్లపడ్డదాన్ని తిరిగి చక్కగా నిలిపినట్టు, మూసి ఉన్నదాన్ని తెరిచిచూపించినట్టు, దారి తప్పినవాడికి దారి చూపించినట్టు, కన్నులున్నవాడికి నూనెదీపం పట్టుకుని చీకటిలో రూపాన్ని చూపించినట్టు' మనకి ఒక మెలకువ కలుగుతుంది. ఆ మెలకువకీ, మనకీ మధ్య వ్యాఖ్యాతల అవసరం లేకుండాపోతుంది.

ఈ సంభాషణలన్నీ చదివినప్పుడు నాకు మరీ ముఖ్యంగా తోచింది బుద్ధుడికి తన దర్శనం పట్ల ఉన్న అచంచలమైన నిశ్చయం. ఆయన తొలిసారి బోధిగయనుండి వారణాసి వస్తున్నప్పుడు తనకు తారసపడ్డ ఆజీవకుడితో మాట్లాడిన మాటల దగ్గరనుంచి,

చివరిదినాల్లో కుసీనారలో భిక్షువులకు చివరి సందేశం దాకా ఆయన తన దర్శనం పట్ల అదే స్పష్టతతో ఉన్నాడు.

తాను చూసినది తనను విముక్తుణ్ణి చేయగలిగినప్పుడు తనని దర్శనాన్ని అనుసరించ గల ప్రతి ఒక్క మానవుణ్ణీ కూడా అది విముక్తపరచగలదనే ఆయన విశ్వసించాడు. వాదవివాదాలతోగాని లేదా దేవుడు, పరలోకం, మరణాంతరజీవితం లాంటి అవ్యాకృత విషయాల పట్ల చర్చద్వారాగాని ఆయన తన దర్శనాన్ని నిరూపించడానికి ప్రయత్నించలేదు.

'మాగందియా, ఆధ్యాత్మిక శాంతిని పొందిన నేను వాదవివాదాలను విడిచిపెట్టాను. నేను ఏ దర్శనాన్నీ బలపర్చను' అన్నాడు మాగందియుడితో. శీలసమాధిప్రజ్ఞలకు ఉపకరించని ఏ సంభాషణగానీ, చర్చగానీ వ్యర్థమనే బుద్ధుడు భావించాడు.

> పోట్టపాదా. అవి అర్థసహితం, ధర్మసహితం కావు. అది బ్రహ్మచర్యానికి, నిర్వేదానికి, విరాగానికి, నిరోధానికి, శాంతికి, అభిజ్ఞకు, సంబోధికి, నిర్వాణానికి ఉపకరించేవి కావు. అందువల్లనే అవి అవ్యాకృతం.

అని కూడా అన్నాడు. ఈ నేపథ్యంలో ఆయన తన శిష్యులనుంచి కాని, తన మాటలు అనుసరించాలనుకున్న వాళ్ళనుంచి కాని ఏమి కోరుకున్నాడు?

తాను చెప్తున్న విషయాల్ని ఆచరించే నిష్ఠని. మహాసతిపట్ఠాన సుత్తలో ఇలా అంటున్నాడు:

> భిక్షువులారా. ఏడు మాసాలను అలా ఉండనీ, ఈ నాలుగు స్మృతి ప్రస్థానాలను ఈ విధంగా ఆరునెలలు, అయిదు నెలలు, నాలుగు నెలలు, మూడు నెలలు, రెండు నెలలు, ఒక నెల, సగం నెల, సగం నెల అలా ఉండనీ, భిక్షువులారా, ఈ నాలుగు ప్రస్థానాలనూ ఏడు దినాలు అభ్యసించినా భిక్షువు ఈ జన్మలోనే అర్హత్వం లేదా ఉపాధిశేషం ఏమైనా ఉంటే అనాగామిఫలం ఈ రెండింటిలో ఏదైనా ఒకదానిని తప్పక పొందుతాడు.

ఏవి ఆ నాలుగు స్మృతి ప్రస్థానాలు?

> ఇలా లోపలి ధర్మాలలో ధర్మాలను చూస్తూ ఉంటాడు. బయట ధర్మాలలో ధర్మాలను చూస్తూ ఉంటాడు. లోపలి, బయటి ధర్మాలలో ధర్మాలను చూస్తూ ఉంటాడు. ధర్మాలలో ఉదయధర్మాలను చూస్తూ ఉంటాడు, ధర్మాలలో

> నాశనధర్మాన్ని చూస్తూ ఉంటాడు. ధర్మం ఉన్నది అనే ఎరుక కేవలం జ్ఞానం కోసం, ఎరుక కోసం మాత్రమే ఉంటుంది. అతడు లోకంలో దేన్నీ పట్టుకోకుండా ఉంటాడు. ఈ విధంగా భిక్షువులారా, భిక్షువు నాలుగు ఆర్యసత్య ధర్మాలలో ధర్మాన్ని చూస్తూ ఉంటాడు.

ఎరుక, awareness అదీ బుద్ధుడు పదే పదే చెప్తూ వస్తున్న మాట, మహాపరినిబ్బాణ సుత్తలో ఇలా అంటున్నాడు:

> భిక్షువులారా, భిక్షువు తెలివితో ఎలా ఉంటాడు? భిక్షువులారా, భిక్షువు ఇక్కడ రాకపోకలలో పూర్తి తెలివితో ఉంటాడు. అటు ఇటు చూచేటప్పుడు పూర్తి తెలివితో ఉంటాడు. ముడుచుకునేటప్పుడు, చాచుకునేటప్పుడు పూర్తి తెలివితో ఉంటాడు. సంఘాటిని, పాత్రను, చీవరాన్ని ధరించేటప్పుడు పూర్తి తెలివితో ఉంటాడు. తినేటపుడు, తాగేటపుడు, కొరికేటపుడు, రుచిచూసేటపుడు పూర్తి తెలివితో ఉంటాడు. మలమూత్రవిసర్జనలో పూర్తి తెలివితో ఉంటాడు. నడిచేటపుడు, నిలబడినపుడు, కూర్చున్నపుడు, నిద్రపోయినపుడు, మెలకువగా ఉన్నప్పుడు, మాట్లాడుతూ ఉన్నపుడు, మౌనంగా ఉన్నపుడు పూర్తి తెలివితో ఉంటాడు. భిక్షువులారా, భిక్షువు ఈ విధంగా పూర్తి ఎరుకతో ఉంటాడు. భిక్షువులారా, భిక్షువు పూర్తి ఎరుకతో, పూర్తి తెలివితో ఉండాలి. ఇదే నా ఉపదేశం.

ఈ ఎరుక, ఈ స్మృతి, ఇప్పుడు ప్రపంచమంతటా ఆధునిక బౌద్ధమనస్తత్వవేత్తలు, మానేజిమెంటు నిపుణులు మాట్లాడుతున్న mindfulness– దీన్ని అనుష్ఠించకుండా బుద్ధుడి బోధల్ని కేవలం వాదవివాదాలకోసం మాత్రమే ప్రస్తావించేవారిని బుద్ధుడు ఏవిధంగానూ అంగీకరించడని మనం గుర్తుపెట్టుకోవాలి. అంతేకాదు, బుద్ధుడి పేరుమీద నువ్వు మరెవర్నీ తూలనాడినా, మరే మతాన్ని, వర్గాన్ని, జాతిని నిందించినా అది సమ్యక్ వాక్కు కానేరదు అని కూడా గుర్తుపెట్టుకోవాలి.

బుద్ధుడిదర్శనాన్ని ఒక వాదవిషయంగా కాక లేదా ప్రసంగ విషయంగాకాక దాన్ని అనుష్ఠించవలసిన విషయంగా భావించినప్పుడు ఆ వాక్యాలు ఒక సాధారణవ్యక్తిని కూడా ఎంత శక్తిమంతుడిగా మార్చగలవో థిక్ నాట్ హన్ ఒక ఉదాహరణ. ఇటీవల పరమపదించిన వియత్నమీయ బౌద్ధభిక్షువు థిక్ నాట్ హన్ బుద్ధుడు చెప్పిన mindfulness ను అనుక్షణం ఆచరణలోకి తీసుకురావడానికి ప్రయత్నించాడు. తన కాలంలో

వియత్నాం అనుభవించిన రాజకీయ కల్లోలం మధ్య ఆయన లక్షలాదిమందికి ఒక స్ఫూర్తిగా, ఓదార్పుగా, ధైర్యంగా ఉంటూ వచ్చాడు. అటువంటి సాధువులు తెలుగునేలమీద వికసించాలంటే, అన్నిటికన్నా ముందు బుద్ధుడి సంభాషణల్ని యథాతథంగా చదవడం, చదివినదాన్ని ఆచరించడానికి ప్రయత్నించడం అవసరం.

ఈ రచనకు 'స్వర్ణహంస' అని పేరుపెట్టడంలో కూడా ఈ ఔచిత్యమే కనిపిస్తున్నది. ఈ హంస బౌద్ధ జాతకకథల్లోని సువర్ణహంస కాదు. ఇది మనలో మన బుద్ధితో, ఆలోచనల్తో నిమిత్తం లేకుండా అహర్నిశం చలిస్తూ ఉండే హంస. ఆ హంస మీద దృష్టిపెట్టమనే బుద్ధుడు 'ఆనాపాన సతి సుత్త' లో విశదంగా చెప్పాడు. మనం బుద్ధుడి గురించీ, బౌద్ధం గురించీ మాట్లాడుతూ ఉండి ఉపయోగం లేదు. ఇప్పటికి వందల ఏళ్ళుగా ఈ పనే చేస్తూ ఉన్నాం. నిజానికి చెయ్యవలసింది, మనం బుద్ధులం కావడం. నువ్వు బుద్ధుడి కావడమంటే, గతం గురించీ, భవిష్యత్తు గురించీ చింత వదిలిపెట్టి, 'ఇప్పుడు', 'ఇక్కడ' మీద ధ్యాస పెట్టడం. ఇంకా చెప్పాలంటే, జెన్ బౌద్ధులు చెప్పినట్లుగా, ప్రతి మనిషి తాను బుద్ధుడిగా మారే క్రమంలో బుద్ధుణ్ణి కూడా పక్కన పెట్టగలగడం.

5

బుద్ధుడు మాట్లాడిన మాటల్ని మనం నేరుగా విన్నప్పుడు, వాటిని అర్థం చేసుకున్నప్పుడు, అనుష్ఠించడానికి ప్రయత్నించినప్పుడు– అప్పుడు మాత్రమే బుద్ధుడికి చేరువకాగలుతాం. మహాపరినిబ్బాణ సుత్తలో ఆయన ఇలా అంటున్నాడు:

> భిక్షువులారా, ఎవరైనా భిక్షువు ఫలానాపేరుగల ఆవాసంతో బహుశ్రుతులు, నాలుగు నికాయాలను నేర్చుకున్నవారు, ధమ్మపరులు, వినయధరులు, మాతృకాధరులు ఉన్నారు. ఆ థేరుల ద్వారా నేను ఈ ధమ్మాన్ని, ఈ వినయాన్ని, ఈ శాస్త్ర శాసనాన్ని గ్రహించాను అంటే భిక్షువులారా, దాని మీరు వెంటనే అభినందించవద్దు. వెంటనే తిరస్కరించవద్దు. అభినందించ–కుండా, తిరస్కరించకుండా ఆ మాటలను, ఆ అర్థాలను చక్కగా గ్రహించి సూత్రాలతో సరిచూడాలి. వినయంతో సరిచూడాలి. వాటిని సూత్రాలతో, సరిచూచినపుడు, వినయంతో సరిచూచినపుడు, అవి సూత్రాలతో, వినయంతో సరిపోకపోతే –'ఇది భగవానుని వచనం కాదు, దీనిని ఈ భిక్షువు తప్పుగా గ్రహించాడు' అని వాటిని నిరాకరించాలి. ఒకవేళ సూత్రాలతో సరి చూచినపుడు, వినయంతో సరిచూచినపుడు అవి సూత్రాలతో, వినయంతో

సరిపోతే – 'ఇది భగవానుని వచనమే. ఈ భిక్షువు దీనిని సరిగా గ్రహించాడు' అని వాటిని స్వీకరించాలి.

ఈ మాటలు ఆయన నాలుగు సార్లు చెప్పాడు. ఎవరేనా భగవానునిపేరు చెప్పి చెప్పినా లేదా సంఘం పేరు చెప్పినా, లేదా ఫలానా ఆవాసం పేరు చెప్పి చెప్పినా లేదా మరో ఆవాసం పేరు చెప్పి చెప్పినా కూడా ఆ మాటలు సూత్రాలకీ, వినయానికీ అనుగుణంగా ఉంటేనే వాటిని స్వీకరించండి అన్నాడు. కాబట్టి ఎవరు బుద్ధుడి గురించి ఏమి చెప్పినా దాన్ని అంగీకరించేముందు, లేదా తిరస్కరించేముందు, కనీసం ఈ పుస్తకం చదివి, ఇందులో బుద్ధుడి సంభాషణలకు ఆ మాటలు అనుగుణంగా ఉన్నాయా లేదా అని పరిశీలించుకోండి.

నాలుగు వందల పేజీల ఈ సూత్ర, వినయ సంకలన సారాంశాన్ని నాకై నేను రెండు వాక్యాల్లో చెప్పుకోగలనా అని చూసాను. దమ్మపదంలోని ఈ గాథని ఈ పుస్తక–సంగ్రహంగా భావించవచ్చు అనిపించింది.

> సబ్బ పాపస్స అకరణం, కుసలస్స ఉపసంపదా
> సచిత్తపరియోదపనం ఎతం బుద్ధాన సాసనం (బుద్ధ వగ్గ, 183)

(ఎటువంటి పాపం చెయ్యకుండా ఉండటం, కుశలకర్మలు చెయ్యడంలో నేర్పు గడించడం, చిత్తాన్ని పరిశుద్ధంగా ఉంచుకోవడం–ఇదే బుద్ధులు అనుసరించే సాధనవిధి.)

బౌద్ధదర్శనానికి సంబంధించిన పాలీవాఙ్మయానికి చెందిన సుత్త, వినయ పిటకాల నుంచి ముఖ్యమైన భాగాల్ని ఈ రూపంగా సంగ్రహించి, తెలుగులోకి అనువదించి, సంకలనంగా మనకు అందించిన భిక్ఖు ధమ్మరక్ఖితకు తెలుగు జాతి ఎంతో ఋణపడి ఉంటుంది. సందేహం లేదు. కాని మరొక త్యాగశీలునికి కూడా మనమెంతో ఋణపడి ఉండాలి. ఆయనే అందెశ్రీ. 'మాయమయిపోతున్న మనిషి కోసం వెతుకుతున్నవాడు', సాధుకవి, యోగికవి, ప్రజాకవి. అందెశ్రీ పూనుకోకపోతే ఈ గ్రంథం ఈ రూపంలో ఇలా వెలువడి ఉండేది కాదు.

బుద్ధభగవానుని ఆశీసులు వీరిద్దరిపైన ఎల్లప్పుడూ వర్షించుగాక!

2-2-2023

నిజమైన జీవితాశయం

భారతదేశానికి బుద్ధుడెలాగో, గ్రీసుకి సోక్రటీసు ఎలాగో, చైనాకి కన్‌ఫ్యూసియసు (క్రీ.పూ. 551-479) అలాగ. గత రెండువేల అయిదువందల చీనా చరిత్రమీదా, సంస్కృతి మీదా ఆయన ముద్ర అపారం. ఇరవయ్యవశతాబ్దిలో ఆయన భావజాలం మీద పెద్ద తిరుగుబాటు చెలరేగింది. కమ్యూనిస్టు చైనా ఆయన్ని ప్రజాస్మృతినుంచి పూర్తిగా తుడిచిపెట్టే ప్రయత్నం చేసింది. కాని ఇరవై ఒకటవ శతాబ్ది చైనా మళ్ళా తన సమస్యలతో నలుగు-తున్నప్పుడు మళ్ళా ఓదార్పుకోసం, దిశానిర్దేశం కోసం ఆయనవైపే చూస్తున్నది.

అందుకొక ఉదాహరణ యు-డాన్ అనే యువభావుకురాలు రాసిన Confucius From The Heart: Ancient Wisdom for Todays World (పాన్ మాక్మిలను, 2009). ఈ రచన ఒక్క చీనాలోనే కోటిప్రతులు అమ్ముడుపోయిందట. ఇప్పుడు ఈ ఇంగ్లీషు అనువాదం ప్రపంచవ్యాప్తంగా ఆదరణకి నోచుకుంటున్నది.

ఈ రచనలో యు-డాన్ 'అనలెక్ట్సు' పేరిట సుప్రసిద్ధమైన కన్‌ఫ్యూసియసు సుభాషితాల్ని ఇప్పటి అవసరాలకు తగ్గట్టుగా వివరించడానికి ప్రయత్నించింది. ఒకప్పుడు నేను లారీబెత్‌జోన్స్ అనే యువభావుకురాలు రాసిన 'జీసస్, ద సి.ఇ.ఓ' అనే రచన చదివి కూడా ఇట్లానే ముగ్ధుణ్ణయ్యాను. ఈ రచనల్లో నన్ను విశేషంగా ఆకర్షించినవి ఈ రచయిత్రులకు తాము ఎవరిగురించి మాట్లాడుతున్నారో వారి గురించి సాధికారికంగా తెలిసిఉండటం, ఆ తెలివిడిలోంచి ఇప్పటి అవసరాలకు తగ్గట్టుగా వ్యాఖ్యానించడం.

తన రచనకు రాసుకున్న ముందుమాటలో యు-డాన్ ఇలా రాసింది:

> నాకేమనిపిస్తుందంటే, ప్రాచీనఋషులు తమ వాక్యాలతో ప్రజల్ని భయపెట్ట లేదనీ, కఠినపదాలతోనూ, వాగాడంబరంతోనూ ప్రజల్ని మభ్యపరచలేదనీ.

> 'నేనింక మాట్లాడటం వదిలిపెట్టేద్దామనుకుంటున్నాను' అన్నాడు కన్ ఫ్యూసియసు ఒకసారి. ఆ మాట వింటూనే జిగోంగ్ 'మీరే మాట్లాడకపోతే, మీ శిష్యులం, మాకు దిక్కేది? మాకెవరు దారి చూపిస్తారు' అని అడిగాడు. ఆ మాటలకి కన్ఫ్యూసియసు స్థిమితంగా, యాథాలాపంగా ఇట్లా జవాబిచ్చాడు: 'ఆ మాట కొస్తే స్వర్గమెప్పుడన్నా ఏదన్నా మాట్లాడుతుందా? అయినా నాలుగు ఋతువులూ వస్తూపోతూనే ఉన్నాయికదా, శతాధికమైనవెన్నో సంభవిస్తూనే ఉన్నాయి కదా. స్వర్గం మాట్లాడవలసిన పని ఉందా?'

ఆమె ఇంకా ఇలా రాసింది:

> ఇట్లాంటి సరళ సత్యాలు ప్రజల హృదయాల్లోకి చొచ్చుకుపోవడానికి కారణం అవి ప్రతి ఒక్క హృదయాన్నీ తట్టిలేపే విధంగా ఉండటమే తప్ప వాళ్ళ మూఢవిశ్వాసాన్ని చూరగొనాలని ప్రయత్నించకపోవడమే.
>
> కన్ఫ్యూసియసు వివేకం మన హృదయస్పందనాన్ని ఒక్కసారి ఆపి సత్యాన్ని సాక్షాత్కరింపచేస్తుంది. ఒక్కసారిగా మనలో అవగాహన పరవళ్ళు తొక్కుతుంది. ఒక జీవితకాలంపాటు నిర్విరామంగా అధ్యయనం చేస్తేగాని దొరకని అవగాహన అది...కాబట్టి మనమీరోజు కన్ఫ్యూసియసు నుంచి నేర్వవలసింది 'వూ' చక్రవర్తి మాట్లాడిన కన్ఫ్యూసియను అధ్యయనం కాదు. లేదా చీనాలో డావోయిజం, బౌద్ధాలతో పాటు సమానంగా వర్ధిల్లిన కన్ఫ్యూసియను మతాన్నీ కాదు. వాదవివాదాల్తో కూడిన కన్ఫ్యూసియను పాండిత్యం అంతకన్నా కాదు.
>
> అదేమిటో మాటల్లో పెట్టలేకపోయినా ప్రతి మనిషీ తన హృదయంలో అనుభూతి చెందే సరళసత్యాల్నే కన్ఫ్యూసియసు సుభాషితాలనుంచి మనం ఏరుకోవలసి ఉంటుంది. నా ఉద్దేశ్యంలో కన్ఫ్యూసియసు వివేకం మన చేతుల్ని కాల్చే నిప్పు కాదు, లేదా గడ్డ కట్టించే మంచూకాదు. అది మన శరీర ఉష్ణోగ్రత కన్నా కొద్దిపాటి వెచ్చన. అంతే. ఆ వెచ్చదనంతోనే అది యుగాలుగా వర్ధిల్లుతూవస్తున్నది.

ఈ పుస్తకంలో ఆరు అధ్యాయాలున్నాయి. దేనికదే ఎంతో విలువైన అధ్యాయమే అయినప్పటికీ. The Way of Ambition అనే అధ్యాయం చాలా విలువైందిగా

అనిపించింది. ఎందుకంటే నేటికాలపు మానవుడు చాలా ambitious. ఇప్పటి మన సాహిత్యం, రాజకీయాలు, సినిమాలు మన యాంబిషనుని తృప్తి పరిస్తేనే ప్రజాదరణకి నోచుకోగలుగుతున్నాయి. చివరికి దేవుడూ, దేవాలయాలూ, భక్తి, ఆధ్యాత్మికసాహిత్యం కూడా ప్రజల యాంబిషనుని తృప్తి పరిస్తేనే వాటికి జనాదరణ. ఇటువంటి సమాజానికి కన్‌ఫ్యూసియసు ఇవ్వగల సలహా ఏమిటి?

అందుకామె కన్‌ఫ్యూషియసు అనలెక్ట్సు 11 వ అధ్యాయంలోని ఒక చర్చను ఉదాహరిస్తూ కొంత వివరించింది. ఆ చర్చ ఇలా ఉంది.

ఒకప్పుడు కన్ ఫ్యూషియసు తన నలుగురు శిష్యులు జీ-లు, రాన్-కియు, గోంగ్షి-చి, జెంగ్-దియానులతో కూచుని ఉన్నాడు. వాళ్ళ సంభాషణ జీవితాశయాలవైపు మళ్ళింది. కన్‌ఫ్యూషియసు తన శిష్యుల్నిలా అడిగాడు: 'మీరు యువకులు, విద్యావంతులు, ఎవరైనా మీ శక్తి సామర్థ్యాల్ని గుర్తించి మీకు తగిన అవకాశమిస్తానంటే మీరేం చేస్తారో వినాలని ఉంది, చెప్పండి' అన్నాడు.

అప్పుడు మొదటి శిష్యుడు జీ-లు వెంటనే ఇలా అన్నాడు: 'రెండు రాజ్యాలమధ్యనుండే చిన్న రాజ్యాన్నొకటివ్వండి నాకు. ఆ రాజ్యానికి బయటనుంచి దండయాత్రల భయం, లోపల కరువుకాటకాల ప్రమాదముందనుకోండి, అయినా కూడా మూడేళ్ళలో నేనా ప్రజలకి అన్నవస్త్రాల లోటు లేకుండా చేస్తాను. వాళ్ళని ఉత్తేజితుల్ని చేస్తాను, నైతికతత్పరుల్ని చేస్తాను' అన్నాడు.

ఆ మాటలు వింటూ కన్‌ఫ్యూషియసు చిరునవ్వు నవ్వి రెండవ శిష్యుడి వైపు తిరిగాడు. అతడు, రాన్-కియు ఇలా అన్నాడు: 'నాకు యాభై-అరవై లేదా అరవై-డెబ్భై చదరపు మైళ్ళ విస్తీర్ణముండే మండలాన్నివ్వండి, మూడేళ్ళలో అక్కడి ప్రజలకు అన్నవస్త్రాల లోటు లేకుండా చేస్తాను. ఇక వాళ్ళ ఆధ్యాత్మిక అవసరాలంటారా, అది ఎవరైనా ఋషీశ్వరుడి చేతుల్లో పని. నేను తీర్చగలిగేది కాదు' అన్నాడు.

అప్పుడు కన్‌ఫ్యూషియసు మూడవ శిష్యుడి వైపు తిరిగి 'గోంగ్షి, నీ మాటేమిటి?' అనడిగాడు. గోంగ్షి నెమ్మదిగా 'నేను ముందు మరింత తెలుసుకోవాలనుకుంటాను, మరింత నేర్చుకోవాలనుకుంటాను. అప్పుడు ఏదో ఒక చిన్న ఉద్యోగబాధ్యత స్వీకరించి నాకప్పగించిన పనిని సక్రమంగా నెరవేర్చడానికి ప్రయత్నిస్తాను' అన్నాడు.

ముగ్గురూ కన్‌ఫ్యూషియసు శిష్యులే. ఆయన బోధల్ని వంటపట్టించుకున్నవారే. మానవుడు తన సామర్థ్యాల్ని సమాజం కోసం ఎలా వినియోగించాలని కన్‌ఫ్యూషియసు

బోధించాడో ఆ మెలకువ గ్రహించినవారే. అయినా కన్ఫ్యూషియసు ఆ ముగ్గురి మాటల దగ్గరా ఆగలేదు. అంతదాకా మాటాడకుండా ఉన్న నాలుగవ శిష్యుడు జెంగ్ దియాను వైపు తిరిగి 'దియాన్, నువ్వేమీ మాట్లాడనే లేదు. నువ్వేమంటావు?' అనడిగాడు.

దియాను అప్పటిదాకా యాభైతంత్రుల సంగీతవాద్యమొకటి వాయిస్తూ ఉన్నాడు. గురువు తనని ప్రశ్నించగానే అతడు తన వాద్యం మీద పలుకుతున్న రాగప్రస్తారం పూర్తిగా సద్దుమణిగేదాకా ఆగాడు. అప్పుడా వాద్యాన్ని నెమ్మదిగా పక్కన పెట్టి వినయ పూర్వకంగా లేచినిల్చుని 'నా ఆలోచనలు నా మిత్రులకన్నా భిన్నమైనవి. నేను వాటిని చెప్పవచ్చునా?' అనడిగాడు.

'ప్రతి ఒక్కర్నీ చెప్పమనే కదా అడుగుతున్నాను. నీ భావాలేమిటో నువ్వు కూడా చెప్పు' అన్నాడు కన్ఫ్యూషియసు.

అప్పుడు దియాను ఇలా చెప్పాడు: 'నా కోరికేమిటంటే, ఈ వసంతకాలం ముగిసి పోకుండానే, కొత్త దుస్తులు తీసుకుని, కొందరు మిత్రులతో, పిల్లలతో యీ నదీతీరానికి వెళ్ళాలనుకుంటున్నాను. ప్రకృతి అంతా కొత్తగా ప్రాణం పోసుకుంటూ చెట్లు చిగురిస్తున్న దృశ్యం చూడాలనుకుంటున్నాను. వసంతకాలపు వెచ్చదనానికి ఇప్పుడిప్పుడే మంచు కరుగుతున్న నదీజలాల్లో స్నానం చెయ్యాలనుకుంటున్నాను. స్నానం చేసాక కొత్త దుస్తులు ధరించి వసంతపవనంలో ఓలలాడాలనుకుంటున్నాను. ఆ వసంతగాలి మా అందరి లోపలకీ వీచి మాలో ఒకటైపోవాలనుకుంటున్నాను. నవజీవనశోభతో అలరారే ఈ ఋతువులో నా జీవనక్రతువుని ఉత్సవంగా జరుపుకోవాలనుకుంటున్నాను. ఇక అట్లా గడిపినంతసేపు గడిపాక మేమంతా పాటలు పాడుకుంటూ ఇంటిదారి పట్టాలను-కుంటున్నాను. ఇంతే. ఇంతకుమించి నాకే జీవితాశయమూ లేదు' అన్నాడు.

ఆ మాటలు వింటూనే కన్ఫ్యూషియసు దీర్ఘంగా నిట్టూర్చి 'నా కోరిక కూడా నీ లాంటిదే' అన్నాడు.

ఈ కథ గురించి చాలా సుదీర్ఘంగా తన భావాలు వివరిస్తూ యు-డాన్ చివరకు చెప్పిందేమిటంటే, ఒక మనిషి తన సామాజికబాధ్యత ఎంతబాగా నెరవేర్చాడన్నదాన్ని బట్టి అతడి ఆంతరంగిక ప్రశాంతి ఆధారపడదనీ, అందుకు బదులు, అతడి ఆంతరంగిక ప్రశాంతివల్ల మాత్రమే అతడు తన సామాజికబాధ్యతని మరింత సక్రమంగా నెరవేర్చ-గలుగుతాడనీ.

దీన్నిబట్టి నిజమైన జీవితాశయం ఏది? అది మనం చేసే పనులకి లభించే సామాజిక ఆమోదం వల్ల నిర్ధారితమయ్యేదికాదు. మన ఆంతరంగిక ప్రశాంతిని నలుగురికీ పంచ–గలగడమే నిజమైన జీవితాశయమని అనుకోవలసిఉంటుంది.

బహుశా అత్యున్నత భారతీయ ఆధ్యాత్మికవాక్యాలు బోధిస్తున్నది కూడా ఇదేకదా.

23-10-2013

పులికన్నా ప్రమాదకరమైంది

అశోక్ బుక్‌సెంటరు అధిపతి అశోక్‌కుమారుగారు తెలుగు ప్రచురణకర్తల్లో ఉత్తమ అభిరుచీ, విస్తృతపరిజ్ఞానం ఉన్న వ్యక్తి. విజయవాడలో అశోక్ బుక్‌సెంటరులో గాని, హైదరాబాదులో 'అక్షర'లోగాని సరికొత్త పుస్తకాలు కనిపిస్తాయంటే, అందుకనే, ఆశ్చర్యం లేదు. నిన్న ఆయన్ని విజయవాడలో కలిసినప్పుడు, The Life and Wisdom of Confucius (2002) అనే చిన్న పుస్తకం ఇచ్చారు. 'చైనీస్ సేజ్ సిరీస్' కింద పిల్లలకోసం చైనాలో రూపొందించిన పుస్తకం. బుద్ధుడిలాగా, సోక్రటీసులాగా కన్ ఫ్యూసియసు గురించి కూడా ఎంత తెలుసుకున్నా, ఇంకా తెలుసుకోవలసింది ఉంటూనే ఉంటుంది. తెలుసు కుంటున్న ప్రతిసారీ, కొత్తగానూ, ఉత్సాహకరంగానూ ఉంటుంది.

పిల్లలకోసం చైనీసు లోనూ, ఇంగ్లిషులోనూ, రెండు భాషల్లో చిన్న చిన్న అధ్యాయాలు–గా చక్కటి బొమ్మల్తో తీసుకొచ్చిన ఆ పుస్తకంలోంచి రెండు అధ్యాయాలు, మీ కోసం.

1

కన్‌ఫ్యూసియసు 'లూ' రాజ్యం వదిలిపెట్టి 'కీ' రాజ్యంలో ఝా–వో ప్రభువుని కలుసుకోవాలని బయల్దేరాడు. ఒక రోజు సాయంకాలం అయ్యేటప్పటికి ఆయన తన శిష్యులతో తాయి పర్వతప్రాంతంలో పోతూ ఉండగా, అక్కడొక స్త్రీ ఒక సమాధి దగ్గర విలపిస్తూ కనిపించింది. కన్‌ఫ్యూసియసు తన శిష్యుడు జీ–లు ని సంగతేమిటో కనుక్కోమన్నాడు. ఆమె తన భర్తా, తన మామగారూ ఇద్దరూ కూడా అక్కడ పులి వాత పడ్డారని, ఇప్పుడు తన కొడుకు కూడా పులినోట చిక్కాడనీ చెప్పింది. అయితే అంతప్రమాదకరమైన చోటులోనే ఇంకా ఎందుకున్నావు, వేరే ఎక్కడికైనా వెళ్ళిపోవచ్చుకదా, అని ఙీఖ–లు ఆమెనడిగాడు.

అందుకామె, ఆ మారుమూల కొండప్రాంతంలో నియంతృత్వం లేదనీ, అందుకే తాను అక్కణ్ణుంచి వెళ్ళిపోడానికి ఇష్టపడటం లేదనీ చెప్పింది. ఆ మాటలు విని కన్‌ఫ్యూసియసు దీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు కదా : 'కాబట్టి,మనమిప్పుడొక పాఠం నేర్చుకున్నాం. నియంతృత్వం పులికన్నా ప్రమాదకరమైంది అని' అన్నాడు.

2

'లూ' రాజ్యానికి చెందిన దింగ్ పాలనా కాలం నాలుగో ఏడాది, అంటే క్రీస్తుకు పూర్వం 506 నాటికి, కన్‌ఫ్యూసియసుకి 46 ఏళ్ళు. ఒకరోజు ఆయన తన శిష్యులతో కలిసి ప్రవచనం చేయడానికి దేవాలయానికి వెళ్ళాడు. అక్కడ యజ్ఞయాగాదుల్లో వాడే పెద్ద కంచుపాత్ర ఒకటి ఒక పక్కకి ఒరిగి పోయి కనిపించింది. అది ఎందుకు పక్కకు ఒరిగి పోయిందని కన్ ఫ్యూసియసు అడిగాడుగాని, ఎవరూ కారణం చెప్పలేకపోయారు. కన్ ఫ్యూసియసు తన శిష్యుడు కోంగ్-లి ని పిలిచి నీళ్ళు తెచ్చి ఆ పాత్రలో నెమ్మదిగా పొయ్యమని చెప్పాడు. నీళ్ళు పాత్రంలో సగం నిండేటప్పటికి ఆ పాత్ర తిన్నగా, కుదురుగా నిలబడింది. పూర్తిగా నిండేటప్పటికి మళ్ళా పక్కకి ఒరిగిపోయి, తల్లకిందులైపోయి, మొత్తం నీళ్ళన్నీ ఒలికిపోయాయి. అప్పుడు కన్ ఫ్యూసియసు తన శిష్యులతో ఇలా చెప్పాడు. 'ఇదే మనం గుర్తుపెట్టుకోవలసిన సూత్రం. దీన్ని రాజుగారి సింహాసనం పక్కన ఒక హెచ్చరికగా నిలబెట్టారన్నమాట. ఏమి చెప్పడానికి? ఖాళీగా ఉంటే ఒరిగిపోతావు, మధ్యస్థంగా ఉంటే నిటారుగా ఉంటావు, పొంగిపొర్లావనుకో, తల్లకిందులవుతావు.'

2-7-2022

కన్ఫ్యూసియసు

అశోక్ బుక్‌సెంటరు నుంచి తెచ్చుకున్న కన్ఫ్యూసియసు పుస్తకం నాకు చాలా ఉత్తేజాన్నిచ్చింది. అందుకని ఆ పుస్తకం చదువుతూనే అనువాదం చెయ్యకుండా ఉండలేక పోయాను. ఆ అనువాదానికి ఒక పరిచయవ్యాసం జోడించి అశోక్‌కుమారు గారికి పంపించాను.

బహుశా ప్రతి ఉద్యమకారుడికీ, రాజోద్యోగికీ కూడా కన్ఫ్యూసియసు మాటలు చాలా దగ్గరగా వినిపిస్తాయనుకుంటాను. నా వరకూ నాకు ఎన్నో తావుల్లో కన్ఫ్యూసియసు జీవితంతోనూ, ఆయన మాటల్తోనూ ఎన్నో పోలికలు కనిపించాయి. అంటే నేను కన్ఫ్యూసియసు అంతటివాణ్ణి అని కాదు. నాలాంటి వాణ్ణి కూడా తనతో మమేకపరుచుకునే శక్తి ఆ జీవితానికీ, ఆ సంభాషణలకీ ఉందని దాని అర్థం.

ఆ పుస్తకం చదువుతూ ఉండగానే, నేనెప్పుడో Confucius, A Biography (2006) అనే పుస్తకం కొనిపెట్టుకున్నానని గుర్తొచ్చింది. అది కూడా తీసి చదివాను. Jonathan Clements అనే ఆయన కన్ఫ్యూసియసు సమగ్ర సాహిత్యాన్నీ, ఆయన మీద వచ్చిన రచనల్నీ కూలంకషంగా చదివి చాలా సరళంగానూ, సాధికారికంగానూ రాసిన పుస్తకం. నూటయాభై పేజీలు కూడా లేని ఈ పుస్తకం కన్ఫ్యూసియసు గురించి తెలుసుకోవాలనుకునే వాళ్ళకి ఒక సులభపరిచయంగా ఉపకరిస్తుంది. ప్రపంచంలోని కొందరు గొప్ప విద్యావేత్తల గురించి రాయాలని ఒక ప్రణాళిక వేసుకుని, అందులో భాగంగా చేర్చి పెట్టుకున్న పుస్తకాల్లో ఇది కూడా ఒకటి. ఇన్నాళ్ళకు చదవగలిగాను.

కన్ఫ్యూసియసు మొత్తం డెబ్భైమూడేళ్ళు జీవించాడు. కాని అతడి జీవితకాలం మొత్తం మీద, ఆయన అనుకున్న పాలనా విధానం ప్రకారం పరిపాలించడానికి ఒక నగరాధికారిగా ఒక ఏడాది అవకాశం దొరికింది. 'లూ' అనే చిన్న రాజ్యానికి

న్యాయశాఖామంత్రిగా బాధ్యతలు నిర్వహించడానికి మరొక రెండేళ్ళు అవకాశం దొరికింది. రెండుసార్లూ ఆయన్ని పదవిలో పూర్తి కాలం కొనసాగించలేదు. తనకే గనుక కనీసం మూడేళ్ళు పాలనాధికారం లభిస్తే అద్భుతాలు చేసి చూపించగలని అనుకున్నాడు. కాని తన స్వదేశమైన 'లూ' రాజ్యంతో సహా, అప్పటి చీనాలోని ఏ ఒక్క రాజ్యమూ కూడా తమ చరిత్రలో ఆయనకి కనీసం ఆ మూడేళ్ళు అప్పగించలేకపోయాయి.

తన సలహాలు, సూచనలు విని తాను చెప్పినట్టుగా పాలన చేసే రాజుని వెతుక్కుంటూ ఆయన ప్రాచీనచీనా మొత్తం పర్యటించాడు. అప్పటి ప్రధాన రాజ్యాల తలుపులన్నీ తట్టాడు. ఆశ్చర్యమేమిటంటే, ప్రతి ఒక్క చోటా, రాజులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. కాని మంత్రులు ఆయన్ని తమ పాలన దరిదాపులకు కూడా రానివ్వలేదు. ఎందుకని?

మనకి వేదకాలం లాగా, చీనా చరిత్రకి కూడా ఒక వేదకాలం ఉంది. ఒకప్పుడు అంటే మూడు వేల ఏళ్ళ కిందట పడమటి 'ఝౌ' చక్రవర్తులు 'షాంగ్' రాజవంశ పాలనని కూలదోసి ఒక ఏలుబడి సాగించారు. కొన్ని ధర్మాల మీద, విలువలమీద ఆధారపడి తాము పాలన చేస్తున్నామనీ, ఆ ధర్మం తప్పితే తమకి పాలనాధికారం పోతుందనీ వారు నమ్మారు. అన్నట్టుగానే ఏడువందల ఏళ్ళ పాలన తర్వాత ఆ రాజవంశం కూలిపోయింది. చీనా ఉత్తరాది తెగల దండయాత్రలకు గురయి, ఆ పడమటి ఝౌ సామ్రాజ్యం తూర్పు సామ్రాజ్యంగా మారి లొయాంగ్ రాజధానిగా నడిచింది.

కానీ పవిత్ర రోమను సామ్రాజ్యంలాగా అది పేరుకు మాత్రమే సామ్రాజ్యం. యథార్థమైన పాలన ఏడు సామంత రాజ్యాల చేతుల్లో ఉండేది. తూర్పు ఝౌ చక్రవర్తులు కేవలం ధార్మిక కార్యకలాపానికి మాత్రమే పరిమితమైపోవలసి వచ్చింది. ఆ ఏడు సామంత రాజ్యాలతో పాటు మరికొన్ని చిన్నరాజ్యాలు కూడా ఒకరితో ఒకరు కలహించుకుంటూ ఉండేవారు. ప్రజలమీద పన్నులు విధిస్తూ, తాము మాత్రం భోగలాలసతతో, పరస్పర ద్రోహాలతో కాలంగడుపుతుండేవారు.

చీనాచరిత్రలో సమరశీలరాజ్యాల కాలంగా పేరు పొందిన ఆ కాలంలో కన్‌ఫ్యూసియసు పుట్టి పెరిగాడు. ఆయన ప్రాచీన ఝౌ చక్రవర్తుల ధర్మశాస్త్రాలు, సాహిత్యం, సంగీతం క్షుణ్ణంగా అధ్యయనం చేసాడు. ఆ పాలనలోని సద్గుణాల్ని, తన కాలం నాటి దుర్గుణాల్ని ఆయన త్రైపారు వేసుకుని చూసుకున్నాడు. తన కాలం నాటి సమాజానికి రాజకీయ-సామాజిక విముక్తి లభించాలంటే రెండు విలువలు అవసరమని భావించాడు. అవి దయార్ద్రహృదయంతో కూడిన పాలన, ధార్మిక శీలమూను. ఆ రెండు విలువల్నీ

ఆయన ప్రచారం చేస్తూ గడిపాడు. ఆ విలువల్ని కన్ఫ్యూసియసు తనకి పాలనాధికారం లభించినప్పుడు స్వయంగా అమలుచేసి చూసాడు. ఆ విలువల్ని ఎవరు ఉల్లంఘిస్తున్నా, రాజులుగాని, మంత్రులుగాని, సైనికాధికారులుగాని, మిత్రులు గాని, శిష్యులుగాని, చివరికి తన కన్నకొడుకు గాని, ఎవరు వాటినుంచి దారితప్పినా ఆయన వారి ముఖం మీదనే వారికి హితవు చెప్తూ వచ్చాడు, వినకపోతే మందలిస్తూ వచ్చాడు, పూర్తిగా పెడతోవ పడితే అభిశంసిస్తూ వచ్చాడు.

ఆయన తన యుటోపియాకి ప్రాచీనకాలంలోని ఒక సరళయుగాన్ని ఆధారం చేసుకున్నప్పటికీ, ఆ విలువలు దాదాపుగా సార్వకాలికాలు, సార్వజనీనాలు. ప్రతి ఒక్క విలువనీ ఆయన తరచిచూసాడు. నిశితపరీక్షకి గురిచేసాడు. ఎప్పుడైనా ఆయన తన మాటలు మర్చిపోతే శిష్యులు వాటిని గుర్తుచేసేవారు. కాబట్టి సోక్రటీసు కోరుకున్నట్టుగా ఆయనది thouroughly examined life. ఆయన మాట్లాడిన విలువలు కూడా thouroughly examined.

ఉదాహరణకి, ఆయన మాట్లాడిన విలువల్లో కౌటుంబిక విధేయత filial piety చాలా ప్రధానమైనది. అంటే కొడుకు తండ్రి పట్ల చూపించవలసిన విధేయత. ఆయన న్యాయశాఖామంత్రిగా ఉన్నప్పుడు ఆయన దగ్గరకి ఒక వ్యాజ్యం విచారణకు వచ్చింది. ఆ గొడవలో ఒక తండ్రి తన కొడుకు తనని నిర్లక్ష్యం చేయడమే కాక హింసిస్తున్నాడని కూడా ఫిర్యాదు చేసాడు. కన్ఫ్యూసియసుకి వెంటనే పరిష్కారం దొరకలేదు. ఆయన ఆ తండ్రీ కొడుకులిద్దరినీ మూడు నెలలు ఖైదులో పెట్టాడు. ఆ తర్వాత ఇద్దర్నీ విడుదల చేసేసాడు. కన్ఫ్యూసియసు మాట్లాడే ధార్మికసూత్రాల ప్రకారం ఆ కొడుక్కి మరణశిక్ష విధించాలి. ఎందుకంటే అతడు కౌటుంబిక విధేయతని పూర్తిగా ఉల్లంఘించాడు. ఆ వ్యాజ్యాన్ని కన్ఫ్యూసియసు ఏ విధంగా పరిష్కరిస్తాడా అని ఆ రాజు ఆసక్తిగా, కానీ మౌనంగా చూస్తూ ఉన్నాడు. కానీ కన్ఫ్యూసియసు వాళ్ళిద్దర్నీ విడుదల చెయ్యగానే ఆ కొడుకుని ఎందుకు విడుదల చేసారని అడిగాడు. అందుకు కన్ఫ్యూసియసు చెప్పాడు కదా: 'ఆ కొడుకు అలా తప్పుదోవపట్టాడంటే అందుకు ప్రధాన కారణం ఆ తండ్రినే. అతడు తన కొడుకుని సరిగ్గా పెంచలేదు. అందుకని ఇద్దర్నీ సమానంగా శిక్షించి, ఇద్దర్నీ వదిలేసాను' అన్నాడు!

కన్ఫ్యూసియసు నమ్మిన, మాట్లాడిన విలువలన్నిటినీ ప్రధానంగా ఎనిమిది విభాగాల కింద అర్థం చేసుకోవచ్చునని క్లెమెంట్సు చెప్తున్నాడు. అవి: దయార్ద్రహృదయం, సత్యసంధత, మర్యాద, వివేకం, విధేయత, విశ్వాసం, కౌటుంబిక బాధ్యత, పెద్దవాళ్ళ పట్ల గౌరవం.

ఈ విలువలు ఏ కాలానికైనా, ఏ సమాజానికైనా వర్తించేవే. నాలాగా ప్రభుత్వంలో నలభై ఏళ్ళు పనిచేసినవాడికి కన్ఫ్యూసియసు సంభాషణల్లోని ప్రతి ఒక్క సంభాషణకి ఎన్నో సంఘటనలు ఉదాహరణలుగా గుర్తొస్తూనే ఉంటాయి.

ఉదాహరణకి, పెద్దవాళ్ళని గౌరవించడం అనే విలువని తీసుకోండి. చూడటానికి ఇది గ్రామీణజీవితం తాలూకు, మధ్యయుగాలనాటి విలువలాగా అనిపించవచ్చు. కాని ప్రభుత్వాల్లో ఈ విలువ ఎంత మృగ్యమో నేనెన్నోసార్లు చూసాను. పాతికేళ్ళు కూడా నిండకుండానే సివిలు సర్వీసులో సెలక్టు అయి ఉన్నతోద్యోగం దక్కించుకున్న ఎందరో యువకులు వయసులోనూ, జ్ఞానంలోనూ, అనుభవంలోనూ తమకన్నా ఎంతో ఉన్నతులైన అధికారుల్ని, కేవలం వారు ఆలిండియా సర్వీసు అధికారులు కారు అన్న కారణం వల్ల నించోబెట్టి మాట్లాడటం, నోటికి ఏమొస్తే అది మాట్లాడటం నేనెన్నో సార్లు చూసాను.

ఇది చాలా చిన్న ఉదాహరణ. కాని చాలా పెద్ద విషయాలు ఉన్నాయి. ప్రభుత్వాల ప్రధానధ్యేయం సుపరిపాలననే అయితే అందుకు కన్ఫ్యూసియసుని మించిన గురువు మరొకరులేరు. ఈ క్షణాన కన్ఫ్యూసియసు సంభాషణల (The Analects) నుంచి ఎన్నో వాక్యాలు గుర్తొస్తున్నాయి. వాటన్నిటినీ ఉల్లేఖించాలన్న ప్రలోభాన్ని కష్టం మీద అదుపు చేసుకుంటున్నాను. ఒక్క మాట మాత్రం చెప్తాను. సమాజం పట్ల అపారమైన బాధ్యతా, మనుషులు సంతోషంగానూ, శాంతిగానూ జీవించాలన్న తపనా ఉన్న మనిషి మాత్రమే అటువంటి జీవితం జీవించగలుగుతాడు, అటువంటి మాటలు మాట్లాడగలుగుతాడు.

21-7-2022

ఈ పుస్తకం ఒక దీపం

మీ చేతుల్లో ఉన్న ఈ చిన్న పుస్తకం చైనా సాంస్కృతిక ప్రతినిధి అని చెప్పదగ్గ కన్ఫ్యూసియసు జీవితాన్ని, బోధనల్ని, ఆచరణని ఎంతో సమగ్రంగా, ఆకర్షణీయంగా పరిచయం చేస్తున్న పుస్తకం. మామూలుగా కన్ఫ్యూసియసు గురించిన పుస్తకాలు చదవడం కొంత కష్టంగా ఉంటుంది. ఎందుకంటే వాటిలో ప్రతి ఒక్క పేజీకి ఎన్నో వివరణలు, ఫుట్‌నోట్లు, వ్యాఖ్యానాలు ఉంటాయి. ప్రతి ఒక్కవివరణ మీదా ఎన్నో పాండిత్యవివాదాలూ, చర్చలూ ఉంటాయి. ఆయన జీవితవిశేషాల మీద కూడా ఏకాభిప్రాయం ఉండదు. అటువంటి పరిస్థితుల్లో పాఠకులకి, ముఖ్యంగా పిల్లలకి ఎంతో సరళంగా, సుబోధకంగా కన్ఫ్యూసియసు జీవితం గురించీ, ఆలోచనలగురించీ, ఆయన చేపట్టిన అన్వేషణ గురించి చెప్పిన ఈ పుస్తకం చదవడం చక్కటి అనుభవం.

ఈ పుస్తకంలో వంద అధ్యాయాలు, అంటే దాదాపుగా వంద పేరాలు. రెండు మూడు అధ్యాయాల్లో మాత్రమే ఒకటికన్నా ఎక్కువ పేరాలు ఉన్నాయి. వాడిన భాష చాలా సరళంగా ఉంది. ఎంతో గంభీరమైన తాత్త్వికవిషయాల్ని ఎంతో సులువుగా పరిచయం చేసిన తీరు నిజంగా మెచ్చుకోదగ్గది. ఇక ప్రతి సంఘటనకీ కూర్చిన బొమ్మ ప్రాచీన చీనానీ, అప్పటి సాంఘిక-రాజకీయ పరిస్థితుల్నీ కళ్ళకి కడుతున్నది.

ఈ పుస్తకం చదివిన తరువాత కన్ఫ్యూసియసు గురించి మరింత తెలుసుకోవాలనే కోరిక ఎలానూ కలుగుతుంది. అయితే, ఈ పుస్తకం ప్రధానంగా చీనాపాఠకుల్ని ఉద్దేశించి రాసింది కాబట్టి, కన్ఫ్యూసియసు కాలం నాటి సాంఘిక, ధార్మిక, రాజకీయ పరిస్థితుల గురించి ప్రత్యేకంగా ఎక్కడా వివరించలేదు. అటువంటి అంశాల గురించి స్థూలంగా కొంత పరిచయం చేస్తే ఈ పుస్తకం తెలుగుపాఠకులకి మరింత సుబోధకంగా ఉంటుందనిపించి ఈ నాలుగు మాటలూ రాస్తున్నాను.

కన్ఫ్యూసియసు కన్నా ముందటి చీనా

మూడు వేల ఏళ్ళకిందట ప్రాచీన చైనాలో పచ్చ సముద్రానికి పైన షాంగ్ చక్రవర్తులు చీనాలో నాగరికతను ప్రారంభించారు. కాని వారికి సామంతులుగా ఉన్న ఝౌ వంశీకులు వారిని యుద్ధంలో ఓడించి పడమటి ఝౌ సామ్రాజ్యాన్ని స్థాపించారు. వారు తమకి రాజ్యాధికారం స్వర్గం (లేదా ఆకాశం) నుంచి అనుగ్రహించబడిందనీ, తాము ఆ దైవశాసనానికి విధేయులుగా ఉన్నతకాలం తమ పాలన కొనసాగుతుందనీ నమ్మారు. వారు ప్రజల పట్ల బాధ్యతతో, దైవం పట్ల విధేయతతో, అత్యంత దయార్ద్రహృదయంతోనూ, నైతికశీలంతోనూ పరిపాలన చేసారు.

కాని అనంతరకాలంలో వారు తమ ధర్మం తప్పగానే ఉత్తరాదినుంచి ఆటవిక తెగలు వారిమీద దండెత్తి వారి రాజ్యాన్ని ఆక్రమించుకున్నాయి. అప్పుడు ఆ చక్రవర్తులు తూర్పు ప్రాంతానికి పారిపోయి అక్కడ లొయాంగ్ కేంద్రంగా పాలన కొనసాగించారు.

కాని వారు పడమటి ఝౌ చక్రవర్తుల్లాగా పూర్తి స్థాయి పాలకులు కారు. విస్తృతమైన వారి రాజ్యం అనేక చిన్న చిన్న సామంతరాజ్యాలుగా చీలిపోయి, ఆ సామంతరాజులే పూర్తి సైనిక, రాజకీయ అధికారాన్ని చలాయిస్తూ ఉండేవారు. ఆ సామంతరాజులు వివిధ రాజవంశాలకూ, సైనిక వంశాలకు చెందినవారి చేతుల్లో ఉండేవారు. కాబట్టి ఆ చిన్న చిన్న రాజ్యాల్లో ఎప్పటికప్పుడు రాజ్యాధికారం కోసం కుట్రలూ, యుద్ధాలూ, ఒకరిమీద ఒకరి దండయాత్రలూ నడుస్తూ ఉండేవి. మరొకవైపు తూర్పు ఝౌ చక్రవర్తులు నామ–మాత్రపు పాలకులుగా కేవలం పూర్వకాలపు యజ్ఞయాగాదులకు మాత్రమే పరిమితమైపోయి ఉండేవారు.

కన్ఫ్యూషియసు కాలం నాటి రాజకీయ పరిస్థితి

కన్ఫ్యూసియసు జీవితకాలంలో అంటే క్రీస్తు పూర్వం 551 నుండి 479 దాకా, అయిదారు శతాబ్దాల కాలాన్ని ప్రాచీన చీనాచరిత్రలో వసంత–హేమంతాల కాలం (క్రీ.పూ. 722-476) అనీ, సమరశీల రాజ్యాల కాలం (క్రీ.పూ 476-221) అనీ అంటారు.

అప్పుడు తూర్పు ఝౌ చక్రవర్తుల ఏలుబడిలో ఏడు రాజ్యాలు నిరంతరం ఒకదానితో ఒకటి కలహించుకుంటూ ఉండేవి. అవి కిన్, హాన్, వెయి, ఝూవో, కీ, చూ, యాన్‌లు. వాటితో పాటు మరికొన్ని చిన్న చిన్న రాజ్యాలు కూడా ఉండేవి. ఝూ చక్రవర్తులు లువోయి కేంద్రంగా చిన్న రాజ్యానికి పరిమితమై ఉండేవారు. ఆ రాజ్యాల్లో కన్ఫ్యూసియసు పుట్టిన

'లూ' రాజ్యం కూడా ఒకటి. దాని రాజధాని కు–ఫు. ఆ పాలకుడు ఝౌ చక్రవర్తిలాగా నామమాత్రపు పాలకుడు. రాజకీయాలు, సైనిక వ్యవహారాలూ ముగ్గురు హూణులుగా పిలిచే మూడువంశాల చేతుల్లో ఉండేవి. రాజులు దైవశాసనాన్ని మర్చిపోయి, ప్రజల పట్ల తమ బాధ్యతని ఉల్లంఘించి, రైతులమీద పన్నుల మీద పన్నులు వేస్తూ విలాసమయ, భోగమయ, ఆడంబరమయ జీవితం జీవిస్తుండేవారు. ఆ కాలంలో రాజకీయ పదవులు, ప్రభుత్వోద్యోగాలు కూడా వంశపారంపర్యంగానే సంక్రమించేవి. ఎవరేనా సామాన్యప్రజలు ఆ ప్రభుత్వోద్యోగాల్లోకి రావాలంటే ఎంతో కష్టపడి చదువుకోవలసి ఉండేది. అటువంటి పరిస్థితుల్లో కన్ఫ్యూసియసు పుట్టి పెరిగాడు.

కన్ఫ్యూషియసు ఏమి కోరుకున్నాడు?

ఆయన తన చుట్టూ ఉన్న అవ్యవస్థకి కారణం రాజులూ, రాజోద్యోగులూ, తండ్రులూ, కొడుకులూ అందరూ కూడా ప్రాచీనధర్మసూత్రాల్ని ఉల్లంఘించి నడవడమే అని భావించాడు. ఆ ప్రాచీన ధర్మసూత్రాల్ని 'లిజి' అనే గ్రంథం వివరిస్తుంది. ఆ సూత్రాల్నే ఈ పుస్తకంలో సదాచారాలుగా పేర్కోవడం జరిగింది. సదాచారాలు మనిషికి తోటిమనిషి పట్ల ఉండే బాధ్యతని, తండ్రికి కొడుకుపట్ల, కొడుక్కి తల్లిదండ్రుల పట్ల, రాజుకి ప్రజల పట్ల, ప్రజలకి రాజు పట్ల ఉండవలసిన బాధ్యత, మర్యాద, పరస్పర గౌరవాల గురించి వివరిస్తాయి. వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఆ ప్రకారం నడుచుకుంటే ఏ రాజ్యమైనా చక్కగా వికసిస్తుందనీ, అక్కడ మరణశిక్ష అవసరమే ఉండదనీ కన్ఫ్యూసియసు భావించేడు.

సదాచారాల ప్రకారం నడిచే పాలనని కన్ఫ్యూసియసు పదే పదే రెండు విశేషణాలతో వివరిస్తూ వచ్చేడు. అవి 'దయార్ద్రహృదయం', 'ధార్మిక శీలం' అనేవి. దయార్ద్రహృదయం అంటే ఏమిటనే చర్చ ఈ పుస్తకంలో చాలాచోట్ల కనిపిస్తుంది. ఆ చర్చలో కన్ఫ్యూషియసు ఇచ్చిన వివరణలు ఎంతో మానవీయంగా, విశ్వసనీయంగానూ, అనుసరణయోగ్యంగానూ మనకి కనిపిస్తాయి. ధార్మికశీలం అనేదాన్ని ఆయన కొన్ని సార్లు నైతికశీలంగా, కొన్నిసార్లు వివేకంగా కూడా పేర్కొన్నాడు.

కన్ఫ్యూషియసు సంభాషణలు

కన్ఫ్యూషియసు తన భావాల్ని కేవలం ప్రచారం చెయ్యడమే కాదు, ఆయన స్వయంగానూ, తన దగ్గర చదువుకున్న శిష్యులద్వారానూ ఆ భావాల్ని ఆచరణకు పెట్టడానికి ప్రయత్నించాడు. ఆ విశేషాలు మనకి కన్ఫ్యూషియసుకీ, ఆయన శిష్యులకీ మధ్య జరిగిన సంభాషణల ద్వారా తెలుస్తున్నాయి. ఆ సంభాషణల్ని కన్ఫ్యూషియసు తర్వాతి కాలంలో

'లున్-యు' అనే పేరిట సంకలనంచేసారు. వాటిని 'అనలెక్ట్సు' అనే పేరిట ఇంగ్లిషులోకి అనువదించాక, కన్ఫ్యూషియసు భావాలు విస్తృతప్రపంచానికి పరిచయమయ్యాయి. ఈ పుస్తకంలోని ఎన్నో సంఘటనలు, చర్చలు ఆ సంభాషణలనుండి తీసుకున్నవే.

కన్ఫ్యూషియసు సంభాషణల ఆధారంగానూ, ఆయన జీవితం గురించీ, ఆ కాలం చరిత్ర గురించి లభిస్తున్న ఇతర విశేషాలఆధారంగానూ, కన్ఫ్యూషియసు బోధనల్లో ఎనిమిది ముఖ్యమైన విషయాలున్నాయని చెప్పవచ్చు. అవి: దయార్ద్ర హృదయం, సత్యసంధత, మర్యాద, వివేకం, విధేయత, విశ్వసనీయత, కుటుంబాల్లో ఉండవలసిన అనుబంధం, పెద్దల పట్ల వినయం. ఈ విలువల్లో ప్రతి ఒక్కదానికీ, ఉదాహరణగా చెప్పదగ్గ ఏదో ఒక సంఘటన, మనకి ఈ పుస్తకంలో కనిపిస్తుంది.

కన్ఫ్యూషియసు దర్శనం, ఇతర దర్శనాలు

కన్ఫ్యూసియసు కాలంలోనే లావో-జి అనే మరొక దార్శనికుడు ఉండేవాడు. ఈ పుస్తకంలో కన్ ఫ్యూసియసు లువోయి పట్టణానికి వెళ్ళినప్పుడు లావో-జి ని కలుసుకున్న సంఘటన గురించిన వివరణ ఉంది. లావో-జి అనే వ్యక్తి చరిత్రలో లేడని కూడాకొందరు అంటారు. కాని ఆయన ప్రతిపాదించిన దర్శనం డావోయిజం పేరిట కన్ఫ్యూషియసు ఆలోచనలకి ఒక సవాలుగా, ప్రత్యామ్నాయంగా ఉంటూనే వచ్చింది. ఈ పుస్తకంలో ఒక సంఘటనలో, కన్ఫ్యూషియసు తన ప్రయాణాల్లో ఇద్దరు మునీశ్వరుల్ని కలుసుకున్న సంఘటన ఉంది. అక్కడ కన్ఫ్యూషియసు ఆలోచనా విధానానికీ, డావోయిస్టు విధానానికీ మధ్య ఉన్న తేడా చాలా చక్కగా చిత్రించబడింది. ఈ ప్రపంచంలో ఉన్న సమస్యలకు ఇక్కడే ఉండి పరిష్కారాలు వెతకాలి తప్ప ఈ లోకాన్ని వదిలిపెట్టి, అడవుల్లోకో, కొండల్లోకో పోయి ముక్కు మూసుకుని తపసుచేసుకోవడం తనకి ఇష్టం కాదని కన్ఫ్యూషియసు అక్కడ స్పష్టంగా చెప్తాడు. ఏడు దశాబ్దాల ఆయన జీవితం మొత్తం ఆ మాటకి ఉదాహరణగా నిలబడిందని మనం ఈ పుస్తకం చదివితే గ్రహిస్తాం.

కన్ఫ్యూసియసు సఫలమయ్యాడా విఫలమయ్యాడా?

దీన్ని బట్టి కన్ఫ్యూషియసు సఫలతచెందాడని చెప్పగలమా లేక ఆయన సమకాలికులు చాలామంది విమర్శించినట్టుగా కేవలం సిద్ధాంతానికే పరిమితమై, ఆచరణ సాధ్యంకాని ఆశయాలు ప్రబోధిస్తూ గడిపాడనుకుందామా? ఈ పుస్తకం మొదటిసారి చదివితే, రాజ్యం నుంచి రాజ్యానికి తిరుగుతూ, తన మాట వినే ప్రభువు ఒక్కడు కూడా కనిపించకుండా నిరుత్సాహంగా స్వదేశానికిమరలివచ్చిన కన్ఫ్యూషియసు కనిపిస్తాడు. నిజమే. కాని

మరోసారి చదివితే, జీవితం పట్ల, ప్రపంచం పట్ల ఆశ కలిగించే జీవితం జీవించిన ఒక మహామానవుడు మన కళ్ళముందు కనిపిస్తాడు. నిరుపేద బాల్యం నుంచి కేవలం స్వశక్తితో, స్వీయ అభ్యసనంతో ఒక పండితుడిగా మారి, రాజుల్నీ, రాజ్యాల్నీ ప్రభావితం చెయ్యగలగడం మామూలు విషయంకాదు.

ఈ పుస్తకం చదువుతుండగా మనల్ని వెంటనే ఇబ్బంది పెట్టే అంశం, ఆయన తన సలహాలు, సూచనలు వినే రాజు కోసం, రాజ్యం కోసం ఒక రాజ్యం నుంచి మరొక రాజ్యానికి నిర్విరామంగా చేస్తూ వచ్చిన ప్రయాణాలు చెయ్యవలసి రావడం. ఏ ఒక్కరాజ్యం కూడా ఆయనకి తగిన పదవీబాధ్యతలు ఇవ్వడానికి ఇష్టపడకపోవడం. ఆ రాజ్యాల జాబితా చూస్తే, కన్ఫ్యూషియసు ఆ రోజుల్లో దాదాపుగా ప్రాచీన చైనా మొత్తం పర్యటించినట్టు మనకి కనిపిస్తుంది. కాని ఎక్కడా ఏ రాజ్యంలోనూ ఆయనకి తగిన పదవిగాని, ఆయన ఆలోచనల్ని అమలు చేయగలిగే ప్రభుత్వోద్యోగం గాని లభించకపోవడం చూస్తాం. ఆయన జీవితకాలంలో ఒక ఏడాది పాటు మాత్రం ఒక నగరపాలకుడిగా పనిచేయగలిగాడు. ఆ ఏడాదిలో ఆ నగరాన్ని గొప్ప శీలవంతమైన జనావాసంగా మార్చేడని చరిత్ర చెప్తున్నది. మరొక పెద్ద ఉద్యోగం న్యాయశాఖ మంత్రిగా దొరికిన అవకాశం. ఆ రోజుల్లో రాజ-కుటుంబాలకు చెందని వారికి లభించగల అతి పెద్ద ఉద్యోగం అదే. కాని ఆయన్ని ఎక్కువ రోజులు ఆ ఉద్యోగం చెయ్యనివ్వలేదు. తనని ఏదైనాపదవిలో కనీసం మూడేళ్ళ పాటు ఉండనిస్తే అద్భుతాలు చేసి చూపించగలని ఆయన చెప్పుకున్నాడుగాని, ఏ రాజ్యమూ తన చరిత్రలో ఆ మూడేళ్ళు ఆయనకి అప్పగించలేకపోయింది.

చదువు ఒక్కటే మనుషుల్ని పారంపరిక దాస్యం నుంచి విడుదల చేస్తుందని నమ్మి, ఆర్థిక, సాంఘిక అంతరాల్తో నిమిత్తం లేకుండా అందరికీ పాఠశాల తెరిచిపెట్టిన ఒక విద్యావేత్త కూడా ఈ పుస్తకంలో కనిపిస్తాడు. తన కాలం నాటి రాజకీయాలు, జీవనవిధానం ఆడంబరంతో, విలాసాలతో, పీడనతో కూడుకుని పోయినప్పుడువారికి మానవత్వాన్ని గుర్తుచేస్తూ, మనిషికి తోటిమనిషి పట్ల ఉన్న ప్రాథమిక బాధ్యతని గుర్తుచేస్తూ వచ్చిన ఒక నైతికనాయకుడు కనిపిస్తాడు.

సాహసి, నిర్భయుడు, సత్యం కోసం ప్రాణాల్ని పణంగా పెట్టగలిగిన సత్యాగ్రాహి కనిపిస్తాడు. సరైన పుస్తకాలు చదవకపోతే కన్నకొడుకుని కూడా మందలించిన ఒక తండ్రి, పన్నులు పెంచుతున్న పాలకుడితో చేతులు కలిపినందుకు తన ప్రియశిష్యుణ్ణి నిరాకరించిన గురువు, విలాసాలకు బానిస అవుతున్నందుకు తన ప్రభువునే పరిత్యజించిన ఒక పౌరుడు కూడా ఇందులో కనిపిస్తారు.

మరొకసారి చదివితే, ఇటువంటి పరిస్థితులే ఈ రోజు మన చుట్టూతా కూడా ఉన్నాయనీ, లేనిదల్లా కన్ఫ్యూషియసులాంటి వివేకి, దయార్ద్రహృదయుడే అని మనం గ్రహించగలుగుతాం.

ఆయన ఒక రోల్ మోడలు

ఈ రోజు వ్యక్తిత్వవికాసవేత్తలు యువతరానికి రోల్‌మోడళ్ళు ఉండవలసిన అవసరం గురించి మాట్లాడుతున్నారు. కన్ఫ్యూషియసు నిజంగానే ఒక రోల్ మోడలు. మనం మన పైవారితో, కిందవారితో, తోటివారితో ఎలా నడుచుకోవాలన్నదానికి, ఈ పుస్తకంలోనే ఎన్నో ఉదాహరణలున్నాయి. తాము నమ్మినదాన్ని ఆచరణలో పెట్టడం కోసమే జీవించి తమ జాతికీ, దేశానికీ గురువులుగా నిలబడ్డ సోక్రటీసు, బుద్ధుడు, యేసుక్రీస్తు, మహాత్మా–గాంధీ వంటి వారిసరసన నిలబడే జీవితం కన్ఫ్యూషియసుది. ఈ చిన్న పుస్తకం ఆ మహామానవుడి పట్ల మనకొక కొత్త కుతూహలాన్ని కలిగిస్తుంది. అలా జీవించాలనే ఆశ మనలో రగిలిస్తుంది. మన చుట్టూ ఆవరించి ఉన్న చీకటిలో ఈ పుస్తకం ఒక దీపం. ఒక్క బాలుడు, ఒక్క బాలిక ఈ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని తమని తాము మలుచుకున్నా ఈ రచన సఫలమయినట్టే.

23-1-2023

ఊ తావో జూ

ప్రపంచ చిత్రకళారీతులమీద రాసిన వ్యాసాల్లో సంజీవదేవ్ ఒకచోట ఒక చీనా చిత్రకారుడి గురించి రాసారు (సంజీవదేవ్ వ్యాసాలు-1, 2012, పే. 89). ఉతావూ చూ అనే ఒక చిత్రకారుడు అప్పటి చక్రవర్తి మింగ్ హువాంగ్ ప్రాసాదంలో గోడమీద ఒక ప్రకృతి దృశ్యాన్ని చిత్రించాడట. చక్రవర్తి ఆ చిత్రాన్ని చూసి ఆనందిస్తుంటే, ఉతావూ చూ ఆ చక్రవర్తిని చేతిని పట్టుకుని ఆ చిత్రంలోని గుహలోకి వెళ్ళి అదృశ్యమైపోయాడట. ఆ కథ గురించి చెప్తూ సంజీవదేవ్ '..అంటే, ఆ చిత్రం అంత వాస్తవికంగా ఉన్నదన్నమాట, దాని మూడు ఆయతనాల ఆభాస కంటికి కనిపించేది మాత్రంగా మాత్రమే కాక చిత్రంలోకి ప్రేక్షకులు వెళ్ళిపోయే అంత వాస్తవికంగా ఉన్నదన్న మాట' అని రాసారు.

ఆ కథ నన్ను ఎక్కడో సూక్ష్మలోకాల్లో కదిలించింది. ఉతావూ చూ అనే చిత్రకారుడి గురించి మరికొంత తెలుసుకోగలనా అని ప్రయత్నించాను. ఆ చిత్రకారుడి పేరు ఊ-తావో-జూ అనీ, ఇప్పటి ఉచ్చారణ ప్రకారం ఊ దావో-జి అని పలకాలనీ తెలియడమే కాకుండా, ఆ కథ విని సంభ్రమానికి లోనై ఒక స్వీడిషు భావుకుడు ఏకంగా ఒక పుస్తకమే రాసాడని తెలిసింది. ఆ పుస్తకం తెప్పించుకుని చదివేదాకా నా మనసు ఊరడిల్ల లేదు.

స్వెన్ లిండ్‌క్విస్ట్ (1932-) స్వీడిషు రచయిత. దాదాపు ముప్పైకి పైగా పుస్తకాలు రాసాడు. ప్రధానంగా వ్యాసకర్త, యాత్రాచరిత్రకారుడు, సామాజిక విశ్లేషకుడు. అస్వాల్డ్ సిరేన్ అనే స్వీడిషు కళావిమర్శకుడు చీనా చిత్రలేఖనం మీద రాసిన ఏడు సంపుటాల్లో ఒకచోట ఊ-తావో జూ గురించి రాసిన కథ లిండ్‌క్విస్ట్ కంటపడింది. ఆ కథ చదివి ఉండబట్టలేక చీనా వెళ్ళిపోయాడు. అవి వియత్నాం యుద్ధం జరుగుతున్న రోజులు. బీజింగులో ఒక గురువుదగ్గర కాలిగ్రఫీ నేర్చుకున్నాడు. అక్కణ్ణుంచి భారతదేశం,

ఆఫ్ఘనిస్తానుల మీదుగా తిరిగి స్వదేశానికి వెళ్ళాడు. కొన్నాళ్ళు ఆఫ్రికాలో సంచరించాడు. తన యాత్రానేపథ్యంలో The Myth of Wu Tao-Tzu (1967) అనే పుస్తకం రాసాడు. అతడి రచనలన్నిటిలోనూ సర్వశ్రేష్టమైనదిగా గుర్తించబడ్డ ఆ రచన ఇంగ్లీషు అనువాదం 2012 లో వెలువడింది.

అయితే ఇంతకీ ఉ తావో జూ కథని సంజీవదేవ్ గారు కొంత మార్చి రాసారు, లేదా ఆ కథని ఆయన పొరపాటుగా వినిఉంటారు. ఆ కథలో ఉ తావో జూ తను గీసిన కుడ్యచిత్రం చూడమని చక్రవర్తిని ఆహ్వానించి, తను ఆ చిత్రం ముందు నిల్చుని చప్పట్లు చరచాడట. అప్పుడు ఆ చిత్రలోని గుహ తెరుచుకుందట. చక్రవర్తిని తన కూడా రమ్మంటూ ఉ తావో ఆ గుహలోకి అడుగుపెట్టాడట. ఆశ్చర్యంతో ఆ చక్రవర్తి అతణ్ణి అనుసరించబోగా ఆ గుహ మూసుకుపోయిందట.

సంజీవదేవ్ విన్నదాని ప్రకారం చక్రవర్తి కూడా గుహలో అడుగుపెట్టాడంటే, దాని అర్థం, ప్రేక్షకుడు కూడా ఆ కళాకృతిలోకి వెళ్ళగలిగాడని. అలాకాక, ఆ చిత్రకారుడు మాత్రమే ఆ చిత్రంలోకి ప్రవేశించి అదృశ్యమయ్యాడంటే దాని అర్థమేమిటి? లిండ్క్విస్ట్ ఈ ప్రశ్నతోనే తన పుస్తకం మొదలుపెట్టాడు. అది కళావిమర్శ కాదు, రెండవప్రపంచ యుద్ధానంతరం, వియత్నాం యుద్ధకాలంలో ప్రపంచస్థితిగతుల విశ్లేషణ. కొంత యాత్రానుభవం, కొంత ఆత్మానుభవం. తన ఎనభయ్యో ఏట, అంటే, 2012 లో లండనులో ఓ హొటల్లో కూచుని తన పుస్తకం ఇంగ్లిషు అనువాదానికి ముందుమాట రాసుకుంటూ ఆయనిట్లా రాసాడు:

> ఉ తావో జూ కథ విన్నప్పుడు నా ప్రశ్న: అతడికది ఎట్లా సాధ్యమైందని?
>
> చప్పట్లు చరవగానే గుహాద్వారం తెరుచుకోవడం వెనక రహస్యమేమిటి? తనకు తానుగా అదృశ్యం కాగలిగే కళని అతడికెట్లా పట్టుబడింది?
>
> చూడబోతే అతడు తన చిత్రలేఖనంలోకి చొచ్చుకుపోయి అక్కడ తాను జీవించగల ఒక లోపలిగదిని, ఒక ఆంతరంగిక స్థలాన్ని కనుగొన్నాడని- పిస్తోంది. ఆ భ్రాంతిని అతడెట్లా సృజించగలిగాడు?
>
> బహుశా అది భ్రాంతి కాదేమో. ఆ మాటకొస్తే అత్యుత్తమ జర్మను నవలా రచయిత హెర్మన్ హెస్ తన జీవితకాలమంతా చేస్తూ వచ్చిన సాహిత్యసృష్టి ఉ తావో జూ myth ని పునరభినయించడమే కదా.

ముసిల్, ప్రూ చేసింది కూడా అదే కదా.

ఊ తావో జూ కథని నేను మరింత మరింత అధ్యయనం చేసినకొద్దీ అది మరిన్ని మరిన్ని ఆలోచనలు నాలో సంచలింపచేస్తూ వుంది. మరిన్ని ప్రశ్నలు.

ఇంతకీ అతడెందుకు అదృశ్యమయ్యాడు?

అతడి వెనక ఇక్కడే ఉండిపోయినవాళ్ళెవరు?

అతడికి తన కాలం నాటి సంస్కృతి భరించలేనిదిగానూ, అర్థరహితంగానూ అనిపించిందా?

లేదా అతడు చేసిందంతా ఒక కళాకారుడిగా తనను తాను పరీక్షించుకోవడమా? తన కళని జీవితంమీద గీసి చూసుకోవడమా?

ఊ తావో జూ కి ఒంటరిగా మిగిలిపోగల సాహసముంది. ఆ కథలో నన్ను తీవ్రంగా ప్రలోభపరుస్తున్న అంశమదే. అతడికి కళలో దర్శనీయ పార్శ్వం నుండి అవతలి తీరానికి అదృశ్యంకాగల ధైర్యముంది, ఒంటరిగా కొనసాగగల సాహసముంది.

కళాకారుడు జీవితవాస్తవం నుంచీ, ప్రపంచం నుంచీ బయటపడి తన కళలోకి వెళ్ళిపోగల అవకాశం ఊ తావో జూ కథలో ఉందని లిండ్‌క్విస్ట్ అభిప్రాయపడ్డాడు. ప్రసిద్ధ జర్మనురచయిత, నోబెల్ పురస్కారం పొందిన నవలాకారుడు హెర్మన్ హెస్, మరొక ప్రసిద్ధ రచయిత Man Without Qualities రచించిన రాబర్ట్ ముసిల్, సుప్రసిద్ధ ఫ్రెంచి నవలారచయిత మార్సెల్ ప్రూ కూడా ఊ తావో జూ దారిలోనే నడిచారని లిండ్‌క్విస్ట్ ఎంతో ఆసక్తికరంగా వ్యాఖ్యానిస్తాడు.

కాని ప్రపంచం అందరికీ ఆ అవకాశం ఇవ్వదు. ముఖ్యంగా, ఇండియాని చూసిన తరువాత తానంతదాకా నిర్మించుకున్న కళాహర్మ్యం పూర్తిగా కుప్పకూలిపోయిందని లిండ్‌క్విస్ట్ రాస్తాడు. అపారమైన ఆత్మవంచన, మానవత్వంగాని, రాజ్యంగాని, సంఘంగాని, సంప్రదాయంగాని ఏదీ కూడా మనిషికి రక్షణ ఇవ్వలేని స్థితిలో భారతీయసమాజం అతడికి కనిపించింది. అది 1967 లో మాట. ఇప్పటి మన సమాజాన్ని చూస్తే అతడే–మంటాడో? ప్రతి ఒక్కరూ కొద్దిగా కష్టపడితే ఈ ప్రపంచాన్ని ప్రతి ఒక్కరికీ నివాసయోగ్యంగా

మార్చగలమనే నమ్మకం తనకుండేదనీ, కాని ఇండియాలో ఆ నమ్మకం పూర్తిగా కుప్పకూలి పోయిందనీ, తన భావాలు కేవలం కల్పనలు మాత్రమేనని తెలిసొచ్చిందనీ రాస్తాడు.

నిష్ఠుర యథార్థం ముందు కళాకారుడు మనిషిగా ప్రవర్తించవలసిన పద్ధతి ఏమిటని భారతీయ సాహిత్యవేత్తలూ, కళాకారులూ యుగాలుగా ఆలోచిస్తూనే ఉన్నారు. కొందరు, ఈ లోకంలోనే ఈ మనుషుల మధ్యనే తాము కూడా నిలబడి వాళ్ళ కష్టసుఖాలు పంచుకోవాలనుకున్నారు. మరి కొందరు ఊ తావూ జూ లానే ఈ ప్రపంచాన్ని వదిలిపెట్టి తిరిగి రాని తీరాలకు చేరాలనుకున్నారు. ఇంకొందరు తమ కళాస్వప్నలోకపు ద్వారం దగ్గరే నిలబడి ఉంటారు, ఇటు వైపు రాలేరు, అలాగని పూర్తిగా అటువెళ్ళిపోరు.

లిండ్‌క్విస్ట్ పుస్తకం పూర్తిగా చదివేసేటప్పటికి అర్ధరాత్రి దాటింది. కాని ఆ పుస్తకం నాకేమీ తోవ చూపించలేకపోయింది. ఇంకా చెప్పాలంటే, మరింత వేదన కలిగించింది. మరీ ముఖ్యంగా ఈ వాక్యం:

> We have created a lifestyle which makes injustice permanent and inescapable.

ఇంతకీ ఊ తావో జూ తన చిత్రంలోకి తానొక్కడే ఎందుకు వెళ్ళిపోయినట్టు?

24-9-2014

పావనదర్శనం

ప్రపంచంలో ఆదినుంచీ అన్ని మతాల్లోనూ, నాగరికతల్లోనూ రెండు భావధారలు సమాంతరంగా ప్రవహిస్తో వచ్చేయి. ఒకటి, మనిషిని మరింత మానవీయంగా తీర్చి దిద్దడానికి అతనికొక సామాజికతనూ, నైతికతనూ సమకూర్చడానికి రూపొందిన సాంఘిక ధర్మం. మరొకటి, అటువంటి ప్రయత్నాలు అంతిమంగా కృత్రిమంగా తయారవుతాయనీ, అవి మనిషిని అతడి యథార్థస్వభావానికి దూరంగా తీసుకుపోతాయనీ, అందువల్ల అతణ్ణి ఏవో కొన్ని సామాజిక సూత్రాలకు విధేయుడిగా మార్చడంకన్నా, అతనిలోని ఆ యథార్థ స్వరూపాన్ని అతడికి గుర్తుచేస్తే చాలనే ఆత్మిక ధర్మం.

ఉదాహరణకి భారతదేశంలో వైదికధర్మం మనిషిని యాగశీలతవైపు నడిపించింది. యాగం అంటే సమష్టికృషి. సమష్టి కృషినే వేదం సమ్యక్ కృషి అని కూడా అంది. ఆ విరాట్ పురుషుడికి అనంతమైన శిరాలు, బాహువులు, పాదాలు. అక్కడ వ్యక్తి ముఖ్యం కాదు. నలుగురి శ్రేయస్సు ప్రధానంగా నలుగురూ కలిసిచేసే ప్రతి పనీ యజ్ఞమే అక్కడ. అయితే ఆ సమష్టికర్మని ఎలా నిర్వహించాలో చెప్పడానికి బ్రాహ్మణాలు వచ్చాయి. అధికార విభజన వచ్చింది. వర్ణవ్యవస్థ వచ్చింది. హెచ్చు తగ్గులు వచ్చాయి. క్షీరసాగరమథనం జరిగినప్పుడు అమృతం కొందరికే దక్కింది, అత్యధిక సంఖ్యాకులకి విషపానం వినా మరో దారి లేకపోయింది. ఆ అవ్యవస్థను ప్రశ్నిస్తో ఉపనిషత్తులు వచ్చాయి. ఆ దారిలోనే బుద్ధుడు కూడా ప్రయాణించి యాగశీలమానవుడి స్థానంలో యోగశీలమానవుణ్ణి ఆవిష్కరించే ప్రయత్నం చేసాడు.

సరిగ్గా ప్రాచీనా చీనాలో కూడా ఇలానే జరిగింది. అక్కడ కూడా ఒక కృతయుగం ఉండేది. అప్పుడు మనుషులకి కూడబెట్టడం తెలియదు. సొంత ఆస్తి ముఖ్యం కాదు. ఒక మనిషి మరొక మనిషిని తనకు బానిసగా మార్చుకోవడమెలా అని ఆలోచించేవాడు

కాదు. ఆ రోజుల్లో పండినపంటలో వండుకుని తినగా మిగిలినదాన్ని పొలాల్లో పారబోసే వారట. కాని ఆ కృతయుగం ఎప్పుడో అంతర్ధానమై చారిత్రికయుగం మొదలుకాగానే మళ్ళా ఆ ప్రాచీన సాముదాయక సమసమాజాన్ని ఎలా తీసుకురావడం అన్న చింత, చింతన మొదలయ్యాయి. క్రీస్తుకు ఆరు శతాబ్దాల పూర్వం కన్ఫ్యూషియసు అనే సజ్జనుడు మనుషులు తాము తమ కుటుంబం పట్లా, రాజ్యం పట్లా, తోటిమనుషుల పట్లా నిర్వహించ-వలసిన ధర్మాలు సక్రమంగా నిర్వహిస్తే ఆ ప్రాచీన జీవితాదర్శాల్ని తిరిగి ఆచరణ సాధ్యం చెయ్యగలమని భావించాడు. ఆయన ఆలోచన, బోధనలు ప్రధానంగా నైతిక కార్యాచరణకి సంబంధించినవి. దాదాపుగా మూడువేల చీనా సమాజాన్నీ, చరిత్రనీ కన్ఫ్యూషియసు బోధనలు గాఢంగా ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.

కన్ఫ్యూషియసు ఆలోచనలు మన వైదికధర్మం లాంటివి అని చెప్పవచ్చు. స్వార్థత్యాగం ద్వారా, మనుషులు సామాజిక ఒడంబడికకు కట్టుబడి ఉండడం ద్వారా ప్రాచీన సత్యయుగాన్ని తిరిగి నెలకొల్పగలమని ఆయన కూడా భావించాడు.

కాని, అందుకు సమాంతరంగా, మన ఉపనిషద్వాణిలాగా అక్కడ కూడా మనిషిలోని అత్యంత యథార్థ మౌలికస్వభావం మీద దృష్టిపెట్టమనే హెచ్చరికలాంటి భావధార కూడా వికసించింది. దాన్నే డావోయిజం అన్నారు. కన్ఫ్యూషియసు కన్న వయసులో పెద్దవాడు, ఆయన సమకాలికుడు అయిన లావో-జి అనే ఆయన ఆ భావధారకు మూలకర్త.

లావో-జి అంటే ఒక ఋషి అని మాత్రమే అర్థం. ఆయన దక్షిణ చైనాలో పుట్టాడనీ, ఝౌ చక్రవర్తుల ఆస్థానంలో రాజపత్రాల భాండాగారాన్ని నిర్వహించేవాడనీ, ఒకసారి క్రతువుల గురించి తెలుసుకోవడం కోసం కన్ఫ్యూషియసు ఆయన దగ్గరకు వెళ్ళాడనీ ఒక కథ ఉంది. కన్ఫ్యూషియసు కన్నా వయసులో పెద్దవాడైన లావో-జి కన్ఫ్యూషియసును తన దంబం, పొగరు, దురుసుతనం వదులుకొమ్మని హెచ్చరించాడని కూడా ఆ కథ చెప్తుంది. ఆయన్ను కలిసి బయటకు వచ్చిన తరువాత కన్ఫ్యూషియసు తన శిష్యులతో 'ఆకాశంలో రెక్కలతో ఎగిరే మహాసర్పం గురించి నేనింతకుముందు విన్నాను, ఇప్పుడు కళ్ళారా చూసాను' అని అన్నాడని కూడా ఆ ఐతిహ్యం చెప్తున్నది. కాని, లావో-జి అనే ఒక వ్యక్తి ఎవరూ చారిత్రికంగా లేరనీ, కన్ఫ్యూషియసు కన్నా పూర్వపు కాలం నుంచీ ప్రజల్లో ప్రచారంలో ఉన్న కొన్ని వివేకసూత్రాల్ని 'డావో-డె-జింగ్' పేరిట సంకలనం చేసారనీ నేడు పరిశోధకులు భావిస్తున్నారు.

చాలా బలంగానూ, బిగ్గరగానూ ఒక సామాజిక నైతికత గురించి కన్ఫ్యూషియసు మాట్లాడుతున్న తరువాత మరొక వివేకంతో పనేమిటి? అటువంటి వివేకమంటూ ఒకటుంటే

దాని అవసరమేమిటి? ఈ ప్రశ్నకి జవాబివ్వాలంటే మొత్తం మానవజాతి చరిత్రనంతటినీ మనం పర్యావలోకించవలసి ఉంటుంది.

మానవచరిత్రలో చరిత్రయుగం మొదలై అయిదువేల ఏళ్ళు మాత్రమే. అంతకు ముందు పాతరాతి యుగంలోనూ, కొత్తరాతి యుగంలోనూ మనిషి కొన్ని లక్షల సంవత్సరాలు జీవించాడు. ఆ కాలంలో అతడు ప్రకృతిని ఆరాధించాడు. ప్రకృతి అంటే వట్టి భూమి మాత్రమే కాదు, ఆకాశమూ, అంతరిక్షమూ, పాతాళమూ అన్నీ కలిసిన ఒక సమగ్రస్వరూపం. ఆ ప్రకృతిని ఆ కాలపు మనిషి ఒక తల్లిగా కొలిచాడు. కాని చరిత్రయుగం మొదలుకాగానే, ఆ ప్రాచీన పృథ్వి భూమ్యాకాశాలుగా విడిపోయింది. రాతియుగం నుండి కాంస్యయుగంలో అడుగుపెట్టగానే మనిషి భూమిని ద్వితీయశ్రేణికి నెట్టి ద్యులోకదేవతలకు ప్రాధాన్యతనివ్వడం మొదలుపెట్టాడు. సుమేరులో, ఈజిప్టులో, గ్రీసులో, సప్తసింధులోయలో ప్రతి ఒక్కచోటా ఇదే జరిగింది, చివరికి చీనాలో కూడా.

కానీ ఇలా ఆకాశదేవతల్ని ముందుకు తీసుకురావడం మీద ప్రపంచవ్యాప్తంగా ఎన్నో తిరుగుబాట్లు తలెత్తాయి. ఈ కొత్త దేవతల్ని నిరాకరిస్తూ, ప్రాచీన పృథ్వీదేవతనే, ఆ మాతృదేవతనే ఆరాధించడంలో ఎక్కువ మానవత్వం, సమత్వం, సున్నితత్వం ఉంటాయని ఆ ఆరాధకులు భావించారు. అటువంటి ఒక ప్రాకృతిక స్థితికి మరలిపోవాలన్న ఆకాంక్షలోంచి డావో-డె-జింగ్ రూపుదిద్దుకున్నది. సృష్టికి కారణమైన ఆ శక్తిని, సూత్రాన్ని ఆ గ్రంథం 'డావో' అన్నది. డావో అంటే దారి, మార్గం, నడక, ఒక సూత్రం, సత్యం అని అనువదిస్తూ వచ్చారు. కాని అవేవీ కాదు కూడా. దానికి ఏ పేరుపెట్టినా దాని స్ఫూర్తిని సంకుచితపరచడమే అవుతుంది. దాన్ని ఏ పేరుతోనూ వివరించలేం కాబట్టి డావో అంటున్నాం. అది సృష్టిలో సహజంగా సంభవించే ఒక ప్రసూతి. ఆ ప్రసూతికి ఏ ప్రత్యేక ఉద్దేశ్యమూ లేదు. ఆ సృష్టి తిరిగి మళ్ళా లయమైనప్పుడు తిరిగి పునఃసృష్టిగా మారుతుంది.

నిత్యనిరంతరాయంగా సంభవించే ఒక ప్రక్రియ అది. ఆ ప్రక్రియలో మనం ఎటువంటి జోక్యం చేసుకున్నా, ఏ విధంగా సరిదిద్దాలని చూసినా అది వినాశకారిగానే మారుతుంది తప్ప మనిషికీ, సృష్టికీ కూడా ఏ విధంగానూ సహకరించదు.

మనం చూస్తున్న ప్రపంచంలో 'పదివేలవిషయాలు' ఉన్నాయి. కానీ ఆ పదివేల రూపాలకి కారణమైన దానికి రూపం లేదు. దాన్ని లావో-జి 'లేకపోవడం' అన్నాడు, 'శూన్యం' అన్నాడు. అది ఋగ్వేదంలో నాసదీయసూక్తంలో చెప్పినట్లుగా అనస్తిత్వం.

అది అన్ని రకాల ద్వంద్వాలకి అతీతం కాబట్టి దాన్ని తెలుసుకోవడం ద్వారా మనం మన చుట్టూ ఉన్న ప్రపంచంలోని నిచ్చెనమెట్ల వ్యవస్థను తప్పించుకోగలుగుతాం.

ఒకసారి ఆ డావో ఎరుకపడ్డాక, దాన్ని గౌరవించడం 'డె'. డె అనే మాటకి బలం, జీవం, ప్రాణం, ఆచరణ, నడత లాంటి అర్థాలు చెప్పవచ్చు. నిజానికి 'డె' అనే భావన కన్ఫ్యూషియసు తత్త్వశాస్త్రంలో కూడా ఉంది. దాన్ని స్వర్గం మనుషులకు విధించిన శాసనం పట్ల చూపించవలసిన బాధ్యతగా ఆయన గుర్తించాడు. స్వర్గం మనుషుల పట్ల విధించిన బాధ్యత ఏమిటి?

అత్యంత ప్రాచీన, పౌరాణిక కాలంలో చీనాని పరిపాలించిన జియా రాజవంశం ప్రకృతి ఆరాధకులు. వారిని పక్కకునెట్టిన షాంగ్ రాజవంశం తమ అర్చాపీఠం మీద ఆకాశాన్ని ప్రతిష్టించారు. కాని ఆకాశం పేరిట, స్వర్గం పేరిట వారు తొందరలోనే నిరంకుశులుగా, క్రూరులుగా మారిపోయేరు. అందువల్ల వారి స్థానంలో ఝౌ రాజ్యపాలన తప్పలేదు. అయితే ఝౌ చక్రవర్తులకి ఒక నైతిక సమస్య ఏర్పడింది. ఒకవేళ షాంగ్ చక్రవర్తులు దైవాంశ సంభూతులే అయితే, ప్రజల్ని పరిపాలించడం వారికి దేవుడిచ్చిన హక్కు అయితే, తాము ఆ పరిపాలనని తమ చేతుల్లోకి ఎట్లా తీసుకోగలరు? అందుకు సమాధానంగా వారు చెప్పుకున్నదేమంటే, దేవుడు ఏ రాజవంశానికైనా పాలనాధికారాన్ని శాశ్వతంగా ఇవ్వడనీ, ఏ రాజైనా ధర్మాన్ని పాటించినంతవరకే అతడికి పాలనాధికారం ఉంటుందనీ, ధర్మం తప్పిన మరుక్షణమే పాలనాధికారం పోతుందనీ వారు నమ్మారు. దాన్ని తియాన్ (ఆకాశం) మింగ్ (శాసనం) అన్నారు.

కాని డావో-డె-జింగ్ చేసిన పని ఏమిటంటే, మనుషులు పాటించవలసిన బాధ్యతను తియాన్మింగ్ నుంచి తప్పించడం. ఇంకా చెప్పాలంటే, ఆకాశాన్ని పక్కకు నెట్టి మళ్ళా భూమిని అర్చాపీఠం మీద ప్రతిష్టించడం. తియాన్మింగ్ స్థానంలో డావోని తీసుకురావడం. అంటే మానవప్రయత్నాల కృత్రిమత్వం స్థానంలో ప్రాకృతిక సహజత్వానికి పట్టం కట్టడం. ఆకాశదేవతల్ని ఆరాధించే కన్ఫ్యూషియసు వంటివారి దృష్టిలో కాలం సరళరేఖీయం, చారిత్రికం, కాలెండరీయం. కానీ డావోని నమ్మేవారి కాలం ఋతుపరిభ్రమణశీలం, వర్తులం. కన్ఫ్యూషియసు దృష్టిలో మనిషికీ, ఆకాశానికీ ఉన్న సంబంధం సామాజికం, నైతికం. డావో దృష్టిలో మనిషికీ ప్రకృతికీ ఉన్న సంబంధం తల్లికీ, బిడ్డకీ ఉన్న సంబంధం లాంటిది. అది ప్రాకృతికం, దానికి ఎటువంటి ప్రయోజనాల్నీ, పరమార్థాల్నీ అంటకట్టలేం.

ఇటువంటి భావాలతో రాసిన 81 ఖండికల సంపుటం డావో-డె-జింగ్. అయిదువేల అక్షరాలకు మించని ఆ చిన్న రచన చీనా సంస్కృతిమీద చూపించిన ప్రభావం అపారం.

తర్వాత రోజుల్లో చీనా కవిత్వాన్ని, కళల్ని, చిత్రలేఖనాన్ని ప్రతి ఒక్కదాన్నీ డావోయిజం గాఢంగా ప్రభావితం చేసింది. ఇక ఆధునిక కాలానికి వస్తే, ప్రపంచవ్యాప్తంగా డావో–డె–జింగ్ పట్ల ఆసక్తి నానాటికీ పెరుగుతూనే ఉన్నది. ఆ పుస్తకం చదివినవారికి, ప్రాచీన గ్రీకు తాత్త్వికులు హెరాక్లిటసు, లుక్రీషియసు మొదలుకుని ఆధునికయుగంలో థోరో, గాంధీదాకా, ఎందరో గుర్తుకు రాకుండా ఉండరు. ఎంతో భావగర్భితంగానూ, కవితాత్మకంగానూ ఉండే ఆ చిన్న చిన్న ఖండికలు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషల్లో పదేపదే అనువాద–మవుతూనే ఉన్నాయి.

డావో–డె–జింగ్ ఒక దర్శనం, ఒక కావ్యం మాత్రమే కాదు, ఒక రాజకీయ రచన కూడా. ఎందుకంటే ఝౌ చక్రవర్తుల పాలన బలహీనపడ్డాక ఒక ప్రశ్న ముందుకొచ్చింది. ఒక రాజు రాజు కావాలంటే అర్హత ఏమిటి? ఈ ప్రశ్నకు జవాబుని అన్వేషిస్తూనే నూరు దర్శనాలు ప్రభవించాయి. కన్ఫ్యూషియసూ, అతడి అనుయాయులూ చెప్పేదేమంటే, ఒక రాజు తియాన్మింగ్‌ని పాటించినంతవరకే అతడికి రాజుగా కొనసాగే అర్హత ఉంటుందని. కాని ఆ రాజవంశంలో వారసులు లేకపోతే? అప్పుడు పాలనాధికారానికి యోగ్యులైన కుటుంబసభ్యుల్ని వెతకవలసి ఉంటుంది. విద్య ద్వారా, నైతికశిక్షణ ద్వారా అటువంటి అర్హుల్ని మనం తయారు చేసుకోవలసి ఉంటుంది అని కన్ఫ్యూషియసు భావించాడు. అటువంటి శిక్షిత, సంస్కారవంతుల్ని ఆయన 'జున్జి' అని పిలిచాడు. మరొక వైపు మోహిస్టులనే లీగలిస్టులు దీన్ని అంగీకరించలేదు. వారి దృష్టిలో పాలనాధికారం రక్తసంబంధీకులకే చెందవలసిన పనిలేదు. ఆ అర్హత ఎవరికి ఉంటే వారు పాలకులు కావచ్చు అని వారు వాదించారు.

కాని డావో–డె–జింగ్ ఈ రెండు వాదనలనీ నిరాకరించింది. డావో ప్రతిపాదించిన రాజు ప్రధానంగా వివేకవంతుడు. అతడసలు పరిపాలించడు. ప్రజల్ని పాలితులుగా కాక అతిథులుగా భావిస్తాడు. ఎందుకంటే అన్నిరకాల ప్రగతిశీల ప్రయత్నాలు అంతిమంగా యుద్ధానికే దారితీస్తాయని అతడికి తెలుసు. అటువంటి ఎరుక కలిగిన ఆ రాజుని లావో–జి 'షెన్ గ్రెన్' అన్నాడు. అతడు జనకుడిలాగా రాజర్షి. మార్కసు అరీలియసు లాగా Philosopher-King.

కాని అటువంటి ఒక పాలన ఆచరణ సాధ్యం కాకపోవచ్చు. నిజానికి అటువంటి ఒక పాలన సాధ్యం కాదన్న నిస్పృహతోనే లావో–జి, ఝౌ సామ్రాజ్యాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోయాడట. అతడు రాజ్యం పొలిమేరలు దాటగానే అక్కడ కనుమకు కాపలా కాస్తున్నవాడు లావో–జి తెలుసుకున్న సత్యాన్ని తనకు రాసిమ్మని అడిగాడట. అలా

వచ్చిందే ఈ గ్రంథం. కాబట్టి ఆ ఆలోచనలు ఆచరణ సాధ్యం అయినా, కాకపోయినా నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో anti-authoritarian movements కి డావో-డె-జింగ్ స్ఫూర్తిగా నిలుస్తున్నదన్న మాట కూడా కాదనలేం.

2

ఇరవయ్యవ శతాబ్దం మొదలయ్యాక డావోయిజం పట్ల తక్కిన ప్రపంచానికి మరింత ఆసక్తి పెరిగింది. లావో-జి రాసాడని చెప్పే డావో-డె-జింగ్ కు విస్తారంగా అనువాదాలు రావడం మొదలయ్యింది. అయితే ప్రతి అనువాదకుడూ తనకన్నా ముందటి అనువాదకులు డావోని సరిగా అర్థం చేసుకోలేదనీ, తాను మూలానికి మరింత సన్నిహితంగా పోడానికి ప్రయత్నిస్తున్నాననీ చెప్పుకుంటూ ఉన్నాడు. ఉదాహరణకి డావోని ఇంగ్లిషులోకి అనువదించిన మొదటి అనువాదకులు దాన్ని the way అని అనువదించారు. కాని డావో అంటే దారి కాదని డావో -డె-జింగ్ చదవగానే మనకి స్ఫురిస్తుంది. అసలు డావో ఏ ప్రయాణం గురించీ మాట్లాడదు. ఎక్కడికీ వెళ్ళడం గురించి చెప్పదు. డావో దానికదే ఒక ప్రయాణం. దానికదే గమ్యం. అసలు గమ్యం అనే మాట కూడా డావో దర్శనానికి విరుద్ధం. అందుకని హెన్రీ బోరెల్ (1869-1933) అనే ఒక డచ్చి రచయిత 1897 లో డావో-డె-జింగ్‌ని మళ్ళా అనువదించాడు. 1919 లో ఆయన Wisdom and Beauty from China అనే పుస్తకం వెలురించాడు. అందులో మూడు అధ్యాయాల ఒక కాల్పనికరచనను కూడా పొందుపరిచాడు. Wu-Wei పేరిట ప్రసిద్ధమైన ఆ రచనలో ఆయన డావోయిజం స్ఫూర్తిని తన మాటల్లో ఒక కథగా పాఠకులముందు ఉంచడానికి ప్రయత్నించాడు.

ఆ కథలో రచయిత చీనా సముద్రతీరంలో ఒక చిన్న దీవిమీద ఒక డావోయిస్టు సాధువుని కలుసుకుంటాడు. ఆయన్ని ప్రేమ గురించీ, కళ గురించీ, కవిత్వం గురించీ, సృజన గురించీ, జన్మమృత్యువుల గురించీ, జీవితపరమార్థం గురించీ ప్రశ్నిస్తాడు. ఆ సాధువు తనని కలుసుకోవడానికి వచ్చిన జిజ్ఞాసి ఒక పాశ్చాత్యుడనీ, అతడు 'యూరపియను పండితులు అసంపూర్ణంగా చేసిన అనుచిత అనువాదాలు చదువుకుని వచ్చినవాడనీ' గ్రహించి అతనిడికి డావో గురించి ఏ విధంగా తెలియచెప్పాలో ఆ విధంగా చెప్తాడు.

ఆ సంభాషణ సారాంశాన్ని డా.కాళ్ళకూరి శైలజగారు తన జీవితానుభవమ్మీద అర్థం చేసుకుని తిరిగి మనకీ రచనగా అందిస్తున్నారు. అలాగని ఈ పుస్తకం 'వూ-వెయి'కి అనువాదం కాదు. వూ-వెయిని ఈ రచనకు స్ఫూర్తి అనవచ్చు. మరోలా

చెప్పాలంటే, డావోని తెలుసుకోవడం కోసం ఆమె 'పూవెయి' చెయ్యిపట్టుకుని నడిచారనీ, ఒకసారి ఆ దారమ్మట నడిచి వచ్చాక, ఆ మార్గాన్ని సాకల్యంగా చూసుకున్నాక, ఇప్పుడు మనల్ని తన వెంట తీసుకువెళ్ళడానికి, ఈ పుస్తకంతో మనముందు నిలబడ్డారనీ చెప్పవచ్చు.

సత్యాన్ని తెలుసుకోదలుచుకున్నవాళ్ళు ప్రశ్నిస్తూ ఉండగా, జ్ఞానులు ఆ ప్రశ్నలకు జవాబులు చెప్తున్నట్లుగా సత్యవిచారణ చెయ్యడం ఒక ప్రాచీనప్రక్రియ. ఉపనిషత్తులు ఇటువంటి సంభాషణల రూపంలోనే ఉంటాయి. బుద్ధుడి దీర్ఘసంభాషణలు, సోక్రటీసు సంభాషణలు కూడా ఇటువంటివే. ఆధునిక యుగంలో ఖలీలు జిబ్రాను 'ప్రవక్త' కూడా ఇటువంటి ప్రశ్నోత్తరరూపంలోనే సాగుతుందని మనకు తెలుసు.

హెన్రీ బోరెల్ తన రచనను కూడా ప్రశ్నోత్తర రూపంలోనే రాసాడు. శైలజగారు ఈ రచనను తిరిగి ప్రశ్నోత్తరాలుగా మనకి అందిస్తున్నప్పుడు ఆమె తన రచనకి ఒక సందర్భాన్ని ప్రస్తావించారు. 'తొలి అడుగు' పేరిట ఆమె ప్రస్తావించిన సందర్భం ఈ రచనకు కీలకం. ఎందుకంటే, ఆమె ఇప్పుడు డావో గురించి ఎందుకు మాట్లాడుతున్నారో, మనకు ఎందుకు చెప్పాలనుకుంటున్నారో, ఆ సందర్భంలో స్పష్టంగా వివరిస్తున్నారు. ఆమె వేసుకున్న ప్రశ్న ఇది:

> ఇంతకూ మనిషికి మరో మనిషి తోడు ఎందుకు కావాలి? అసలు అవసరమా? సంఘజీవనవిధానంలో భాగంగానా? కాలక్షేపం కోసమా? స్నేహం కాక జీవితభాగస్వామి గురించి ప్రస్తావిస్తే 'నాది' అంటూ సొంతం చేసుకునేందుకా? అధికారంతో స్వార్థం వెళ్ళగక్కేందుకా? పోనీ ఓదార్పు కోసమా? కష్టసుఖాల్లో తోడుగా ఉండాలనా?

ఇది స్పష్టంగా మనిషిలోని సామాజికపార్శ్వం వేసుకునే ప్రశ్నలు. దీనికి జవాబు చెప్పడానికే యజ్ఞయాగాదులూ, కన్ఫ్యూషియసూ, సమస్త పాశ్చాత్యతత్త్వశాస్త్రమూ ముందుకొచ్చాయి. కాని బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు తన భార్య మైత్రేయికి చెప్పిన మాటలు సుప్రసిద్ధాలు. మనిషికి తన ఆత్మ ప్రియమైంది కాబట్టే, అతడు తన ఆత్మను ఎవరెవరిలో చూస్తున్నాడో వారందరినీ ప్రేమిస్తున్నాడని చెప్తాడు యాజ్ఞవల్క్యుడు.

శైలజగారి ఈ రచన అటువంటి ఆత్మసాక్షాత్కారం దిశగా నడవడంలో ఆశ్చర్యం లేదు. ఒక అన్వేషిగా ఆమె వేసుకున్న ప్రశ్నలూ, అందుకు ఆమెకి లభించిన సమాధానాలూ ఈ అపురూపమైన రచనగా మనచేతుల్లోకి వచ్చాయి. అలాగని మనం తొందర తొందరగా ఈ పుస్తకం చదివేసి ఇది మనకు తెలిసిన విషయమే అని పక్కన పెట్టేస్తే మనం పొరబడ్డట్టే.

ఇందులో అన్వేషకుడు కూడా ముందు ఆ పొరపాటే చేస్తాడు. ఆ సందర్భంగా జరిగిన ఈ సంభాషణ చూడండి:

ఒక అమితానందపు అరుదైన ప్రేరణతో నేనిలా అన్నాను. 'ఆచార్యా ! ఇప్పుడు నాకదితెలుస్తోంది. నేను దేనిని అన్వేషిస్తున్నానో అదిఅంతటా వ్యాపించి ఉంది, అతి చేరువలోఉంది. కనుక, నేను దాని కోసం ఎక్కడో దూరంగా వెతకనక్కరలేదు. నేను అన్వేషించేది, నాఅస్తిత్వం, నా ఆత్మ అది ప్రతిచోటా ఉన్నది. నా అంతరంగం లో 'నేను' గా నాకు ఎప్పటినుంచో పరిచయమున్నట్టు అనిపించినా, మీరు సూచించాక అదంతా సాక్షాత్కారమైంది. ఇదిగో ఇప్పుడే! ఔనౌను. దేవుడు ప్రతిచోటా ఉన్నాడు! 'తావొ' ప్రతిదానిలోనూ ఉన్నది!', కాస్త ఉత్సాహంగా అన్నాను.

అంతే, నాయనా, అంతే! కానీ దాన్ని గూర్చి నీవు ఇంత చేటు సంభ్రమానికి లోను గాకు ! నీవు చూసేదానిలో 'తావొ' ఉంది, కానీ నీవు చూసేది తావొ కాదు. అసలు 'తావొ' నీ కంటికికనిపిస్తుందని నీవు భావించకూడదు. 'తావొ' నీ హృదయంలో ఆనందాన్ని కలిగించలేదు, కన్నీటిని పొంగించనూ లేదు. ఎందుకంటే నీలోని అనుభూతులు, భావోద్వేగాలు సాపేక్షమైనవేగానీ ఏ ఒక్కటీ పూర్తినిజాలు కావు. ఏదేమైనా, నేనా విషయం పై ప్రస్తుతం మాట్లాడను. నువ్వింకా తొలిమెట్టు పైనే ఉన్నావు. ప్రస్తుతానికి సుప్రభాత వేళ తొలి కాంతి రేఖను మాత్రమే చూశావు.'తావొ' ను సర్వాంతర్యామిగా తెలుసుకోవాలి' అనే పరమసత్యాన్ని గ్రహించడమే ఇప్పటికి ఎక్కువ!

'తావొ' నీ జీవితాన్ని తప్పకుండా మరింత సహజంగా మలచగలదు. నన్ను నమ్ము. ఎలాగంటే, పసిపాప తల్లి చేతుల్లో ఉన్నంత సురక్షితంగా నువ్వు 'తావొ' చేతుల్లో ఉంటావు. తావొ నిన్ను గంభీరంగా, ఆలోచనాపరునిగా మారుస్తుంది. అంటే, ఇక మీదట, ప్రతిచోటా నిన్ను నీవు, ఒక పూజారి గుడిలో ఉండేటంత పవిత్రంగా భావించుకుంటావు. ప్రాపంచిక విషయాల్లో మార్పులకు, జనన మరణాలకు ఇంకెప్పుడూ నువ్వు భయపడవు. ఎందుకంటే చావు పుట్టుకలు రెండూ 'తావొ' నుంచే ఉద్భవిస్తాయని గ్రహిస్తావు, కాబట్టి. అంతేకాక, బ్రతికిన న్నాళ్ళు చుట్టూ ఉన్న ఈ తావొ అంతే సహజంగా నీ మరణానంతరం కూడా నిన్ను విడువక పరివేష్టించాలి.

కాబట్టి అటువంటి 'చేటు సంభ్రమానికి' లోను కాకుండా మనం ఈ రచనని చదవవలసి ఉంటుంది. అలాగని డావో మరొక ప్రత్యేకసత్యమని మనం భావించకూడదు. నిజానికి ఈ రచన చదువుతున్నంతసేపూ, ఉపనిషత్తుల్ని చదువుతున్నట్టుగానూ, జలాలుద్దీన్ రూమీ కవిత్వం చదువుతున్నట్టుగానూ ఉండటంలో ఆశ్చర్యం లేదు. మాటలు వేరుగాని, స్ఫూర్తి ఒక్కటే. ఈ మాటలు చూడండి:

> ఇక మీదట నీ ఎదుగుదల తప్పక నీ స్వయంకృతం కావాలి. అదంతా ఏ విధంగానో నువ్వే స్వయంగా తెలుసుకోవాలి. మనసులో నెమ్మదిగా, సాధు స్వభావిగా ఉండు.అప్పుడు ఏవిధమైన ప్రయత్నం లేకనే, అంతా తెలుసు–కుంటావు, ఒక చిన్నపాప పూలను కనుగొన్నంత సులభంగా.

ఒక చిన్నపాప పూలని గుర్తుపట్టినంత సులభంగా మనం మనల్ని గుర్తుపట్టగలం. అదే డావో అని అంటున్నప్పుడు గీతాంజలినీ, కబీరుని చదువుతున్నట్టుగా కూడా ఉంది. అత్యంత సుకుమారమైన జెన్ కవిత్వం చెప్తున్నదంతా కూడా ఇదే కదా అనిపిస్తున్నది.

3

ఇది తెలుగువాళ్ళకొక అపురూపమైన కానుక. డా.శైలజగారిని కవిగా, భావుకురాలిగా, సాహిత్యవిశ్లేషకురాలిగా మాత్రమే తెలిసివున్న మనకి ఈ పుస్తకం ద్వారా ఆమె ఒక 'పావన దిఙ్మండలాన్ని' దర్శించారనీ, 'సంపూర్ణ నిర్మలశాశ్వతత్వం లో ఉండే అన్ని ఆత్మలకీ' ఆమె ఒక పవిత్రసంగమం కాగలిగారనీ తెలుస్తుంది. ఇందుకు డా.శైలజగారికి కాదు, తెలుగు పాఠకప్రపంచానికి అభినందనలు తెలుపుతున్నాను.

9-6-2023

ఆవిరిపూల కొమ్మ

అన్ని ఇజాల్నీ చూసిన తరువాత టీయిజం వైపు మనసు మొగ్గుతూ ఉంది. ఒకాకురొ కకుజొ ఇలా రాస్తున్నాడు:

> సౌందర్యశాస్త్రం అనేది చాలా మామూలు మాట కాబట్టి టీ తత్త్వశాస్త్రం కేవలం సౌందర్యశాస్త్రం కాదు. మతాన్నీ, నైతికతనీ ఒక్కచోట చేర్చుకుని మనిషి గురించీ ప్రకృతి గురించీ వెలువరించగల సమగ్రదృక్పథం అది. పరిశుభ్రతని కోరుకుంటుంది కాబట్టి ఆరోగ్యఉద్యమం. ఆడంబరాన్నీ పటాటోపాన్నీ కాక నిరాడంబరతని ప్రోత్సహిస్తుంది కాబట్టి అది ఆర్థికశాస్త్రం. అసలు ఈ విశ్వప్రమాణాల గురించే మనకొక స్పష్టతనిస్తుంది కనుక దాన్ని నైతిక క్షేత్రమితి అనవచ్చు. అది తన అభిమానులందరికీ సమానంగా అభిరుచిని కలిగిస్తుంది కాబట్టి అసలు ప్రాచ్యదేశాల ప్రజాస్వామిక స్ఫూర్తికి అది ప్రతీక అని చెప్పవచ్చు.

ఇంకా అంటాడు కదా, అందులో కన్ఫ్యూషియసు సంయమనం, లావో–జి జీవితేచ్ఛ, శాక్యముని అలౌకికానందం మూడూ వున్నాయట. కకుజొ రాసిన The Book of Tea (1906) చదివిన తర్వాతనే ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది రసజ్ఞులు జపాను యాత్రీకులుగా మారారు. జెన్ పుస్తకాలు చదవడం మొదలుపెట్టారు. టాగోరులాంటి వాడు జపాను చిత్రకళ గురించీ, సౌందర్యదృక్పథం గురించి కకుజొ దగ్గర నేర్చుకుని రమ్మని ఏకంగా ఒక అధ్యయనబృందాన్నే జపాను పంపిచాడు. ఆయన పంపిన ఒక శిష్యుడి దగ్గర వాష్ టెక్నిక్కు నేర్చుకుని అవనీంద్రనాథ్ టాగోరు నీటిరంగుల చిత్రలేఖనంలో నేరుగా బెంగాలు స్కూలునే ప్రారంభించాడు.

నేను ఈ బృందంలో కొద్దిగా ఆలస్యంగా చేరినవాణ్ణి. టాగోరు రాసిన జపాను యాత్రానుభవాలు ఒకప్పుడు చదవకపోలేదుగానీ, అది మరీ చిన్నవయస్సు. అంత సరళ సత్యాల్ని అర్థం చేసుకోగల వయసుకాదది. నువ్వు జీవితంలో ఎంతో దూరం ప్రయాణిస్తే గాని, ఎంతో వ్యథకి లోనయిఉంటేగాని, ఎంతో వృథాచేసుకున్నాననే చింత నిన్ను దహిస్తే గాని, అంత సరళ, సులభమార్గాలవైపు దృష్టి పడదు.

కాబట్టి ఇప్పుడు ఎక్కడ మొదలుపెట్టాలి? డి.టి.సుజుకి జెన్ బౌద్ధం మీద రాసిన గ్రంథాలు చదివాను. బషో యాత్రానుభవాలు తెలుగు చేసాను. హైకూ ఉద్యానవనాల్లో ఎన్నోసార్లు సంచరించాను. కాని ఇప్పుడు అన్నిటికన్నా ముందు ఒక కప్పు టీ కాచుకోవడ-మెలానో, తాగడమెలానో తెలిస్తే తప్ప, బహుశా, ఈ జెన్ దేశంలో పౌరసత్వానికి అర్హత దొరకదని అర్థమయింది.

అందుకని ఈ నగరంలో టీ కాచుకోవడం గురించి చెప్పేవారెవరైనా ఉన్నారా అని నెట్టులో శోధిస్తే, టీ విశ్వవిద్యాలయాలు, టీ కోర్సులు, టీ డిప్లొమాలు ఏకంగా ఒక తేయాకు విశ్వమే కనిపించింది! కాని నాకు కావలసింది అక్షరాభ్యాసం. టీ కాచుకోడానికి నీళ్ళు ఎలా మరిగించాలి, ఎన్ని నీళ్ళల్లో ఎంత తేయాకు వెయ్యాలి, కాచిన నీళ్ళు టీగా మారడానికి ఎంతసేపు ఆగాలి– అంటే దాదాపుగా నీటిరంగులచిత్రాలు వేయడం నేర్చుకున్నట్టే అన్నమాట. అక్కడా నీటితో సంభాషణే, ఇక్కడా నీటితో సంభాషణే.

ఏమైతేనేం, నేనూ గంగారెడ్డీ కలిసి బంజరాహిల్సులో ఒక టీ దుకాణాన్ని పట్టుకున్నాం. అక్కడ మేఘాలయ నుంచి వచ్చిన కుర్రవాడొకడున్నాడు. అతడి దగ్గర వందరకాల తేయాకులున్నాయి. అతణ్ణి అడిగాం, చీనాలో, జపానులో టీ ఎట్లా కాచుకుంటారో కాచి చూపించమని. ఆ టీపాత్రలు, కప్పులు, స్పూనులు ప్రతి ఒక్కటీ దగ్గరగా చూసాం. అతడు మా కోరిక మన్నించాడు. మాకోసం టీ కాచిపెట్టాడు. రెండు కప్పులు తేనీరు అందించాడు. రెండవ రౌండులో ఆ తేనీటిలో కొంత తేనె కూడా కలిపాడు.

ఆ తేనీరు తాగిన అర్హతతో కకుజొ రాసిన The Book of Tea తెరిచాను. పట్టుమని ఎనభై పేజీలు కూడా లేని ఆ రచన ఒక కావ్యం, ఒక మానిఫెస్టో. సరళ-సుందరమైన, ఆత్మను పరిశుభ్రం చెయ్యగల జీవనవిధానంలోకి తెరిచిన కిటికీ. అందులో ఉన్నది కేవలం టీ కాదు. అది నాగరికత పేరుమీద చలామణి అవుతున్న అనాగరిక పాశ్చాత్య జీవనదృక్పథం పట్ల ఒక మందలింపు. ప్రాచ్య సంస్కృతులు, చీనా, జపాను, భారతదేశాల్లో మనిషి యుగాల తరబడి ఏ ఆధ్యాత్మికసత్యాల్ని తన జీవనశైలిగా మార్చుకున్నాడో దాన్ని తెలియపరిచే ఒక మెలకువ. అందులో కళ ఉంది, కవిత్వం

ఉంది, పూలున్నాయి, సంగీతం ఉంది, అన్నిటికన్నా మించి నువ్వు నీ ఇంట్లోనే ఉంటూ, ఒక కప్పు టీ తాగుతూ, విముక్తమానవుడిగా ఎట్లా జీవించవచ్చో చెప్పే ఆధ్యాత్మిక తత్త్వశాస్త్రమంతా ఉంది.

కకుజొ పుస్తకం చదవగానే నేను టీయిస్టుగా మారిపోయానని చెప్పుకోడానికి నాకు సంకోచం లేదు. ఎందుకంటే, ఆ పుస్తకంలో అటువంటి జీవితాలగురించి రాసాడాయన! కొలనులో తామరపూలు కనే కలల్తో తన కలలు కూడా సమ్మిళితం కావాలని ఒక రాత్రంతా ఒక కొలను ఒడ్డున పడుకున్న ఒక జెన్ సాధువు గురించి విన్నారా మీరు? తన తోటలో పూసిన పూలని సంతోషపరచడం కోసం తన ఆస్థాన సంగీతబృందాన్ని తోటలోకి తీసుకువెళ్ళి వాటి కోసం ఒక సంగీతసమారోహం నిర్వహించిన చీనా చక్రవర్తి గురించి విన్నారా? ఒక ఇల్లు అగ్నిప్రమాదంలో చిక్కుకుంటే, ఆ ఇంట్లో విలువైన చిత్రలేఖనం ఒకటి ఉందనీ, అది కూడా తగలబడుతుందేమోనని దాన్ని రక్షించడం కోసం మంటల్లోకి దూకిన సమురాయి గురించి విన్నారా? చామంతుల్తో మాట్లాడటంకోసం తన కంచె దగ్గర బాసింపట్టు వేసుకు కూచున్న తావో యువాన్ మింగ్ గురించి విన్నారా?

చాలా విషయాలున్నాయి అందులో. జపాను టీ గురువు రికియు ఒక రోజు తన టీ కుటీరం దగ్గర ఉండే బాట శుభ్రం చెయ్యమని తన కొడుక్కి చెప్పాడట. అతడు ఆ దారి శుభ్రంగా తుడిచాడు. కాని ఆ తండ్రికి తృప్తి కలగలేదు. ఆ కొడుకు మళ్ళా రెండు సార్లు తుడిచాడు. కాని నీకు తుడవడమెలానో తెలియలేదన్నాడట తండ్రి. కొడుక్కి అర్థం కాలేదు. అప్పుడు రికియు లేచి ఆ బాట పక్కన ఉన్న ఒక చెట్టుదగ్గర నిలబడి ఆ చెట్టు కొమ్మల్ని గట్టిగా ఊపాడట. ఆకులూ, పూలూ ఆ బాటమీద జలజలా రాలాయట. ఆ తండ్రి కొడుకుతో అన్నాడట. 'శుభ్రం చెయ్యడమంటే ఊడ్చెయ్యడం కాదు, కొంత సౌందర్యాన్ని మిగుల్చుకోవడం కూడా' అని.

కొబొరి ఎన్షియు దగ్గర గొప్ప చిత్రలేఖనాల సేకరణ ఉండేదట. అతడి శిష్యులు ఆ సేకరణ చూసి 'ఎంత గొప్పగా ఉంది, ఇందులో దేనికదే, దేన్నీ తీసిపారెయ్యలేం, ప్రతి ఒక్కటీ విలువైందే, అదే రికియు దగ్గర చూడండి, ఆ చిత్రాలు వేలమందిలో ఏ ఒకడినో మాత్రమే ఆకర్షిస్తాయి' అన్నారట. ఆ మాటలు వింటూనే ఆ గురువు సిగ్గుపడిపోయేడట. 'రికియుది ఎంత గొప్ప అభిరుచి. అతడు తనకి ఏది ఇష్టమో దాన్నే దగ్గరపెట్టుకున్నాడు. నేనో, వెయ్యిమంది ఇష్టాల్ని ఇక్కడ పోగుచేసుకుని కూచున్నాను' అన్నాడట.

జపానులోని నరా సామ్రాజ్యాన్ని పాలించిన వారిలో కొమియొ మహారాణి ప్రసిద్ధురాలు. ఆమె ఒక ప్రభాతాన తన తోటలోకి వెళ్ళిందట. అక్కడ నిండుగా పూసిన

ఒక పూలమొక్క దగ్గర నిల్చుని ప్రార్థించిందట: 'ఇంత అందమైన పూలని నా చేతుల్తో తెంపితే అవి మలినపడిపోతాయి. కాబట్టి, ఇదిగో, ఇక్కడ ఇలా విరబూసిన ఈ పూలనిట్లానే గతంలో జీవించిన బుద్ధులకి, ప్రస్తుతం జీవిస్తున్న బుద్ధులకి, రేపు రాబోతున్న బుద్ధులకి అందరికీ సమర్పిస్తున్నాను' అని!

ఒక కప్పు టీలో ఇంత మహత్యం ఉంది. త్రిపురగారు కప్పు కాఫీని గోధుమరంగు ఊహ అన్నాడు. నేనంటానూ, ఒక కప్పు తేనీరు ఒక ఆవిరిపూల కొమ్మ అని!

16-7-2022

నిజమైన సంతోషం క్రియాపదం

కొన్ని పుస్తకాలు మనదగ్గర చాలాకాలంగా ఉన్నా సమయం వచ్చినప్పుడు కాని మన దృష్టి వాటి మీదకి పోదు. గత కొన్నాళ్ళుగా చెప్పలేని మనోవేదనని అనుభవిస్తున్న నాకు నా అల్మైరాలో చాలాకాలంగా నా చేతులకోసం ఎదురుచూస్తున్న పుస్తకమొకటి కనబడింది. అది The Art of Living: The Classic Manual on Virtue, Happiness and Effectiveness (హార్పరు కాలిన్సు, 2005). షారోన్ లెబెల్ అనే రచయిత్రీ, సంగీత సాధకురాలూ ఇప్పటి అవసరాలకు తగ్గట్టుగా ఎపిక్టెటసుకు చేసిన అనువాదం.

ఎపిక్టెటసు (సా.శ. 55-135) ప్రసిద్ధ గ్రీకు-రోమను స్టోయిక్కు తత్త్వవేత్తల్లో ఒకడు. రోమను సామ్రాజ్యపు తూర్పుసరిహద్దుల్లో జన్మించి జీవితం అధికభాగం బానిసగా జీవించాడు. ఆ కాలంలోనే ఎవరో యజమాని అతణ్ణి హింసించడంతో అవిటివాడిగా కూడా మారాడు. కొన్నాళ్ళకు బానిసత్వం నుంచి బయటపడ్డాక ఒక తాత్త్వికుడిగా సంచరించాడు. సా.శ 94 లో రోమను చక్రవర్తి డొమితియను తత్త్వవేత్తల్ని రోము నుంచి బహిష్కరించడంతో, వాయవ్య గ్రీసులోని నికొపొలిసు అనే పట్టణానికి వెళ్ళి అక్కడే ఒక పాఠశాల నడుపుకుంటూ జీవించాడు. చిన్న కుటీరంలో ఒక సాధుసత్తముడిగా జీవిస్తూ అతడు చేసిన బోధల్ని అతడి శిష్యుడు అరియను అనే యువకుడు గ్రంథస్థం చేసాడు. ఎనిమిది సంపుటాలుగా సంకలనమైన ఆ బోధనల్లో ప్రస్తుతం నాలుగు సంపుటాలు మాత్రమే లభ్యమవుతున్నాయి. వాటిల్లో Discourses, నుంచీ, Enchiridion (Manual) నుంచీ కొన్ని భాగాల్ని షారోను అనువదించింది.

ఆ అనువాదాన్ని చదువుతుంటే రెండువేల ఏళ్ళ కిందటి రచన చదువుతున్నట్టు లేదు. ఇప్పటి సామాజిక జీవితంలో ఒత్తిళ్ళని తట్టుకోలేని యువతీయువకులకోసం గొప్ప మనస్తత్వశాస్త్రజ్ఞుడు రాసిన కరదీపికలాగా ఉంది. ఆ మాటే షారోను కూడా అంది.

ఆమె ఇలా రాసింది:

> మన రోజువారీ జీవితం అనేకరాకాల సమస్యల్తో అతలాకుతలమవుతున్నదని ఎపిక్టెటసు గుర్తించాడు. మనిషి బాహ్యపరిస్థితులెట్లాగైనా ఉండనివ్వు, అయినా కూడా మనిషి సంతోషం, జీవనసాఫల్యం, ఆంతరంగిక ప్రశాంతిని పొందడ మెట్లా అన్నదాని గురించే ఎపిక్టెటసు ఆలోచిస్తూ వచ్చాడు. ఆ రచనల్ని ఆవరించిన ప్రాచీనసందర్భంనుంచి వాటిని విడదీసి చదివితే అవి నేటికాలపు సమాజానికి ఎంతసన్నిహితంగా కనిపిస్తాయో చెప్పలేం. అవి మనకాలపు అత్యున్నత మనస్తత్వశాస్త్రంలాగా కనిపిస్తాయి... ఆ మాటకొస్తే వ్యక్తి తనని తాను సర్దుకోవడం గురించి బోధించే ఆధునిక మనస్తత్వశాస్త్రానికి ఎపిక్టెటసు చింతనాధోరణి కూడా ఒక మూలమని చెప్పవలసిఉంటుంది.

ఎపిక్టెటసు ఒక బానిసగా జీవించి మాట్లాడిన మాటల వల్ల అందరికన్నా ఎక్కువ ప్రభావితుడైన వాడు మార్కసు అరీలియసు (121-180). The Philosopher-King గా ప్రసిద్ధి చెందిన అరీలియసు రాసుకున్న The Meditations మీద ఎపిక్టెటసు ప్రభావం సుస్పష్టం. నిష్ఠురమైన కాలంలో జీవించవలసి వచ్చిన ఒక బానిసా, ఒక చక్రవర్తీ కూడా ఒక్కలాగే ఆలోచించడం చూస్తే తత్త్వశాస్త్రాన్ని కాలం నిర్ణయించినట్టుగా వ్యక్తులు నిర్ణయించలేరని తెలుస్తోందన్నాడు రస్సెలు. కాని ఆయనే మరో మాట కూడా అన్నాడు. క్రీస్తుపూర్వపు ఆరవశతాబ్ది ఏథెన్సు సామాజికంగా క్రీస్తుశకం రెండవశతాబ్ది రోము కన్నా ఎంతో మెరుగైందే కాని, ప్లేటో ఊహించగలిగిన ఆదర్శలోకం కన్నా ఎపిక్టెటసు భావించ-గలిగిన ఆదర్శజీవితం మరెన్నో రెట్లు ఉన్నతమైనదని. అంటే ఏమిటి? ఒక మనిషి సంభావించుకోగల ఆదర్శజీవితానికి అతడి బాహ్యపరిస్థితుల పరిమితులు ఆటంకం కాదనే కదా.

ఇదే స్టోయిక్కు చింతనలో. ఎపిక్టెటసులో కనవచ్చే అత్యంత విలువైన అంశం. ఈ ప్రపంచం, మానవజీవితం ఒక నిశ్చయగతిని అనుసరించి నడుస్తున్నాయనే determinism వారిది. కాని, అలాగని మానవుడు పరిస్థితులకి బానిస కాడు. అతడికొక స్వేచ్ఛాసంకల్పముంది (free will). అతడు తన మానసిక శక్తుల్ని, తన ఆలోచనాక్రమాన్ని తాను నిర్ణయించుకోగలడు. ఈ సమన్వయం స్టోయిక్కులు ప్రపంచానికిచ్చిన అత్యున్నతమైన ఉపాదానం. బాహ్య ప్రకృతి కొన్ని చలనసూత్రాల ప్రకారం నడుస్తోందని 17 వ శతాబ్దిలో న్యూటను చెప్పినప్పుడు మొత్తం మానవస్వాతంత్ర్యమంతా ఒక పుకారుగా మారిపోయి-

నప్పుడు, ఆ పరిస్థితినుంచి మానవసంకల్పాన్ని పైకి లేవనెత్తడానికి ఇమ్మాన్యువల కాంట్‌కి ఉపకరించింది ఈ స్టోయిక్కుల సమన్వయమే. ఇప్పుడు బాహ్యసమాజం మన ఆలోచనా ధోరణిమీదా, మన ప్రశాంతి మీదా ఆక్రమణ చేస్తున్నప్పుడు మనకీ, లోకానికీ మధ్య సమన్వయమెట్లా సాధించుకోవాలా అనే మీమాంసకి ఎపిక్టెటసు ఆలోచనలు ఒక దిక్సూచి అనడంలో అతిశయోక్తి లేదు. తన ఆలోచనల్ని వివరించడానికి మొదలుపెడుతూనే ఎపిక్టెటసు ఇలా అంటున్నాడు:

> ఒకవిషయాన్ని స్పష్టంగా అర్థంచేసుకోవడం మీదనే మన సంతోషం, స్వాతంత్ర్యం ఆధారపడ్డాయి. అదేమంటే, కొన్ని సంగతులు మన చేతుల్లో ఉన్నాయి. కొన్ని మన చేతుల్లో లేవు. ఈ ముఖ్య, మూలసూత్రాన్ని నువ్వు అర్థం చేసుకుంటేనే, నీ చేతుల్లో ఉన్నదేదో, లేనిదేదో తెలుసుకున్నాకనే నీ ఆంతరంగిక ప్రశాంతీ, బయటి సామర్థ్యమూ ఒనగూడతాయి.

ఆయన మాటల సారాంశాన్ని షారోను ఇట్లా సంగ్రహంగా చెప్పింది:

> చాలా సరళ, సామాన్య, దైనందిన జీవితానికి అనువైన పద్ధతిలో ఎపిక్టెటసు మనిషి నడవడిక ఎలా ఉండాలో వివరించాడు. మనం మన మంచితనాన్ని అసాధారణంగా, ఆడంబరంగా, వీరోచితంగా ప్రకటించడం కన్నా ఈశ్వర సంకల్పం ప్రకారం స్థిరంగా, సరళంగా ప్రకటించే జీవితం పట్ల అతడెక్కువ మొగ్గు చూపాడు. చక్కటి జీవితం గురించి అతడు చెప్పిన విషయాలు మూడు సూత్రాల మీద ఆధారపడ్డాయి: నీ కోరికల్ని అదుపు చేసుకోవడం, నువ్వు చెయ్యవలసిన పనులు సక్రమంగా చెయ్యడం, నీ గురించీ, తక్కిన ప్రపంచంతో నువ్వు నడుచుకోవలసిన తీరు గురించీ స్పష్టంగా ఆలోచించుకోవడం.

ఈ విషయంలో ఎపిక్టెటసు Enchiridion (Manual) భగవద్గీతనీ, దమ్మపదాన్నీ, తిరుక్కురళునీ, డావో-డె-జింగ్‌నీ, సువార్తల్నీ సహజంగానే గుర్తుకుతెస్తుంది. అయితే వాటికన్నా ఎపిక్టెటసు మరింత ఆచరణాత్మకంగా, మరింత మానవసన్నిహితంగా మాట్లాడు తున్నాడు. అందుకనే ఆ రచన నేటికాలపు ఒక Self-Help Manual గా కనిపించి నాకు కొత్తబలాన్ని అందించింది.

అందులోంచి కొన్ని వాక్యాలు మీ కోసం:

1

దేన్నైనా గట్టిగా కావాలనుకోవడంగాని, వద్దనుకోవడంగాని, చాలా శక్తివంతమైనవేకాని, అవి కేవలం అలవాట్లు మాత్రమే. ప్రయత్నిస్తే మనమంతకన్నా మంచి అలవాట్లే అలవర్చుకోగలుగుతాం. నీ చేతుల్లో లేని విషయాలపట్ల కలతచెందుతుండే అలవాటుని అదుపు చేసుకోవడం నేర్చుకో. అందుకు బదులు నీ చేతుల్లో ఉండి నీకు మేలు చెయ్యని వాటిని నిగ్రహించడం మొదలుపెట్టు.

2

నిన్ను బాగా సంతోషపెడుతున్న విషయాలగురించి ఒక్కసారి ఆలోచించు– నువ్వు వాడుతున్న పనిముట్లు, నువ్విష్టపడుతున్న మనుషులు. కాని ఒకటి గుర్తుపెట్టుకో, వాటి గురించి మనం ఏమనుకుంటున్నాము అన్నదాంతో సంబంధం లేకుండా వాటికంటూ వాటికొక ప్రత్యేకధర్మం కూడా ఉంటుంది. ఉదాహరణకి, నీకు బాగా ఇష్టమైన మట్టిపాత్ర. నీకదంటే బాగా ఇష్టం. కాని గుర్తుపెట్టుకో. అది మట్టిపాత్ర. ఏదో ఒక రోజు పగిలిపొయ్యేదే. అట్లా పగిలిపోయినప్పుడు తట్టుకోగలగడం కూడా నేర్చుకో. అట్లాగే నీకు ఇష్టమైన మనుషుల విషయంలో కూడా.

3

విషయాలు వాటంతటవే మనల్ని బాధపెట్టేవీ కావు, అడ్డగించేవీ కావు. అలాగే మనుషులు కూడా. మనమా విషయాల్నెట్లా చూస్తున్నామన్నది వేరే సంగతి. కాని విషయాల పట్లా, మనుషుల పట్లా మన వైఖరి, మన ప్రతిస్పందనలు–అవే మనని బాధపెట్టేది...మన బాహ్యపరిస్థితులెలా ఉండాలో మనం శాసించలేం. కాని వాటిపట్ల ఎలా ప్రతిస్పందించాలి అన్నది మాత్రం పూర్తిగా మన చేతుల్లో ఉన్న విషయమే.

4

మనం నైతికంగా పురోగమిస్తున్నామన్నదానికి స్పష్టమైన ఒక కొండగుర్తు ఇతరుల్ని తప్పుపట్టే గుణం మనలో నెమ్మదిగా తగ్గిపోతుండటమే. ఊరకనే ఎదుటివాళ్ళను వేలెత్తి చూపడం నిరర్థకమని గ్రహించడమే.

5

ఏదీ మననుంచి దేన్నీ కాజెయ్యలేదు. మనం పోగొట్టుకునేదంటూ ఏదీ లేదు. 'నేనిది పోగొట్టుకున్నాను' అనుకోవడం మానేసి 'నేను ఫలానాదాన్ని ఎక్కణ్ణుంచి తెచ్చు–

కున్నానో అక్కడే పెట్టేసాను' అని ఎప్పుడనుకుంటావో అప్పుడే నీ ఆంతరంగిక ప్రశాంతి మొదలవుతుంది.

6

నీ జీవితం ఒక విందుకు వెళ్ళడంలాంటిది. నువ్వక్కడ హుందాగా ప్రవర్తించవలసి ఉంటుంది. నీ ముందు వంటకాల వడ్డన సాగుతున్నప్పుడు నువ్వు మితంగా హుందాగా వడ్డించుకోవాలి. వడ్డించేవాళ్ళు నీ ముందు ఆగలేదా, నీ పళ్ళెంలో ఏముందో దానిమీదే దృష్టిపెట్టాలి. వడ్డించేవాళ్ళింకా నీ వైపు రాలేదా, ఓపిగ్గా ఎదురుచూడాలి.

7

నువ్వు అత్యున్నతమైన నువ్వుగా మారడం మీద తప్ప మరిదేని మీదా దృష్టిపెట్టకు. ఎందుకంటే, నువ్వు నువ్వుగా మారడం పూర్తిగా నీ చేతుల్లో ఉన్నదే.

8

నిన్ను అవమానించడం, బాధపెట్టడం ఎవరివల్లా కాదని గుర్తుపెట్టుకో. ఎవరైనా నిన్ను తిడితే, కొడితే, నువ్వు అవమానానికి గురయ్యావని అనుకుంటే. అది అవమానానికి గురయ్యావని నీకు నువ్వు చెప్పుకోవాలని అనుకోవడం తప్ప మరేమీ కాదు.

9

ప్రతి దానికీ రెండు హాండిల్సు ఉంటాయి. దాన్ని పట్టుకోవడానికి ఉపయోగించే-దొకటి, పట్టుకోడానికి వీలుకానిది మరొకటి. ఉదాహరణకి నీ అన్నదమ్ముడో, అక్కచెల్లెలో నీతో సరిగ్గా ప్రవర్తించలేదనుకో, అప్పుడు నువ్వు బాధపడితే నువ్వు పట్టుకోలేని హాండిలు వైపు పట్టుకోవడానికి చూసినట్టు. అలా కాకుండా, ఆ బాంధవ్యాన్ని పట్టుకోగలిగే హాండిలు వైపు పట్టుకోవడానికి ప్రయత్నించు. అంటే, మీ మధ్య ఉన్న బాంధవ్యం మీ చిన్నప్పుణ్ణుంచీ, తల్లికడుపునుంచీ మొదలయ్యిందనీ, దాన్నెట్లాగైనా నిలుపుకోవాలనీ ఆలోచించు.

10

నిజమైన సంతోషం నామవాచకం కాదు, క్రియాపదం.

27-10-2013

కృపావర్షధార

నిన్న ఎవరో నా చేతుల్లో పెట్టారు పరిశుద్ధగ్రంథాన్ని. మరోసారి తెరిచి చూసాను సువార్తల్ని. 'హృదయం కఠినమై గడ్డకట్టి ఎండిపోయినప్పుడు నువ్వు వొచ్చి కరుణావర్షంతో నన్ను తడిపెయ్యి' అంటాడు టాగోరు. సువార్తల్లో ఎక్కడ ఏ అధ్యాయం తెరిచినా కృపావర్షమే, జల్లుగా కాదు, జడివానగా. ఆ కృపావర్షధారలు మిమ్మల్ని కూడా తడపాలని, ఇదిగో, నాలుగు వాక్యాలు:

ప్రలోభపెట్టేవాడొకడు ఆయన దగ్గరకొచ్చి 'నువ్వు నిజంగా దేవుడి కుమారుడివే అయితే, ఇదిగో, ఈ రాళ్ళు రొట్టెలుగా మారాలని ఆదేశించి చూపించు' అనడిగాడు.

'మనిషి బతికేది వట్టి రొట్టె వల్ల మాత్రమే కాదు, ఈశ్వరుణ్ణుంచి వినవచ్చే ప్రతి ఒక్క మాట వల్ల కూడా అని పెద్దలు చెప్పలేదా!' అన్నాడు క్రీస్తు.

(మత్తయి, 4:3-4)

మీరీ మాట కూడా విని ఉంటారు: మీ పొరుగువాళ్ళని ప్రేమించండి, మీ శత్రువుల్ని ద్వేషించండి అని. కానీ మీ శత్రువుల్ని కూడా ప్రేమించండి అంటాన్నేను, మిమ్మల్ని దూషిస్తున్నవాళ్ళ పట్ల కూడా దయచూపండి. మిమ్మల్ని ద్వేషించేవాళ్ళకి కూడా మంచి చెయ్యండి. మిమ్మల్ని అవమానించేవాళ్ళకోసమూ, వేధించేవాళ్ళ కోసం కూడా మీ ప్రార్థనల్లో చోటివ్వండి.

మిమ్మల్ని ప్రేమించేవాళ్ళనే మీరు ప్రేమిస్తుంటే మీరిచ్చే బహుమానం ఏమిటట? పన్ను వసూలు చేసే సుంకరులు కూడా ఆ పని చేస్తుండరా?

మీరు మీ అన్నదమ్ములతో మటుకే సఖ్యంగా ఉంటే, తక్కినవాళ్ళకీ మీకూ తేడా ఏమిటట? పన్ను వసూలు చేసే సుంకరులు చేసేది కూడా అదే కదా.

(5:43-47)

మీ దుస్తులగురించి మీకెందుకింత చింత? పొలంలో గడ్డిపూలు చూడండి. అవెట్లా విప్పారుతున్నాయో చూడండి. అవి వడకవు, ఒళ్ళు అలిసేలాగా పనిచేయవు.

కాని తన సమస్తవైభవంతో కూడిన సొలోమోను చక్రవర్తి కూడా వాటిలో ఒక్క గడ్డిపువ్వుకి కూడా సాటిరాడని చెప్పగలను.

ఈ రోజు పొలంలో వికసించి రేపు పొయ్యిలోకి ఎండుకట్టెగా పోయే గడ్డిపూలనే దేవుడిట్లా అలంకరించాడంటే, అల్పవిశ్వాసులారా, మిమ్మల్ని మరింత శోభాయమానంగా అలంకరించడా?

కాబట్టి, ఇప్పుడు మనమేం తినాలి? ఎప్పుడు మనమేం తాగాలి? మనమే గుడ్డలు తొడుక్కోవాలి? వదిలిపెట్టెయ్యండి- ఆ చింతలన్నీ.

(6: 28-31)

యోహాను శిష్యులూ, పరిసయ్యుల శిష్యులూ ఆయనదగ్గరికొచ్చి అడిగారు కదా 'అదేమిటి? మేము చాలా సార్లు ఉపవాసాలు చేస్తుంటాం, కాని మీ శిష్యులేమిటి ఎప్పుడూ ఉపవాసాల మాటే ఎత్తరు?'

'పెళ్ళికొడుకు తమతో ఉండగా పెళ్ళికొడుకు స్నేహితులు ఉపవాసాలు చేస్తుంటారా?'

(9:14-15)

వెళ్ళండి, స్వర్గం మీ చెంతకు దిగి వచ్చిందని చెప్పండి, బోధించండి.

అస్వస్థుల్ని స్వస్థపరచండి. రోగగ్రస్తుల్ని శుద్ధపరచండి. మరణించినవాళ్ళకి ఊపిరి పొయ్యండి. దెయ్యాల్ని వెళ్ళగొట్టండి.

మీకు లభించిందేదో ఉచితంగా మీకు లభించింది. దాన్ని అంతే ఉచితంగా నలుగురికీ వెదజల్లండి. బంగారంగాని, వెండిగాని, రాగిడబ్బులుగాని మీ కొంగున మూట కట్టుకోకండి.

మీ ప్రయాణానికి మూటలు సిద్ధం చేసుకోకండి, కనీసం రెండు జతల దుస్తులు, చెప్పులు, చేతికర్ర కూడా వెంటతీసుకుపోకండి. మీరు చేసే పనికి ఆ రోజుకి కడుపునిండా ఇంత అన్నం దొరికితే అదే మీకు మజూరీ.

మీరే పట్టణంలో, నగరంలో అడుగుపెట్టినా, అక్కడ ప్రశస్తమైన మనుషులెవరున్నారో తెలుసుకోండి, ఆ ఊరు వదిలిపెట్టేదాకా వాళ్ళ పంచనే నివసించండి.

మీరు ఏ ఇంట్లోఅడుగుపెడుతున్నా ఆ ఇంటివాళ్ళని ప్రేమపూర్వకంగా పలకరించండి. వాళ్ళు ప్రశస్తమైన మనుషులా, మీ నిర్మలచిత్తం వాళ్ళకి కూడా అందుతుంది. కాదా, మీ మనశ్శాంతి మీతోనే ఉండిపోతుంది.

ఎక్కడ మనుషులు మిమ్మల్ని స్వాగతించరో, ఎవరు మీ మాటలు వినడానికి ఇష్టపడరో ఆ ఇల్లు, ఆ ఊరు, ఆ నగరం వదిలిపెట్టేటప్పుడు మీ పాదాలకి అంటిన దుమ్ము అక్కడే దులిపేసుకోండి.

(10:7-14)

నేను మీకు చీకట్లో చెప్పినదాన్ని మీరు నలుగురికీ పట్టపగలే వివరించండి. చెవిలో చెప్పినదాన్ని ఇళ్ళకప్పుల మీద నిలబడి మరీ బిగ్గరగా ప్రకటించండి.

(10:27)

అప్పుడు కొంతమంది శాస్త్రకారులు, పురోహితులు ఆయనదగ్గరకొచ్చి 'బోధకుడా, నువ్వు చెప్పేది నిజమే అయితే మాకు నిదర్శనాలు చూపించు' అనడిగారు.

'నిదర్శనాలా? దుర్మార్గమైన జాతి, వ్యభిచారి సమాజం మాత్రమే ఇట్లాంటి ప్రశ్నలు అడుగుతుంది, నిదర్శనాలు కోరుకుంటుంది.'

(12: 38-39)

ఆయన వాళ్ళకి మరొక ఉదాహరణ చెప్పాడు. ఈశ్వరుడి సామ్రాజ్యం ఆవగింజ లాంటిది. ఒకాయన దాన్ని తీసుకుపోయి తన పొలంలో నాటాడు. అది గింజలన్నింటిలోకీ లవలేశంలాంటిది. కాని పెరిగిపెద్దయ్యాక అది పొదలన్నిటి కన్నా ఎత్తుగా చెట్టంత వికసిస్తుంది. అప్పుడు గాల్లో పిట్టలు ఎగురుకుంటూ వచ్చి దాని కొమ్మల్లో గూడు కట్టుకుంటాయి.

(13: 31-32)

ఈశ్వరుడి ప్రేమ పొలంలో దాచిపెట్టిన నిధినిక్షేపం లాంటిది. అది ఎవరి కంట పడిందో, దాన్నతడు మరింత భద్రంగా దాచుకుంటాడు. తనకున్న గొడ్డూగోదా సమస్తం అమ్మేసుకుని మరీ ఆ మడిచెక్క తన సొంతం చేసుకుంటాడు.

ఈశ్వరుడి రాజ్యం ముత్యాల కోసం వెతుక్కుంటున్న వ్యాపారిలాంటిది. ఆ వర్తకుడికి విలువైన ముత్యాలు కనిపించడమే ఆలస్యం, తక్షణమే, తనకున్నదంతా అమ్మేసుకుని మరీ దాన్ని కొనితెచ్చుకుంటాడు.

(13: 44-45)

మనిషి లోపలకి పోయేదేదీ అతణ్ణి మలినపర్చదు. గుర్తుపెట్టుకోండి, అతడి నోటిలోంచి ఏది బయటికొస్తుందో, అదే అతణ్ణి మలినపరుస్తుంది..

నోటిలోంచి బయటికొచ్చేవి అతడి హృదయంలోంచి బయటికొస్తాయి కాబట్టి వాటి వల్ల అతడు మలినపడతాడు. ఏమిటవి? బయటకొచ్చేవి? దురాలోచనలు, హత్యలు, వ్యభిచారాలు, అక్రమసంబంధాలు, దొంగతనాలు, తప్పుడు సాక్ష్యాలు, చివరికి దేవుణ్ణి నిందించడాలు.

ఇదిగో వీటివల్ల మనిషి అపరిశుద్ధుడవుతున్నాడు, అంతే తప్ప, చేతులు కడుక్కోకుండా అన్నం తిన్నందుకు కాదు.

(15: 11, 19-20)

ఆయన శిష్యులు ఆయనదగ్గరికొచ్చి అడిగారు: మరి మేమెందుకని ఆ దెయ్యాన్ని వెళ్ళగొట్టలేకపోతున్నాం?

'ఎందుకంటే, మీకు నమ్మకం లేదు కాబట్టి. నేను నిశ్చయంగా చెప్తున్నాను. వినండి, మీ హృదయంలో ఆవగింజంత నమ్మకం ఉన్నా కూడా అదిగో ఆ కొండ దగ్గరికి పోయి 'పక్కకి జరుగు' అనండి, అది పక్కకి జరిగి తీరుతుంది.'

(17: 19-20)

25-12-2019

అత్యున్నత రూపకాలంకారం

సువార్తలు ఎప్పుడు తెరిచినా నాకు గొప్ప స్ఫూర్తీ, చెప్పలేనంత సాంత్వనా కలుగుతుంటాయి. అందులోనూ, గొప్ప భాష్యకారులెవరేనా సువార్తలమీద రాసినది చదువుతుంటే తెల్లవారేవేళ ఆకాశమంతా పరుచుకునే తెలివెలుగులాంటిది నా హృదయాన్ని ఆవరించి వెలిగిస్తూండటం నాకు అనుభవం. ఈ మధ్య అట్లాంటి పుస్తకం ఒకటి దాచుకుని దాచుకుని మరీ చదివాను.

యూజిని.ఎ.పీటర్సను అమెరికాకి చెందిన బోధకుడు, బైబిలు వ్యాఖ్యాత, ప్రసంగి. 21 వ శతాబ్దానికి తగినట్టుగా బైబిలు సందేశాన్ని విడమర్చి చెప్తున్నవాడిగా ఆయన ఇప్పటికే ప్రసిద్ధిచెందాడు. ఆయన రాసిన పుస్తకాల్లో ఒకటి, Tell it Slant: A Conversation on the Language of Jesus in his Stories and Prayers (2008) అనే రచన నా కంటపడింది. ఆ పుస్తకాన్ని అధ్యాత్మిక గ్రంథమనాలో, లేక అత్యున్నత స్థాయి సాహిత్యపఠనం అనాలో నేను తేల్చుకోలేకున్నాను.

ఆ రచన రెండు భాగాలు. మొదటి భాగంలో ఆయన లూకా సువార్త ఆధారంగా క్రీస్తు చెప్పిన కథల్ని మళ్ళా మరొకసారి వివరిస్తాడు. రెండవ భాగంలో, నాలుగు సువార్తల్లోనూ క్రీస్తు చేసిన ప్రార్థనల్ని ఏరి తెచ్చి, వాటిని మరొక మారు పునఃపఠించి వ్యాఖ్యానిస్తాడు. రెండు భాగాలూ కూడా అత్యంత విలువైన రచనలు. క్రీస్తు ప్రార్థనల్లో ఆయన ప్రతి పదాన్నీ వివరించిన తీరు బ్రహ్మసూత్ర భాష్యంలాంటిది అని చెప్పవచ్చు. కాని, ఇక్కడ మీతో మొదటిభాగం గురించే పంచుకుందామనుకుంటున్నాను.

నాలుగు సువార్తల్లోనూ మార్కు, మత్తయి, లూకా సువార్తల్ని సారూప్య సువార్తలు అంటారు. అవన్నీ ఒక మూల సువార్త ఆధారంగా రాసినవని భావిస్తున్నారు. తిరిగి ఆ మూడింటిలోనూ మార్కు సువార్త మొదటిదనీ, తక్కిన రెండూ ఆయన్ని అనుసరించినవనీ

పరిశోధకులు చెప్తున్నారు. ఆ మూడు సువార్తలూ కూడా యేసు జీవితవిశేషాల్ని ఆధారం చేసుకుని ఆయన బోధల్నీ, తన జీవితం ద్వారానూ, మరణం ద్వారానూ, పునరుత్థానం ద్వారానూ ఆయన ఈ లోకానికి తీసుకువచ్చిన దైవసందేశాన్ని వివరించే రచనలు. నాలుగవ సువార్త యోహానుసువార్త పూర్తిగా తాత్త్విక రచన. అక్కడ క్రీస్తు జీవితవిశేషాల్ని కథలాగా చెప్పడం కన్నా, ఆయన జీవితంలోని ప్రతి సంఘటననీ, ప్రతి ఒక్క ఉపమానాన్నీ, ప్రతి ఒక్క బోధననీ పూర్తిగా ఆధ్యాత్మికదృష్టితో వివరించిన రచన.

సువార్తలతో నాకు చిన్నప్పటినుంచీ పరిచయం ఉన్నప్పటికీ ఆ నాలుగింటిలోనూ నన్ను మొదట ఆకట్టుకున్నది నాలుగవ సువార్తనే. కాని చాలా ఏళ్ళ తరువాత మత్తయిని చదివినప్పుడు చిన్నచిన్న వాక్యాల్లో, సాదాసీదా వివరాల్తో ఆయన ఎంత అనల్పార్థ రచన చేసాడో బోధపడింది. ఇప్పుడు, ఈ రచన ద్వారా లూకా సువార్త నాకు కొత్తగా కనిపిస్తున్నది.

అన్నిటికన్నా ముందు సృష్ట్యాదిలో శబ్దం మాత్రమే ఉందనీ, ఆ శబ్దం (వాక్యం, logos, మన భాషలో చెప్పాలంటే ప్రణవం) వెలుగై ఉండేదనీ, ఆ శబ్దం రక్తమాంసాలు ధరించి భూమ్మీద యేసుగా అవతరించిందనీ సువార్తలు చెప్తాయి. ఆ శబ్దాన్ని వేదం వాక్కు అంది. ఆ వాక్కు ఎంత పవిత్రమైందో, ఆ వాక్కుని విశ్వసించినవాళ్ళు, ఈ లోకాన్ని ఎట్లా తరించగలరో వివరించడమే పీటర్సను రచన ముఖ్య ఉద్దేశం.

మన దర్శనాలు ఆరుప్రమాణాల్ని ఆధారం చేసుకున్నప్పటికీ శబ్దప్రమాణాన్ని అన్నిటి కన్నా ముఖ్యంగా భావించాయి. ఈ వ్యాఖ్యాత కూడా సువార్తను ఒక శబ్దప్రమాణంగా తీసుకున్నాడు. అందులోని ప్రతి ఒక్క పదం, పదబంధం, వాక్యం, చివరికి విరామచిహ్నాల్ని కూడా అతడు ఎంతో నిష్ఠతో, శ్రద్ధతో సంభావించి, ఆ శబ్దార్థాన్ని ప్రసన్నం చేసుకోవడానికి పరితపించాడు. ఈ ప్రపంచంలోని తక్కిన శబ్దాలు మనల్ని బంధిస్తాయి. కాని దైవ-వాక్యం మనల్ని విడిపిస్తుంది. అసలు ఆ మాటకొస్తే యేసు జీవితం కూడా ఒక శబ్ద-ప్రమాణాన్ని నమ్మి తన జీవితాన్ని అందుకు ఉదాహరణగా తీర్చిదిద్దుకోవడమే కదా. పూర్వనిబంధన ప్రవక్తల్ని, ముఖ్యంగా ఇషయ్యాని యేసు పరిపూర్ణంగా విశ్వసించాడు కాబట్టే క్రీస్తు కాగలిగాడు.

శబ్దానికి మూడు వినియోగాలుంటాయి అంటాడు పీటర్సను. మొదటిది ప్రవచనం (preaching). ప్రవచనమంటే ప్రకటన. అది భగవంతుడి గురించిన సమాచారాన్ని అందరూ వినేలా బిగ్గరగా ప్రకటించడం. మార్కు సువార్త అటువంటి ప్రచనంతో మొదలైందనీ, అది గలిలియలో యేసు సూచకక్రియలు మొదలుపెట్టడంతో మొదలవు-తుందనీ అంటాడు పీటర్సను.

శబ్దానికున్న రెండవ వినియోగం బోధన (teaching). అంటే తరగతిగదుల్లో ఉపాధ్యాయులు పిల్లలకి బోధించడమనే కాదు, అసలు ఎవరేనా సరే, తల్లి, తండ్రి, గురువు, స్నేహితుడు, రచయిత, కవి మనం ఈ లోకంలో ఎట్లా మసలాలో, జీవితాన్ని ఏ విధంగా తీర్చిదిద్దుకోవాలో, ప్రతి ఒక్క విశేషంతోనూ ఓపిగ్గా విడమరిచి చెప్పడం. క్రీస్తు అట్లాంటి బోధకుడని మత్తయి సువార్త చెప్తుందంటాడు పీటర్సను. మన జీవితాల్లో విడివిడిగా ఉన్న అనుభవాల్ని ఒకదానికొకటి కలుపుతూ వాటికొక సమగ్రతనీ, సార్థకతనీ సమకూర్చడం బోధన లక్ష్యమనీ, గలిలయలోనూ, యెరుషలేంలోనూ కూడా ఒక బోధకుడిగా క్రీస్తు చేసింది అదేననీ కూడా అంటాడాయన.

ఇక శబ్దవినియోగంలోని మూడవ అంశం, ముఖ్యమైన అంశం, మన రోజువారీ వ్యవహారంలో మనం మాటాడుకునే మాటలు. మామూలు మాటలు. చిన్నవీ, పెద్దవీ మన పనులు, మనచుట్టూ ఉండే మనుషులతో దైనందిన జీవితాన్ని కొనసాగించడానికి మనం చెప్పుకునే మాటలు, ఇచ్చే ఆదేశాలూ, కోరుకునే అభ్యర్థనలూ, ప్రశంసలూ, అభిశంసనలూ అన్నీ. మనం మామూలుగా ఈ శాబ్దిక వ్యవహారానికి ఏమంత ప్రాధాన్యత నివ్వం. ఇది మన వ్యావహారికజీవితానికి సంబంధించింది అనీ, మన పారమార్థిక జీవితానికి సంబంధించిన పార్శ్వానికీ, ఈ వ్యావహారికభాషకీ ఏమీ సంబంధంలేదని భావిస్తాం. కాని క్రీస్తు దృష్టిలో, ఈ రోజువారీ, అల్ప సంఘటనలకి సంబంధించిన చిన్న చిన్న మాటలకీ, ప్రవచనానికీ, బోధనకీ మధ్య ఏమీ తేడా లేదు. పైగా, పీటర్సను చెప్పేదేమంటే, ఇటువంటి రోజువారీసంభాషణల్లో, ఈ small talk లోనే క్రీస్తు మనకి మరింత చేరువగా కనిపిస్తాడని. లూకా తన సువార్తలో చిత్రించిన యేసు ఇటువంటి రోజువారీ జీవితానికి చెందిన యేసు అని చెప్తాడాయన. ఆ కోణంలో ఆయన సువార్తను చదివిన తీరు, వ్యాఖ్యానించిన పద్ధతి నిజంగా నేనిప్పటిదాకా ఎక్కడా చదవలేదు.

మార్కు చిత్రించిన క్రీస్తు ప్రవచనకారుడు కాగా, మత్తయి చిత్రించిన క్రీస్తు బోధకుడు కాగా లూకా చిత్రించిన క్రీస్తు సంభాషణకారుడు, ముఖ్యంగా కథకుడు అనేది పీటర్సను ప్రతిపాదన.

అందులోనూ తక్కిన సువార్తల్లో లేనిదీ, లూకాలోనే ప్రత్యేకంగా ఉన్నదీ, క్రీస్తు గలిలయనుండి సమరయ మీదుగా యెరుషలేం ప్రయాణించినప్పుడు ఆ దారి పొడుగునా చెప్పిన కథలు. దాదాపుగా పది అధ్యాయాల పొడుగునా (9:51-19:44) లూకా వర్ణించిన ఆ ప్రయాణాన్ని పీటర్సను ఆద్యంతం ఒక అత్యున్నత రూపకాలంకారంగా వివరిస్తాడు.

యేసు మహిమ మొదటిసారిగా గలిలయలో ప్రకటితమయ్యింది. ఒకవైపు బాప్తిస్మ–మిచ్చే యోహాను ఉరుములాగా భగవత్సందేశాన్ని, పూర్వ ప్రవక్తల ప్రవచనాల్ని వినిపిస్తుంటే, యేసు నిశ్శబ్దంగా గలిలయ సముద్రపు ఒడ్డున పల్లెల్లో పేదల్నీ, పతితుల్నీ, దీనుల్నీ కలుసుకుంటూ, అక్కున చేర్చుకుంటూ, వారి అస్వస్థ జీవితాన్ని స్వస్థపరుస్తూ ఉన్నాడు. యెరుషలేంలో క్రీస్తు అవతార ప్రయోజనం లోకానికి పూర్తిగా వెల్లడి అయింది. ఆయన చివరిసారి యెరుషలేంలో అడుగుపెట్టిన తరువాత వారంరోజులు కూడా కాకుండానే ఒకదానివెనక ఒకటి సంఘటనలు నాటకీయంగా జరిగాయి. తన శిష్యుడి మోసం వల్ల ఆయన పట్టుబడటం, ముందు మతాధిపతులూ, తర్వాత రాజప్రతినిధులూ ఆయన్ని విచారించడం, శిలువ వెయ్యడం, ఆ తర్వాత ఆయన పునరుత్థానం వెనువెంటనే జరిగిపొయ్యాయి. క్రీస్తు ఒక బోధకుడు మాత్రమే కాదు, లోకరక్షకుడని యెరుషలేంలోనే ఋజువయ్యింది.

తన జీవితానికీ, బోధనకీ, జీవనసార్థక్యానికీ అత్యంత అనుకూలమైన గలిలయనుండి యెరుషలేం వెళ్ళడానికి క్రీస్తు సమరియా మార్గాన్ని ఎందుకు ఎంచుకున్నాడు? ముఖ్యంగా సమరయులకీ, యూదులకీ మధ్య జాతివైరం ఉండగా, ఆ మార్గం కఠినమైన దారి మాత్రమే కాదు, సామాజికంగా కూడా అత్యంత ప్రతికూలం అని తెలిసిన తరువాత కూడా క్రీస్తు ఆ దారినే ఎందుకు ఎంచుకున్నాడు? ఈ ప్రశ్నలకి లూకా సువార్త ఆధారంగా పీటర్సను ఇచ్చిన వివరణ మహిమాన్వితంగా ఉంది.

లూకా సువార్తలో అధికభాగం క్రీస్తు సమరయ గుండా చేసిన ప్రయాణాన్ని వివరించడానికి కేటాయించడమే కాకుండా, ఆ దారిపొడుగునా క్రీస్తు చెప్పిన కథల్ని చెప్పడంతో ఆ ప్రయాణమొక travel narrative గా మారిపోయిందంటాడు పీటర్సను. గలిలయ, సమరయ, యెరుషలేం వట్టి ప్రాంతాలు మాత్రమే కాక, మెటఫర్లుగా మారిపోయే–యంటాడు. మనం మన ఆధ్యాత్మిక జీవితంలో మన ప్రార్థనవేళలూ, పూజాసమయాలూ, ప్రవచనఘడియలూ గలిలయ, యెరుషలేం వంటివి కాగా, ఆ వేళల మధ్యనుండే మన దైనందిన జీవితం సమరయలాంటిది.

ఒక ఆదివారం గలిలయ కాగా మరొక ఆదివారం యెరుషలేం లాంటిది. ప్రభువుని తలుచుకోవడానికి అర్పించుకున్న ఆ రెండు ఆదివారాల మధ్య మనం గడిపే తక్కిన ఆరు రోజుల జీవితం సమరయలో చేసే ప్రయాణం లాంటిది. అది మన దృష్టిలో అత్యంత లౌకికం, ఈశ్వరదూరం, శ్రద్ధావిదూరం. ఆ ఆరురోజుల్నీ మనమెట్లానో గడుపుతాం, మన శారీరిక, ప్రాపంచిక అవసరాల్ని ఏదో ఒక విధంగా తృప్తి పరుచుకుంటూ.

ఒక్క మాటలో చెప్పాలంటే ఆ ఆరురోజుల పాటూ మనం భగవంతుడినుంచి ముఖం చాటేసుకుని తిరుగుతాం. కాని యేసు అట్లా కాదు. ఆయన ప్రతి రోజూ భగవత్సాన్నిధ్య-సుఖం అనుభవిస్తూనే ఉంటాడు. ప్రవచనాల్లోనూ, బోధనవేళల్లోనూ మాత్రమే కాదు, తన రోజువారీ జీవితంలో తనకి తారసపడ్డ ప్రతి ఒక్కరితోనూ, ప్రతి ఒక్క వ్యవహారంలోనూ కూడా ఆయన పూర్ణమానవుడిగానే ప్రవర్తిస్తాడు. అంతేకాదు, అటువంటి రోజువారీ జీవితంలోని మామూలు మాటల్లోనే, మనతో చెప్పే కథల్లోనే ఆయన ప్రేమైకహృదయం, ఆయన దయ, ఆయన విశ్వాసం మనకి మరింత స్పష్టంగా ద్యోతకమవుతాయి.

గలిలయ నుండి యెరుషలేం దాదాపు డెబ్భై మైళ్ళ కఠిన ప్రయాణం. కాలినడకన మూడు నాలుగు రోజుల ప్రయాణం. ఆ దారిపొడుగునా యేసు తన శిష్యులతో నెమ్మదిగా, ప్రేమగా మాట్లాడుతోనే ఉన్నాడు. ఆ మాటలకి ముందస్తు ప్రణాళిక ఏమీ లేదు. అవి ఎప్పటికప్పుడు తనకి తారసపడుతున్న వాళ్ళని పలకరించడంలోంచో లేదా తనని ఎవరేనా ఏదైన ప్రశ్న అడిగినప్పుడు జవాబివ్వడంలోంచో రూపుదిద్దుకున్న సంభాషణలు. ఆ సంభాషణల్లోంచే ఆయన చెప్పిన అపురూపమైన కథలు.

నిన్ను నువ్వు ప్రేమించుకున్నట్టుగా నీ పొరుగువాణ్ణి కూడా ప్రేమించమని చెప్తే, నా పొరుగువాడెవరు అని అడిగిన ప్రశ్నకి ఒక సమరయుణ్ణి ఉదాహరణగా చూపిస్తూ యేసు చెప్పిన మహిమాన్వితమైన కథతో సమరయ ప్రయాణం మొదలవుతుంది. ఆ ప్రశ్న అడిగినాయన ఒక ధర్మశాస్త్రపండితుడు. నీ పొరుగువాడు నీవంటి యూదునే అని చెప్పలేదు యేసు ఆయనకి. యూదులు ద్వేషించే సమరయుణ్ణి ఉదాహరణగా చూపించడం క్రీస్తు విజ్ఞతకి మాత్రమే కాదు, ఎల్లల్లేని ఆయన ప్రేమైకచిత్తానికి కూడా నిరూపణ. మన పొరుగువాడు మన ఇంటిపక్కనుండేవాడో లేదా ఆఫీసులో మన సహోద్యోగినో మాత్రమే కాదు. మనం ఎవరితో కలిసి జీవించక తప్పదో, అలా జీవించవలసి వచ్చినందువల్ల ఎవరిని మనం సదా ద్వేషిస్తూ ఉంటామో అతడు మన పొరుగువాడు. నన్ను నేను ప్రేమించుకున్నట్టు నేనతణ్ణి ప్రేమించడం సాధన చెయ్యమంటున్నాడు యేసు. ఆ సాధన క్రమంలో భాగంగానే ఆయన యెరుషలేం వెళ్ళడానికి సమరయ గుండా పొయ్యే తోవ ఎంచుకున్నాడు.

అట్లా యేసు ఒకటి కాదు, ఆ దారిపొడుగునా మొత్తం పది కథలు చెప్పాడు. అవి వట్టి కథలు కావు, పది ఉపనిషత్తులని అర్థమయ్యింది నాకు పీటర్సను రచన చదువుతుంటే. అవి కూడా ప్రవచనాలుగానో, బోధనలుగానో కాక, కథలుగా చెప్పడం. ఆ కథలు కూడా తన స్వజనం మధ్యనా, తన స్వదేశంలోనూ కాక, తనకి అత్యంత ప్రతికూలమైన

దారిలో చెప్పడం. అందువల్లనే ఆ కథలు వింటున్నప్పుడు మనలో ఏదో జరుగుతుంది. అదేమిటో కూడా పీటర్సను తనే ఇలా చెప్తున్నాడు:

> Every time Jesus tells a story, the world of those who listen enlarges, understanding deepens, imaginations are energized. Without stories, we end up with stereotypes-a flat earth with flat cardboard figures that have not texture or depth, no interior.

2-12-2020

సుమనస్వీ, దయాళువూ

నన్ను ప్రభావితం చేసిన పుస్తకాల గురించి రాసినప్పుడు, అందులో సురా అల్ ఫాతిహా గురించి కూడా ప్రస్తావిస్తూ, మౌలానా అబుల్‌కలాం ఆజాద్ భాష్యం గురించి ప్రస్తావించి–నప్పుడు, ఒకరిద్దరు మిత్రులు ఆ పుస్తకం ఎక్కడ దొరుకుతుందని అడిగారు.

ఆ మొదటి సూక్తంలో, 'అల్ రహమాన్, అల్ రహీమ్' అనే విశేషణాల్ని వివరిస్తూ ఆయన రాసిన 'రహమత్' అనే అధ్యాయం నుండి రెండు పుటలు (పే. 47-49) తెలుగు చేసి మీకందిస్తున్నాను.

అల్ రహ్మాన్, అల్ రహీమ్ : సుమనస్వీ, దయాళువూ

అల్ రహ్మాన్, అల్ రహీమ్ అనే పదాలు 'రహమత్' అనే పదం నుంచి పుట్టాయి. మనుషులు ఇతరులపట్ల దయచూపడానికి ఉత్సాహపడతారే, ఆ మనోసౌకుమార్యాన్ని సూచించడానికి వాడే ఆరబిక్ పదం రహమత్. ఆ పదం కలిగించగల స్ఫురణ చాలా విస్తృతమైంది. అందులో ప్రేమ, సహానుభూతీ, సౌమనస్యమూ, ఔదార్యమూ ప్రతి ఒక్కటీ ఇమిడిపోతాయి.

అల్ రహమాన్, అల్ రహీమ్ అనే రెండు పదాలూ కూడా రహమత్ అనే ధాతువు నుంచే ఉత్పన్నమైనప్పటికీ, అవి రెండూ రెండు విభిన్నపార్శ్వాల్ని సూచిస్తాయి. అల్ రహమాన్ అంటే రహమత్ ఉన్నవాడని అర్థం. అల్ రహీమ్ అంటే కేవలం రహమత్ కలిగి ఉన్నవాడనే కాకుండా, ఆ రహమత్‌ని సదా ప్రకటిస్తూ ఉండేవాడనీ, అతణ్ణుంచే ఈ సృష్టిలోని ప్రతి ఒక్కటీ ప్రతి క్షణమూ భద్రతని పొందుతూ ఉంటున్నదనీ అర్థం.

ఈ రెండు పార్శ్వాల్నీ కలుపుకుని సర్వేశ్వరుడి రహమత్ లోని సమగ్రతను మనకు ఎరుకపరచడమే ఖురాను ఉద్దేశ్యం.

> నా రహమత్ ఈ ప్రపంచంలోని ప్రతి ఒక్కదాన్నీ తనలో పొదువుకునే ఉంది (ఖు. 7:156)

ఇంతకీ సర్వేశ్వరుడి ఈ రహమత్ అంటే ఏమిటి? ఖురాను చెప్పేదేమంటే, జీవితంలో ఎక్కడెక్కడ సౌందర్యం, పరిపూర్ణత కనిపిస్తున్నాయో అదంతా సర్వేశ్వరుడి దయాపరత్వమనే.

ఈ విశ్వంలో వర్ధిల్లుతున్న జీవితాన్ని మనమొకసారి పర్యావలోకించి చూస్తే, మనకి స్పష్టంగా కనబడే విశేషమేమిటంటే, ఈ విశ్వాన్ని ఒక గతి, ఒక వ్యవస్థ నిలబెడుతున్నాయని. 'నిజామీ రుబూబియత్'. ఈ ఋతం ద్వారానే మనం ప్రకృతికి పరిచయమవుతున్నాం. ఈ గతిని మనం ఏ మాత్రం పరిశీలించి చూసినా కూడా ఈ వ్యవస్థని మించిన మహా-సత్యమొకటి సర్వత్రా వ్యాపించి ఉన్నదనీ, పనిచేస్తున్నదనీ, దానిమీదనే ఈ వ్యవస్థ మొత్తం ఆధారపడి ఉన్నదనీ తెలుస్తుంది.

మరి ఈ వ్యవస్థ, ఈ 'రుబూబియత్' ప్రయోజనమేమిటి?ఈ విశ్వంలో జీవులకి పోషకంగా ఉండటం. కాని కేవలం ఆ పోషకత్వమే పరమప్రయోజనమని చెప్పడానికి లేదు. అంతకన్నా మించింది మరొకటి ఉంది. ప్రతి ఒక్క అస్తిత్వంలోనూ సౌందర్యోన్మీలనం చెయ్యడమే ఆ పోషకత్వ పరమప్రయోజనం. అట్లా చూసినట్టయితే, ఈ విశ్వసంచాలనం వెనక ఒక మహావ్యూహముందని అర్థమవుతుంది.

ఆ వ్యూహంలో, ఆ ప్రణాళికలో ఒక సౌందర్యముంది. దాని నడకలో ఒక సమతూకం ఉంది. దాని చర్యలకి కొన్ని ప్రత్యేక ధర్మాలున్నాయి. దాని దృక్కుల్లో సౌందర్యముంది. దాని స్వరంలో సంగీతముంది. దాని శ్వాసలో సుగంధముంది. తనపై నిర్మించబడ్డ దివ్యభవనం నాలుగుకాలాలపాటు నిలబడటానికి అది చేయనిదంటూ ఏమీ లేదు. జీవిత-గమనంలో మనకు కనిపించే 'రుబూబియత్' కన్నా ఈ ధర్మం గొప్పది. ఈ అంశాన్నే ఖురాను 'రహమత్' అనే పదం ద్వారా సూచిస్తున్నది. ఇందులో సర్వేశ్వరుడి సౌమనస్యం, దయాపరత్వం రెండూ కలిసే ఉన్నాయి.

విశ్వసంచాలనాన్ని నడిపిస్తున్న వ్యూహం దివ్యసౌమనస్యం తాలూకు ఫలితం: తనేది చేసినా స్థిరంగానూ, నెమ్మదిగానూ ఒక పరిపూర్ణత్వాన్ని సాధించుకునే ప్రజ్ఞనే లేకపోయుంటే ఈ విశ్వయంత్రాగానికి అస్తిత్వమే ఉండేది కాదు.

అయితే, ఈ ప్రజ్ఞ ఏమిటి? దీని ప్రయోజనమేమిటి? దీని లక్ష్యం విధ్వంసం కాదు, సృష్టించడం. అవ్యవస్థ కాదు, సమన్వయం. ఎందుకని? తన తెలివితేటలన్నీ ఉపయోగించి మరీ మనిషి ఈ ప్రశ్నకు సమాధానం వెతకడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు, కానీ ప్రయోజనం లేకపోయింది. కాని ఖురాను చెప్పే సమాధానమేమిటంటే, ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్న రహమత్ వల్లనే, స్వభావరీత్యా రహమత్ సమన్వయకారకం కావడం వల్లనే ఈ విశ్వాన్నీ, విశ్వంలో వ్యాపించి ఉన్న ప్రతి ఒక్కదాన్నీ నడిపించే వ్యూహమంటూ ఒకటి ఉన్నది. అది నిలబెట్టేదిగా ఉంటున్నది.

ఒక నిష్పత్తిలో జీవిత మూలద్రవ్యాల్ని సమకూర్చిపెట్టడంలోనే ఆ సంతులనం కనిపిస్తున్నది. ప్రతి అస్తిత్వంలోనూ ఆ సమతూకమే మనకు గోచరిస్తున్నది. ప్రతి ఒక్క వికాసంలోనూ, పరిపూర్ణత దిశగా అది సాధించే ప్రతి ప్రయాణంలోనూ ఆ సమతౌల్యమే కనిపిస్తున్నది. ఈ సంతులనధర్మాన్ని బట్టే ప్రతి ఒక్క సృజనాత్మక కార్యకలాపాన్నీ మనం గుర్తుపట్టగలుగుతున్నాం.

ఈ విశ్వవ్యాపారంలో ఈ సమతౌల్యమూ, సమన్వయమూ ఎందుకుండాలి? పంచ-భూతాలూ కలిసి ప్రపంచంగా ఏర్పడుతున్నప్పుడు అవి నిర్దిష్ట అనుపాతంలోనే ఎందుకు సమ్మిళితం కావాలి? పదార్థం తనలోని మూలధాతువుల నిష్పత్తిని ఉల్లంఘించకుండా ఎందుకు గౌరవించాలి? ఈ ప్రశ్నముందు మానవపరిజ్ఞానం నోరువెళ్ళబెడుతుంది. కాని ఖురాను చెప్పేదేమంటే, ఈ విశ్వ సృష్టికర్త స్వయంగా దయామయుడు కాబట్టి, రహమత్ కలిగినవాడు మాత్రమే కాక, ఆ దయాపరత్వాన్ని ప్రకటిస్తూనే ఉంటాడు కాబట్టి, అటువంటి అభివ్యక్తి తప్పనిసరిగా సుందరంగానూ, అనుగ్రహపూరితంగానూ, సమన్వయసుశోభితం గానూ ఉండకతప్పదు కాబట్టి అని.

ఒక నిర్దిష్ట ఆకృతినీ, సౌందర్యాన్నీ సంతరించుకోడానికే ప్రకృతి సదా పరితపిస్తూ ఉంటుందని తత్త్వశాస్త్రం చెప్తుంది. ఆకృతికి అనుపాతం కావాలి, సౌందర్యానికి సమతౌల్యం కావాలి. ఈ రెండూ కలిసి జీవితాన్ని నియమబద్ధంగా కొనసాగించే సూత్రాన్ని అల్లు-తుంటాయి. అలా అనుకుంటే, మళ్ళా ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఇట్లా నియమబద్ధంగానే ఎందుకుండాలి అని. ఋతమే ఎందుకుండాలి? అనృతం మటుకు ఎందుకుండకూడదు? ఈ ప్రశ్నలకి తత్త్వశాస్త్రం దగ్గర సమాధానాలు లేవు. ఒక ప్రసిద్ధ తత్త్వవేత్త మాటల్లో చెప్పాలంటే 'ఎందుకు, ఎక్కడ అన్న ప్రశ్నలు తలెత్తగానే తత్త్వశాస్త్రం మూగబోతుంది'. కాని ఖురాను దగ్గర ఇందుకు సమాధానముంది. ఈ నియమనిర్బంధం దివ్యానుగ్రహం వల్లనే అని అంటుంది ఖురాను.

తన సృష్టిలో అస్తిత్వాన్ని సంతరించుకునే ప్రతి ఒక్కటీ శివమయంగానూ, సౌందర్యోపేతంగానూ ఉండితీరాలని సర్వేశ్వరుడి నిర్హేతుక కృపావిలాసం భావిస్తూ ఉన్నది కాబట్టి అని.

ఖురాను ఇట్లా ప్రశ్నిస్తున్నది:

'చెప్పు, ఈ భూదిగంతాల్లో ఉన్నదంతా ఏమిటి?

చెప్పు, ఇదంతా సర్వేశ్వరుడిదేననీ. ఆయన తనమీద తనే ఒక దయాశాసనం విధించుకున్నాడనినీ.' (ఖు. 6:12)

'నా దయనే అన్నిటినీ తనలో పొదువుకుని ఉంది.' (ఖు. 7:156)

29-7-2017

రిక్తహస్తాలూ, స్వచ్ఛ హృదయమూ

తుమ్మపూడి వెళ్ళిన రోజునే సాయంకాలం తెనాలిలో కూడా ఒక సాహిత్యప్రసంగం చెయ్యమని జుగాష్ విలి అడిగాడు. నేను ఆంధ్రదేశం నలుమూలలా ప్రసంగాలు చేసాను గానీ, ఆంధ్రుల బౌద్ధికరాజధాని తెనాలిలోమాట్లాడే అవకాశం ఇంతకు ముందు కలగలేదు. నేను తెనాలికి ఎంత ఋణపడిఉన్నానని! చలం, కుటుంబరావు, జి.వి.కృష్ణరావు, త్రిపురనేని రామస్వామి, గోపీచందు, శారద, బైరాగిలతో పాటు, సంజీవదేవ్, సోమయ్యగారలదాకా తెనాలి కవిరచయితల స్ఫూర్తికి ఋణపడని తెలుగువాళ్ళు ఎవరుంటారు?

కాబట్టి తెనాలిలో మాట్లాడే అవకాశం నిజంగానే అదృష్టమనిపించింది. కవిరాజు త్రిపురనేని రామస్వామి మునిసిపలుపార్కులో 'భిన్నస్వరాలు' అనే సంస్థ ఏర్పాటు చేసిన సాహిత్య సభ. నా చిన్ననాడు నాకు యూరపు చరిత్ర, ఆధునిక ప్రపంచచరిత్ర బోధించిన నాగళ్ళ వెంకటరత్నం మాష్టారితో పాటు రావెల అరుణగారు కూడా ఆ సభకు హాజరు కావడం నాకెంతో సంతోషమిచ్చింది.

ఆ రోజు నన్ను జుగాష్ సూఫీ కవిత్వం గురించి మాట్లాడమన్నాడు. ఎప్పుడో ఒక సాయంకాలం హైదరాబాదులో అతడూ ఎమ్మెస్ సూర్యనారాయణా మా ఇంటికి వచ్చినప్పుడు నేను సూఫీ కవిత్వం గురించి వాళ్ళతో మాట్లాడేనట, అది తనకు చాలా నచ్చిందనీ, అందుకని, 'భిన్నస్వరాలు' వేదిక మీద సాహిత్య ప్రసంగాలు ఏర్పాటు చెయ్యడం అరుదైనప్పటికీ, నాతో సూఫీ కవిత్వం గురించి మాట్లాడించాలనే తాను అనుకున్నట్టు చెప్పాడు.

కాని నాకు 'భిన్నస్వరాలు' వేదిక మీద సూఫీ కవిత్వం గురించి మాట్లాడటం సముచితమైన విషయమే అనిపించింది. నేడు ప్రపంచమంతటా సమాచార ప్రసార సాధనాలు ఇస్లాంను ఒక టెర్రరిస్టుమతంగానూ, మధ్య ఆసియాదేశాల్ని, ప్రపంచశాంతికి

భంగం కలిగించే ప్రాంతాలుగానూ చూపిస్తున్న రోజుల్లో సూఫీ తత్త్వం వంటి శాంతిశీల భావజాలం గురించి మాట్లాడుకోవడం చాలా అత్యవసరమైన విషయమనే నేను నమ్ముతాను. అదీకాక గత ఏడెమినిదేళ్ళుగా ప్రతి రంజాను మాసంలోనూ ఏదో ఒక విధంగా సూఫీ కవిత్వం గురించి మాట్లాడే అవకాశం నాకు దొరుకుతూ ఉంది. నా చిన్నతనంలో మా పాఠశాలలో కొన్నేళ్ళ పాటు ప్రతి సాయంకాలం సురా అల్ ఫాతిహా ప్రార్థన చేసిన దాని ఫలితం కావచ్చును. అందుకని ఆ సాయంకాలం నేను సూఫీ కవిత్వం కన్నా కూడా ఎక్కువగా సూఫీతత్త్వం గురించే మాట్లాడేను.

సూఫీ తత్త్వం గురించి రబియా, రూమీ, సాది, హాఫిజు వంటి కవుల కవిత్వం కన్నా వేరే పరిచయగ్రంథాలేవీ అవసరం లేదు. మనిషిని అర్థం చేసుకోవడంకన్నా ముందు అతణ్ణి ప్రేమించడం ముఖ్యమనేదే సూఫీ సూత్రమనుకుంటే, ఆ ప్రేమతత్త్వానికి మూలాలు ఖురానులోనూ, ప్రవక్తమహమ్మదు మాటల్లోనూ, జీవిత ఉదాహరణలోనూ ఉన్నాయని నా మటుకు నాకు అల్-ఖుషాయరీ రాసిన The Principles of Sufism (ఇస్లామిక్ బుక్ ట్రస్టు, 2004) చదివినదాకా బోధపడలేదు. వాయవ్య ఇరాను ప్రాంతంలో జన్మించిన ఖుషాయరీ (986-107) ఆరబికులో రాసిన 'రిసాలా' అనే గ్రంథం నుంచి కొన్ని భాగాల్ని బి.ఆర్. వాన్ ష్లీగెలు ఇంగ్లీషులోకి మొదటిసారి అనువదించి నాలాంటి సూఫీ విద్యార్థులకి మహోపకారం చేసింది. ఆ పుస్తకమే చదవకపోతే ఇప్పటికీ చాలామందిలాగా నేను కూడా సూఫీతత్త్వం మూలాలు గ్రీకు సోఫిష్టుల్లోనో, భారతీయ యోగశాస్త్రంలోనో ఉన్నాయనే భ్రమిస్తూ ఉండేవాణ్ణి.

సూఫీ తత్త్వం గురించి ఖుషాయరీ వ్యక్తం చేసిన భావాలు వెయ్యేళ్ళ కిందటి భావాల్లాగా లేవు. ఇటీవలి కాలంలో సూఫీ తత్త్వం గురించి ప్రపంచానికి పరిచయం చెయ్యడానికి పూనుకున్న ఒక సమకాలిక భావుకుడు రాసిన మాటల్లాగా ఉన్నాయి. సూఫీల గురించి ఇద్రిష్ షా రాసిన పుస్తకం వల్ల తనకు సూఫీ మార్గం గురించి బాగా బోధపడిందని ఓషో ఒకచోట రాసాడు. నేను ఇద్రిష్ షాని కూడా చదివానుగాని, ఖుషాయరీ వల్లనే నాకు సూఫీధోరణి గురించి స్పష్టత ఏర్పడింది.

ముఖ్యంగా సూఫీ అనే పదం, (అరబికులో తసవ్వుఫ్), దేన్నుంచి వచ్చిందంటే, చాలామంది 'సుఫ్' అంటే ఊలు అనే పదం నుంచి వచ్చిందనీ, సూఫీ సాధువులు ముతక ఉన్నిగుడ్డలో, కంబళ్ళో కప్పుకునేవారనీ, అందువల్ల ఆ పేరు స్థిరపడిందనీ చెప్తారు. కాని, ఆ వ్యుత్పత్తి సరైనది కాదనీ, అసలు వస్త్రధారణ బట్టి గుర్తుపట్టే పరిస్థితిలో సూఫీ ఎన్నడూ ఉండడానికి ఇష్టపడడనీ ఖుషాయరీ అంటాడు.

అలాగే తక్కిన రకరకాల వ్యుత్పత్తులు- ప్రవక్త మహమ్మదు ఇంటిముందు బెంచి మీద కూచుండేవారనే అర్థంలో, 'సుఫా' అనే ధాతురూపం, అలాగే, నిర్మలమానవులు అనే అర్థంలో 'సఫా' అనే ధాతువు, శ్రేష్ఠమానవులనే అర్థంలో 'సఫ్ఫ్' అనే మూలపదం- ఇవేవీ కూడా సూఫీ అనే పదానికి ఆధారం కాదంటాడు.

అందుకు బదులు, సూఫీ అంటే ఎవరో విజ్ఞులూ, పెద్దలూ ఏమని అభిప్రాయపడ్డారో ఆ మాటలద్వారా సూఫీని అర్థం చేసుకోవాలని ప్రతిపాదిస్తాడు. ముహమ్మద్ అల్ జుర్రాయీ అనే ఆయన 'సూఫీ అంటే ప్రతిఒక్క సద్గుణాన్నీ స్వీకరించేవాడూ, ప్రతి ఒక్క దుర్గుణాన్నీ పక్కన పెట్టేసేవాడూ' అని నిర్వచించాడట. అల్ జునాయిదు దృష్టిలో 'సూఫీతత్త్వం అంటే దేవుడు నీకోసం నిన్ను నిర్మూలించి తనలో నిన్ను తిరిగి బతికించడం'. అల్ హుసేన్ దృష్టిలో 'సూఫీ ఏకాంతికుడు, అతణ్నెవరూ అంగీకరించరు, అతడెవరినీ అంగీకరించడు'. అబూ హంజా అల్ బాగ్దదీ చెప్పిన దాని ప్రకారం 'తాను సంపన్నుడైనతరువాత ఎవరు పేదరికాన్ని వరిస్తారో అతడు సూఫీ. కీర్తి రుచి చూసాక అపకీర్తిని పొందగలిగినవాడు. ప్రఖ్యాతి చెందిన తరువాత కూడా అనామకుడిగా జీవించగలిగినవాడు-అటువంటివాడే సూఫీ.' అమర్ ఉత్మాన్ అల్ మక్కి చెప్పినదాని ప్రకారం 'ఏ క్షణానికి తగ్గట్టుగా ఆ క్షణానికి నడుచుకోగలిగే సేవకుడు సూఫీ'. సమ్నూన్ అనే ఆయన చెప్పింది నాకు చాలా గొప్పగా అనిపించింది: 'సూఫీ దేన్నీ వశపరుచుకోవాలనుకోడు, దేనికీ వశపడడు.'

అల్ జునాయదు మరో మాట అన్నాడట: సూఫీ తత్త్వమంటే శాంతిలేని సమరమని. దీన్నే రువయ్యుం అనే ఆయన ఇంకోలా అన్నాడు: సూఫీలు ఎంతకాలమైతే ఇతరులతో రాజీపడరో అంతకాలమే స్వచ్ఛంగా ఉంటారు. తోటి మనుషులతో విభేదాలు అంతరించా-యంటే వాళ్ళ నిర్మలత్వం కూడా అంతరించినట్టే అని.

అబూ అలి అర్ రుద్బారీ సూఫీ తత్త్వాన్ని రెండు మాటల్లో క్లుప్తంగా చెప్పేసాడు: 'రిక్తహస్తాలూ, స్వచ్ఛ హృదయమూ' అని. అష్ షిబ్లి మాటల్లో 'సూఫీ తత్త్వమంటే మరి దేనిమీదా ధ్యాస లేకుండా భగవంతుడి పక్కన కూచోడమే.' ధున్నూన్ అల్ మిస్రీ అనే ఆయన మాటల్లో 'తక్కినవన్నీ వదిలి భగవంతుణ్ణి మాత్రమే కోరుకునేవారు, భగవంతుడు కూడా తక్కినవారందరినీ వదిలి ఎవరిని కోరుకుంటాడో వారే సూఫీలు' అని.

అన్నిటికన్నా గొప్ప మాట అబూ నసర్ సర్రాజ్ చెప్పాడు. 'నీ దృష్టిలో సూఫీ అంటే ఎవరనుకుంటున్నావు' అని అడిగితే, 'ఎవరిని భూమి మొయ్యదో, ఎవరికి ఆకాశం నీడ నివ్వదో అతడే' అన్నాడట.

నక్ష్ బందీ ఒక మాటన్నాడు: 'సూఫీ ఎవర్నీ మలినపరిచడు, పైగా తనను చేరవచ్చిన వాళ్ళని పరిశుద్ధపరుస్తాడు' అని. సూఫీతత్త్వం ఒక ప్రక్షాళనోద్యమం. దానికి పుస్తక పాండిత్యంతో పనిలేదు. సూఫీ వక్తకాడు, ప్రచారకుడు కాదు, బోధకుడు కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే అతడు అనుష్ఠానవేదాంతి. భూతభవిష్యత్తులో నిమిత్తం లేనివాడు. ఇక్కడే, ఈ క్షణమే– వాటిమీదనే అతడి దృష్టి. 'నీ ద్వారా నువ్వు భగవంతుణ్ణి చేరుకో అనడం' సూఫీ మొదట్లో చెప్పేమాట. తరువాత ఇంకొంచెం ముందుకు పోయాక, 'భగవంతుడిద్వారా భగవంతుణ్ణి చేరుకో' అంటాడు.

భగవంతుడికీ, సూఫీ మధ్య ఉండే అనుబంధానికి మూడు దశలున్నాయంటారు. మొదటి దశలో వాళ్ళిద్దరి మధ్యా అనుబంధం ఒక క్లయింటుకీ, అతడి లాయరుకీ మధ్య ఉండే సంబంధం. క్లయింటు తన లాయరుతో తన బాధలన్నీ ఏకరువు పెడతాడు. అన్నీ విప్పి చెప్పుకుంటాడు. తన మంచీ, చెడూ ఏదీ దాచకుండా చెప్పి తననెట్లాగైనా సమస్యనుంచి బయటపడెయ్యమని అడుగుతాడు. రెండవదశలో, వాళ్ళిద్దరి మధ్యా సంబంధం, ఒక తల్లికీ, ఇంకా మాటలురాని చిన్నిశిశువుకీ ఉండే అనుబంధం లాంటిది. ఆ చిన్నిపాప తల్లికేమీ చెప్పుకోలేదు. సైగలు కూడా చెయ్యలేదు. ఆ శిశువుకి తెలిసిందల్లా ఏడవడమే. ఆ ఏడుపుని బట్టే ఆ తల్లి అంతా గ్రహించుకుంటుంది. పాలిస్తుంది, పడుకోబెడుతుంది, ఊరడిస్తుంది, జోలపాడుతుంది. కాని ఇది కూడా మధ్యస్థదశనే. భగవంతుడికి, సూఫీకీ మధ్య నిజంగా నెలకొనవలసిన అంతిమ సంబంధం ఒక రజకస్త్రీకీ, ఆమె చేతుల్లో ఉన్న మలినవస్త్రానికీ ఉండే సంబంధంలాగా ఉండాలి. ఆ మలినవస్త్రం మాట్లాడదు. కనీసం ఏడవను కూడా ఏడవదు. దానికి తెలిసిందల్లా ఆ రజకస్త్రీ హస్తాలకు తనను తాను మౌనంగా అప్పగించుకోవడమే. ఆ రజకహస్తాలు ఆ వస్త్రాన్ని బండకేసి బాదుతాయి, చుట్టచుట్టి పిండుతాయి, సాగదీసి ఎండవేస్తాయి. ఏం చేసినా సరే మౌనంగా తనను తాను ఆ చేతులకు అప్పగించుకోవడమే సూఫీ చేసేదంతా.

ఇటువంటి మనఃస్థితిలో, తమలోంచి తమను పూర్తిగా తొలగించుకుని భగవంతుణ్ణి మాత్రమే ప్రతిష్ఠించుకున్న దివ్య ఉన్మత్తతలోంచి చెప్పిన కవిత్వం కాబట్టే సూఫీ కవిత్వానికి ఆ శక్తి. ఒక రూమీ ఒక కబీరునీ, ఒక హాఫిజు ఒక మెహెర్ బాబానీ రూపొందించారంటే వారు 'భగవద్దివ్య గుణానువర్తన సదా ప్రాప్తైకచిత్తులు' గా ఉండటమే కారణం.

20-8-2014

వాల్డెను-1

నేనింతదాకా అమెరికా చూడలేదు. చూడాలన్న ఆసక్తి కూడా లేదు. కాని ఎప్పుడేనా అమెరికా వెళ్ళవలసి వస్తే కనీసం వారం రోజులేనా న్యూ ఇంగ్లాండులో సాహిత్యయాత్ర చెయ్యాలని ఉంది. పద్ధెనిమిదోశతాబ్ది చివరి రోజుల్లో అక్కడ అమెరికను స్వాతంత్ర్య పోరాటం జరిగింది. వారు ఏ విలువలకోసం, నమ్మకాల కోసం, ఆశయాలకోసం పోరాటం చేసారో వాటిని అన్వేషిస్తూ పందొమ్మిదో శతాబ్దిలో అమెరికను రినైజాన్సు సంభవించిన ప్రాంతం అది. వాల్ట్ విట్మను నుండి రాబర్ట్ ఫ్రాస్టు దాకా, ఎమర్సను నుండి ఎమిలీ డికిన్‌సనుదాకా అమెరికను ఆత్మని పట్టుకున్న రచయితలు, కవులు, భావుకులు వర్ధిల్లిన ప్రాంతం అది. ఆ భావుకులు రాజకీయ విముక్తి కోసం కాదు, మానసిక విముక్తి కోసం పోరాడేరు. ఇప్పటికీ అమెరికా అంటే నా దృష్టిలో ఆ పందొమ్మిదోశతాబ్ది రచయితలు సృష్టించిన సాహిత్యమే. ఆ తర్వాత పందొమ్మిదోశతాబ్ది మధ్యకాలం నుంచి ఇరవయ్యవ శతాబ్ది దాకా ఆఫ్రికను-అమెరికను రచయితలు, ప్రధానంగా దక్షిణాది రచయితలు ఆ వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారు.

అమెరికా అనగానే నాకు ముందు గుర్తొచ్చేది స్వాతంత్ర్యదేవతా విగ్రహం కాదు. వాల్డెను సరస్సు. ఒక్కొక్క దేశ స్వాతంత్ర్య సంగ్రామానికి ఒక్కొక్క ప్రతీక మిగిలిపోతుంది. ఫ్రెంచివిప్లవానికి గోడలు బద్దలు గొట్టిన బాస్టిలీ జైలు లాగా, భారతస్వాతంత్ర్య సంగ్రామానికి దండియాత్రలాగా అమెరికను విముక్తివిప్లవానికి బోస్టను టీపార్టీ ఒక గుర్తుగా మిగిలి పోయిందని మనకు తెలుసు. కానీ, ఒకసారి రాజకీయంగా స్వతంత్రమయ్యాక అమెరికా ఎటువంటి జీవనపథాన్ని ఎంచుకోవాలి? ఏమి కావాలని కోరుకోవాలి? ఒక అమెరికను పౌరుడు అభిలషించగదగ్గ జీవనశైలి ఏది? సరిగ్గా ఈ ప్రశ్నలకు సమాధానంగా వాల్డెను సరస్సు కనిపిస్తుంది.

హెన్రీ డేవిడు థోరో (1817-1862) ని ఒక ఋషి అని నా ముందు ఎంతో మంది అన్నారు. కాని ఆయన రచనలు చదువుతూ ఆ ఋషిత్వాన్ని ఎవరికి వారు గుర్తు పట్టడంలో గొప్ప సంతోషం ఉంది. ఒక మనిషి ఎలా జీవించాలని వైదిక ఋషులు, బౌద్ధశ్రమణులు, జెన్ సాధువులు, గ్రీకు స్టోయిక్కులు, తొలి క్రైస్తవులు భావించారో అటువంటి జీవితం జీవించాడు ఆయన. స్వతంత్రుడయిన మనిషి. రాజకీయంగా మాత్రమే కాదు, బౌద్ధికం–గానూ, మానసికంగానూ కూడా విముక్తుడు ఎలా ఉంటాడో థోరో జీవితం, రచనలు రెండూ చెప్తాయి.

ఆయన జీవితాదర్శాలేమిటో తనగురించి తాను రాసుకున్న దానికన్నా, ఆయన్ని స్మరిస్తూ ఎమర్సను రాసిన వ్యాసంలో మరింత స్పష్టంగా కనిపిస్తాయి. 'థోరో' (1862) అనే వ్యాసంలో ఎమర్సను ఇలా అంటున్నాడు:

> అతడు ప్రతి ఒక్క ఆచారాన్నీ తరచి తరచి చూసాడు. ఒక ఆదర్శవంతమైన పునాది దొరికితే దాన్ని బట్టి తన జీవితాచరణని కొనసాగించాలనుకున్నాడు. అతడు కరడుగట్టిన ప్రొటెస్టంటు. కాని అతడి జీవితమంతా త్యాగాలమయం. అంత త్యాగభరితమైన జీవితాలు మనం చూడగలిగినవి ఆట్టే లేవు. అతడు ఫలానాదంటూ ఏ వృత్తికీ కట్టుబడలేదు. పెళ్ళిచేసుకోలేదు. ఒంటరిగానే జీవించాడు. ఒక్కరోజు కూడా చర్చిలో అడుగుపెట్టలేదు. ఎన్నికల్లో ఓటు వెయ్యలేదు. ప్రభుత్వానికి పన్నుకట్టడానికి ఇష్టపడలేదు. నిరాకరించాడు కూడా. ఒక్కసారి కూడా మాంసాహారం ముట్టలేదు. మద్యం సేవించలేదు. పొగాకు ఉపయోగాలేమిటో తెలియదు అతడికి. ప్రకృతి సంచారకుడేగాని ఒక్కసారి కూడా తుపాకి పట్టలేదు, వలలు పన్నలేదు. అతడు తన భావధారలోనూ, ప్రకృతి ఆరాధనలోనూ మాత్రమే విద్యార్థిగా కొనసాగాడు. సంపదలు ఎలా కూడబెట్టుకోవాలో తెలియదు అతడికి. జీవితమంతా నిరుపేదగా జీవించాడు. అలాగని దీనంగా కాదు..అతడికి తాను పోరాడవలసిన ప్రలోభాలేవీ లేవు. ఏ ఆకలీ, ఏ మోహమూ అతణ్ణి బాధించలేదు. కులీనవిలాసాలు, ఇల్లు, ఆకర్షణీయమైన వస్త్రాలు, అలవాట్లు–వీటన్నిటినీ అతడు దూరంగా నెట్టేసాడు... 'వాళ్ళ భోజనం ఎంత ఖరీదైతే వాళ్ళకంత గర్వం. నా భోజనం ఎంత చౌకగా దొరికితే నాకంత గర్వం' అని చెప్పుకున్నాడు. ఒకసారి భోజనాల బల్ల దగ్గర 'నీకు ఇష్టమైన కూర ఏమిటి?' అనడిగితే 'చేతికి ఏది దగ్గరగా ఉంటే అది' అని జవాబిచ్చాడు.

థోరో ఎన్నడూ కాఫీగానీ, టీ గానీ, శీతలపానీయాలుగానీ, హాట్ డ్రింకులు గానీ ముట్టలేదు. ఎందుకని అడిగితే 'మంచినీళ్ళ రుచికన్నా మించింది లేదు' అని చెప్పేవాడు. అటువంటవాడు ఒక మంచినీటి సరస్సు ఆరాధకుడిగా మారడంలో ఆశ్చర్యమేముంది? మసాచుసెట్సులోని కంకార్డు దగ్గరుండే వాల్డెను సరస్సు దగ్గర అతడు రెండేళ్ళ పాటు ఒక్కడూ జీవించాడు. 1845-1847 మధ్యకాలంలోని ఆ అనుభవాలను, ఒక ఏడాది పాటు ఋతుపరిభ్రమణంలో ఆ సరస్సు అతడికి ఎలా గోచరించిందో, ఆ సరస్తీరంలో తానెట్లా జీవించాడో 1849 లో 'వాల్డెన్' పేరిట ఒక పుస్తకంగా వెలువరించాడు. మీ కోసం, ఆ రచనలోంచి కొన్ని పేరాలు ఇలా అందిస్తున్నాను:

1

ఏ ప్రాకృతిక ప్రదేశానికైనా అత్యంత శోభనిచ్చేది ఒక సరసు అని చెప్పవచ్చు. అది భూమి తాలూకు నేత్రం. దానిలోకి చూస్తూ ఏ సందర్శకుడేనా తన స్వభావప్రకృతి ఎంత లోతైనదో అనుభూతి చెందవచ్చు. ఆ సరస్తీరాన పెరిగే చెట్లు ఆ సరసుని అంటిపెట్టుకుని ఉండే కనురెప్పలు. వాటి చుట్టుపక్కల ఉండే అడవులూ, కొండలూ ఆ కనురెప్పల పైన పరుచుకున్న కనుబొమ్మలు.

2

సెప్టెంబరులోగాని, అక్టోబరులోగాని, అట్లాంటి ఏ రోజైనా వాల్డెను చక్కటి అడవి అద్దంలాగా కనిపిస్తుంది. అంతకన్నా స్వచ్ఛంగా, నిర్మలంగా, అదే సమయంలో అంతకన్నా విశాలంగా, ఒక సరసులాగా ఈ భూమ్మీద మరే ప్రదేశమూ అలరారుతుందని చెప్పలేం. ఆకాశగంగ. దానికొక కంచెతో పనిలేదు. రాజ్యాలూ, జాతులూ పుడతాయి, నిష్క్రమిస్తాయి. కాని ఆ సరసు చెక్కుచెదరదు. దాని మిలమిల ఎన్నటికీ తరిగిపోదు, అరిగిపోదు. ప్రకృతి ఎప్పటికప్పుడు ఆ అందానికి నగిషీ పెడుతూనే ఉంటుంది. ఏ దుమ్ము, ఏ ధూళి, ఏ సుడిగాలి కూడా ఆ అకలంక సౌందర్యాన్ని కలతపరచలేదు. ఆ అద్దం మీద ఏ మసకపడ్డా, ఏ మరక పడ్డా సూర్యకాంతి ఇంతలోనే తుడిచేస్తుంది. దుమ్ము తుడిచే ఆ గుడ్డని కాంతితో నేసిన వస్త్రం అనవచ్చు. ఆ సరసుమీద వదిలిన ఏ ఊపిరిమసకనీ అది అక్కడ నిలవ నివ్వదు. పైగా తన కాంతిని మేఘసముదాయంగా మార్చి ఆ సరసుమీద ప్రవహింప చేస్తుంది, ఆ సరోవరవక్షస్థలం మీద ఆ మేఘసౌందర్యం మరింత ప్రభావంతంగా ప్రతిఫలిస్తుంది.

3

ఏ జలరాశిని చూసినా అది తన చుట్టూ ఉండే వాతావరణంలోని ఉత్సాహ ఉద్వేగాల్నే ప్రతిఫలిస్తుందనుకుంటాను. ఎప్పటికప్పుడు అది పైనుంచి తన జవసత్త్వాల్నీ, సంతోషసంచలనాల్నీ తనలోకి ఇంకించుకుంటూ ఉంటుంది. నింగికీ నేలకీ మధ్య ఆ జలరాశి ఒక మధ్యవర్తి. నేలమీద పచ్చికబయళ్ళూ, చెట్లకొమ్మలూ మాత్రమే గాలికి కదులుతాయి. కాని కొలనునీళ్ళు మొత్తం చిరుగాలికి సితారా సంగీతం వినిపిస్తాయి. మందపవనం ఆ సరసుని ఎక్కడ తాకిపోతుంటుందో ఆ మిలమిలని బట్టి నేను గుర్తుపట్ట-గలను. మనం ఆ సరోవర ఉపరితలంలోకి చూపులు సారించగలగడం గొప్ప విశేషమని-పిస్తుంది.అట్లా ఆ సరోవరతలాన్ని ఎంతసేపేనా పరికిస్తూ, ఎక్కడ ఆ జలరాశికన్నా సూక్ష్మశరీరమొకటి దాన్ని గిలిగింతలు పెట్టిపోతున్నదో చూడటంలో ఒక సంతోషముంది.

4

నువ్వున్న చోటు నుంచి చూసినా కూడా వాల్డెను ఒక సారి నీలంగానూ, మరొకసారి ఆకుపచ్చగానూ కనిపిస్తుంది. నేలకీ, నింగికీ మధ్య పరుచుకుని అది ఆ రెండింటి రంగుల్నీ పుణికి పుచ్చుకున్నట్టుండేది. కొండకొమ్ము మీంచి చూస్తే అది అకాశం రంగుని ప్రతిఫలి-స్తుండేది. అలాకాక దగ్గర్నుంచి చూస్తే పచ్చటిరంగులో, ఆ ఇసుక జాలు కనబడుతుండేది. లేతాకుపచ్చవన్నెతో దూరంగా జరిగే కొద్దీ చిక్కని ముదురాకుపచ్చ వర్ణం సంతరించు-కుండేది. కొన్ని కొన్ని వెలుగుల్లో కొండకొమ్ము మీంచి చూసినప్పుడు కూడా అది ఆకుపచ్చగానే కనిపించేది. చుట్టూ ఉండే పసరుదనం అట్లా ప్రతిబింబిస్తోందని కొందరు అన్నారు గాని, ఇసుక ఒడ్డు పక్కన కూడా అది ఆకుపచ్చగానే కనిపించేది. వసంతాగమన వేళ, ఆకులజొంపాలు ఇంకా పూర్తిగా తెరుచుకోకముందు అది నీలమూ, ఇసుక జాలు పసుపురంగూ మిశ్రితమై గోచరించేది... మరొకసారి అక్కడొక నిరుపమానమైన, వర్ణించడం సాధ్యంకాని ఒక నీలిమ తళుక్కుమనేది. బాగా పదునుపెట్టిన కత్తివాదరల్లోనూ లేదా బాగా నేతనేసిన పట్టువస్త్రాల్లోనూ కనిపించే నిగనిగ. ఆ నీలం ఆకాశం కన్నా మరింత శ్యామసుందరంగానూ, తరగలు ఎగిసిపడుతున్నప్పుడల్లా ఒకసారి ఆకుపచ్చగానూ మరొకసారి నీలంగానూ మార్చిమార్చి కనబడేది.

5

నా యవ్వనప్రాయంలో ఒక పడవ వేసుకుని నేనా సరసుమధ్యదాకా పోయి అప్పుడు వెనక్కి వాలి ఆ వేసవి పూర్వాహ్ణాల్లో పగటికలలు కంటూ ఎన్నో గంటలకు గంటలు

గడిపేవాణ్ణి. ఆ మందపవనం ఆ పడవను ఎక్కడకు నెడితే అక్కడకు పోయేవాణ్ణి. నేనట్లా కలల్లో తేలిపోతూ ఉండగా, పడవ ఏ ఇసుకజాలునో తగులుకోగానో కళ్ళు తెరిచి చూసే వాణ్ణి. నన్ను విధి ఏ కొత్త తీరాలకు నెట్టిందా అని పరికించేవాణ్ణి. ఈ లోకంలో నేను చేపట్టగల అతి పెద్దపని, అత్యంత ఆకర్షణీయమైన పని అట్లా సోమరిగా గడపడమే అనిపించేది. ఏ రోజైనా అత్యంత విలువైన సమయం పూర్వాహ్ణమే అనుకుంటే, అట్లాంటి ఎన్నో పూర్వాహ్ణాలు నేనట్లా నాకోసం దొంగిలించుకున్నాను. అప్పట్లో నేను వేయి సువర్ణ పూర్వాహ్ణాల మేరకు సుసంపన్నుణ్ణి. ఆ వేసవి రోజుల్ని నేనెంతో దిలాసాగా కర్చుపెట్టేసాను. కాని నాకేమీ పశ్చాత్తాపం లేదు. వాటిని ఏదో ఒక కార్ఖానాలోనో, లేదా ఏదో ఒక పాఠశాల గదుల్లోనో గడపలేకపోయినందుకు నాకేమీ విచారం లేదు.

6

ఎంతసేపు ఏకాంతంలో గడిపితే అంత ఆరోగ్యానికి మంచిదనిపిస్తుంది నాకు. ఎంత మంచి స్నేహితులుగానీ, ఎక్కువసేపు ఎవరిసాంగత్యంలోనైనా గడపడం చాలా విసుగ్గానూ, అలసటపెట్టేదిగానూ అనిపిస్తుంది. ఒంటరిగా ఉండటమే నాకు ఇష్టం. ఏకాంతాన్ని మించిన సాన్నిహిత్యం నాకిప్పటిదాకా కనిపించలేదు. .. నా ఇంట్లో నాకు గొప్ప సాంగత్యం తోడుగా ఉంటుంది. మరీ ముఖ్యంగా పొద్దుటివేళ, ఎవరూ మన ఇంటి తలుపు తట్టనప్పుడు. నేను చెప్తున్నది అర్థం కావడానికి బహుశా మరికొంత వివరంగా చెప్పలేమో. ఊరికే గలగలనవ్వే ఆ చెరువూ, ఆ మాటకొస్తే వాల్డెను సరస్సూ ఎంత ఏకాంతాన్ని అనుభవిస్తున్నాయో నేనూ అంతే ఏకాంతాన్ని అనుభవిస్తాను. ఆ కొలనుకి స్నేహితులెవరున్నారు చెప్పండి? కాని మీరు పరికించి చూస్తే ఆ నీలిసరోవరం మీద తేలియాడుతూ నీలి దెయ్యాలు కాదు, నీలి అప్సరసలు కనిపిస్తారు. సూర్యుడు కూడా ఒక్కడే. అప్పుడప్పుడు మరీ మబ్బుపట్టినప్పుడు ఒకడు కాదు, ఇద్దరు కనిపిస్తా-రనుకోండి, కాని ఆ రెండో సూర్యుడు వట్టి భ్రమ అని మనకి తెలిసిపోతూంటుంది. దేవుడు కూడా ఒక్కడే. కాని దెయ్యమో? సైతాను ఎప్పటికీ ఒంటరిగా మనలేడు, అతడికి చాలా పెద్ద సమాజం కావాలి. ఇంకా చెప్పాలంటే అతడే ఒక సైన్యం. నా సంగతి వేరు. ఆ పచ్చికబయల్లో వికసించిన ఆ పసుపుపచ్చటి పువ్వు, ఆ గడ్డిపువ్వు, ఒక చిక్కుడాకు, గడ్డిదుబ్బు, జోరీగ, తేనెటీగ ఎంత ఒంటరివో నేనూ అంతే ఒంటరిని. నేను కూడా ఒక్కణ్ణే కాను. ఆ కొండవాగు, ఆ గాలికోడి, ఆ ధ్రువనక్షత్రం, ఒక మలయపవనం, ఒక వసంతవాన, తొలిమంచుసోన, కొత్త ఇంట్లో కొత్తగా గూడుకట్టుకున్న సాలీడు–ఇవి ఒంటరివైతే నేనూ ఒంటరినే.

7

నా జీవితాన్ని ప్రకృతితో సమానంగా సరళంగానూ, అంత నిష్కపటంగానూ రూపొందించుకోవడానికి ప్రతి ప్రత్యూషమూ ఒక ఉల్లాసమయ ఆహ్వానం. గ్రీకుల్లానే నేను కూడా ఉషోదేవతకి వీరారాధకుణ్ణి. రోజూ పొద్దున్నే లేచి ఆ సరసులో స్నానం చేస్తాను. అది నా ప్రభాతప్రార్థన. నా జీవితంలో నేను చేయగలిగిన మంచిపనుల్లో అదొకటి. ఒక చీనాచక్రవర్తి స్నానంతొట్టె మీద రాసి ఉండేదట: 'ప్రతి రోజూ మీ జీవితం మళ్ళా కొత్తగా మొదలుపెట్టండి, మళ్ళా, మళ్ళా, ఎప్పటికీ' అని. నేను ఆ మాటలు నమ్ముతాను. ఎందుకంటే ప్రభాతాలు మన పూర్వమహాయుగాల్ని, గడచిపోయిన కృతయుగాల్ని మనకోసం మళ్ళా పట్టుకొస్తాయి. పొద్దున్నే కిటికీలు తెరుచుకుని, తలుపులు బార్లా తెరిచి గుమ్మం దగ్గర కూచున్నప్పుడు, ఆ ఇంట్లో ఏదో ఒక దోమ కంటికి కనిపించ–కుండా గీపెడుతున్న చప్పుడు వింటున్నప్పుడు నాకది ఒక మహా యశోవైభవగానం లానే అనిపిస్తుంది. అదొక హెూమరీయ కావ్యగానం. దానికదే గాల్లో సంచలిస్తున్న ఒక ఇలియడు, ఒక ఒడెస్సీ. ఆ మర్మరధ్వనిలో దాని కోపతాపాలూ, సంచారసల్లాపాలూ సంపూర్ణంగా వినిపిస్తున్నవి. దానిలో ఏదో వైశ్వికమహత్యం నిండి ఉన్నది. దానికదే ఒక గంభీరప్రకటన. దాన్ని పక్కకు నెట్టేసేదాకా అది ఈ ప్రపంచ జవసత్వాల్ని ప్రకటిస్తూనే ఉంటుంది.

ఏ రోజుకైనా ప్రభాతమే దాని అత్యంత స్మరణీయసమయం. అది వైతాళిక వేళ. అది మనలో నిద్రమత్తు అణగిపోయేవేళ. తక్కిన రోజు పొడుగునా, రాత్రీ మనలో కునికిపాట్లు పడేదేదో ఆ సమయాన మాత్రం పూర్తిగా రెక్కలు విప్పుకుని ఉంటుంది. ఎవరో మన పక్కన నిలబడి లేవమని నసపెడుతుంటే లేవడం కాక, మన లోపల ఏదో కొత్త జాగృతి, కొత్త స్ఫూర్తి, కొత్త ఆశయోద్వేగంవల్ల లేవమో ఆ రోజు రోజనిపించుకోదు. ఫాక్టరీ గంటల గణగణవల్ల కాక, ఏదో దివ్యసంగీతం స్థిరంగా మోగుతూ మన చుట్టూ గాలంతా ఒక సుగంధం అల్లుకుని ఉండగా అంతదాకా మనం ఏ ఉన్నత జీవితానికి ఎడమై నిద్రిస్తూ ఉన్నామో ఆ జీవితం లోకి లేవడమే లేవడం. అప్పుడు చీకటి కూడా వెలుగులానే ఫలప్రదమవుతుంది.

తాను ఇంతదాకా మలినపర్చుకున్న, మసకపరుచుకున్న జీవితం కన్నా మరింత పవిత్రమైన, ఒక పూర్వ ఉషస్సుని ప్రతి రోజూ మనకోసం తిరిగి కొత్తగా వెంటబెట్టుకుని వస్తున్నదని ఏ మనిషి నమ్మలేడో అతడు మరింత అంధకారలోకాల్లోకి జారిపోతున్నట్టే లెక్క. మన ఇంద్రియజీవితం కొంతసేపు సద్దుమణిగాక, ప్రతి రోజూ మనిషి ఆత్మ,

ఇంకా చెప్పాలంటే అతడి దేహావయవాలు కొత్తగా ప్రాణంపోసుకునే వేళ అది. తనకోసం మరింత శుభప్రదమైన జీవితాన్ని ఆవిష్కరించుకోగలమని నమ్మే సమయం అది. మనం గుర్తుపెట్టుకోదగ్గవన్నీ ఆ ప్రత్యూషవేళ, ఆ ప్రభాతవాతావరణంలోనే ప్రాణం పోసు-కుంటాయి. 'అన్ని శుభసంకల్పాలూ ప్రాతఃకాలవేళనే మేలుకుంటాయి' అని వేదాలు ఘోషిస్తున్నాయి. కళలు, కవిత్వం మనుషుల కార్యాలన్నిటిలోనూ కలకాలం నిలిచేవన్నీ అప్పుడే పురుడు పోసుకుంటాయి. వీరులూ, కవులూ ఉషోదేవి సంతానం. వాళ్ళది సూర్యోదయసంగీతం. ఎవరి భావధార సూర్యసంచారంతో అడుగులు వెయ్యగలదో అతడికి రోజంతా ప్రభాతమే. అప్పుడు అతడికి గడియారాలతో పని లేదు. ఎవరి వైఖరి ఎలా ఉన్నా పర్వాలేదు. ప్రభాతం నేను జాగృతమయ్యేవేళ. అప్పుడు ఆ ఉదయం ఉదయించేది నాలోనే. నిద్రమత్తు విదిలించుకోవడమే నిజమైన నైతిక సంస్కరణ. ..

లక్షలాది మంది పొట్టకూటికోసం నిద్రలేస్తారు. ఆ లక్షమందిలో ఒక్కడు మాత్రమే ప్రతిభాశీల పరిశ్రమకోసం మేలుకుంటాడు. ఇక కవితాత్మక, దివ్యజీవనం కోసం మేలుకునే వాడు కోటికి ఒక్కడు కూడా ఉండడు. మేలుకుని ఉండటమంటే సజీవంగా ఉండటం. పూర్తి జాగృతమానవుణ్ణి నేనిప్పటిదాకా చూడనేలేదు. ..

మనం మనల్ని మెలకువగా ఎట్లా ఉంచుకోవాలో, ఎలా జాగృతపరుచుకోవాలో సాధన చేస్తూండాలి. ఏవో యాంత్రిక సాధనాలతో కాదు, ఎప్పుడు తెల్లవారుతుందా అనే ప్రగాఢమైన ఆకాంక్షతో, మనం మన నిద్రలో ఆ ప్రత్యూషాన్ని ఎక్కడ తప్పిపోతామో అన్న ఆతృతలో మనం కాలం గడపాలి. ..మన దైనందిన జీవితాన్ని శ్రేష్ఠంగా గడపడమే అన్నిటికన్నా గొప్ప కళ.

8

నేనక్కడికి వెళ్ళిన తొలి వేసవికాలంలో పుస్తకాలేమీ చదవలేదు. అందుకు బదులు చిక్కుడుపాదులకి గొప్పు తవ్వుకుంటూ గడిపాను. కాదు, చాలాసార్లు అంతకన్నా విలువైన-రీతిలో కాలం గడిపాను. చాలాసార్లు ఆ నిమిషాన్ని వదులుకుని మరే పనీ చెయ్యాలని-పించని సమయాలు చాలానే ఉన్నాయి. నా జీవితానికి వీలైనంత ఖాళీ జాగా వదిలి పెట్టుకోవడమంటే చాలా ఇష్టం నాకు. చాలా సార్లు వేసవి ఉదయాల్లో సరసుదగ్గర నా స్నానం పూర్తయ్యాక, అప్పుడప్పుడే ప్రభాతకాంతి పరుచుకుంటున్న గుమ్మం దగ్గర జారగిలి సూర్యోదయందాకా, ఆ తర్వాత మధ్యాహ్నం దాకా ఆ పైన్‌చెట్ల నీడన, హికరీ చెట్లనీడన, సుమాక్‌చెట్ల నీడన ఏదో చెప్పలేని పారవశ్యంలో నిరాఘాట ఏకాంతంలో నిశ్చలంగా

గడిపేసేవాణ్ణి. చుట్టూ పక్షులు పాడుతూనో, లేదా నిశ్శబ్దంగా ఇంట్లో ఈ మూలనుంచి ఆ మూలకి కలయతిరుగుతూనో ఉండేవి. సూర్యుడు ఎప్పటికో పడమటి గవాక్షంవైపు జరిగిపోయినప్పుడో లేదా దూరంగా ఏదో బాటసారి బండిచప్పుడు వినిపించినప్పుడో కాలం గడిచిపోయిందని నాకు హఠాత్తుగా గుర్తొచ్చేది. రాత్రివేళల్లో సస్యాలు పెరిగినట్టు ఆ ఋతువుల్లో నేను పెరిగాను. చేతుల్నిండా ఏదో ఒక పనితో గడిచినదానికన్నా ఆ కాలాలు ఎంతో విలువైనవి. అట్లా గడిచిన కాలం నా జీవితంలో తీసేయదగ్గ కాలం కాదు సరికదా, నేను పొందవలసిన దానికన్న అధికంగా పొందిన కాలం అని చెప్పవచ్చు. ప్రాచ్యదేశాల వాళ్ళు అన్ని పనులూ వదిలిపెట్టి ధ్యానం చెయ్యడం గురించి మాట్లాడతారే అదేమిటో అప్పుడు తెలిసొచ్చింది. చాలావరకూ కాలం ఎలా గడిచిపోయేదో నాకు తెలిసేది కాదు. నా పనిని తగ్గించడానికా అన్నట్టు కాలం గడిచేది. ఉదయం తెల్లవారి ఇంతలోనే సాయంకాలం అయిపోయేది. చెప్పుకోదగ్గదేదీ చేయకుండానే కాలం గడిచిపోయేది. పక్షుల్లాగా పాడుకుంటూ తిరగలేదన్నమాటేగానీ, నేను కూడా నా నిరంతరాయమైన భాగ్యాన్ని చూసుకుంటూ నాలోనేను ఒకటే మురిసిపోతుండేవాణ్ణి. నా గుమ్మం ముందు హికరీ చెట్టు మీద కూచుని పిచుక తనలో తాను పాడుకున్నట్టే నేను కూడా నా కులాయంలో కుదురుకుని ఏదో ఒకటి అస్పష్టంగా గొణుక్కునేవాణ్ణి లేదా ఆ పక్షికి ఎక్కడ వినబడు–తుందోనని నాలోనేనే గొంతులో కుక్కుకునేవాణ్ణి. ..నాతోటి నగరవాసుల దృష్టిలో ఇది పరమసోమరితనం, సందేహం లేదు. కాని పక్షుల దృష్టిలోంచీ, పువ్వుల ప్రమాణాల ప్రకారం చూస్తే నేనెందులోనూ కొరతపడ్డది లేదు.

17-5-2021

వాల్డెను-2

థోరో గురించీ, వాల్డెన్ గురించీ నా ఆలోచనలు పంచుకుంటూ న్యూ ఇంగ్లాండు రచయితలు అమెరికను సాంస్కృతిక పునరుజ్జీవనానికి కారణమయ్యారని రాసాను. అందుకు మిత్రుడు కన్నెగంటి రామారావు ప్రతిస్పందిస్తూ నిజానికి అమెరికా ఇరవయ్యవశతాబ్దిలోనే తనని తాను ఆవిష్కరించుకోగలిగిందనీ, న్యూ ఇంగ్లాండు రచయితలు ఇంగ్లాండు సాంస్కృతిక వారసత్వానికి ఎక్కువ సన్నిహితులుగా తమని తాము భావించుకున్నారనీ రాసాడు.

రామారావు నా కన్నా ఎక్కువ చదువుకున్నవాడు, చూసినవాడు. అమెరికా గురించి సాధికారికంగా మాట్లాడగలినవాడు. నేను అమెరికా గురించి తెలుసుకున్నది చాలా అరకొరగా, అది కూడా ఏవో కొన్ని పుస్తకాల సాయంతో మాత్రమే. కాని న్యూ ఇంగ్లాండు రచయితలు, ముఖ్యంగా ఎమర్సను, థోరోల గురించి తెలుసుకునే కొద్దీ సాహిత్యపరంగా, తాత్త్వికంగా అమెరికా ప్రపంచానికి ఇవ్వగలదేదో వారి రచనలను మించి ఇప్పటిదాకా ఆవిష్కారం కాలేదనే అనిపిస్తున్నది.

ఉదాహరణకి, ఇదిగో, నా దగ్గర Ralph Waldo Emerson: Selected Essays, Lectures and Poems (బాంటం క్లాసిక్సు, 2007) ఉన్నది. ఈ రచనల్ని సంకలనం చేసిన రాబర్టు.డి.రిచర్డ్సను అమెరికను చరిత్రకారుడు. ఎమర్సను, థోరో, విలియం జేమ్సుల పైన ఆయన వెలువరించిన జీవితచరిత్రలు ప్రసిద్ధిపొందాయి. ఆయన ఈ సంకలనానికి రాసిన ముందుమాటలో ఇలా రాస్తున్నాడు:

> అమెరికాకి ఇప్పటికే తన గొప్ప తత్త్వవేత్తల్ని ఎమర్సను, థోరోల రూపంలో సంపాదించుకుందని స్టాన్లీ కావెలు అన్నాడు, కాని వారిని ప్రధానస్రవంతిలో

అంతర్భాగం చెయ్యడం ఎలానో అమెరికాకి చాతకాలేదు. ఈ విషయమే జార్జి కాటెబు మరికొంత ఆశావహంగా వివరించాడు. ఈ అణ్వస్త్రాంతర యుగానికి మనం అందించగల గొప్ప రక్షణ తత్త్వశాస్త్రం ఎమర్సను, థోరో, వాల్ట్ విట్మనుల ప్రజాస్వామిక ఆదర్శవాదమే అన్నాడతడు. ఎందుకంటే వీరి ఆలోచనల్లో సమతావాదంతో పాటు జీవితం పట్ల అపారమైన గౌరవం కూడా కూడుకుని ఉంది.

పద్ధెనిమిదవ శతాబ్దపు చివరి సంవత్సరాల్లో అమెరికను స్వాతంత్ర్యకారులు ఒక సుప్రసిద్ధ స్వాతంత్ర్యప్రకటన చేసారు. నా చిన్ననాడు తాడికొండ హైస్కూల్లో మా వెంకట–రత్నం మాష్టారు ఆ స్వాతంత్ర్యప్రకటన మాకు చదివి వినిపిస్తూ ఎంత ఉద్వేగభరితులై పోయేవారో నాకు ఇప్పటికీ గుర్తుంది. అందులో ముఖ్యంగా ఈ వాక్యాలు:

> మనుషులంతా సమానంగా సృష్టించబడ్డారు. సృష్టికర్త వాళ్ళందరికీ జన్మసిద్ధం–గానే కొన్ని హక్కులు ప్రసాదించాడు. వాటినెవరూ వాళ్ళనించి లాక్కోలేరు. జీవించడం, స్వేచ్ఛగా జీవించడం, సంతోషంగా జీవించాలనుకోవడం అట్లాంటి కొన్ని హక్కులు. ఈ సత్యాలకి మరి ఎటువంటి నిరూపణా అవసరం లేదు. ..ఈ హక్కులు సాధించుకోవడం కోసమే మనుషులు ప్రభుత్వాల్ని ఏర్పరచుకున్నారు. అలా ప్రభుత్వాల్ని ఏర్పర్చుకున్న మనుషుల సమ్మతిలోంచే ప్రభుత్వాలకు అధికారం సిద్ధిస్తూ ఉంది. ఎప్పుడేనా ఏదేనా ప్రభుత్వం మనుషుల ఈ ప్రయోజనాలకి భంగం వాటిల్లేలాగా ప్రవర్తిస్తుంటే, ఆ ప్రభుత్వాల్ని మార్చడానికి గాని, కూలదొయ్యడానికి గాని ఆ ప్రజలకు పూర్తి హక్కు ఉంది. అట్లా ఆ ప్రభుత్వాన్ని కూలదోసాక తమకు మరింత భద్రత, మరింత సంతోషం కలిగించే సూత్రాలతో, నియమనిబంధనలతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే హక్కు వారికుంది. ..

1776 లో ఈ స్వాతంత్ర్య ప్రకటన రాసిన స్వాతంత్ర్యవీరుల ఇళ్ళల్లో ఆఫ్రికను నీగ్రోలు బానిసలుగా పనిచేస్తూండేవారు. మనుషులంతా సమానంగా స్వాతంత్ర్యానికి అర్హులని భావించిన ఆ స్వాతంత్ర్యవీరులకి తమ ఇళ్ళల్లో, పొలాల్లో, తోటల్లో, గనుల్లో పనిచేస్తున్న బానిసలు కూడా అందుకు అర్హులే అన్న విషయం గుర్తు రాలేదు.

కాని యాభై, అరవయ్యేళ్ళ తరువాత ఎమర్సను, థోరోలు తమ పూర్వపు స్వాతంత్ర్య వీరులు రాసుకున్న ఆ స్వాతంత్ర్యప్రకటనని పూర్తిగా నమ్మారు. ఆ నమ్మకం వాళ్ళని

రాజకీయస్వాతంత్ర్యపు పరిధి దాటి, నైతిక, మానసిక స్వాతంత్ర్యాల వైపు నడిపించింది. తన కాలం నాటి అమెరికా, బానిస వ్యాపారుల ప్రయోజనాల కోసం మెక్సికోతో యుద్ధం ప్రకటించినప్పుడు థోరో ఆ యుద్ధాన్ని వ్యతిరేకించడమే కాదు, ప్రభుత్వానికి పన్ను కట్టడానికి నిరాకరించాడు కూడా. అప్పుడాయన్ని ప్రభుత్వం అరెస్టు చేసి ఒక రాత్రి జైల్లో పెట్టింది. ఆ రాత్రి ఆ జైలుగోడల మధ్య థోరోకి తానొక్కడే పూర్తి స్వంతంత్రంగా ఉన్నాడనే భావన కలిగింది. తన సుప్రసిద్ధ ప్రసంగం Civil Disobedience (1848)లో అతడిట్లా రాస్తున్నాడు:

> ఆరేళ్ళపాటు నేను ఎన్నికల పన్ను కట్టలేదు. అందుకని ఒక రోజు నన్ను అరెస్టు చేసి ఒక రాత్రి జైల్లో పెట్టారు. ఆ రాత్రి రెండు మూడు అడుగుల వెడల్పుండే ఆ రాళ్ళ గోడల్నీ, చెక్కతోటీ, ఇనుముతోటీ తయారు చేసిన ఆ తలుపునీ, దీపాల కాంతికి అడ్డునిలుస్తున్న ఆ ఇనప ఊచల్నీ చూస్తూంటే ఆ చెరసాల ఎంత మూర్ఖమైనదో అని అనుకోకుండా ఉండలేకపోయాను. ఎందుకంటే అది నన్ను రక్తమాంసాలూ, ఒట్టి ఎముకలూ మాత్రమే ఉండే దేహంగా భావించి ఆ దేహాన్ని ఖైదు చేయగలని భావించింది. బహుశా నన్ను ఇంతకన్నా ప్రయోజనకరంగా వాడుకోలేనని భావించిన మీదటనే వాళ్ళు నన్నిట్లా బందీ చేసేరేమో అని కూడా అనుకున్నాను. నాకూ, నా తోటి పట్టణవాసులకీ మధ్య ఒక రాతిగోడ అడ్డుగా ఉందనుకుంటే, ఆ పట్టణవాసులు నాలాగా స్వేచ్ఛాభావనని అనుభూతిలోకి తెచ్చుకోవాలనుకుంటే ఇంతకన్నా పెద్ద గోడని దాటవలసి ఉంటుందని అనిపించింది. అది నిజానికి వాళ్ళెవరూ బద్దలు కొట్టలేని గోడ. ఆ రాత్రి నాకు ఒక్క క్షణం కూడా బంధించ-బడ్డానన్న భావన కలగలేదు. ఆ రాళ్ళూ, సున్నమూ పూర్తిగా నిరుపయోగ-మైనట్టే అనిపించింది. నిజానికి ఆ మొత్తం పట్టణవాసుల్లో పన్ను చెల్లించింది నేనొక్కణ్ణే అని కూడా అనుకున్నాను. ఆ జైలు సిబ్బందికి నన్ను ఎలా చూడాలో అర్థం కాక నాతో మొరటుగానే ప్రవర్తించారు. వాళ్ళు నాతో మాట్లాడిన ప్రతి మంచిమాటలోనూ, ప్రతి హెచ్చరికలోనూ కూడా పొరపడుతూనే ఉన్నారు. ఎందుకంటే నేను గోడకి అవతల ఉండాలని అనుకుంటున్నట్టుగా వాళ్ళు పొరబడ్డారు. వాళ్ళు ఎంతో జాగ్రత్తగా ఆ తలుపులు మూసినప్పటికీ నా భావాలకు తాళం వెయ్యలేకపోవడం చూసి నాకు నవ్వొచ్చింది. వాళ్ళు తలుపులు వేసి అటు తిరగ్గానే ఆ భావాలు నిరాఘాటంగా వాళ్ళని ఎట్లా వెన్నాడాయో వాళ్ళకి తెలీదు. ఆ భావాలు ఎంత ప్రమోదకరమైనవో కూడా

వాళ్ళకి తెలిసినట్టు లేదు. వాళ్ళు నా అంతరంగాన్ని సమీపించలేరు కాబట్టి నా శరీరాన్ని శిక్షించాలని నిర్ణయించుకున్నట్టున్నారు. ఇదెలా ఉందంటే నీకో పెద్దమనిషితో తగాదా ఉందనుకో, అతణ్ణేమీ చెయ్యలేవుకాబట్టి అతడి కుక్కమీద కోపం చూపించినట్టుంది. రాజ్యం నా కళ్ళకి చాలా మూర్ఖంగానూ, చాతకాని-దానిలానూ కనిపించింది. దానికి తన స్నేహితులెవరో తన శత్రువులెవరో తెలిసినట్టులేదనిపించింది. రాజ్యం పట్ల నాలో ఏ లేశమాత్రమైనా గౌరవం మిగిలి ఉంటే ఆ రాత్రి అది పూర్తిగా నశించిపోయింది. ఆ రాత్రి ఆ రాజ్యాన్నీ, ఆ ప్రభుత్వాన్నీ చూసి నాకు గొప్ప జాలి కలిగింది.

ఆయన ఇంకా ఇలా అంటున్నాడు:

ప్రభుత్వం తాలూకు అధికారం నేను దానికి విధేయంగా ఉండటానికి ఇష్టపడ్డా కూడా, అది నాకన్నా విజ్ఞులూ, సమర్థులూ నడుపుతున్నా, నడపకపోయినా కూడా, ప్రభుత్వాధికారం ఎప్పటికీ కళంకితమే. అది నిజంగా న్యాయబద్ధంగా ఉండాలంటే అది ఎవరిని పరిపాలిస్తున్నదో వారి పూర్తి సమ్మతికి అది నోచుకుని ఉండాలి. నేను ఏ మేరకు దానికి విధేయంగా ఉండటానికి ఇష్టపడతానో అంతకు మించి నా దేహం మీద గాని, వ్యక్తిత్వం మీద గాని, నా ఆస్తిపాస్తులమీద గాని దానికి అధికారం ఉండకూడదు. నిరపేక్ష నిరంకుశ రాజరికం నుంచి పరిమిత రాజరికానికీ, పరిమిత రాజరికం నుంచి ప్రజాస్వామ్యానికీ మనం చేసిన పురోగమనం నిజానికి వ్యక్తి పట్ల చూపించ-వలసిన గౌరవం దిశగా చేస్తున్న ప్రయాణమే. చివరికి చీనా తత్త్వవేత్త కూడా ఒక సామ్రాజ్యానికి ఆధారబిందువు వ్యక్తి అనే అన్నాడు. అది అతడి వివేకం. మనం చూస్తున్న మనకి తెలిసిన అర్థంలో ఈ ప్రజాస్వామ్యమే ప్రభుత్వపాలన తాలూకు పరిపూర్ణరూపమా? ఇంతకు మించిన పురోగతి మరేదీ లేదా? మనుషుల తాలూకు హక్కుల్ని గుర్తించడంలోనూ, కూడదీసుకోవడంలోనూ ఇంతకన్నా మరొక అడుగు ముందుకు వెయ్యలేమా? వ్యక్తినుంచే తన సమస్త అధికారమూ, రాజకీయశక్తీ సమకూరుతున్నాయని గ్రహించి రాజ్యం వ్యక్తిని తనకన్నా అత్యున్నత, స్వతంత్రశక్తిగా భావించనంతవరకూ నిజంగా ఏ రాజ్యమూ స్వతంత్రమని గాని, పూర్తిగా వికసించిందని గాని చెప్పలేము.నా వరకూ నాకు కనీసం రాజ్యమనేది వ్యక్తులందరి పట్లా న్యాయసమ్మతంగా ఉండాలనీ, వ్యక్తిని తన ఇరుగుపొరుగుగా గౌరవించాలనీ, ఇంకా వీలైతే

> ఎవరేనా కొద్ది మంది వ్యక్తులు ఇరుగుపొరుగు పట్లా, తోటిమనుషుల పట్లా తమ బాధ్యతలు నిర్వహిస్తూ తమ మానాన తాము బతకడానికి ఇష్టపడుతుంటే వాళ్ళ జోలికి పోకుండా వాళ్ళని మానాన వాళ్ళని బతకనివ్వాలని కూడా కోరుకుంటాను. ఏ రాజ్యమైతే ఈ విధంగా ఫలప్రదమవుతుందో, ఆ ఫలం కూడా ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా పండి తొడిమ విదుల్చు-కుంటుందో అటువంటి రాజ్యం అంతకన్నా మరింత పరిపూర్ణమైన, మరింత యశోవంతమైన రాజ్యానికి దారి తీస్తుంది. అయితే అటువంటి రాజ్యాన్ని కలల్లో తప్ప ఇంతదాకా కళ్ళారా చూడలేకపోయాను.

అటువంటి రాజ్యం గురించిన అన్వేషణలోనే అమెరికా ప్రపంచానికి ఇవ్వగల ఉపాదానం ఉంది. అందుకనే ఆ వ్యాసం చదివి ఒక టాల్‌స్టాయి, ఒక గాంధి, ఒక మార్టిన్ లూథర్ కింగ్ ప్రభావితులు కావడంలో ఆశ్చర్యం లేదు.

ఎమర్సను కోరుకున్నది ప్రధానంగా నైతికస్వాతంత్ర్యం. థోరో అంతకన్నా ఒక అడుగు ముందుకు వేసాడు. ముందస్తు ప్రణాళికలు ఏర్పరచుకుని దాని ప్రకారం జీవితాన్ని, సమాజాన్ని నడుపుకోవడంలో ఎంతో కొంత డంబం, హింస, ఆత్మవంచన తప్పనిసరిగా వచ్చిచేరతాయని ఆయన భావించాడు. అందుకని Life Without Principle (1863) అనే తన వ్యాసంలో ఇలా అంటున్నాడు:

> మనం మన ఇళ్ళకీ, కొట్టాలకీ పునాది గట్టిగా ఉండటం కోసం గ్రానైటు వాడతాం. ఇళ్ళ చుట్టూ రాతిగోడ కట్టుకుంటాం. కాని మనం మాత్రం సత్యమనే బ్రహ్మాండమైన శిల మీద నిలబడాలని మాత్రం అనుకోం. సత్యం అత్యంత ఆదిమశిల. మన ఇళ్ళ కిటికీలూ, తలుపులూ తుప్పుపట్టిపోయాయి. మన అంతరంగంలో మనం సంభావించగల అత్యంత నిర్మల, అత్యంత సూక్ష్మసత్యంతో సహజీవనం చెయ్యని మానవుడు ఏమి మానవుడు? నేను నా దగ్గరి మిత్రుల మీదా, సన్నిహితులమీదా తరచు చేసే ఆరోపణ ఇదే. జీవితం పట్ల ఉండవలసినంత గంభీరంగా వాళ్ళుండటంలేదనే. పరస్పర మర్యాదల్నీ, ప్రశంసల్నీ పక్కన పెట్టి, మనం జీవితం గురించి ఒకరికొకరం ఎంత నిజాయితీతో, ఎంత సత్యసంధతతో చెప్పుకుంటున్నాం? శిలలాగా స్థిరసంఘటనగా ఎందుకు మనలేకపోతున్నాం? నేననుకుంటాను, ఈ దోషం పరస్పరం. ఎందుకంటే ఒకరి పట్ల ఒకరం ఎలా ఉండాలో మనమెప్పుడూ నేర్చుకోనేలేదు.

ఇంకా ఇలా రాస్తున్నాడు:

> మనం రోజూ ఒకరితో ఒకరం మాటాడుకునే మాటలు చూడండి. ఎంత డొల్లగా ఉంటాయో. మన సంభాషణలకి ఒకరినొకరు ప్రభావితం చేసుకోగల శక్తిలేదు. మనదంతా పైపై వ్యవహారం మాత్రమే. ఆంతరంగికక్షేత్రంలోంచి మన జీవితం ఎప్పుడు వికసించదో, మన అత్యంత వ్యక్తిగత అనుభూతిని ప్రకటించదో, అప్పుడు మన సంభాషణ తప్పనిసరిగా గాసిప్పుగా మారి పోతుంది. తాను చదివిన వార్తాపత్రికలో విషయాలు మళ్ళీ మనకి చెప్పని వాడు, లేదా తన పొరుగువాడు చెప్పిన విషయాలే మళ్ళా మనదగ్గర ఏకరువు పెట్టనివాడు మనకి కనిపించడం చాలా అరుదు. మనకీ, మనల్ని కలిసే మనిషికీ తేడా అంటూ ఉంటే, ఇదొకటే: అతడు పొద్దున్నే న్యూసు పేపరు చూసాడు, లేదా వీధి చివర హోటలుకి వెళ్ళి టీ తాగాడు, మనమింకా ఆ పని చెయ్యలేదు, అంతే. మన ఆంతరంగిక జీవితం ఏ మేరకు మూసుకు పోతే ఆ మేరకు మనం పోస్టాఫీసుకు పరుగెడతాం. తనకి వచ్చిన ఉత్తరాల కట్టని చూసి మురిసిపోయే మనిషి గురించి నిశ్చయంగా చెప్పగల సంగతేమి-టంటే, అతడికీ అతడి లోపలి మనిషికీ మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు ఆగి-పోయాయనే.

1776 స్వాతంత్ర్య ప్రకటన సమానులూ, స్వతంత్రులూ అయిన మనుషుల్ని సంభావించింది. స్వతంత్రం కోరుకునేవారు ముందు మనుషులుగా జీవించడం నేర్చుకోవాలని ఎమర్సను అన్నాడు. మనుషుల సంగతి వదిలిపెట్టండి, అసలు ఇప్పటిదాకా ముందు ఒక మనిషి కూడా రూపొందలేదంటున్నాడు థోరో. తన ప్రసంగంలో ఇలా అంటున్నాడాయన:

> నీ ప్రభాతాలూ, సాయంసంధ్యలూ నీ కోసం కొత్త వార్తలు మోసుకొస్తున్నాయని నీకిప్పుడు తెలిసివస్తుంది. పొద్దున్నా, సాయంకాలం నువ్వు నడిచే నడక పొడుగునా ఎన్ని సంఘటనలు. ఇప్పుడు నువ్వు గమనిస్తున్నది యూరోపులో జరుగుతున్న విషయాలు కాదు, ఇక్కడ మసాచుసెట్సులో ఈ పొలాల్లో నీకెదురవుతున్న సంఘటనలే. నువ్వు సంచరిస్తున్న ఈ సూక్ష్మలోకం చాలా పలచన, అది వార్తాపత్రికలు ముద్రించే కాగితంకన్నా ఎంతో పలచన. ఆ సూక్ష్మ ప్రపంచంలో నువ్వు సంచరించగలిగితే ఎన్ని వార్తలు. కాని నువ్వు ఆ ప్రపంచం కన్నా ఒక అడుగు పైన తిరిగినా, ఒక అడుగు కింద నడిచినా

నీకు ఆ వార్తలు వినిపించవు. రోజూ పొద్దున్నే సూర్యుడు ఉదయించడం, సాయంకాలం అస్తమించడం, వాటిని నీ మనోప్రపంచంలోకి సమన్వయించు-కోవడం, మనల్ని నిజంగా ఆరోగ్యంగా ఉంచగలిగేవి ఇవే. ఇంక జాతులా? రాజ్యాలా? ఏమి జాతులు? హూణులు, తార్తార్లు, చీనావాళ్ళు-కీటకాల్లాగా ముసురుకున్నారు ఈ ప్రపంచమంతా. వాళ్ళ జీవితాల్ని మనమేదో విధంగా గుర్తుపెట్టుకోవడం కోసం ఇప్పుడు చరిత్రకారుడంటూ ఒకడు కొత్తగా బయల్దేరాడు. నేనకుంటాను, ఒక్క మనిషి దొరకడం దుర్లభమైపోయింది కాబట్టే, మనం అంతమంది అసంఖ్యాకమానవుల గురించి ఆలోచించవలసి వస్తున్నది.

అమెరికా స్వాతంత్ర్యోద్యమానికి కారణం taxation without representation అని మనకు తెలుసు. కాని ప్రాతినిధ్యం లేకుండా పన్నులు కట్టవలసి రావడాన్ని థోరో ఒక మెటఫరుగా చూసి ఇలా అంటున్నాడు:

> ఈ దేశం నిజంగా స్వతంత్రదేశమని మనం అనగలమా? అసూయాద్వేషాలనే శక్తులనుంచి మనం విముక్తులం కానంత కాలం జార్జి చక్రవర్తినుంచి విముక్తులమై ఏమి లాభం? మనం స్వతంత్రంగా మనలేనప్పుడు స్వతంత్రులుగా పుట్టడంలో అర్థమేముంది? నైతికస్వాతంత్ర్యం కోసం కాకపోతే రాజకీయస్వాతంత్ర్యానికి విలువ ఏమిటి? మనం రొమ్ము విరుచుకుని బిగ్గరగా ప్రకటించుకుంటున్న స్వాతంత్ర్యం మనం స్వతంత్రంగా ఉండటానికి అనువైన స్వాతంత్ర్యమా లేక బానిసలుగా బతకడానికి అనువైన స్వాతంత్ర్యమా? ఒక జాతిగా మనది కేవలం రాజకీయనాయకుల జాతి. మనమెంతసేపూ స్వాతంత్ర్యాన్ని ఎలా రక్షించుకోవాలని మాత్రమే మాట్లాడుతుంటాం. బహుశా మన పిల్లల పిల్లలు మాత్రమే ఏ మేరకో నిజంగా స్వతంత్రులుగా మనగలరేమో. మనం మనల్నించి ఏదో ఒక రాబట్టుకోవాలనే చూస్తుంటాం. కాని మనలోని విలువైన భాగానికి మాత్రం అక్కడ ప్రాతినిధ్యం ఉండదు. ప్రాతినిధ్యానికి నోచుకోకుండా పన్నులు కట్టవలసి రావడమంటే ఇదే.

కాబట్టి నిజమైన అమెరికాని చూడటానికి న్యూ ఇంగ్లాండు రచయితలు తిరిగిన దారుల్లోనే తిరగాలనిపిస్తున్నది నాకు.

24-5-2021

కిర్కెగార్డు అవునంటే సార్త్ర కాదంటాడు

మరోసారి సెకండుహాండు బుక్ స్టాల్లో మరొక అనర్ఘరత్నం. వాల్టర్ కాఫ్‌మన్ సంకలనం చేసిన Existentialism: From Dostoevsky to Sartre (ఎ మెరిడియన్ బుక్, 1989).

వాల్టర్ కాఫ్‌మన్ తత్త్వశాస్త్ర ఆచార్యుడిగా పనిచేసాడు. కవి, రచయిత, అనువాదకుడు. నీషే రచనలన్నిటినీ దాదాపుగా అనువదించాడు. వాటితో పాటు జర్మను కవిత్వాన్నీ, 'ఫౌస్టు'నీ కూడా అనువదించాడు. Tragedy and Philosophy అతడి మరొక సుప్రసిద్ధ రచన. యూరపియను ఆత్మని పట్టివ్వగల రచయితలు, కవులు, తత్త్వవేత్తలందరి మీదా సాధికారికంగా మాట్లాడగల సమర్థుడు.

ఈ పుస్తకం కూడా ఆ కోవలోకే వస్తుంది. ఇందులో డాస్టవిస్కీ, కిర్కెగార్డు, నీషే, రిల్కె, కాఫ్కా, ఒర్టెగా, జాస్పర్సు, హిడెగ్గరు, సార్త్రే, కామూల రచనలనుంచి ఏరి కూర్చిన భాగాలతో పాటు కాఫ్‌మన్ రాసిన సవివరమైన, విమర్శనాత్మకమైన ముందుమాట కూడా ఉంది.

పుస్తకం చదువుతున్నంతసేపూ ఒకటే అనిపిస్తూ ఉంది, ఈ రచన ముప్ఫైఏళ్ళ కింద నా చేతుల్లోకి వచ్చి ఉంటే ఎంతబాగుండేదని! 80 ల ప్రాంతంలో నేను డిగ్రీ మొదటి ఏడాదిలో ఉండగా, జార్జి కాట్లిన్ (1896-1979) రాసిన గాంధీజీ అడుగుజాడల్లో (In the Path of Mahatma Gandhi) అనే పుస్తకం చదివాను. తత్త్వశాస్త్రం, కళలు, సౌందర్యమీమాంసలో ఆ రచయితకున్న అభిరుచివల్లా, ప్రాక్పశ్చిమాల్ని హృదయపూర్వకంగా దగ్గరకు తీసుకోవాలన్న గాఢమైన కోరికవల్లా ఆ రచన నన్ను తీవ్రంగా కట్టిపడేసింది.

అయితే అందులో ఒకచోట, ఆ రచయిత, అస్తిత్వవాదం గురించి ప్రస్తావిస్తూ 'కిర్కెగార్డు అవునంటే సార్త్ర కాదంటాడు' అని రాసాడు. ఆ వాక్యం నన్ను తీవ్రంగా

వెంటాడింది. కిర్క్‌గార్డు, విచిత్రమైన పేరు. ఎవరతడు? అతడు దేన్ని అవునంటున్నాడు? సార్త్ర ఎవరు? అతడు దేన్ని కాదంటున్నాడు? గాంధీ గురించి తెలుసుకోవడానికి బయలుదేరిన జిజ్ఞాసికి వాళ్ళిద్దరూ ఎందుకు గుర్తొచ్చారు? వాళ్ళేం రాసారు? ఆ రచనలెక్కడ దొరుకుతాయి? ఎప్పటికి చదవగలుగుతాను?

ఆ వాక్యం నా జీవితాన్నే మార్చేసింది.

ఆ తర్వాత ఏమి జరిగిందో నా 'సత్యాన్వేషణ' (2003) కు రాసిన ముందుమాటలో వివరంగా రాసేను.

కిర్కుగార్డు, సార్త్రే అస్తిత్వవాద రచయితలని తెలిసిన తరువాత అస్తిత్వవాదం గురించి తెలుసుకోవాలన్న నా తృష్ణని తెలుగు రచయితలు తీర్చలేకపోయారు. పాశ్చాత్యచైతన్యాన్ని ఎంతో సాధికారికంగా తెలుగువాళ్ళకు పరిచయం చేసిన శ్రీశ్రీ కూడా ఇక్కడ తొట్రుపడి పోయాడు. 'ఝ్యా పాల్ సార్త్ర్ సౌండించిన ఎగ్జిస్టెన్షియాలిజం/ జనన మరణ నరక నాక సబ్ సూపర్ రియలిజం' అనే అర్థరహితమైన వాక్యం తప్ప మరేమీ రాయలేకపోయాడు. గోపీచంద్ 'తత్త్వవేత్తల్లో' గాని నండూరి రామ్మోహనరావుగారి 'విశ్వదర్శనం'లోగాని నాకు దొరకవలసిన స్పష్టత దొరకనే లేదు.

అట్లాంటి రోజుల్లో రాజమండ్రిలో ఆర్.ఎస్.సుదర్శనంగారు, నా మిత్రుడు కవులూరి గోపీచంద్ అస్తిత్వవాదం గురించి నాకు కొంత అర్థమయ్యేలా చెప్పారు. కాని అందరికన్నా విస్తృతంగానూ, లోతుగానూ కూడా అస్తిత్వవాదప్రశ్నల్ని నాకు బోధపరిచింది బైరాగి కవిత్వం.

20వ శతాబ్దంలో మనం పాశ్చాత్యప్రపంచం నుంచి దిగుమతి చేసుకున్న భావజాలంలో కొంత ఎక్కువతక్కువలున్నాయి. ఉదాహరణకి మనం మార్క్సిజాన్ని దిగుమతి చేసుకున్నాంగాని, అదే నిష్పత్తిలో మార్క్సుకి ముందూ వెనకా సంభవించిన ఆర్థిక విశ్లేషణని గానీ, సత్యమీమాంసనుగానీ, సామాజికచింతనను గానీ అధ్యయనం చెయ్యలేదు. మార్క్సు, ఎంగెల్సు ప్రతిపాదించింది డయలెక్టికలు మెటీరియలిజం. అది కేవలం ఐడియలిజం మీద మాత్రమే తిరుగుబాటు కాదు, పద్దెమినిది, పందొమ్మిది శతాబ్దాల యాంత్రిక భౌతికవాదం మీద కూడా అంతే తిరుగుబాటు. కాని మనం కేవలం మార్క్సు ఎంగెల్సులను మాత్రమే దిగుమతి చేసుకున్నందువల్ల మన దేశంలో మార్క్సిజం కూడా మరొక యాంత్రిక భౌతికవాదంగా మారిపోయింది.

హెగెలు, మార్క్సులు (ఒకరు ఐడియలిస్టు, మరొకరు మెటీరియలిస్టు) ప్రతిపాదించింది అంతిమంగా ఒక చారిత్రిక నిర్ణాయకవాదంగా పరిణమించిందనీ (Historical determinism), అందులో వ్యక్తికి చోటులేదనీ, మహాప్రమాణాల్తో ఆవిష్కృతమవుతున్న చారిత్రిక శక్తులముందు మానవుడొక అల్పజీవిగా నిలబడవలసి వస్తున్నదని గుర్తించి ఆ చారిత్రిక నిర్ణాయకవాదాన్ని ధిక్కరిస్తూ రష్యను రచయిత డాస్టవిస్కీ రాసిన నవలల్లోంచీ, డేనిషు చింతకుడు కిర్కుగార్డు రాసిన రచనల్లోంచీ రూపుదిద్దుకున్నదే అస్తిత్వవాద ధోరణి.

డాస్టవిస్కీ Notes from the Underground (1864) తో మొదలైన ఈ ధోరణిలో మూడు ముఖ్యలక్షణాలున్నాయి.

మొదటిది, ఇది అకడెమిక్ ఫిలాసఫీ కాదు, సోక్రటీసు సంభాషణల్లాగా జీవితంలోంచి తలెత్తిన ఒక జీవనవైఖరి.

రెండవది, ఇది హేతుప్రాధాన్యతని ప్రశ్నిస్తుంది. హేతువు (reason) ఒక్కటే జీవితానికి అర్థం సమకూర్చగలదని నమ్మలేదు. అసలు మనం జీవితానికి చెప్పుకునే అర్థాలన్నిటికన్నా ముందే మనకొక అస్తిత్వం ఉంది. (Existence precedes essence). ఆ అస్తిత్వం (హిడెగ్గరు దాన్ని being అన్నాడు, సార్త్రే దాన్ని existence అన్నాడు) మనకొక ప్రత్యేక మనస్థితిలో ఎరుకపడుతుంది. ఆలోచనకు విరుద్ధమైన ఈ మనస్థితిని వాళ్ళు angst అనే మాటతో సూచించారు. ఇంగ్లీషులో దీన్ని dread అనీ, fear అనీ అనువదించారుగానీ అది సరైన అనువాదం కాదు.(తెలుగులో ఒక ప్రసిద్ధ విమర్శకుడు దీన్ని విశ్వనాథ జీవునివేదనతో పోల్చే సాహసం చేసాడు!). ఒకప్పుడు అజంతా గురించి రాస్తూ నేను దీన్ని 'భీతి' అన్నాను. కాని ఆ పదం పట్ల కూడా నాకు సంతృప్తి లేదు.

మూడవది, ముఖ్యమైంది, ఈ dread లోంచి మన అస్తిత్వం మనకు, మనం ఎంచుకునే సంభావ్యతల రూపంలోనూ, తీసుకునే నిర్ణయాల రూపంలోనూ అవగతమవుతుంది. అందుకనే మనిషికి అన్నిటికన్నా కఠినమైన విషయం, ఎంచుకోవడం, నిర్ణయించుకోవడం.

దీన్ని అబ్రహాం తన కుమారుడు ఇసాకును బలివ్వడానికి పూనుకున్న సంఘటనతో కిర్కుగార్డు వివరిస్తాడు. దేవుడి ఆజ్ఞమేరకు అబ్రహాం తన కుమారుణ్ణి బలివ్వడానికి నిల్చున్నప్పుడు, ఆ క్షణం, అది అత్యంత వ్యక్తిగత క్షణం. తక్కిన ప్రపంచానికక్కడ చోటు లేదు, హేతువుకి స్థానం లేదు. ఒక మనిషి తనకై తను ఎంచుకోవలసిన మార్గం, తనకై తను తీసుకోవలసిన నిర్ణయం, అంతే.

తన పినతండ్రిమీద ప్రతీకారం తీర్చుకోవలసి వచ్చినప్పుడు హేమ్లెటూ, తన తాతనీ, గురువునీ, తమ్ముళ్ళనీ సంహరించవలసి వచ్చినప్పుడు అర్జునుడూ ఎదుర్కొన్నదీ ఇటువంటి సమస్యనే.

'కర్మ యొనర్చుడమెలాగు, ఈ బాధ్యత కఠినతరం' అంటాడు బైరాగి.

డాస్టవిస్కీనుంచి బైరాగిదాకా కూడా, మనకి చెప్తున్నది, కాఫ్‌మన్ వాక్యాల్లో చెప్పాలంటే–

> the self is essentially intangible and must be understood in terms of possibilities dread and decisions.. and my choice is made in fear and trembling.

26-10-2015

నువ్వింకా ప్రజలకి బాకీ పడి ఉన్నావు

ఖలీలు జిబ్రాను గురించి రాయవలసి వచ్చి మరోసారి ఆయన రచనలు చదువుదామని చూసాను. ఆయన రచనల సమగ్రసంకలనం నా దగ్గర ఉంది గాని, కొత్తగా మరేమన్నా పుస్తకాలు వచ్చాయా అని చూస్తే, బలరాం అగర్వాలు అనే ఆయన సంకలనం చేసిన Kahlil Jibran, The Prophet and His Prophetic, Philosophic and Spiritual Essays (2014) అనే పుస్తకం కనిపించింది. అందులో సంపాదకుడు 'ద ప్రాఫెట్' తో పాటు జిబ్రాను ఇతర రచనలనుంచి కూడా కొన్ని వాక్యాలు ఏరి పెట్టాడు. వాటిలో చాలా వాక్యాలు సూటిగానూ, ఎంతో వివేకంతోనూ నన్ను ఆకట్టుకున్నాయి. వాటిల్లోంచి, ఇవిగో, ఈ కొన్ని వాక్యాలు మీకు కూడా వినిపించాలనిపించింది.

1

ప్రజల్లో నువ్వు పెట్టుకునే నమ్మకానికీ, వాళ్ళ పట్ల నీకున్న సందేహాలకీ, నీ పట్ల నీకున్న నమ్మకానికీ, సందేహాలకీ చాలా దగ్గర సంబంధముంది.

2

విద్య మీలో విత్తనాలు చల్లదు, చల్లిన విత్తనాలు అంకురించేలా చేస్తుంది.

3

నరకభయమే నరకం. స్వర్గాన్ని కోరుకోవడమే స్వర్గం.

4

వాళ్ళంటారు, 'ఒక బానిస నిద్రపోతూ కనిపిస్తే అతణ్ణి లేపకు, ఏమో, బహుశా అతడు స్వాతంత్ర్యాన్ని కలగంటూ ఉండవచ్చు' అని. నేనంటాను: 'ఒక బానిస నిద్రపోతూ కనిపిస్తే అతణ్ణి తక్షణమే నిద్రలేపి అతడితో స్వాతంత్ర్యం గురించి సంభాషించండి' అని.

5

ఎవరి జీవితంలోనైనా కానుకలు పెరిగేకొద్దీ స్నేహితులు తగ్గిపోతారు.

6

భగవంతుడు సత్యసౌధానికి చాలా ద్వారాలు పెట్టాడు, విశ్వాసి ఏ తలుపు తట్టినా ప్రవేశం దొరకాలని.

7

ప్రచండ ఝుంఝూమారుతాలు వీచే ఒక పర్వతాగ్రం మీద కూచున్నట్టు ఊహించుకుంటాను. అట్లాంటి చోటు నిజంగా ఉందా? ఉంటే ఒకనాటికి అక్కడకి పోయి, ఆ పర్వతాగ్రాన నా హృదయాన్ని కవితలుగానూ, బొమ్మలుగానూ మార్చుకుంటాను.

8

పరిపాలించబడేవాళ్ళ ఆసక్తి ఎంతసేపూ పాలకులమీదనే.

9

జ్ఞానమంటే రెక్కలుండే జీవితం.

10

వైభవోపేతమైన మనిషి జీవితం ఊరేగింపులాగా సాగిపోయినప్పుడు బాటకిరుపక్కలా రేగే బంగారుధూళిలోంచే భాషలూ, మతాలూ, ప్రభుత్వాలూ రూపుదిద్దుకుంటాయి.

11

నిన్నటి నీ జమాఖర్చు ఒకసారి లెక్క చూసుకుంటే, నువ్వింకా ప్రజలకీ, జీవితానికీ బాకీ పడివున్నావనే అర్థమవుతుంది.

12

జీవితం మనకి ప్రసాదించిన అపురూపమైన కానుకలు సౌందర్యమూ, సత్యమూనూ. మొదటిది ప్రేమించే హృదయంలో కనిపిస్తే, రెండోది శ్రామికుడి హస్తంలో కనిపిస్తుంది.

13

సాహిత్యంలో నేనిష్టపడేవి మూడు: విప్లవశీలత, పరిపూర్ణత, నైరూప్యత. సాహిత్యంలో నేను ఏవగించుకునేవి మూడు: అనుకరణ, వక్రీకరణ, సంక్లిష్టత.

14

ప్రేమ అంటే? వణికిపోయే సంతోషం.

15

వాళ్ళంటారు, మనిషి తనని తాను అర్థం చేసుకుంటే ప్రజల్ని ప్రేమించగలుగుతాడని. నేనంటాను, అతడు ప్రజల్ని ప్రేమిస్తే, తన గురించి తాను ఎంతో కొంత తెలుసుకో-గలుగుతాడని.

16

న్యాయబద్ధంగా నడుచుకునేవాడు ప్రజలహృదయాల్ని గెలుస్తాడు. దయాపూర్వకంగా నడుచుకునేవాడు ఈశ్వరహృదయాన్నే గెలుచుకుంటాడు.

17

మనిషి పొలందున్నకపోతేనో, భవనాలకు పునాది వెయ్యకపోతేనో లేక వస్త్రాలు నెయ్యకపోతేనో దేశానికి అరిష్టం దాపురించదు. అతడు తన వృత్తిని రాజకీయంగా ఎప్పుడు మారుస్తాడో అప్పుడుమటుకే దేశానికి ఉపద్రవం సంభవిస్తుంది.

18

ఓహ్! నా ఆత్మని రంగుల్లో స్నానమాడనివ్వండి. నాకు సూర్యాస్తమయాన్ని మింగెయ్యాలని ఉంది, ఇంద్రచాపాన్ని తాగెయ్యాలని ఉంది.

19

ప్రోత్సహిస్తే తప్ప ఒక ఉదాత్త కార్యం చెయ్యనివాడు ప్రోత్సహిస్తే ఎప్పటికీ చెయ్యడు.

20

మనుషులు ప్లేగు వ్యాధిగురించి భయంతో వణికిపోతూ మాట్లాడతారు, కాని నెపోలియను గురించీ అలెగ్జాండరు గురించీ పారవశ్యంతో మాట్లాడతారు.

21

అలంకరించుకోవడంటే నువ్వు అనాకారిగా ఉన్నావని ఒప్పుకున్నట్టు.

22

మనం వాక్స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం కోరుకుంటాం, కాని మాట్లాడటానికీ, ప్రచురించడానికీ నిజంగా పనికొచ్చేదేదీ మన దగ్గర లేదు.

23

కన్నీళ్ళు పెట్టుకోలేని వివేకం నుంచి, మనసారా నవ్వుకోలేని తత్త్వశాస్త్రంనుంచి, శిశువు ముందు తలవంచలేని గర్వం నుంచి నన్ను బయటపడెయ్యి.

24

ఎవరి కవిత విన్నాక అతడి ఉత్తమకావ్యం ఇంకా రావలసిఉందనే భావన నీకు కలిగిస్తాడో అతడే నిజమైన కవి.

25

కవికీ పండితుడికీ మధ్య ఒక పచ్చికబయలు ఉంది. పండితుడు దాన్ని దాటాడా వివేకి అవుతాడు. కవి దాటాడా, ప్రవక్త అవుతాడు.

26-11-2017

మరో పూలప్రేమికుడు

అదేమి చిత్రమో గాని నా ముందొక నరకం ప్రత్యక్షమయినప్పుడల్లా ఒక కొత్త కవి కూడా ప్రత్యక్షమవుతుంటాడు, డాంటేని నరకం దాటించిన వర్జిలులాగా. పుట్టి బుద్ధెరిగిన తర్వాత ఇప్పటిదాకా నేను నరకం చూడని కాలం లేదు. చోటు మారి ఉండవచ్చు, గోడలు మారి ఉండవచ్చు, కాని అదే హింస, అదే రిరంస. కాని ప్రతి సారీ ఒక పూలతోట పరిచయమవుతూనే ఉంది. ఇన్నాళ్ళ తరువాత, ఇన్నేళ్ళ తరువాత, నడిచి వచ్చిన దారుల్ని వెనక్కి తిరిగి చూసుకుంటే, ఆ నరకాలేవీ గుర్తులేదు, ఆ పూలతావి తప్ప. ఆ హింస తాలూకు ఆనవాళ్ళేవీ మిగల్లేదు, అప్పుడు చదువుకున్న పద్యాలు తప్ప, అప్పుడు పరిచయమైన కవులు తప్ప. ఇదుగో, ఇప్పుడు నా చేతుల్లో మారిసు మాటర్లింకు రాసిన The Intelligence of Flowers (2005) ఉంది. మరికొంత కాలం గడిచేక, వెనక్కి తిరిగి ఈ రోజుల్ని తలుచుకుంటే, బహుశా నాకు గుర్తుండిపోయేవి, మేడమీద నిండుగా విరిసిన అపరాజితాలతా, ఈ పుస్తకమూ మాత్రమేనని నిశ్చయంగా చెప్పగలను.

మాటర్లింకు ఫ్రెంచి భాషలో సాహిత్యం సృష్టించిన బెల్జియం కవి. నాటకకర్త, యోగి, మిస్టిక్కు. నోబెలు పురస్కారం పొందినవాడు. కాని అతడు కూడా నరకం చూసాడు. డిప్రెషనులో కూరుకుపోయాడు. తన జీవితంలో అత్యంత పరీక్షాత్మకసమయంలో అతడీ పుస్తకం రాసాడు– పూల గురించి. అలాగని అతడు రాసింది కవిత్వం కాదు. బోటని. కాని ఏ వృక్షశాస్త్రజ్ఞుడికీ సాధ్యంకాని కవితాత్మతో రాసాడు. అలాగని వట్టి కవిత్వం రాయలేదు.

ఏళ్ళ తరబడి తన తోటలో గంటలతరబడి, రోజులతరబడి పూలమొక్కల మధ్య వాటి అత్యంత సూక్ష్మ స్పందనల్నీ, ప్రతిస్పందనల్నీ గమనిస్తూ రాసిన పుస్తకం అది. ఒక కిండరుగార్టను తరగతిగదిలో చిన్నారి పిల్లల మధ్య గడుపుతో వాళ్ళ సున్నితమైన స్పందనల్నే

గమనిస్తూ ఒక విద్యావేత్త తన అనుభవాలు పుస్తకంగా రాస్తే ఎలా ఉంటుంది? మాంటిస్సోరి Discovery of Child లాగా ఈ పుస్తకం ఒక discovery of flowers.

ఏదైనా పుస్తకం చదివితే అది చదువుతుండగానో, చదివినవెంటనో మనలో రేకెత్తే స్పందనల్ని వెంటనే రాసేసుకోవాలి. లేకపోతే పూలతావిలాగా అవి గాల్లో కలిసిపోతాయి. మాటర్లింకు పూల గురించి రాసింది చదివాక ఆ స్పందనలు నా రక్తంలో కలిసిపోయి–నట్టున్నాయి. ఏదో ఒకటీ రెండూ వాక్యాల్నీ, అక్కడా ఇక్కడా ఏరి మళ్ళా గుర్తుచేసుకుందా–మనుకుంటే, ఆ వాక్యాలు పుస్తకాల మధ్యలో పెట్టి ఎండిపోయిన పూలరేకల్లాగా ఉన్నాయి.

'ఏ మంచిపూవులన్ ప్రేమించినావొ నిను మోచె నిన్ను తల్లి కనకగర్భమున' అన్నాడు కవి. అలాంటి బంగారుతల్లులు ప్రతిదేశంలోనూ, ప్రతి భాషలోనూ ఉండటం మన అదృష్టం. మాటర్లింకు రాసిన ఈ పుస్తకాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన ఫిలిప్ మోస్లే అనే అతను సుదీర్ఘమైన ముందుమాట కూడా రాసాడు. అందులో వృక్షశాస్త్రానికీ, సాహిత్యానికీ మధ్య యుగాలుగా ఉన్న సాన్నిహిత్యం గురించి చాలా కొత్త విషయాలు సమగ్రంగా రాసుకొచ్చాడు. ప్రాచీనగ్రీకుల్లో మొక్కల మొదటి వర్గీకరణ చేపట్టిన థియోఫ్రాటసు, డయోస్కొరిడసులు మొదలుకుని ప్లేటో, వర్జిలు, లుక్రీషియసుల మీదుగా లిన్నేయసు, షోపెనుహెూవరులదాకా యూరపులో వృక్షశాస్త్రానికీ, కవిత్వానికీ మధ్య సరిహద్దులు చెరిగిపోయిన తావుల్ని అతడు గుర్తుపట్టాడు.

రస్సెలు అన్నాడట, వృక్షశాస్త్రజ్ఞులవల్లనే ఈ ప్రపంచాన్ని ఒక యంత్రంగా కాకుండా, ఒక జీవంగా పరిశీలించడం మొదలయ్యిందని. అటువంటి దర్శనం వల్లనే రొమాంటిసిజం సాధ్యమయ్యిందని. తిరిగి మళ్లా రొమాంటిసిజం జర్మను ప్రాకృతిక తత్త్వశాస్త్రాన్ని ప్రభావితం చేసింది. ప్రాణుల, జాతుల పరిణామాన్ని డార్విను అధ్యయనం చేసి సిద్ధాంతాలు రూపొందించడానికన్నా ముందే ఎమర్సను 'నేచర్' మీద తన ప్రసిద్ధ ప్రసంగం వెలువరించడంలో, అందుకే, ఆశ్చర్యం లేదు.

మనకీ, యూరపియను సాహిత్యకారులకీ మధ్య ప్రధానమైన తేడా ఎక్కడంటే, వాళ్ళల్లో చాలామంది ఏదో ఒక శాస్త్రంలోనో, లేదా ఏదో ఒక మానవరంగంలోనో సుప్రసిద్ధమైన కృషి చేసినవాళ్ళు కూడా అయ్యుంటారు. ఉదాహరణకి రూసో లాంటి వాడు Letters on the Elements of Botany (1771-73) రాస్తే, గొథే లాంటి మహాసాహిత్యకారుడు The Metamorphosis of Plants (1795) లాంటి పుస్తకం

రాసాడు. కాలరిడ్జి లాంటి కవి Theory of Life (1848) రాస్తే, రస్కిను లాంటి కళావిమర్శకుడు Studies of Wayside Flowers (1874) లాంటి పుస్తకం రాసాడు.

ఆ అనువాదకుడు తన ముందుమాటలో పేర్కొన్న మరెందరో రచయితల్నీ, శాస్త్రజ్ఞుల్నీ వారు పరస్పరం ఒకరినొకరు ఎలా ప్రభావితం చేసుకున్నారో ఆ సంప్రదాయాన్నంతా మళ్ళా ఎత్తి రాయలేనుగానీ, యూరపియను కవులు మంచి పూవుల్ని ప్రేమించి మాత్రమే ఊరుకోలేదు, వాటి గురించి జీవితమంతా అధ్యయనం చేస్తూనే ఉన్నారన్నది నేను తెలుసుకున్న అంశం.

భారతదేశంలో కవుల్లో, రచయితల్లో, సాహిత్యకారుల్లో లేదా వృక్షశాస్త్రజ్ఞుల్లో ఎవరున్నారు అలాంటివాళ్ళు? అసలు మన రచయితలకి ఎంతమందికి ఎన్ని పూలపేర్లు తెలుసు? ఎంత వెదికి చూసినా ఇద్దరే కనిపిస్తారు: ఒకరు, వాల్మీకి, రెండోది, టాగోరు. వాళ్ళిద్దరికీ సమానంగా, కొన్నిసార్లు వారికన్నా మరింత సూక్ష్మ సంవేదనలతో సంగం కవులు కనిపిస్తారు. అంతే. నిజానికి మన నిఘంటుకారులకి కూడా పూల గురించి తెలీదు. ఒకప్పుడు నేను బషో యాత్రానుభవాల్ని తెలుగు చేయాలని కూచున్నప్పుడు ఆయన ప్రస్తావించే పూలకీ, పండ్లకీ దాదాపుగా ఒక్క తెలుగుపదం కూడా దొరకలేదు!

అలాంటిది, మాటర్లింకు లాంటి కవి, నాటకకర్త, ఋషితుల్యుడు తన జీవితకాలం పాటు తానెన్ని యుద్ధాలు చేస్తూ ఉన్నా, తనచుట్టూ ప్రపంచం ఎన్ని యుద్ధాల్లో కూరుకుపోతూ ఉన్నా, మొక్కల్నీ, పూలనీ తదేకంగా చూస్తూ ఉండటం మానలేదని తెలియడం గొప్ప ఆశ్చర్యంతో పాటు కొత్త ఉత్సాహాన్ని కూడా ప్రేరేపిస్తోంది.

పట్టుమని వందపేజీలు కూడా లేని ఈ పుస్తకంలో 'పూల ప్రజ్ఞానం' తో పాటు, పరిమళం మీద కూడా ఒక వ్యాసం ఉంది. రెండింటిలోనూ మాటర్లింకు రాసింది సైన్సు కాదు. కవిత్వం. కానీ పూలనీ, పూల సుగంధాన్నీ ఒక శాస్త్రజ్ఞుడిగా పరిశీలించాక పుట్టిన కవిత్వం అది. ఇంకా చెప్పాలంటే, అతడిలోని శాస్త్రజ్ఞుడివల్ల అతడిలోని కవి అదృశ్యం కాకపోగా, మరింత బలం పుంజుకున్నాడన్నమాట.

ఉదాహరణకి పరిమళం గురించి రాసిన వ్యాసంలో ఈ వాక్యాలు చూడండి:

> కొన్ని సాయంకాలాలు గాని లేదా ప్రభాతాలు గాని గుర్తొస్తే అన్నిటికన్నా ముందు గుర్తొచ్చేది ఆయావేళల్లో పూచే పూల సుగంధాలే. అవి గులాబీలుగానీ లేదా మల్లెలుగానీ, మరొకటిగానీ. ఆ పూలతావి సోకగానే భూమ్మీద మొత్తం వాతావరణమే ఏదో హటాత్పరిణామానికి లోనయినట్టుగా, మొత్తం భూగోళ–

> మంతా అంతులేని సంతోషనిలయంగా మారిపోయినట్టుగా అనిపిస్తుంది. అలాంటి వేళల్లో ఆ పూలతావి తొందరగా చెరిగిపోయేదిగానో లేదా అస్పష్టంగానో లేదా అనిర్దిష్టంగానో కాకుండా స్థిరంగా, విస్తారంగా, సంపూర్ణంగా, శాశ్వతంగా, ఉదారంగా, అత్యంత సహజంగా, మనల్నుంచి ఎవరూ ఎన్నటికీ విడదీయలేనిదిగా మనకు అనుభవానికొస్తుంది.

అసలు అన్నిటికన్నా ముందు మనం aerial beings మి అని చెప్తూ, ప్రాణవాయువే మనకి జీవితాన్నిస్తున్న శక్తికాబట్టి పరిమళాల ద్వారానే ముందు మనం మన చుట్టూ ఉన్న ప్రకృతిని పోల్చుకుంటాం అని చెప్తూ, ఇలా రాస్తున్నాడు:

> మనం వర్షాన్నీ, సాయంసంధ్యనో గుర్తుపడుతున్నట్టే పొగమంచునీ, మంచునీ, పొద్దుటి తుషారబిందువుల్ని, ప్రభాత ఫలాల్నీ, నక్షత్రాల మినుకునీ కూడా వాటి సుగంధంతో ఎందుకు గుర్తుపట్టకూడదు? మన చుట్టూ ఉన్న స్థలంలో ఆవరించిన ప్రతి ఒక్కదానికీ ఏదో ఒక పరిమళం ఉండేఉంటుంది. బహుశా మనం ఇప్పుడు దాన్ని గుర్తుపట్టలేకపోవచ్చు, కాని ఒక వెన్నెల కిరణం, నీటిగలగల, తేలిపోయే మబ్బుతునక, చిరునవ్వే ఆకాశం ప్రతి ఒక్కటీ పరిమళిస్తూనే ఉండి ఉంటుంది.

పూల గురించీ, పూలమొక్కల్లోని చైతన్యం గురించీ, వాటిలోని ప్రజ్ఞానం గురించీ రాసిన వాక్యాలు కూడా ఇలానే ఉంటాయి. వాటిల్లో పరిశీలనాశక్తి ఎంత ఉందో, భావుకత్వం కూడా అంతే ఉంది. ఒక స్వేచ్ఛాగానం అన్నమాట. ఈ వాక్యాలు చూడండి:

> ఏదో ఒక సాధారణ చైతన్యంతో కూడుకున్న తెలివైన జీవరాశి అక్కడక్కడా చెదురుమదురుగా పడి ఉన్నది కాదనీ, మన చుట్టూ విశ్వవ్యాప్తంగా ఒక ప్రజ్ఞానరసంలాంటిది ప్రవహిస్తూ ఉందనీ, దాన్ని తాకుతున్న ప్రతి ఒక్క ప్రాణిలోనూ ఆ ప్రజ్ఞానరసం చొచ్చుకుపోతూనే ఉంటుందనీ అనుకుంటాను. అయితే ఆ ప్రాణుల్లో కొన్ని ఆ చైతన్యప్రవాహాన్ని తమలో బాగా ప్రవహింప చేసుకోగలవు, కొన్ని అంతబాగా ప్రవహింపచేసుకోలేవు. అంతే తేడా. ఇప్పటిదాకా, ఈ భూమ్మీద, బహుశా మానవజాతి ఒక్కటే ఈ చైతన్యస్రవంతిని మరీ ఎక్కువ అడ్డగించుకోకుండా తనలోకి తీసుకోగలది అని కూడా అనుకుంటున్నాను. ఆ చైతన్యస్రవంతినే మతాలు దైవం అని పిలిచాయి. మనలోకి చొచ్చుకుపోయి ప్రసరించే ఈ సూక్ష్మవిద్యుచ్ఛక్తికి మన నరాలు

తీగలుగా పనిచేస్తే, మన బుద్ధి ఒక రాగిచుట్టలాగా ఆ శక్తిని మరింత ద్విగుణీ-కృతం చేసుకుంటూ ఉంటుంది. కాని మనలో ప్రసరించే ఈ దివ్యశక్తి నిజానికి మన చుట్టూ ఉన్న రాయీరప్పా, తారకలూ, పూలూ, పశుపక్ష్యాదులగుండా మనలోకి ప్రవహిస్తున్నదే అని మాత్రం చెప్పక తప్పదు.

మనలో ప్రవహిస్తున్న ఈ ప్రజ్ఞానస్రవంతి గురించి మనం మాటల్లో చెప్పగలుగు-తున్నాం గానీ, ఇటువంటి శక్తిస్ఫురణలో మాత్రం మొక్కలు మనకన్నా వేలయుగాల ముందున్నాయన్నది మాటర్లింకు పుస్తకసారాంశం. ఈ వాక్యాలు చూడండి.

ప్రతి పువ్వుకీ తనదైన ఒక ఊహ, ఒక వ్యవస్థ, తన ఉపయోగంలో పెట్టుకోగల సముపార్జిత అనుభవం ఉన్నాయని ఎన్నో ఉదాహరణలు చెప్పవచ్చు. వాటి చిన్న చిన్న ఆవిష్కరణల్నీ, అవి అనుసరించే రకరకాల పద్ధతుల్నీ దగ్గరగా చూసినప్పుడు మనకి మానవుడు తన ఆధీనంలో ఉన్న వనరుల్తో ఎటువంటి యాంత్రికప్రతిభను కనపరుస్తున్నాడో ప్రదర్శించే మహాపారిశ్రామిక ప్రదర్శనలు గుర్తొస్తాయి. కాని మన యాంత్రికప్రతిభ నిన్నమొన్నటిది. పూలల్లో కనవచ్చే యాంత్రికశక్తి వేల ఏళ్ళుగా వర్ధిల్లుతూ వస్తున్నది. పూలు ఈ భూమ్మీద తొలిసారిగా తలెత్తినప్పుడు వాటికి నేర్చుకోడానికీ, అనుకరించడానికి ఎటువంటి నమూనాలూ లేవు. అవి ఏమి సాధించుకున్నా అదంతా తమలోంచి తాము పైకి తెచ్చుకున్నదే. మనమింకా గదలు తయారు చేసుకుంటున్నప్పుడు, బాణాలు సంధిస్తున్నప్పుడు, ముళ్ళగదలు విసుర్తున్నప్పుడు, ఇంకా మరీ ఇటీవలి కాలానికి వస్తే, రాట్నాలూ, కప్పీలూ, కొక్కేలూ, గొట్టాలూ కనిపెడుతూ ఉండగా, అంటే మరీ ఈ మధ్యనే మనం వడిసెల, గడియారం, నేతమగ్గం లాంటి గర్వించదగ్గ యంత్రాల్ని కనుక్కునేటప్పటికే, పూలు ఇటువంటి సూత్రాల్నే కొన్ని వేల సంవత్సరాలుగా అనుసరిస్తూ ఉన్నవని గమనించాలి. ఒక మరచుట్టు ఎలా పనిచేస్తుందో మనం కనుక్కుని మహా అయితే వందేళ్ళు అయి ఉండవచ్చు, కాని మేపులు చెట్టూ, నిమ్మచెట్టూ అదే సూత్రాన్ని వృక్షజాతి తలెత్తిన కాలానికే కనిపెట్టలేదా?

మొక్కల్లోని ఆ అద్భుతప్రజ్ఞానాన్ని ఆయన తాను స్వయంగా పరిశీలించిన అనేక ఉదాహరణల్తో వివరిస్తాడు. ఇంకా ఏమంటున్నాడో చూడండి:

మన చుట్టూ ఉన్న వాటిని దగ్గరగా పరిశీలించినమీదట, బహుశా మనం మాత్రమే ఏదీ కొత్తగా సృష్టించలేమని అర్థమవుతుంది. ఈ భూమ్మీద అడుగు పెట్టిన వాళ్ళల్లో చివరివాళ్ళుగా, మనకి మిగిలిందల్లా, ఇప్పటికే ఈ భూమ్మీద ఉన్న ప్రతిఒక్కదాన్నీ గమనించడం, మనమిక్కడ అడుగుపెట్టకముందే పరచి ఉన్న దారుల్ని చూసి చిన్నపిల్లల్లాగా ఆశ్చర్యపోవడం మాత్రమే.

చూడటం ఒక పార్శ్వం. మనం కూడా చూస్తాం. పూలు పూసిన మొక్కల్ని చూస్తాం, సంతోషిస్తాం. అది మరికొంత లోతుగా చూస్తే పరిశీలన అంటాం. కాని చూసినదాన్ని బట్టి చూడనిదాన్ని సంభావించడం ఊహాగానం. అది కవికి మాత్రమే సాధ్యమవుతుంది. ఈ వాక్యాలు చూడండి:

మొక్కల్ని సదా పోషించే అత్యంత ఆవశ్యకమైన భాగం వాటి వేర్లు. అవి నేలని విడిచిపెట్టకుండా అంటుకుపోయి ఉండే భాగం. మనల్ని విభ్రాంతపరిచే భౌతికసూత్రాల్లో మనం భరించలేనంత ప్రాకృతికసూత్రం ఏమై ఉండవచ్చు అని అడిగితే చెప్పడం కష్టమేమోగాని, మొక్కలకి మాత్రం కాదు. పుట్టినప్పటి నుంచి మరణించేదాకా తమని మరెక్కడికీ కదలనివ్వనది ఆ ప్రాకృతిక సూత్రమేనని వాటికి తెలుసు. మన శక్తిసామర్థ్యాల్ని అటూ ఇటూ తిరుగుతూ ఊరికే వృథాపుచ్చే మనకన్నా దేనికి మొదటి ప్రాధాన్యానివ్వాలో వాటికి బాగా తెలుసు. తన వేర్ల నీడల్లోంచి తలెత్తి నెమ్మదిగా పూలవెలుతురులో పైకి వికసించేదాకా ప్రతి మొక్కా ఒక దృశ్యకావ్యం. తన సమస్త అస్తిత్వాన్నీ అది ఒకే ఒక్క ప్రణాళికకి అనుగుణంగా నడుపుకుంటుంది. నేలలోంచి పైకి లేవడం, పాతాళ విధిభారం నుంచి బయటపడటం, తనమీద విధించిన ప్రాకృతిక నిశ్చలసూత్రాల పట్టునుంచి తప్పించుకోవడం, సంకుచితసీమావధిని బద్దలుగొట్టడం, రెక్కలు విప్పుకోవడం, వీలైనంతగా తన బంధాలనుంచి స్వేచ్ఛగా విప్పారడం, విధి ఒకవైపు తన స్థలాన్ని కుంచింపచేస్తూ ఉండగా, తాను వీలైనంతగా తన సామ్రాజ్యాన్ని విస్తరింపచేసుకోవడం, తన చుట్టూ ఉన్న జంతుజీవప్రపంచంలోకి అడుగుపెట్టడం- తమకి విధినిర్దేశించిన పరిమిత ప్రపంచం నుంచి తమకిచ్చిన జీవకాలంలో మొక్కలు ఇలా తమని తాము విస్తరింపచేసుకోవడం ఆశ్చర్యావహం కాదా? పాదార్థిక ప్రకృతి విధించే చలనసూత్రాల్ని ఇలా ధిక్కరించడం అద్భుతం కాదా? సాహసమంటే ఏమిటో, నిర్భీతి, అపారమైన సహనం, ఆధిపత్య ధిక్కారం అంటే ఎలా ఉండాలో

> మొక్కలు మనిషికి ఒక ఉదాహరణగా నిలబడుతున్నాయి. మనం మనమీద ఒరిగిపడుతున్న అనివార్య స్థితిగతులు–ఉదాహరణకి, బాధ, వృద్ధాప్యం, మృత్యువు–లాంటి వాటినుంచి మనల్ని మనం పైకిలేవనెత్తుకోడానికి, మన తోటలో వికసించిన అతిచిన్న పువ్వు చూపించే శక్తిలో, సహనంలో, సామర్థ్యంలో సగం చూపించగలిగినా కూడా, మన జీవితం ఇలా ఉండకుండా మరోలా ఉండితీరుతుంది.

ఇటువంటి వాక్యాలు చదివినప్పుడు ఒక కవి ఒక శాస్త్రజ్ఞుడు కూడా అయితే ఎంత సత్యసౌరభం వికసిస్తుందో తెలియవస్తుంది. ఒక శాస్త్రజ్ఞుడు కవి కూడా అయితే, బంగారానికి తావి అబ్బినట్టే కదా.

అయితే పూలని ఎంత ప్రస్తుతించినా, మాటర్లింకుకి, మనిషి స్థానం ఏమిటో కూడా తెలుసు. మనిషి బలం ఎక్కడుందో అతడు మర్చిపోడు. చూడండి ఏమంటున్నాడో:

> ప్రాణికోటిలోగానీ, ప్రకృతిలోగాని, మొత్తం ప్రతిభ అంతా జాతిలో ఉంటుంది, కాని విడివిడి ప్రాణుల్ని పరికించి చూస్తే అవి మొద్దుల్లానే కనిపిస్తాయి. ఒక్క మానవజాతిలో మాత్రమే రెండురకాల ప్రజ్ఞానాల యథార్థవికాసాన్ని చూడగలం. ఆ రెండు ప్రజ్ఞానాల మధ్యా సమతూకాన్ని నిశితంగా, క్రియా–శీలకంగా నిలుపుకోవడంలోనే మానవజాతి భవిష్యరహస్యం దాగి ఉంది.

అంటే పువ్వుల్లో, పక్షుల్లో, క్రిమికీటకాల్లో కనవచ్చే ప్రజ్ఞ విడివిడి ప్రాణుల ప్రజ్ఞ కాదు. అవి ఆయా జాతులు పరిణామక్రమంలో ఒక జాతిగా సాధించుకున్న ప్రజ్ఞ. అందుకే ఒక సాలీడు గూడు ఎంత బాగా అల్లినా, యుగాలుగా, గూడు మాత్రమే అల్లగలదు, మరొక పని చెయ్యలేదు అని అంటాడు టాగోరు. కాని ఒక్క మనిషికి మాత్రమే రెండు రకాల ప్రజ్ఞానాలు సాధ్యం. ఒకటి మానవజాతిగా యుగాలుగా సముపార్జించుకున్న అనుభవం, వివేకం. రెండోది ఒక విడి వ్యక్తిగా, ఒక బుద్ధిగా, ఒక హృదయంగా తనకై తాను చేయగల ఊహాగానం, రూపొందించగల సిద్ధాంతం, ఉదాహరణగా చూపించగల తన ప్రవర్తన. మానవాళికి సుందరభవిష్యత్తు సాధ్యపడాలంటే, జాతిగా, వ్యక్తులుగా–రెండురకాలుగానూ సాధ్యపడుతున్న ప్రజ్ఞానాల మధ్య ఎప్పటికప్పుడు సమతూకం సాధించుకుంటూ ఉండాలి అంటున్నాడు మాటర్లింకు.

27-6-2024

నీరసతథ్యాల్ని తిరస్కరించడం

పరీక్షించి నిగ్గుతేల్చని జీవితం జీవితమే కాదు అని సోక్రటీసు అన్న మాటలు సుప్రసిద్ధాలు. An unexamined life is not worth living అని ఇంగ్లిషు వాక్యం. కొందరు An unconsidered life అని కూడా అనువదించారు. ఎలా చూసినా స్థూలంగా ఒకటే అర్థం: లోతుగా వివేచించి, పరీక్షకు పెట్టుకుని, సారాంశమేమిటో తేల్చుకుని చూసుకుంటే తప్ప ఏ జీవితం కూడా నిజంగా జీవించినట్టు కాదు అని. దాన్నే philosophy అని కూడా అన్నాడు ప్లేటో.

మానవచరిత్రలో philosophy అనే పదం సోక్రటీసుతో, ప్లేటోతో పుట్టింది. దాని అర్థం సత్యాన్ని ప్రేమించడమని. వేరే దేశాల్లో, వేరే సంస్కృతుల్లో సత్యాన్వేషణలూ, దర్శనాలూ, జీవితదృక్పథాలూ ఉండి ఉండవచ్చు. కాని philosophy మాత్రం పూర్తిగా గ్రీకు పదం, గ్రీకు భావన, గ్రీకు అన్వేషణ.

పూర్వకాలపు గ్రీసులోనూ, రోములోనూ కూడా philosopher అంటే అర్థం ఒకటే. ఎవరేనా– తానెందుకు పుట్టాడు, తన జీవితానికి అర్థం ఏమిటి, తాను జీవిస్తున్న జీవితం సార్థకమేనా అని ప్రశ్నించుకుంటూ, తన మాటకీ, నడవడికకీ మధ్య ఎటువంటి తేడా లేకుండా జీవించడానికి ప్రయత్నిస్తే– వాళ్ళని మాత్రమే ఫిలాసఫర్లు అనేవారు. సా.శ 4వ శతాబ్దం తర్వాత యూరోపులో క్రైస్తవం రాజమతంగా మారిన తరువాత కూడా క్రైస్తవ సాధువులు నిరంతరం తమ ఆత్మపరీక్ష చేసుకుంటూ, ఆత్మావలోకనంలో గడుపుతూ ఉన్నట్లయితేనే వాళ్ళని ఫిలాసఫర్లుగా వ్యవహరించేవారు. కాని ఆధునికయుగం మొదలయ్యాక, ఈ అర్థం నుంచి ఫిలాసఫీ పక్కకు తప్పుకుంది. ఒక మనిషి వ్యక్తిగత జీవితంతో సంబంధంలేకుండా, అతడు తాను నమ్ముతున్న విలువలకి కట్టుబడి ఉన్నాడో లేదో పట్టించుకోనక్కర్లేకుండానే, అతడు తార్కికంగా సత్యాన్ని పరిశీలిస్తున్నట్లయితే, అతడిని

కూడా ఫిలాసఫరుగా భావించవచ్చు అనే ఆలోచన మొదలై, మన కాలానికి వచ్చేటప్పటికి ఫిలాసఫీ అంటే విశ్వవిద్యాలయాల్లో బోధించే ఒక కోర్సుగా మారిపోయింది.

ఆధునికయుగంలో ఫ్రెంచి తాత్త్వికుడు దేకార్తే ఈ కొత్త తరహాదృక్పథానికి దారి తీసినవాడు. ఆ తర్వాత రోజుల్లో కాంట్, హెగెలు, మార్క్సు, రస్సెలు, మూరు మొదలైనవారు తమ వివేచనాబలం వల్ల సత్యమీమాంసని సముద్రమంత విశాలం చేసేసారు. మనం వారి భావాల్ని, లేదా వారి ఆలోచనల్ని లేదా వారి తార్కిక విశ్లేషణల్ని చదువుతున్నప్పుడు వారి వారి వ్యక్తిగత జీవితాలకూ, ఆ దృక్పథాలకూ ఏమైనా పొంతన ఉందా లేదా అని చూసే పని పెట్టుకోం. వాళ్ళు చెప్తున్న విషయాలు తార్కికంగా నిశితపరీక్షకు నిలబడతాయా లేదా అని మాత్రమే చూస్తాం. అంటే ఆధునికతత్త్వశాస్త్రానికి వచ్చేటప్పటికి, పరీక్షకు నిలబడే జీవితాలకన్న, పరీక్షకు నిలబడి నిగ్గుతేలే సిద్ధాంతాలే తత్త్వశాస్త్రంగా చలామణీ అవుతూ వచ్చాయమన్నమాట.

కాని సోక్రటీసు మొదలుకుని ఇరవైవ శతాబ్దపు తాత్త్వికులైన గ్రాంస్కి, ఫుకో, లెవినాసుల దాకా కూడా, మనిషి తాను ప్రతిపాదిస్తున్న ఆలోచనలకీ, తాను జీవిస్తున్న జీవితానికీ మధ్య తేడా లేకుండా చూసుకోవాలన్న ఒక తపన మాత్రం దాదాపుగా ప్రతి తత్త్వవేత్త జీవితంలోనూ కనిపిస్తుంది. బహుశా ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఆ సంఘర్షణ ఒక సోక్రటీసు జీవితంలో కనిపించినంత నాటకీయంగా కనిపించకపోవచ్చుగాక, లేదా సోక్రటీసులాగా తాను నమ్మిన సత్యం కోసం స్థిరచిత్తంతో ప్రాణాలు త్యజించగల తత్త్వవేత్తలు ప్రతి యుగంలోనూ ఉండకపోయి ఉండవచ్చుగాక. కానీ, క్రైస్తవానికి సంబంధించి-నంతవరకూ క్రీస్తు ఎలా ఆదర్శమో, ఫిలాసఫీకి సంబంధించినంతవరకూ సోక్రటీసు అటువంటి ఆదర్శంగా ఉంటూనే వచ్చాడు.

ఐరోపా తత్త్వశాస్త్ర చరిత్రని తరచి చూసినప్పుడు దాదాపుగా ప్రతి ఒక్క తత్త్వవేత్తా సోక్రటీసులాగా జీవించాలని తపించినట్టే కనిపిస్తుంది. ప్లేటోతో సహా దాదాపుగా ప్రతి ఒక్కరూ ఆ ప్రయత్నంలో ఏ మేరకు నిలబడ్డారో తెలుసుకునే ఉద్దేశ్యంతో James Miller అనే ఆయన Examined Lives, From Socrates to Nietzsche (2012) అనే పుస్తకం రాసాడు.

ఇందులో అతడు యూరోపు, అమెరికాలకు చెందిన తాత్త్విక తారాసమూహం నుంచి పన్నెండుమంది తత్త్వవేత్తల్ని ఎంపిక చేసుకుని వారి జీవితాల్నీ, వారి రచనలనీ కూలంకషంగా చర్చించాడు. వారిలో ప్రాచీనకాలానికి చెందిన సోక్రటీసు, ప్లేటో, డయోజినిసు, అరిస్టాటిలు, సెనెకాలు మధ్యయుగాలకు చెందిన అగస్టెయిను, రినైజాన్సు

యుగానికి చెందిన మాంటేనులతో పాటు ఆధునిక యుగానికి చెందిన దేకార్తే, రూసో, కాంట్, ఎమర్సను, నీషేలు ఉన్నారు.

నేనెవరిని, నా జీవితానికి అర్థం ఏమిటి, ఈ జీవితం జీవించదగ్గదేనా, నా మాటకీ, నా ప్రవర్తనకీ మధ్య తేడా లేకుండా ఉండాలంటే ఏమి చెయ్యాలి? ఒకవేళ తేడా ఉంటే ఎందుకుంటోంది? పూర్తి త్రికరణశుద్ధితో జీవించడం అసలు మనిషికి సాధ్యమేనా? తన జీవితాన్ని తన భావిస్తున్న ఆదర్శాల ప్రకారం జీంచడానికి మనిషి ఏ మేరకు స్వతంత్రుడు? అసలు స్వేచ్ఛాసంకల్పం అనేది సాధ్యమేనా?– సోక్రటీసుతో మొదలై నీషే దాకా తాను ఎంచుకున్న పన్నెండు మంది తత్త్వవేత్తల్నీ ఈ ప్రశ్నలు ఎలా వేధించాయో, వారు వాటిని ఎలా ఎదుర్కొన్నారో, ఎలా ఎదుర్కోలేకపోయారో, ఆ ప్రయత్నంలో వాళ్ళ వాళ్ళ జీవితాల్లో సంభవించిన విషాదాలేమిటో మిల్లరు ఎంతో ప్రతిభావంతంగా ఆవిష్కరించాడు.

ఉదాహరణకి, తాను కోరుకుంటున్న ఆదర్శరాజ్యంలో తాత్త్విక–చక్రవర్తులే పాలకులుగా ఉంటారని ఆశించిన ప్లేటో నిజజీవితంలో సైరాక్యూసు పాలకుణ్ణి సంస్కరించ బోయి చావు తప్పి కన్నులొట్టబోయిన ఉదంతం మనల్ని నివ్వెరపరుస్తుంది. ఆధునిక–యుగానికి స్వేచ్ఛాప్రవక్తగా కొనియాడబడుతున్న రూసో, పిల్లలకి ఎటువంటి విద్య కావాలో ఏకంగా ఒక పుస్తకమే రాసిన రూసో, తనకి పుట్టిన పిల్లల పోషణ, పెంపకం బాధ్యతలు స్వీకరించకుండా వాళ్ళని ఒకరివెంట ఒకరిని అనాథశరణాలయానికి అప్పగిస్తూ వచ్చేడని చదివినప్పుడు నిర్ఘాంతపోతాం. దేవుడు మరణించాడనీ, దేవుడి స్థానంలో ఉన్నతమానవుడు ప్రభవించబోతున్నాడనీ ప్రవక్తలాగా ఎలుగెత్తిన నీషే తన జీవితంలో చివర పదకొండేళ్ళ పాటు మతిస్థిమితం కోల్పోయి జీవించాడని తెలుసుకోవడంలో చెప్పలేని నిర్వేదానికి లోనవకుండా ఉండలేం. ప్లేటో శిష్యుడిగా సమస్త మానవ విజ్ఞానాన్నీ ఔపోశన పట్టడానికి ప్రయత్నించిన అరిస్టాటిలు తన జీవితకాలంలో మేసిడోనియను విజేతలకు ఆశ్రితుడిగా, వారి దురాక్రమణలకు మద్దతుదారుగా బతికాడని తెలియడం మనకొక విద్యుదాఘాతం లాంటిది. అందుకనే అరిస్టాటిలుని అతడి సమకాలికులే కాదు, అతడు మరణించిన తర్వాత మరొక రెండువందల ఏళ్ళ దాకా కూడా ఎవరూ ఒక మనిషిగా లెక్కెయ్యలేదని చరిత్ర చెప్తున్న సాక్ష్యాల్ని మిల్లరు మనముందు ప్రవేశపెడుతున్నప్పుడు మనకెలా ప్రతిస్పందించాలో అర్థం కాదు.

పట్టపగలే ఒక లాంతరు చేతపట్టుకుని అంగడి వీథులన్నీ కలయతిరుగుతూ, ఎందుకిట్లా పగటిపూట దీపం పట్టుకు తిరుగుతున్నావని ప్రశ్నిస్తే, తాను అసలైన మనిషి కోసం వెతుక్కుంటున్నానని చెప్పిన ఒక తత్త్వవేత్త గురించి నీషే తన Thus Spake

Jaratushtra లో రాస్తాడు. ఆ తత్త్వవేత్త క్రీ.పూ. అయిదవ శతాబ్దానికి చెందిన Diogenes the Cynic. సమస్త మానవ విజ్ఞానశాస్త్రాలకీ పితామహుడిగా ఈనాడు గుర్తింపు పొందుతున్న అరిస్టాటిలుని అతడి సమకాలికులెవరూ గౌరవించలేదని తెలుసుకున్నాం. కాగా జీవితమంతా ఒక కుక్కలాగా కుక్కబతుకు బతికిన (Cynic అంటే అర్థం శునక సమానమైన అని) డయోజినిసుని అతడు ఏ పుస్తకాలూ రాయకపోయినా, ఏ తత్త్వశాస్త్రాన్నీ నిర్మించకపోయినా, ఏ సిద్ధాంతాన్నీ ప్రతిపాదించకపోయినా, అతడి సమకాలిక గ్రీకులు మాత్రమే కాక తర్వాత కాలంలో రోమన్లతో పాటు అరబ్బులు కూడా ఎంతో విలువైన వ్యక్తిగా, యోగిగా గౌరవించారని తెలుసుకోవడం మరొక ఆసక్తికరమైన సంగతి.

ఇలా ఈ పుస్తకంలోని పన్నెండుమంది తత్త్వవేత్తల గురించీ మనకు తెలియని ఎన్నో విషయాల్ని మిల్లరు సాధికారికంగా పరిచయం చేస్తాడు. అందుకుగాను ఆయన ఆ తత్త్వవేత్తల జీవితం నుంచీ, రచనలనుంచీ మాత్రమే కాక, సమకాలికుల రచనలనుంచి కూడా ఎంతో సమాచారాన్ని సహాయంగా తెచ్చుకుంటాడు.

ఇందులో ప్రతి ఒక్క తత్త్వవేత్త గురించీ మిల్లరు వివరిస్తున్నప్పుడు తిరిగి ఎత్తి రాసుకోదగ్గవీ, మీవంటి మిత్రుల్తో పంచుకోదగ్గవీ ఎన్నో వాక్యాలు అండరులైను చేసుకుంటో పోయేను. వాటన్నిటినీ మళ్ళా ఇక్కడ రాయలేను. కాని కొన్ని ముఖ్యమైన వాక్యాలు మాత్రం పంచుకోవాలనుకుంటున్నాను.

తన పుస్తకం మొదలుపెడుతూ, ఉపోద్ఘాతంగా రాసిన అధ్యాయంలో, మిల్లరు నీషే రాసిన ఒక వాక్యాన్ని ఉదాహరించాడు. ప్రాచీన ఐరోపీయ తత్త్వవేత్తల గురించి తెలుసుకోడానికి Diogenes Laertis అనే గ్రీకు చరిత్రకారుడు రాసిన Lives and Opinions of Eminent Philosophers అనే పుస్తకం ఒక ప్రామాణిక గ్రంథం. ఆ పుస్తకం గురించి రాస్తూ నీషే ఇలా అంటున్నాడు:

> నావరకూ డయోజినిసు లయర్టసు రచన చదవడమంటే చాలా ఇష్టం. తత్త్వశాస్త్రవిమర్శ అంటూ ఒకటి నిజంగా సాధ్యమనుకుంటే, దాని ద్వారా దేన్నైనా నిరూపించగలమనుకుంటే, అది చెయ్యవలసిన పని ఒక్కటే. ఏ తత్త్వవేత్త ఐనా తాను చెప్తున్నదానికి అనుగుణంగా జీవిస్తున్నాడా లేదా అన్నది చూడటమే. కాని మన విశ్వవిద్యాలయాల్లో మాత్రం ఆ విషయం ఎవరూ బోధించరు. అక్కడ నేర్పేదల్లా మాటల్ని మాటల్తో నిగ్గుతేల్చే విద్యమాత్రమే.

డయోజినిసు లయర్టసు తన పుస్తకంలో వివిధ ప్రాచీన గ్రీకుతత్త్వవేత్తల భావాల్ని వివరిస్తున్నప్పుడు వారి జీవితాలు ఏ మేరకు పరీక్షకు నిలబడ్డాయో చెప్తూ వచ్చాడు. అవన్నీ చాలావరకూ ఐతిహ్యాలూ, కల్పనలూ, పుక్కిటిపురాణాలే కావొచ్చుగాక. కాని, వాటి ఉద్దేశ్యం స్పష్టమే. తత్త్వవేత్తల భావాల నిగ్గుతేల్చవలసింది ఆ మాటల్లోని తార్కికత బట్టి కాదు, వాళ్ళు తమ తమ జీవితాల్లో ఏ మేరకు తమ నమ్మకాలకు నిలబడ్డారన్నదాన్ని బట్టి అన్నది.

ఇరవైవ శతాబ్దంలో ఫుకో లాంటి తత్త్వవేత్త డయోజినిసు మాటల్ని పట్టించుకోక పోవచ్చుగాని, నీషేని పక్కనపెట్టలేకపోయాడు. ఆధునికయుగంలో తత్త్వశాస్త్రానికి పట్టిన గ్రహణం ప్రధానంగా, philosophical life ని నిర్లక్ష్యం చేయడమేనని ఫుకో భావించాడు. అందుకు ఆయన రెండు కారణాలు చెప్పాడు. ఒకటి: మనిషి తన ఆదర్శాలకు అనుగుణంగా జీవించాలనే ఆదర్శాన్ని తత్త్వశాస్త్రం నుంచి మతం గుంజుకుపోవడం. రెండవది: సత్యాన్ని అన్వేషించడంలో తత్త్వశాస్త్రంకన్నా సైన్సు మరింత విశ్వసనీయమని ప్రజలు భావించడం.

కాని, మతమూ, సైన్సూ కూడా తత్త్వశాస్త్రానికి ప్రత్యామ్నాయాలు కాలేవని నమ్మినప్పుడు మాత్రమే తత్త్వవేత్తలు తమ జీవితాల్నీ, తమ చుట్టూ ఉన్న జీవితాల్నీ ప్రభావితం చెయ్యగలరని తత్త్వశాస్త్రచరిత్ర నిరూపిస్తూ ఉన్నది.

మతం మన కంటికి కనిపించే అస్తిత్వాన్ని నిరాకరిస్తుంది. సైన్సు ఈ అస్తిత్వానికి స్థిరత లేదని చెప్తుంది. కాని తత్త్వశాస్త్రం మాత్రమే నీషే చెప్పినట్టుగా to become what one is అనే అన్వేషణకు పూనుకుంటుందని మిల్లరు రాస్తున్నాడు. ఈ వాక్యాన్ని కొంత వివరించాలి. మామూలుగా మతం being గురించి మాట్లాడుతుంది. అంటే ఎన్నటికీ మారని, మార్పు వల్ల ఏ మాత్రం ప్రభావితం కాని ఒక శాశ్వతఅస్తిత్వం ఉందని చెప్తుంది. సైన్సు becoming గురించి మాట్లాడుతుంది. అంటే ఒక అంతిమసత్యం అంటూ ఏదీ లేదనీ, సృష్టిలో ప్రతి ఒక్కటి పరిణమిస్తూనే ఉన్నదనీ, ఏ పరిణామానికీ ఒక శాశ్వత పరమార్థాన్ని ఆపాదించలేమనీ చెప్తుంది. కానీ నీషే చెప్తున్నదేమిటంటే, తత్త్వశాస్త్రం మాత్రం మనిషి తానేదై ఉన్నాడో (what is) అది కావడానికే (to become) తపిస్తూంటుందని. పైకి విరోధాభాసగా కనిపించే ఈ వాక్యంలోనే తత్త్వశాస్త్ర సారాంశమంతా ఇమిడి ఉందని చెప్పవచ్చు.

ఒక మనిషి తాత్త్వికంగా సత్యాన్వేషణకు పూనుకోవడమంటే 'నీరసతథ్యాల్ని' తిరస్కరించడం. 'నిశ్చలనిశ్చితాల' ని పక్కకు నెట్టేయడం. కాబట్టే, సత్యాన్వేషణ అన్ని వేళలా సంతోషానికీ, మనశ్శాంతికీ దారితియ్యకపోగా, నిరంతర ఆత్మశోధనకీ, సంశయ–

గ్రస్తతకీ, ఆత్మవేదనకీ దారితియ్యడం ఆశ్చర్యం కాదు. అలాగని మనం సత్యాన్వేషణని ఆపలేం. పక్కనపెట్టేయలేం. 'నిత్య నిరుత్తరపు ప్రశ్న జ్ఞానం ఇచ్చిన దానం' అని తెలిసికూడా మన వివేచనని కట్టిపెట్టలేం.

ఎందుకంటే తత్త్వవేత్తలే లేకపోతే, ఎప్పటికప్పుడు మతమో, సైన్సో తాము చెప్తున్నవే అంతిమసత్యాలని ప్రజల్ని నమ్మించే ప్రమాదం ఉండనే ఉంటుంది. మరెందుకు కాక–పోయినా, నిశ్చయసత్యాలుగా ప్రతిపాదిస్తున్నవాటిని నిగ్గుతేల్చమని అడగటానికేనా తత్త్వశాస్త్రం తప్పనిసరి.

అయితే అటువంటి ప్రశ్నలు విశ్వవిద్యాలయాల్లో తార్కికంగా చేసే చర్చల రూపంలో కన్నా ఒక మనిషి తన మాటలకీ, చేతలకీ మధ్య ఉన్న దూరాన్ని చూసి భయపడి, తట్టుకోలేక, బహిరంగంగానో, రహస్యంగానో విలపించడంలోంచో, తనని తాను నిలదీసు–కోడంలోంచో లేదా చివరికి మతిస్థిమితం తప్పడంలోనో మానవాళికి కొత్త వెలుగు చూపిస్తాయి. అందుకనే ప్రాచీనకాలంలో ఒక సోక్రటీసు, ఒక మార్కసు అరీలియసు వంటివారు తమ జీవితాలే ఉదాహరణగా ప్రజలమీద చూపించిన ప్రభావం ఒక అరిస్టాటిలు లాంటి వాడు చూపలేకపోయాడు. అధునిక కాలంలో ఒక టాల్‌స్టాయి లాంటి రచయిత ప్రజల ఆలోచనావిధానాన్ని, జీవనశైలిని ప్రభావితం చెయ్యగలిగినట్టుగా, యూరోపులోనూ, ఇంగ్లాండులోనూ విశ్వవిద్యాలయాల్లో తత్త్వశాస్త్రం బోధించిన ప్రొఫెసర్లు చేయలేకపోయారు.

ఒక నీషే లాంటి వాడు ఒకరోజు బజారులో పోతున్నప్పుడు ఒక గుర్రబ్బండివాడు తన గుర్రాన్ని చితకబాదుతున్న దృశ్యం చూసి చలించిపోయి అమాంతం పోయి ఆ గుర్రాన్ని కావిలించుకున్నాడనీ, ఆ క్షణమే అతడికి మతితప్పిందనీ, ఆ తర్వాత తను మరణించేదాకా, పదకొండేళ్ళపాటు అతడికి మళ్ళా మతిస్థిమితం చిక్కలేదనీ తెలిసినప్పుడు అంతదాకా నీషే రాసిన ప్రతి ఒక్క వాక్యం సరికొత్త సార్థకతతో మనముందు ప్రత్యక్షం కావడం మొదలుపెడుతుంది. తత్వవేత్త అన్వేషణకు నిజమైన అర్థాన్ని సంతరించేది అతడి నిజాయితీ, అతడి నైతికతలు మాత్రమేనని మనం స్పష్టంగా చెప్పుకోవచ్చు.

ఈ పుస్తకం చదువుతున్నంతసేపూ నాకు చలంగారే గుర్తొస్తూ ఉన్నారు. ఒకప్పుడు చలంగారి సాహిత్యదృక్పథాన్ని అంచనా వేస్తూ, సుదర్శనంగారు, చలం రొమాంటిక్ గా జీవితం ప్రారంభించి దార్శనికుడిగా పరిణతి చెందాడు అని రాసారు. ఆ మాటలు అక్షర సత్యం. ఆధునిక తెలుగు సాహిత్యంలోనూ, తత్త్వశాస్త్రంలోనూ (తెలుగు తత్త్వశాస్త్రమంటూ ఒకటి ఉంటే) కూడా సత్యాన్వేషణకి చలాన్ని మించిన జీవితం మరొకటి కనబడదు. తన

ఆలోచనలకీ, తన జీవితానికీ మధ్య ఎడం తగ్గించుకోడానికి ఆయన చేసిన పోరాటం ఒక సోక్రటీసు, ఒక ఎమర్సను, ఒక నీషేల ప్రయాణానికి ఏ మాత్రం తీసిపోనిదే.

ఈనాడు మన జీవితాల్లోనూ, మన చుట్టూ ఉన్న జీవితాల్లోనూ కూడా conformity ఒక విలువగా మారిపోతున్నది. మతాచార్యులూ, మేధావులూ, రాజకీయ నాయకుల్తో పాటు చివరికి సినిమాతారలూ, అడ్వర్టైజుమెంట్లూ చెప్పేవే నిశ్చలనిశ్చితాలుగా, ప్రశ్నించ–వలసిన పనిలేని సత్యాలుగా చలామణి అయిపోతున్న కాలంలో ఉన్నాం మనమిప్పుడు. మనిషి వ్యక్తిగతజీవితానికీ, అతడు సమాజకేంద్రం మధ్యలో నిల్చొని మాట్లాడుతున్న విలువలకీ మధ్య పొంతన ఉండాలని ఆశించనవసరం లేదనే కాలం ఇది. ఏ బలమైన శక్తి ఎటు ఊగిస్తే అటు అత్యధికసంఖ్యాకులు తలూపడానికి సిద్ధంగా ఉన్న ఈ కాలంలో తన జీవితాన్ని బహిరంగంగా పరీక్షకు పెట్టుకోడానికి ఒక్క మనిషి ముందుకొచ్చినా కూడా అది చాలా పెద్ద విషయం నా దృష్టిలో. అప్పుడు మాత్రమే మనం నిజంగా చీకటి యుగంలోంచి వెలుగులోకి అడుగుపెట్టినట్టు చెప్పుకోగలుగుతాం.

7-6-2024

మన కాలపు మార్కసు అరీలియసు

నెల్సను మండేలా Long Walk to Freedom (1994) దాదాపుగా ఒక సమష్టి రచన. రాబిను ఐలండులో నిర్బంధంలో ఉన్నప్పుడు తన తోటి ఖైదీ, జాతీయోద్యమ సహచరుడూ అహ్మదు కత్రాడాతో కలిసి రూపొందించుకున్న ముసాయిదాని మండేలా 1990 ల్లో రిచర్డు స్టెంగాలుతో కలిసి మరింత సవరించాక, ఆయన మిత్రబృందం ఒక సంపాదక బృందంగా ఆ రచనని పరిష్కరించారు. ఇప్పుడు మనం చదువుతున్న పుస్తకం ఆత్మకథనే అయినప్పటికీ, ఆ కథనాన్ని ఒక బృందం ఎంతో నిర్విరామంగా, శ్రద్ధగా తుదిరూపానికి తీసుకువచ్చారని మరవలేం.

అయితే, ఆ పుస్తకానికి సీక్వెలుగా 'నెల్సను మండేలా సెంటర్ ఫర్ మెమొరీ అండ్ డైలాగ్' వారు వెలువరించిన Conversations with Myself (2011) మరింత సూటి రచన. ఇది మండేలా రాసిపెట్టుకున్న డైరీలు, ఉత్తరాలు, ప్రసంగాలనుంచి ఏరి కూర్చిన సంపుటి. వాటితో పాటు ఆయన రిచర్డు స్టెంగాలుతో చేసిన సంభాషణలు, దాదాపు యాభై గంటల నిడివి గల ఇంటర్వ్యూ నుంచి కూడా కొన్ని సంభాషణలు ఇందులో చేర్చారు. వీటితో పాటు ఆయన తన ఆత్మకథకు సీక్వెలుగా రాసిపెట్టుకున్న ఒక అముద్రిత ప్రతినుంచి కూడా చాలా భాగాలు చేర్చారు. వీటన్నిటివల్లా వీటిలో కనబడే మండేలా నేరుగా మనతో మాట్లాడే రచయితగా ఈ పుస్తకంలో ప్రత్యక్షమవుతాడు.

ఇటువంటి సంపుటి డా.కలాం గురించి కూడా వెలువడింది. Indomitable Spirit (2010) అనే పేరుతో వెలువడ్డ ఆ పుస్తకాన్ని నేను 'ఎవరికీ తలవంచకు' అని తెలుగు చేసాను. అలాగే కిందటేడాది పూనం కోహ్లి అనే ఆమె పుణ్య పబ్లిషింగు హౌజు తరఫున వెలురించిన You are Unique అనే రచన కూడా కలాం రచనలనుంచి ఏరికూర్చిన

సంకలనమే. దాన్ని కూడా నేను 'యు ఆర్ యునీక్' పేరిట అనువదించాను. ఈ ఏడాది జనవరిలో ఆ తెలుగు అనువాదం వెలువడింది కూడా.

ఈ సందర్భంగా కలాం పుస్తకాల గురించి ఎందుకు ప్రస్తావించానంటే, మన చుట్టూ ఉన్న సమాజం ఒక hate factory గా మారిపోతున్న కాలంలో, కలాం, మండేలా వంటి వ్యక్తులు మనకు సమకాలికులుగా ఉన్నారనీ, కాని వాళ్ళు అపారమైన వెలుగునీ, దయనీ, స్ఫూర్తినీ పంచిపెట్టి వెళ్ళారనీ గుర్తుచేసుకోడానికి మాత్రమే.

ఎందుకంటే, స్టోయిక్కులు చెప్పినట్లుగా ప్రపంచాన్ని మార్చడం మనచేతుల్లో లేని పని. కాని ప్రపంచం పట్ల మన స్పందనలూ, ప్రతిస్పందనలూ మాత్రం మన చేతుల్లో ఉన్నవే. వాటిని మనం అదుపుచేసుకోగలిగితే, మనం ఈ ప్రపంచాన్ని ఏ విధంగా సమీపించాలో ఆ విధంగా సమీపించగలిగితే, తప్పకుండా మనమున్న మేరకు ప్రపంచం మారడం మొదలుపెడుతుంది. విమర్శ, ఖండన, ద్వేషం, దూషణ చెయ్యలేని పని మన జీవితమే ఒక ఉదాహరణగా మనం చెయ్యగలుగుతాం.

ఈ పుస్తకానికి సంపాదకులు రాసిన ముందుమాటలో తాము మార్కసు అరీలియసు Meditations నుంచి స్ఫూర్తి పొంది ఆ తరహాలో ఈ పుస్తకాన్ని సంకలనం చేసామని చెప్పడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. అరీలియసు తన పుస్తకానికి గ్రీకులో To Himself అని మాత్రమే పేరుపెట్టుకున్నాడు. అదే దారిలో ఈ పుస్తకానికి కూడా Conversations with Myself అని పేరుపెట్టామని సంపాదకులు రాసుకున్నారు.

ఆ సంపాదకులు భావించినట్టే నేను కూడా మండేలాను మన కాలపు మార్కసు అరీలియసుగా అభివర్ణించకుండా ఉండలేకపోతున్నాను. అరీలియసు చక్రవర్తి. మండేలా స్వాతంత్ర్యయోధుడూ, దేశాధినేతా కూడా. కాని యుద్ధసమయంలోనూ, శాంతిసమయం లోనూ కూడా మండేలా అపారమైన కరుణ చూపగలిగాడు. మనిషి జయించవలసింది బయటి శత్రువుని కాదు, అంతశ్శత్రువుని అన్న ఎరుక వల్ల వచ్చిన కరుణ అది.

ఒక పుస్తకం పూర్తిగా చదవకుండా ఆ పుస్తకాన్ని పరిచయం చెయ్యడం నా స్వభావానికి విరుద్ధం. కాని ఈ పుస్తకం చేతుల్లోకి వచ్చినప్పటినుంచీ, మొదటి కొన్ని పేజీలు తిరగేసిన మరుక్షణమే, ఈ పుస్తకం గురించి ఎప్పుడెప్పుడు మీతో ముచ్చటిద్దామా అని ఒకటే ఉత్సాహపడుతూ ఉన్నాను. పుస్తకం మొత్తం చదివేక ఎలానూ వివరంగా రాస్తాను. ఇప్పటికి మాత్రం, ఇందులోంచి ఒక పేజీ మీ కోసం తెలుగుచేస్తున్నాను.

జైల్లో ఉండగా రాసుకున్న స్వీయచరిత్ర అముద్రితప్రతి నుంచి.

> భ్రాంతికి లోనుకావడం, భ్రమలనుంచి బయటపడటం జీవితంలో ఒక భాగం. అవి నిరంతరాయంగా జరిగే పనులే. కానీ నా వాస్తవానుభవాలకీ, నా ఆకాంక్షలకీ మధ్యనున్న అగాధం 1940 ల మొదట్లో నన్ను మరీ శరాఘాతానికి గురిచేసింది. కాలేజిలో చదువుకునేటప్పుడు నేను గ్రాడ్యుయేషను పూర్తికాగానే నా తెగకి నాయకుణ్ణి అవుతాననీ, అన్ని విధాలా వాళ్ళకి నాయకత్వం వహిస్తాననీ అనుకుంటూ ఉండేవాణ్ణి. ఫోర్ట్ హేర్ లో చదువుకున్న చాలామంది విద్యార్థులకి అటువంటి భావనలు కలగడం సహజమే. కాని వాళ్ళల్లో చాలామంది తరగతిగదులనుంచి నేరుగా ఏదో చక్కటి ఉద్యోగంలో అడుగుపెట్టి, చక్కటి జీతం, చెప్పుకోదగ్గ సామాజిక హెూదా సంపాదించుకునే వారు. గ్రాడ్యుయేట్లంటే సమాజంలో, ముఖ్యంగా విద్యారంగంలో ఎంతో కొంత గౌరవం ఉండేదన్నమాట కూడా సత్యదూరం కాదు.
>
> కాని నా అనుభవం వేరేలా ఉండింది. జీవితానికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవలసి వచ్చినచోట ఉన్నత విద్యార్హతల కన్నా కూడా ఇంగిత జ్ఞానమూ, జీవితానుభవమూ ముఖ్యమైన మనుషుల మధ్యనే నేను మసలుతుండేవాణ్ణి. కాలేజిలో బోధించిందేదీ కూడా నేను సంచరిస్తున్న కొత్త వాతావరణానికి ఏ విధంగానూ ఉపకరించేది కాదు. జాతివివక్ష, సరైన అవకాశాలు లేకపోవడం, నల్లజాతిమనిషి తన నిత్యజీవితంలో ఎదుర్కోవలసి వచ్చే అసంఖ్యాకమైన అవమానాలూ లాంటి వాటి గురించి మాట్లాడటానికి సగటు ఉపాధ్యాయుడికి ఎప్పటికీ ధైర్యం సరిపోయేది కాదు. జాతివివక్ష తాలూకు దుష్పరిణామాల్ని ఎలా తుదముట్టించాలో నాకెవరూ చెప్పింది లేదు. క్రమశిక్షణాయుతమైన స్వాతంత్ర్యపోరాటంలో భాగం కావాలంటే ఏ పుస్తకాలు చదవాలో, ఏ రాజకీయసంఘాల్లో చేరాలో నాకెవరూ చెప్పలేదు. అటువంటి విషయాలన్నీ కూడా నాకై నేను పడుతూ లేస్తూ, తప్పులు చేస్తూ, సరిదిద్దుకుంటూ, కాలానుగుణంగా, ఇంకాచెప్పాలంటే యాదృచ్ఛికంగా తెలుసుకున్నవే.

10-6-2023

ప్రతి వాక్యం ఒక వివేకచూడామణి

ట్విట్టరులో 280 అక్షరాల నిడివిలోనే మన సినిమాతారలూ, రాజకీయనాయకులూ, క్రికెటర్లూ తమ ఫాలోయర్లని లాక్కుపోతున్నారు. కానీ ఆ చిన్నపాటి స్థలంలోనే సంస్కృతికీ, సాహిత్యానికీ కూడా చోటిస్తున్నవాళ్ళు లేకపోలేదు. African Proverbs అనే ఒక హేండిలు గురించి నేనింతకుముందే రాసాను. ఇప్పుడు మరొక ఆసక్తికరమైన పుస్తకం చూసాను. My Grandmothers Tweets: Stories Inspired by Avvaiyars Wisdom (2018) ట్విట్టరు శకంలో ప్రాచీనతమిళకవయిత్రి అవయ్యారు రచన ఎంత ప్రాసంగికమో హఠాత్తుగా గుర్తుచేసింది.

అవ్వయారు గొప్ప వివేకానికీ, సూక్ష్మదృష్టికీ పేరు పొందిన కవయిత్రి. ప్రాచీన తమిళసాహిత్యంలో కనీసం ఇద్దరు ముగ్గురు అవ్వయ్యారులు ఉన్నారు. వారిలో ఒకామె పేరిట చిన్న చిన్న నీతివాక్యాలు శతాబ్దాలుగా తమిళ జనస్మృతిలో కొనసాగుతూ వస్తున్నాయి. ఒకప్పుడు స్త్రీలకి విద్యావకాశాలు లేనిరోజుల్లో ఆ చిన్ని చిన్ని వాక్యాలే వాళ్ళు తమ జీవితాన్ని నడుపుకోడానికి అవసరమైన విద్యనీ, విజ్ఞతనీ అందించాయనీ, తరతరాలుగా అమ్మలూ, అమ్మమ్మలూ తమ పిల్లలకీ,మనమరాళ్ళకీ అందిస్తూ వచ్చిన ఆస్తిపాస్తులవే అనీ అంటుంది ఆ పుస్తక రచయిత్రి గీతా గోపాలకృష్ణన్.

అకారాదిగా అక్షరమాలని పరిచయం చేసే ఆ చిన్న చిన్న వాక్యాలు సరిగ్గా ట్విట్టరుకి సరిపోయేవే.

'అరం సెయ్య విరుంబు'

'ఆరువదు సినమ్'

'ఇయల్ వదు కరవేల్'

'ఈవదు విలక్కేల్'

'ఉదయదు విలంబేల్'

'ఊకమదు కైవిడేళ్'

కవిత్వంలోనూ, జీవితంలోనూ కూడా చలంగారు కోరుకున్న economy of words ఆయనకన్నా వెయ్యేళ్ళముందు జీవించిన తమిళ విదుషి సుసాధ్యం చేసింది. ఆమె చెప్పిన ప్రతి వాక్యం ఒక వివేకచూడామణి.

'ఆత్తిచూడి' గా ప్రసిద్ధి పొందిన ఆ మాటలవిందు మొత్తం 109 వాక్యాలు. వాటిని తీసుకుని ప్రతి ఒక్క వాక్యానికీ సమకాలిక జీవితం నుంచో, లేదా చరిత్ర, పురాణాల నుంచో ఒకటి రెండు ఉదాహరణలతో రచయిత్రి, అవ్వయ్యారు వివేకం 21 వ శతాబ్దానికి ఎంత ప్రాసంగికమో వివరించింది. అసలు అన్నిటికన్నా ముందు ఆ ఆలోచనే నాకెంతో నచ్చింది. ఉదాహరణకి, మొదటి సుభాషితం 'అరం సెయ్య విరుంబు' అన్నదే తీసుకోండి. చద్దన్నం మూట లాంటి ఆ మాటకి అర్థం 'మంచిగా చెయ్యాలని కోరుకో' అని అట. Desire to Do Good అనే ఆ ప్రవచనానికి ఆమె ఇచ్చిన ఉదాహరణ చూడండి:

ఏది ఇస్తామో, అది వెనక్కి వస్తుంది

1892 లో స్టాన్‌ఫర్డు విశ్వవిద్యాలయంలో చదువుకునే ఇద్దరు విద్యార్థులకి చదువుకోడానికి డబ్బు సరిపోలేదు. వాళ్ళు అప్పట్లో ప్రఖ్యాత పియానిస్టు ఇగ్నసీ జాన్ పడెరవిస్కీ దగ్గరకు వెళ్ళారు. 2000 డాలర్ల మేరకు టికెట్లు అమ్ముతామనీ, తమకోసం ఒక కచేరీ చెయ్యమనీ అడిగారు. అందులో ఆయన కివ్వాల్సిన పారితోషికం పోను మిగిలిన సొమ్ముతో తమ ఫీజులు కట్టుకుంటా–మని చెప్పారు. కాని వాళ్ళనుకున్నట్టుగా ఆ టికెట్లు పూర్తిగా అమ్ముడు పోలేదు. ఆ ప్రదర్శనకి పూర్తిస్థాయి ఆదాయం వచ్చేట్టు కనబడలేదు. వాళ్ళ ఇబ్బంది తెలుసుకున్న పడెరవిస్కీ తన పారితోషికం వదులుకోడానికి సిద్ధపడ్డాడు. కచేరీకి అయ్యే ఇతర ఖర్చులు చెల్లిస్తే చాలనీ, మిగిలిన సొమ్ముతో ఆ విద్యార్థులు తమ కాలేజీ ఫీజులు కట్టుకోవచ్చనీ చెప్పాడు.

పదిహేనేళ్ళ తర్వాత, పడెరవిస్కీ పోలాండు ప్రధానమంత్రి అయ్యాడు. కాని ఆ రోజుల్లోనే పోలాండు తీవ్రదుర్భిక్షానికి లోనయ్యింది. అతడు తన

దేశాన్ని ఆదుకొమ్మని అమెరికా సంయుక్తరాష్ట్రాల పౌరసరఫరా విభాగాన్ని వేడుకున్నాడు. తక్షణమే టన్నులకొద్దీ ఆహారధాన్యాలు పోలాండు రేవు పట్టణాలకు చేరుకున్నాయి.

తన దేశాన్ని సకాలంలో ఆదుకున్నందుకు, ధన్యవాదాలు చెప్పడానికి, సంయుక్తరాష్ట్రాల పౌరసరఫరా, పునారావాస విభాగం అధిపతి హెర్బెర్ట్ హూవరుని పడెరవిస్కీ పోయి కలుసుకున్నాడు. పదిహేనేళ్ళ కిందట పడెరవిస్కీ సాయం చేసిన ఇద్దరు విద్యార్థుల్లో తానొకణ్ణని హూవరు చెప్పాడాయనకి!

20-12-2018

శ్రీ అరవింద సరిత్ సాగర

రవీంద్రుణ్ణి నేను నా పదిహేనవ ఏటనే సమీపించగలిగాను, కాని అరవింద ప్రపంచంలోకి పూర్తిగా అడుగుపెట్టడానికి నా యాభై అయిదవ ఏటిదాకా ఆగవలసి వచ్చింది. అలాగని అరవిందుణ్ణి నేనింతకు ముందు చదవలేదని కాదు. అరవిందుల పైన 'నవజాత' రాసిన జీవితచరిత్ర, నేషనల్ బుక్‌ట్రస్టు ప్రచురణ, మా తాడికొండ లైబ్రరీలోనే చదవకపోలేదు. ఆ తరువాత ఎన్నో ఏళ్ళకు The Secret of the Veda, The Upanishads, Hymns to the Mystic Fire, The Future Poetry చదివాను కూడా. 'సావిత్రి' లోని మంత్రమయలోకాల్లోకి కొంతమేరకు ప్రయాణించగలిగాను, అది కూడా, ఎప్పుడో, నా రాజమండ్రిరోజుల్లో, సుదర్శనంగారు, డాంటేకీ, అరవిందుడికీ మధ్య పోలికలు చెప్పిన సమ్మోహనీయ ప్రసంగం కలిగించిన ప్రలోభంవల్ల.

ఇరవయ్యవశతాబ్ది భారతదేశాన్ని జాగృతం చేసిన మహనీయుల్లో, ఎవరేనా అత్యంత సులభంగా సమీపించగలిగిన మొదటి రచయిత మహాత్మాగాంధీ. ఆ తర్వాత, వివేకానంద స్వామి, రమణమహర్షి, టాగోరు, రాధాకృష్ణన్, కృష్ణమూర్తి. కాని, శ్రీ అరవిందులు (1872-1950) వారందరిలాగా సులభసాధ్యుడు కాడు. అది ఆయన భాష గంభీరంగా ఉన్నందువల్ల కాదు, ఆయన భావనాప్రపంచంలోని గాంభీర్యంవల్ల అని ఇప్పుడు అర్థం చేసుకుంటున్నాను. అందుకు కారణం కూడా ఉంది. కృష్ణమూర్తి బుద్ధుడివల్లా, రాధాకృష్ణను శంకరుడివల్లా, టాగోరు ఉపనిషత్తులవల్లా, మహాత్మాగాంధీ భగవద్గీత వల్లా ప్రభావితులైతే, అరవిందులు స్వయంగా వేదాలవల్ల ప్రభావితుడైన భావుకుడు, ఋషి.

ఎటువంటి జీవితం శ్రీ అరవిందులది! ఆయన తండ్రి ఇండియన్ మెడికలు సర్వీసులో ఉద్యోగి. పిల్లవాణ్ణి ఐ.సి.ఎస్. చేయించాలనుకున్నాడు. అంతదాకా, భారతదేశం గాలి సోకకూడదని, బెంగాలీ మాట వినబడకూడదని, శుద్ధోధనుడు సిద్ధార్థుణ్ణి పెంచినట్టుగా,

భారతదేశానికి దూరంగా, ఇంగ్లాండులో పెంచాడు. తండ్రి కోరినట్టే అరవిందుడు ఐ.సి.ఎస్ పరీక్ష పాసయ్యాడు. అది కూడా గ్రీకు, లాటిను సాహిత్యాల్లో పరీక్ష రాసి మరీ. కాని, ఆయన మనసు బ్రిటిషుప్రభుత్వపు అధికారి కావడానికి ఇష్టపడలేదు. ఐ.సి.ఎస్‌లో చేరకుండా, భారతదేశం తిరిగి వచ్చి, బరోడామహారాజు ఆస్థానంలో కొన్నాళ్ళు పనిచేసాడు. తాను ఇంగ్లాండులో ఉండగా అధ్యయనం చేసిన గ్రీకు, లాటిను, ఫ్రెంచి, ఇటాలియను, జర్మను భాషలకి తోడు, ఇప్పుడు సంస్కృతం, బెంగాలీ, తమిళం, మరాఠీ అధ్యయనం మొదలు పెట్టాడు. అది మామూలు మామూలు అధ్యయనం కాదు. గ్రీకులో హోమరుని చదివినట్టు, ఇటాలియనులో డాంటేని చదివినట్టు, ఇంగ్లిషులో షేక్స్పియరును చదివినట్టు, సంస్కృతంలో వేదాల్ని, వ్యాసవాల్మీకుల్ని, కాళిదాసుని చదివాడు.

ఇంతలో బెంగాలు విభజనని వ్యతిరేకిస్తూ వందేమాతరం ఉద్యమం మొదలయ్యింది. బరోడాలో సౌకర్యవంతమైన ఉద్యోగం వదిలిపెట్టి, కలకత్తాలో గౌరవవేతనం మీద జాతీయ కళాశాలలో చేరాడు. జాతీయోద్యమంలో అతివాదపంథాని ఎంచుకున్నాడు. 1906 లో సూరతు కాంగ్రెసులో తిలక్ పక్షాన నిలబడ్డాడు. 1908 లో కుదీరాం బోసు విసిరిన బాంబుకేసులో అరవిందుణ్ణి కూడా ప్రభుత్వం నిర్బంధించి జైల్లో పెట్టింది. అక్కడ, ఏడాది పాటు అనుభవించిన సాలిటరీ కన్‌ఫైన్‌మెంటులో ఆయనకు అపూర్వమైన ఆధ్యాత్మిక అనుభవాలు సంప్రాప్తించాయి. ఆయన తరఫున దేశబంధు చిత్తరంజనదాసు వాదించి ఆయన్ను నిర్దోషిగా విడుదల చేయించాడు. బయటికిరాగానే, సిస్టరు నివేదిత సలహామీద, బ్రిటిషుపాలిత భారతదేశం వదిలి ఫ్రెంచికాలనీ పుదుచ్చేరికి వెళ్ళిపోయారు.

1910 నుంచి 1950 దాక నలభై ఏళ్ళు అక్కడే ఉండిపోయారు. చివరి 24 సంవత్సరాలు ఆయన పూర్తి ఏకాంతంలో తన మనస్సు, దేహం,ప్రజ్ఞ అన్నీ భగవంతుడికి అర్పితం చేసి, 'దివ్యజీవితం' సాధన చేస్తూ, తన ప్రయోగానుభవాల్ని గ్రంథస్థం చేస్తూ గడిపారు. ప్రపంచం రెండు మహాయుద్ధాల మధ్య అతలాకుతలం అవుతున్న కాలంలో ఆయన ఒక ప్రాచీన వైదికఋషిలా, ఉపనిషత్కారుడిలా, ద్యావాపృథ్వుల్ని తనలో తాను సమన్వయించుకుంటూ గడిపారు. దాన్ని ఆయన సమగ్రయోగం (Integral Yoga) అన్నారు. పూర్తి తాపసజీవితానికీ, పూర్తి ఐహికజీవితానికీ మధ్య బుద్ధుడు ఒక మధ్యేమార్గాన్ని అన్వేషిస్తే, శ్రీ అరవిందులు, ఆ రెండింటినీ, సమన్వయం చేసే ఒక synthesis ని సరికొత్తగా ప్రతిపాదించారు.

అందువల్ల, ఆయన్ని అర్థం చేసుకోవాలంటే, హిమాలయాల అంచుల్లో విహరిస్తే చాలదు, మనం స్వయంగా ఆ పర్వతారోహణకు పూనుకోవాలి. కొన్ని అడుగులు పైకి

ఎక్కామో లేదో, గాలి పీల్చడం కూడా కష్టంగా తోచే ఆ అత్యున్నతవాతావరణంలో ఎట్లానో ఒక్కొక్క అడుగే వేసుకుంటోపోవాలి. అన్నిటికన్నా ముందు ఒక సుశిక్షిత పర్వతా-రోహకుడి చేతుల్లో మనని మనం తర్ఫీదు చేసుకోవాలి.

అటువంటి ఒక శిక్షకుడి గురించి ఎదురుచూస్తూ ఉన్న నా చేతుల్లో 'శ్రీ అరవింద సరిత్ సాగర' (2018) వచ్చి వాలింది. చీరాలకు చెందిన రావి మోహనరావుగారు నడుపుతున్న 'ఆత్మజ్యోతి' పత్రికకోసం అరవిందుడి సమగ్ర సాహిత్యం గురించి గత అయిదేళ్ళుగా ప్రేమా నందకుమారుగారు రాసిన పరిచయ వ్యాసాలసంపుటి అది.

శ్రీ అరవిందుల శతజయంతి సందర్భంగా 1972 లో ఆయన రచనలు 30 సంపుటాలుగా, Sri Aurobindo Birth Centenary Library పేరిట వెలువడ్డాయి. (తిరిగి, ఆయన 125 వ జయంతి సందర్భంగా, మరికొన్ని రచనలు చేర్చి 37 సంపుటాలు 1992 లో వెలువరించారు. ఈ సంపుటాలన్నీ అరవిందాశ్రమం వారు పబ్లిక్ డొమైనులో అందరికీ అందుబాటులో పెట్టారు కూడా.)

ఇప్పుడు ఎనభయ్యేళ్ళు పైబడ్డ వయసులో ప్రేమా నందకుమారు ఆ మొదటి 30 సంపుటాల్నీ పరిచయం చేస్తూ వ్యాసాలు రాస్తూ వచ్చారు. అందులో ఇప్పటిదాకా 15 సంపుటాల మీద రాసిన 47 వ్యాసాల్ని చీరాలకు చెందిన సంస్కృతపండితులు, అనువాదకులు చింతగుంట సుబ్బారావుగారు, ఇప్పుడు తన 86 ఏళ్ల వయసులో, తెలుగు లోకి అనువదించారు. ఆ ఇంగ్లీషు, తెలుగు వ్యాసాల్ని కలిపి మోహనరావుగారు 'శ్రీ అరవింద సరిత్ సాగర' పేరిట పుస్తక రూపంగా వెలువరించారు.

ఆగస్టు 15 న అరవింద జయంతి సందర్భంగా చీరాలలో జరిగిన ప్రత్యేక సమావేశంలో అరవిందాశ్రమాల కార్యకర్త శ్రీ పి.సి.స్వరూప్ ఆ గ్రంథాన్ని ఆవిష్కరించేరు. నెల్లూరుకు చెందిన భావుకులు, రచయిత, అనువాదకులు శ్రీ అల్లు భాస్కరరెడ్డిగారి అధ్యక్షతన జరిగిన ఆ సమావేశంలో ఆ పుస్తకాన్ని పరిచయం చేసే భాగ్యం నాకు లభించింది.

ప్రేమా నందకుమారు ప్రసిద్ధ ఇంగ్లీషు అచార్యులు, ఒకప్పుడు ఆంధ్రవిశ్వ-విద్యాలయానికి వైస్ ఛాన్సలరుగా పనిచేసిన కె.ఆర్.శ్రీనివాస అయ్యంగారుగారి కుమార్తె. ఆమె 'సావిత్రి' కావ్యం పైన డాక్టొరలు పరిశోధన చేసిన విదుషి. సుబ్రహ్మణ్య భారతి రచనలనీ, సంగం కావ్యం 'మణిమేఖలై' నీ ఇంగ్లిషులోకి అనువదించారు. రామానుజులపైన ఒక జీవితచరిత్ర ఇటీవలే వెలువరించారు. ఆమె శ్రీ అరవిందుల రచనలపైన ఇంత

సమగ్ర పరిచయం చేయడం,ఆ పరిచయ వ్యాసాల్ని తెలుగులోకి అనువదించడం వల్ల అందరికన్నా ముందు, ఆ పుస్తకం మొదటి పాఠకుడిగా, అమితంగా లబ్ధి పొందింది నేనే. ఇప్పుడామె చిటికెన వేలు పట్టుకుని శ్రీ అరవిందుల తేజోమయలోకాల్లోకి సునాయాసంగా నడిచిపోగల ధైర్యం చిక్కింది నాకు.

18-8-2018

ముళ్ళదారి

మహాత్మాగాంధీ పెద్దకొడుకు హరిలాల్ గాంధీ జీవితం మీద చందూభాయి భాగూభాయి దలాలు గుజరాతీలో ఒక పుస్తకం రాసారు. దాన్ని త్రిదీప్ సుహృద్ ఇంగ్లీషులోకి Harilal Gandhi: A Life (ఓరియెంటు లాంగ్మను, 2007) అనువదించారు. దాదాపు రెండేళ్ళనుంచీ ప్రొ. రఘురామరాజు ఆ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించమని నన్ను ఆడుగుతూ, పట్టుపడుతూ ఉన్నారు. ఏమైతేనేం, కన్నీళ్ళ మధ్య ఆ పుస్తకాన్ని అనువదించడం పూర్తయ్యింది. అందులో తండ్రికీ, కొడుకీ మధ్య సంభవించిన విలువల సంఘర్షణమీద ఒక వ్యాసం రాయడంలో ఉన్నాను. ఆ సంఘర్షణ సంభవించిన కాలంలో (1906-1915) గాంధీజీ మనఃస్థితిని అర్థం చేసుకోవడానికి మరొక్కసారి ఆయన ఆత్మకథ ఆసాంతం చదివాను.

ముప్పైఅయిదేళ్ళ కిందట నేను మా కుటుంబపరిస్థితులు అనుకూలించక పెద్దాపురంలో బి.ఏలో చేరినరోజుల్లో గాంధీజీ రచనలపట్ల గొప్ప ఆసక్తి పుట్టింది. అప్పట్లో గాంధీజీ ఆత్మకథకు వేలూరి శివరామశాస్త్రిగారి అనువాదం చదివాను. మళ్ళా మూడున్నర దశాబ్దాల తరవాత మరొకసారి చదవడం. పుస్తకం పూర్తి చెయ్యగానే నాకు గొప్ప దుఃఖమూ, గొప్ప ఆశా కూడా ఒక్కసారే కలిగాయి. దుఃఖమెందుకంటే, పద్దెనిమిదేళ్ళ వయసులో ఈ పుస్తకం నా చేతుల్లోకి వచ్చికూడా ఈ రచన ఏంచెప్తోందో అర్థం చేసుకోలేకపోయానే అని. గొప్ప వ్యాకులత కలిగింది నాకు. ఆ రోజుల్లో ఎవరేనా ఈ పుస్తకం గురించి నాకు అర్థమయ్యేలా చెప్తే ఒక జీవితకాలాన్ని నేనింతగా వృథా చేసుకుని ఉండేవాణ్ణి కాదుకదా, ఇంత చీకట్లో ఇన్నేళ్ళుగా తచ్చాడుతూండేవాణ్ణి కాదు కదా అనిపించింది. అయితే వెంటనే గొప్ప ఆశ కూడా కలిగింది. ఇంకా నా ఒంట్లో జవసత్త్వాలు ఉడిగిపోకముందే, జీవితం సార్థకంగా జీవించాలన్న ఉత్సాహం అడుగంటకముందే ఈ పుస్తకం మరొకసారి

చదవగలిగాను కదా, దీన్నుంచి పొందిన స్ఫూర్తితో ఇప్పుడేనా కనీసం నేనొక దారి వెతుక్కోగలను కదా అనిపించింది.

నా ప్రస్తుతజీవితం పట్ల, నా ఉద్యోగం పట్ల, నా సామాజిక పరిసరాలపట్ల, జీవితంలో అధికభాగం నిరర్థకంగా గడపవలసిరావడం పట్లా నాకు చాలా ఏళ్ళుగానే తీవ్ర అసహనం కలుగుతున్నప్పటికీ, అది పూర్తిగా precipitate అయ్యింది నాలుగేళ్ళకిందట. 2010 లో నేను మొదటిసారి సబర్మతీ ఆశ్రమానికి వెళ్ళాను. గాంధీజీ రచనల సంకలనాలు నవజీవన్ వారు వేసినవి కొన్ని తెచ్చుకున్నాను. అందులో 'గ్రామ స్వరాజ్' అనే సంకలనం నన్ను నిలవనివ్వలేదు. విద్యావంతుడూ, ఆరోగ్యవంతుడూ అయిన యువకుడు ఉండవలసింది గ్రామాల్లో తప్ప నగరంలో కాదనిపించింది. తక్షణమే ఉద్యోగం వదిలిపెట్టి ఏదేనా గిరిజన ప్రాంతానికి పోయి గిరిజనుల విద్యకోసమో, ఆరోగ్యంకోసమో పాటుపడదామనిపించింది. రెండుమూడునెలలు సెలవుపెట్టాను. అదిలాబాదునుంచి నెల్లూరుదాకా తిరిగాను. కాని మరికొన్ని కారణాలవల్ల నా నిర్ణయం మరొక అయిదేళ్ళు వాయిదా వెయ్యాలనుకున్నాను.

కాని గాంధీజీ ఆత్మకథ చదివినతరువాత నాకు 2015 దాకా కూడా ఆగడం కష్టమనిపిస్తోంది. కాని ఇప్పుడు నా ఆలోచనలు మరోలా ఉన్నాయి. ఇప్పుడు నాకు నా కార్యక్షేత్రం బయట ఎక్కడో ఉందనిపించడం లేదు. నేనున్నచోటనే నా శక్తిసామర్థ్యాలను నేననుకున్న రీతిలో వినియోగించాలని ఉంది. నాకొక పూర్తికాలపు రచయితను కావాలని ఉంది. విస్తృతంగా చదువుకోవాలని ఉంది. నాలో చాలాకాలంగా రూపుదిద్దుకుంటున్న ఎన్నో నవలలు, నాటకాలు, తాత్త్వికగ్రంథాలు వీలయినంత త్వరగా రాయాలనిఉంది. అయితే ఇటువంటి కార్యసాధనకు పూనుకునే వ్యక్తి ముందు సత్యసాధన చెయ్యాలన్నదే గాంధీజీ ఆత్మకథ సారాంశం.

ఇప్పుడు మీడియా వల్ల, ముఖ్యంగా సినిమాలవల్ల గాంధీగిరిగా వాడుకలోకి వచ్చిన ఒక విచిత్రమైన భావజాలం గాంధీని ఒక చెంపమీద కొడితే రెండవచెంప చూపేవాడిగానూ, తనని అవమానించినవాళ్ళనీ, బాధిస్తున్నవాళ్ళనీ, ప్రజలకు అన్యాయం చేస్తున్నవాళ్ళనీ గులాబీపూలతో వేడుకునేవాడిగానూ చూపిస్తున్నది. ఈ నాటి యువతీయువకులకి గాంధీజీ 'సత్యశోధన' చదివే తీరిక ఉండదు కాబట్టి, ఆ పుస్తకం చదవాలని కూడా వాళ్ళకెవరూ చెప్పరు కాబట్టి, (ఒక వేళ వాళ్ళు చదివినా, ఆ వయసులో నాకు లాగే వాళ్ళకి కూడా దాని సందేశమేమిటో పూర్తిగా బోధపడదు కాబట్టి) గాంధీమార్గమంటే గులాబీల మార్గం అనే అనుకుంటారు.

కాని గాంధీ ఆత్మకథ చదివినవాళ్ళకి అది ముళ్ళదారి అనీ, గాంధీజీ చేసిన పోరాటం ప్రధానంగా తనతోనేననీ, తన శరీరంతోనూ, తన మనసుతోనూ అని తెలుస్తుంది. My Experiments With Truth ఒక రాజకీయ ఉద్యమకారుడి రచనకాదు, ఒక ఆధ్యాత్మిక సాధకుడి ఆత్మకథ అని ప్రపంచం ఎప్పుడో గుర్తించింది. కాని ఇప్పుడు నాకు కొత్తగా స్ఫురించిందేమిటంటే ఆ ఆధ్యాత్మికసాధకుడు ఒక సాధారణమానవుడనీ, కాని ఆ మానవుడు అనుక్షణం తన మానవదౌర్బల్యాలతో పోరాడినందువల్లనే అటువంటి ఆత్మోన్నత్యాన్ని సాధించుకోగలిగాడనీ. కాబట్టే అది నీకు నాకూ కూడా సాధ్యమనిపిస్తున్నది.

26-8-2014

సత్యశోధన

రెండురోజుల కిందట గాంధీజీ ఆత్మకథ గురించి నాలుగు వాక్యాలు రాయకుండా ఉండలేకపోయానేగాని, నిజానికి ఆ పుస్తకం గురించీ, గాంధీజీ జీవితం గురించీ నా మనసులో కదలాడుతున్న భావాలన్నిటికీ నేను అక్షరరూపం ఇవ్వలేకపోయాను. 1927-29 మధ్యకాలంలో ఆ మానవుడు రాసుకున్న అనుభవాలు 2014 లో నన్నెట్లా చలింప చేస్తున్నాయో, ఆ వాక్యాలు చదివి నేనెందుకు స్పందిస్తున్నానో మాటల్లో పెట్టలేకపోతున్నాను.

1869 నుంచి 1921 దాకా తన జీవితంలోని యాభై ఏళ్ళ అనుభవాలు మాత్రమే గాంధీజీ అందులో రాసుకొచ్చారు. ఆ తరువాత తన జీవితంలో సంభవించిందంతా దేశానికి తెలుసనీ అందువల్ల వాటిని ప్రత్యేకంగా రాయవలసిన పనిలేదనీ ఆయన భావించారు. ఆ యాభై ఏళ్ళ జీవితంలో కూడా ముఖ్యంగా ముప్ఫై ఏళ్ళ అనుభవాలు, అంటే తాను బారిష్టరు చదువుకోవడానికి ఇంగ్లాండు వెళ్ళినప్పటినుంచి సహాయనిరాకరణ తీర్మానం కాంగ్రెసుతో ఆమోదింపచేసుకునేదాకా అనుభవాలు. ఆ అనుభవాలన్నిటిలోనూ రాజకీయాలకీ, సమాజానికీ, స్వాతంత్ర్యానికీ సంబంధించిన భావాలది కేవలం రెండో స్థానం మాత్రమే. ఆ జీవితమంతా ప్రధానంగా కనబడే పదాలు– ఉపవాసాలు, శాకాహారం, బ్రహ్మచర్యం, ప్రార్థన, రామనామం, రామకృప మాత్రమే.

నాక్కూడా యాభయ్యేళ్ళు పూర్తయ్యాయి. గాంధీజీ జీవితంలో 20 ఏళ్ళనుంచి యాభై ఏళ్ళదాకా ముప్ఫై ఏళ్ళ పాటు సత్యంతో ప్రయోగాలు జరుపుతూనే ఉన్నాడు. పుస్తకమంతా చదివిన తరువాత చాలా ఆలోచించాను. గాంధీజీని సత్యం వైపు నెట్టిందేమై ఉండ వచ్చునని? ఆయన చెప్పుకున్నదాని ప్రకారమే ఆయన మీద అయిదు ప్రభావాలున్నాయి.

ఒకటి, తను చిన్నప్పుడు తప్పులు చేసి ఆ తప్పుల్ని ఒప్పుకుంటూ తండ్రికి ఉత్తరం రాసినప్పుడు, ఆ తండ్రి కార్చిన కన్నీరు. ఆ దృశ్యాన్నిట్లా రాసుకున్నారాయన:

ఆయన ఆ ఉత్తరాన్ని ఆసాంతం చదివారు. ఆయన చెంపలమీదుగా ముత్యాల్లాంటి అశ్రుబిందువులు టపటపా జారి కాగితాన్ని తడిపేసాయి. ఒక క్షణంపాటు ఆయన ఆలోచనలో పడి కళ్ళుమూసుకున్నారు, ఆ మీదట ఆ చీటీని చింపేసారు. ఆయన లేచి కూచుని ఆ ఉత్తరం చదవవలసి వచ్చింది. మళ్ళా పక్కమీద వాలారు. నేను కూడా ఏడ్చేసాను. నా తండ్రి హృదయంలో ఘూర్ణిల్లిన దుఃఖాన్ని నేను చూడగలిగాను. నేనే కనుక ఓ చిత్రకారుణ్ణై ఉంటే ఆ మొత్తం దృశ్యాన్నంతా ఈ రోజు చిత్రించగలిగి ఉండేవాణ్ణి. ఆ దృశ్యం ఇప్పటికీ నా మనసులో అంత స్పష్టంగానూ ఉంది. ఆ ప్రేమ మౌక్తికాలు నా హృదయాన్ని ప్రక్షాళనం చేసేసాయి. అటువంటి ప్రేమని అనుభవించినవాడు మాత్రమే అదేమిటో తెలుసుకోగలడు. ప్రేమబాణం హృదయాన్ని చీల్చినవాడికే దాని శక్తి ఏమిటో అనుభవానికొస్తుంది. నా వరకూ నాకు అది అహింసాపాఠమనే అనిపించింది. ఆ రోజు నేనందులో ఒక తండ్రి ప్రేమను మించి మరేమీ చూడలేకపోయానుగాని, ఈ రోజు అది పూర్తిగా అహింస తప్ప మరేమీ కాదని గ్రహిస్తున్నాను.

రెండవ ప్రభావం, తమ ఇంట్లో పరిచారిక రంభ ద్వారా విన్న రామనామమహిమ. ఒక హంతకుడి తుపాకిగుండు ముందు కూడా ఆ రామనామాన్ని ఆయన వదల్లేదు. మూడవ ప్రభావం, తన రాజకోట మిత్రుడు రాయచందుభాయి స్నేహం. అతణ్ణి తన ఆధ్యాత్మికగురువుగా చెప్పుకోలేకపోయినప్పటికీ అతణ్ణి తన మార్గదర్శకుడిగానూ, ఆప్తుడిగానూ చెప్పుకున్నారాయన. ఇక నాల్గవ ప్రభావం, గాంధీజీ చదివిన రెండు పుస్తకాలు: టాల్‌స్టాయి రాసిన The Kingdom of God is Within You, రస్కిను రాసిన Unto This Last. రస్కిను పుస్తకమైతే ఆయన బాహ్యాంతర జీవితాల్ని రెండింటినీ కూడా మార్చేసింది.

కాని ఈ ప్రభావాలన్నీ ఒక ఎత్తూ, ఆయన ఇంగ్లాండు వెళ్ళబోయే ముందు తల్లి ముందు ఒక జైనసాధువు సమక్షంలో చేసిన మూడు ప్రమాణాలూ ఒక ఎత్తు. తండ్రి చెప్పిన మాట పాటించడం రాముడి జీవితాన్ని రామాయణంగా మార్చినట్టే, తల్లికిచ్చిన మాట మోహన్‌దాసుని మహాత్ముడిగా మార్చిందని స్పష్టంగా అర్థమవుతూ ఉంది.

మద్యం, మాంసం, మగువ– అనే మూడింటినీ ముట్టనని చేసిన ప్రమాణమే ఆయన జీవితాన్ని 'సత్యం నుంచి సత్యం' వైపుకు నడిపిస్తూ పోయిందని గ్రహించాను. ఆ మూడింటిలోనూ మద్యం ఆయన్ని వ్యక్తిగతంగా ఎక్కువ పరీక్షించలేదు. (అది తరువాత

రోజుల్లో ఆయన పెద్దకొడుకు హరిలాలు రూపంలో ఒక జీవితకాలంపాటు ఆయన్ని వేధించింది). కాని తక్కిన రెండూ ఆయన్ని చాలా నిశిత పరీక్షకు గురిచేసాయి. తన ప్రాణం, తన భార్య ప్రాణం, తన కొడుకు మణిలాల్ ప్రాణం పొయ్యే పరిస్థితి సంభవించి–నప్పుడు కూడా మాంసాహారాన్ని ముట్టననే ప్రమాణాన్ని ఆయన వదులుకోలేదు. ఆ పరీక్ష ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుకునేవారు, ఆత్మకథ 3 వ భాగంలో 22 వ అధ్యాయం ఒకసారి చదివితే బాగుంటుంది.

కాని అన్నిటికన్నా ముఖ్యమైన పరీక్ష తన కామవాంఛ కోసం పరస్త్రీవైపు చూడకుండా ఉండటమనేది. బహుశా గాంధీజీ జీవితంలో అత్యంత కీలకమైన ప్రమాణమిదే అనుకుంటాను. ఇంద్రియనిగ్రహం, బ్రహ్మచర్యం వంటి పదాల్ని శుష్కపదాలుగానూ, అర్థరహితంగానూ భావించే కాలంలో నేను పెరిగి పెద్దవాణ్ణవడం నా జీవితంలో అత్యంత దురదృష్టంగా భావిస్తున్నాను. నా జీవితంలో కూడా ఏదో ఒక దశలో నన్ను బడికి పంపేటప్పుడో, ఇల్లు విడిచి దూరప్రాంతానికి వెళ్ళేటప్పుడో, ఉద్యోగంలో చేరేటప్పుడో–నా తల్లి, తండ్రి, గురువు ఎవరో ఒకరు నాతో కూడా అట్లాంటి ప్రమాణం చేయించుకుని ఉంటే ఎంతబాగుండేది! ఈ రోజు నాకు స్పష్టంగా తెలుస్తున్నదేమంటే, నువ్వెంతైనా చదివి వుండవచ్చు గాక, ఎంతైనా నేర్చి ఉండవచ్చుగాక, నీ ఇంద్రియాల్ని అదుపులో పెట్టుకోవడమెలానో తెలుసుకోకపోతే ఆ చదువు వృథా.

ఇంద్రియనిగ్రహమంటే, కేవలం జననేంద్రియ నిగ్రహం గురించి మాత్రమే నేను మాట్లాడటం లేదు. ముఖ్యంగా నీ నోరు, నీ మాట. ఇతరులపట్ల దయాన్వితంగా మసలు–కోవడానికి అవసరమైన శక్తిసామర్థ్యాలు సంపాదించుకొవడమే బ్రహ్మచర్యమని నేనిప్పుడు గ్రహిస్తున్నాను.

స్త్రీని కాముకంగా చూడటంలో ఉన్న ప్రధానదోషమేమిటంటే, ఆ చూపువల్ల నువ్వొక మనిషిని, నిండువ్యక్తిత్వాన్ని కనీసం కొన్ని క్షణాలపాటైనా ఒక మనిషిగా కాక ఒక object గా చూస్తావు. ఈ objectification ఇదే అత్యంత అమానవీయమైన అంశం. పరస్త్రీ వైపు చూడకూడదన్న ప్రమాణం గాంధికి నెమ్మదిగా కలిగించిన ఎరుక ఏమిటంటే, తన భార్యని కూడ తానట్లా చూడకూడదని. Objectification ఎదుటి స్త్రీ పట్ల ఎంత తప్పో, తన భార్య పట్ల కూడా అంతే తప్పు. తాను తన కోరిక వల్ల తన భార్యని కూడా ఒక object గా చూస్తున్నాడన్న గ్రహింపు రాగానే ఆయనకు తను తన భార్య దేహాన్ని colonize చేస్తున్నాడనీ , తద్వారా ఆమెనొక inferior being గానూ, second rate citizen గానూ భావిస్తున్నాడనీ అర్థం చేసుకున్నాడు. అప్పుడాయనకి దక్షిణ ఆఫ్రికాలో

బ్రిటిషువాళ్ళు భారతీయులతో వ్యవహరిస్తున్న తీరుకీ, భారతదేశంలో సవర్ణహిందువులు దళితకులాలతో వ్యవహరిస్తున్న తీరుకీ మూలకారణమెక్కడుందో తెలిసిపోయింది. తోటి మనిషి దేహాన్ని object గా భావించడంలోంచే సమస్త ఆధిపత్యభావజాలమూ పుట్టి పెరుగుతోందని గుర్తించాడు. నీ పక్కవాడు ఆధిపత్య భావజాలాన్ని చూపిస్తున్నాడని నువ్వతణ్ణి ప్రశ్నించే ముందు నీలో నిగూఢంగా ఉన్న అధిపత్య భావజాలం నుంచి నిన్ను నువ్వు ప్రక్షాళన చేసుకొమ్మనే ఆయన చెప్తున్నాడు.

ముప్ఫైఏళ్ళ కిందట గాంధీజీ ఆత్మకథని రాజమండ్రిలో నా మిత్రుడు గోపీచందుకి చదవమని ఇచ్చినప్పుడు అతడొక వాక్యాన్ని ఎత్తిచూపి గాంధీ రాసిన ఆ వాక్యం నిజమే అయితే కనుక ఆయన నిస్సందేహంగా మహాత్ముడు అన్నాడు. ఆ వాక్యమెక్కడుందా అని ఈ సారి చదివినప్పుడు శ్రద్ధగా వెతికాను. 2 వ భాగం ఇరవయ్యవ అధ్యాయంలో ఆ చివరి వాక్యం ఇలా ఉంది:

> It has always been a mystery to me how men can feel themselves honored by the humiliation of their fellow-beings.

29-8-2014

అనాసక్తి యోగం

సోమవారం మధ్యాహ్నం. పొద్దుణ్ణించీ వెళ్ళాలి వెళ్ళాలి అనుకుంటున్న రాజఘాటుకి వెళ్ళేటప్పటికి నడిమధ్యాహ్నమైపోయింది. ఎర్రటి ఎండ. చాలా ఏళ్ళ తరువాత మళ్ళా అడుగుపెట్టాను ఆ ప్రశాంత ప్రాంగణంలో. అక్కడ లానుల్లో గడ్డి చదును చేస్తున్న రొట్ట వాసన. ఒకపక్క నిండుగా వికసించిన గన్నేరు పూలచెట్లు. సందర్శకులకోసం అక్కడ దారంతా నీళ్ళతో తడుపుతున్నారు. అడుగుపెడితే బొబ్బలెక్కిపోతుందన్నట్టున్న ఆ ఎండలో, ఎవరో ఇద్దరు ముగ్గురు విదేశీయులు, సాక్సు కూడా తీసేసి మరీ, అడుగులేస్తున్నారు. సమాధి దగ్గర ఎర్రగా జ్వలిస్తున్న దీపం. బీహారు నుంచి వచ్చిన కొన్ని గ్రామీణ కుటుంబాలు ఆ ఎండలోనే మహాత్ముడికి మనసారా నమస్కరిస్తున్నారు.

సమాధి ప్రాంగణం ఎదురుగా వాహనాలు పార్కింగు చేసే చోట ఇప్పుడొక బస్టాండు, కేంటీను, ఖాదీ విక్రయశాలలతో పాటు పబ్లికేషన్సు సెంటరు కూడా ఉన్నాయి. ఇవేవీ నేనింతకుముందు వచ్చినప్పుడు లేవు. పిల్లలు కూడా నాతో పాటు ఆ దుకాణంలో అడుగుపెట్టారు. ప్రమోద్‌కి 'డిస్కవరి ఆఫ్ ఇండియా', అమృతకి 'దస్ స్పోక్ గాంధి' పుస్తకాలు కానుక చేసాను. అప్పుడు కనిపించింది, Bhagavad Gita According to Gandhi. ఇది 2014లో భారత ప్రధానమంత్రి అమెరికా అధ్యక్షుడికి బహూకరించిన ఎడిషను అట. ప్రధానమంత్రి ఒబామాకి భగవద్గీత ఇచ్చాడని విన్నానుగాని, అది గాంధీజీ అనువదించి, వ్యాఖ్యానించిన భగవద్గీత అని నాకు తెలీదు. తక్షణమే ఆ పుస్తకం చేతుల్లోకి తీసుకున్నాను.

'అనాసక్తి యోగం' గా ప్రసిద్ధి చెందిన ఈ పుస్తకం నా చేతుల్లోకి, చాలా ఏళ్ళ కిందటనే, నా పదిహేడో ఏట అడుగుపెట్టింది. నేను పెద్దాపురంలో డిగ్రీలో చేరినప్పటి మాట. అదంతా ఒక అగమ్యకాలం. జీవితం నేనూహించుకున్నట్టూ, ఆశించినట్టూ

కాకుండా, నడిసముద్రంలో నావ మాదిరి దారితప్పడం మొదలైన రోజులు. అక్కడ ఒకరింట్లో వీధిగదిలో ఉండేవాణ్ణి. ఆ ఎదురుగా పెద్దాపురం సంస్థానం వారు బీదసాదల కోసం నడిపే ధర్మసత్రంలో భోజనం. ఆ రోజుల్లో తెలుగుసాహిత్యం విస్తారంగా చదివేవాణ్ణి. కాని, ఆ కథలూ,నవలలూ, కవిత్వం మధ్య, గాంధీగారి రచనల తెలుగు అనువాదాలు, కొన్ని ఇంగ్లిషు వ్యాసాలూ కూడా నాతో పాటే ఉండేవి. ముఖ్యంగా, జార్జి కాట్లిన్ రాసిన 'గాంధీజీ అడుగుజాడల్లో' అనే పుస్తకం. (ఆ పుస్తకం నా జీవితాన్ని ఎట్లా మలుపు తిప్పిందో అదంతా నా 'సత్యాన్వేషణ' (2003) కి ముందుమాటలో రాసాను.) దాంతో పాటు భగవంతుడి గురించి గాంధీగారు రాసిన వ్యాసం కూడా. ఈశ్వరీయ చింతనలో ఆ వ్యాసాన్ని మించిన రచన నాకు మరేదీ ఇప్పటిదాకా, కనిపించలేదు. అప్పుడు చదివాను, ఈ వ్యాఖ్యానం. పూర్తిగానా, కొంత భాగమా అన్నది నాకు గుర్తులేదు. కాని, ఒక పుస్తకంగా ఇది నా చేతుల్లోకి వచ్చింది మటుకు 1987 లో.

అది కూడా ఆసక్తికరమైన, నేను మరవలేని వైనం. రాజమండ్రిలో నా మిత్రుడు కవులూరి గోపీచందు హేతువాది, కమ్యూనిస్టు కుటుంబం నుంచి వచ్చినవాడు. భగవంతుడి మీద నమ్మకంలేని వాడు. గాంధీ అతణ్ణి ఎప్పుడూ ఆకర్షించలేదు. కాని, నా సాంగత్యంవల్ల మొదటిసారి గాంధీజీ ఆత్మకథ చదివాడు. ఆ పుస్తకం అతణ్ణి దగ్గరగా గుంజుకుంది. ఆ రోజుల్లో మిత్రులంతా ఒకసారి ఢిల్లీ వెళ్ళినప్పుడు అతడు కూడా వాళ్ళతో పాటు వెళ్ళి, రాజఘాటు చూడాలని పట్టుబట్టి, అక్కణ్ణుంచి నాకోసం ఒక ఖద్దరు నూలుపోగునీ, 'అనాసక్తి యోగా' న్నీ తీసుకొచ్చాడు.

ఇప్పుడు మళ్ళా రాజఘాటు మరోసారి ఈ పుస్తకాన్ని నా చేతులకందించింది. ఇందులో గాంధీ అనువాదమూ, వ్యాఖ్యానమూ, ఆయనే రాసుకున్న ముందుమాటలతో పాటు, 2010 లో భారతపార్లమెంటును ఉద్దేశించి బరక్ ఒబామా చేసిన ప్రసంగం పూర్తి పాఠం కూడా ఉన్నాయి. గీతచుట్టూ, గీతకి గాంధీ వ్యాఖ్యానం రాయడం చుట్టూ చెలరేగిన వివాదం మీద ప్రచురణకర్తలు రాసిన పొందుపరిచిన చిన్న నోటు కూడా ఉంది.

గీత మీద వ్యాఖ్యానాల్లో నేను చదివినవాటిలో గాంధీజీ రాసిందే మొదటిది. ఆ తర్వాత, తిలక్, వినోబా, అరవిందులు, రాధాకృష్ణనులతో పాటు, శంకర, రామానుజ, జ్ఞానేశ్వర, మధుసూదన సరస్వతిల వ్యాఖ్యానాలు కూడా చూసాను. గీతకి తెలుగులోనూ, ఇంగ్లిషులోనూ కూడా చాలా అనువాదాలే చదివాను. గీతకీ, మహాభారతానికీ ఉన్న సంబంధం అర్థం చేసుకోవడానికి మహాభారతం కూడా సమగ్రంగా చదివాను.

కాని, ఇప్పటికీ భగవద్గీత మీద వ్యాఖ్యానాల్లో నాకు సన్నిహితంగా తోచింది గాంధీజీ రాసిన మాటలే. ఎన్నడో ఒకరోజు గీత మీద ప్రసంగించమని అడిగితే మా మాష్టారు ఒక మాటన్నారు: 'భగవద్గీత అనుష్ఠించవలసిన విషయం తప్ప ప్రసంగించవలసింది కాదు' అని. ఇక చర్చించవలసింది అస్సలు కాదు. నాకేమనిపిస్తుందంటే, గీత ఒక వ్యక్తికి బోధించిన మాట. అది సమాజానికి, en masse చెప్పింది కాదు. అది విస్తృత ప్రజానీకానికి, బహిరంగసభల్లో, ప్రచారానికి పెట్టవలసిన గ్రంథం కాదు. అది ఒక రాజుకో, రైతుకో బోధించింది కాదు. కురుక్షేత్రంలో సైన్యానికంతటికీ వినిపించిందికాదు. నిష్ఫలమైన, నిష్ఠురమైన కర్మ చేయకతప్పనప్పుడు, ఆ కర్మ ఎందుకు నెరవేర్చాలనే సందేహం కలిగిన ఒక ఆత్మీయుడికి అతడి మిత్రుడు, సారథి చెప్పినమాట. యుద్ధం చెయ్యమని పదిమందినీ ప్రేరేపిస్తూ చెప్పిన సామాజిక తత్త్వశాస్త్రం కాదు.

ప్రతి మనిషి జీవితంలోనూ ఒక సంక్షుభిత సమయం వస్తుంది. ఆ సమయంలో అతడికి గీత అతడికి అవసరమవుతుంది. కొందరికి దమ్మపదం, కొందరికి సువార్తలు, కొందరికి కొరాను అవసరమైనట్టే. కొందరికి, బహుశా ఈ పుస్తకాలేవీ కూడా అవసరం పడకపోవచ్చు. వారికి గీతతో అవసరం పడలేదు కాబట్టి, నాకు గీతతో పడ్డ అవసరం తక్కువైపోదు. గీత గురించి ఆలోచించినప్పుడల్లా నాకు కలిగే చింత ఒక్కటే. నేను గీతని గౌరవిస్తున్నానే గాని, ఒక కుదీరాంబోసులాగా ప్రాణప్రదంగా ప్రేమించడం లేదు. పద్ధెనిమిదేళ్ళ పసిప్రాయంలో అతడు భగవద్గీతను కావిలించుకుని ఉరికంబానికెక్కాడు. అతణ్ణి ఉరితీసినప్పుడు చిరునవ్వుతో కనిపించాడని బ్రిటిషు పత్రికలు రాసుకున్నాయి.

బహుశా భగవద్గీతను నేనింకా ఒక అధ్యయన గ్రంథంగానే చూస్తున్నానిపిస్తోంది. నా చిన్నతనంలో, పదిపన్నెండేళ్ళ వయసులో, తాడికొండ గురుకులపాఠశాలలో, సాయంకాల ప్రార్థనాసమావేశాల్లో మా మాష్టారు నరసింగరావుగారు, మాతో స్థితప్రజ్ఞ శ్లోకాలు వల్లెవేయించినప్పటినుంచీ, గీత నా జీవితంలో భాగంగానే ఉంటున్నది. కానీ, గాంధీజీలాగా నేనా పుస్తకాన్ని ఒక బిడ్డ తల్లిని కరిచిపెట్టుకునివున్నట్టుగా ఉండలేకపోయాను.

కాని, ఆసక్తి వదిలిపెట్టి కర్మ నెరవేర్చవలసిన అవసరమేమిటో నా ఉద్యోగజీవితం నాకు ముప్పైఏళ్ళుగా చెప్తూనే ఉంది. ఆసక్తి అంటే కేవలం ప్రతిఫలాపేక్షనే కానక్కర్లేదు. ఫలితంలో ఆసక్తి నిజానికి చాలా స్థూలరూపం. దాన్ని మనం సులభంగా గుర్తుపట్టగలం. కాని, ప్రతిఫలం ఆశించకుండా, సేవచేస్తున్నామని మనలో మనకు తెలియకుండానే కలిగే సంతోషలవలేశం కూడా మనల్ని బాధిస్తుందని నాకు ఏళ్ళ మీదట అర్థమయింది. కర్మ నిన్ను బంధిస్తుంది. నువ్వొక పని చేసిన తరువాత, ఆ పని ఎందుకు చేసావనిగాని,

లేదా, ఒక పని చెయ్యనప్పుడు, ఆ పని ఎందుకు చెయ్యలేకపోయావని గాని, పశ్చాత్తాప పడవలసిన అవసరం రాకపోవడమే నిజమైన విముక్తి. నువ్వీ లోకాన్ని వదిలిపెట్టేవేళకి జమాఖర్చుపట్టీ సరిపోవాలి. నువ్వేదీ మోసుకుపోలేవు, నిజమే, కాని, నీ కర్మఫలితం కూడా నిన్ను వెన్నాడకూడదు, ఋణశేషమేదీ మిగిలిపోకూడదు.

'కర్మ యొనర్చుడమెలాగు? ఈ బాధ్యత కఠినతరం' అంటాడు బైరాగి. అన్నం తినేముందు కాళ్ళూ చేతులూ కడుక్కుని కూచున్నట్టుగా, అంతరంగాన్ని శుభ్రపరుచుకుని మరీ కర్తవ్యానికి పూనుకోవలసి ఉంటుంది. అదొక సాధన. తీవ్ర క్రమశిక్షణ. మనుషులు ఈ లోకానికి (పరలోకానికి కాదు) సంబంధించిన తమ కర్తవ్యాల్ని ఎట్లా నెరవేర్చాలో చెప్పే ఒక మాన్యువలు భగవద్గీత. నలభైఏళ్ళ పాటు తన జీవితంలో ఆ మాన్యువలుని అనుసరించి తన జీవితాన్ని దిద్దుకున్న ఒక మనిషి రాసుకున్న నోట్సు ఈ 'అనాసక్తి యోగం.'

7-6-2018

కళాత్మక సత్యం

ఒక జాతి తన స్వాతంత్యం కోసం చేసే పోరాటాలు అన్నీ ఒక్కలానే ఉండనవసరం లేదు. ఇరవయ్యవశతాబ్ది ప్రారంభంలో భారతదేశం ఒక జాతిగా రూపొందుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడినప్పుడు గాంధీ రాట్నం వడికాడు, భగత్‌సింగు బాంబు విసిరాడు, టాగోరు పాటలు పాడాడు. కాని, రాధాకృష్ణన్ చేసిన పోరాటం వీటన్నిటికన్నా భిన్నమైంది, మరింత సూక్ష్మమైంది. ఆయన సత్యాగ్రహం చెయ్యలేదు, జైలుకు వెళ్ళలేదు, పైగా ఆ కాలమంతా పుస్తకాలు చదువుకుంటున్నాడు, పాఠాలు చెప్పుకుంటున్నాడు. కాని తక్కినవారు భారతదేశాన్ని రాజకీయంగా నిలబెట్టడానికి ప్రయత్నిస్తుంటే, ఆయన ఒక దార్శనిక భారతదేశాన్ని ప్రపంచపటం మీద ఆవిష్కరిస్తూ ఉన్నాడు.

భారతదేశ విశ్వవిద్యాలయాల్లో భారతీయ దర్శనాలు పాఠ్యగ్రంథాలుగా లేని రోజుల్లో భారతీయ తత్త్వశాస్త్రమనే ఒక సరికొత్త శాఖను ఆయన ప్రపంచానికి పరిచయం చేసాడు. వివిధ తత్త్వశాస్త్రాలతో భారతీయ దర్శనాల్ని పోలుస్తూ ఆయన ప్రసంగం వెనక ప్రసంగం చేస్తూంటే, ప్రపంచం సవినయంగా సాష్టాంగపడింది.

ఆచార్య రఘురామరాజు తరచూ చెప్పే ఒక సంఘటనని ఇక్కడ చెప్పకుండా ఉండలేక పోతున్నాను. 1909 లో మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజిలో అసిస్టెంటు ప్రొఫెసరు ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళినప్పటికి రాధాకృష్ణన్ వయస్సు ఇరవైమూడేళ్ళు. అప్పటికి భారతదేశంలో భారతీయులు ఐ.సి.ఎస్‌కి ఎంపిక అయినవాళ్ళున్నారుగాని, ఫిలాసఫీ బోధించడానికి ఎంపిక అయినవాళ్ళు లేరు. ఆయనే మొదటి అభ్యర్థి. ఆ ఇంటర్వ్యూ బోర్డు ఆయన్నొక కొంటెప్రశ్న అడిగారు. 'నీ ఇష్టం, నీకు నచ్చిన ఏ భారతీయ తత్త్వవేత్త–నయినా తీసుకుని, ఒక యూరోపియను తత్త్వవేత్తతో పోల్చి రెండు నిముషాలు మాకు వివరించు' అని. యూరపియను తాత్త్వికులతో పోల్చదగ్గ భారతీయ తత్త్వవేత్త ఎక్కడుంటారనే

హేళన లేకపోలేదందులో. రాధాకృష్ణన్ ఆ ప్రశ్నకు సులువుగా జవాబు చెప్పగలడు. కాంట్‌నీ, శంకరాచార్యుణ్ణీ లేదా సోక్రటీసునీ, బుద్ధుణ్ణీ పోల్చి సమాధానం చెప్పగలడు. కాని, వివేకానందుడి స్ఫూర్తితో నిలువెల్లా రగిలిపోతున్న ఆ యువకుడు తన ముందు కూర్చున్న పండితుల్ని నిరుత్తరుల్ని చేయాలనుకున్నాడు. 'ఇప్పుడు నేను పదార్థతత్త్వం మీద యాజ్ఞవల్క్యుణ్ణీ, స్పినోజానీ పోల్చి వివరిస్తాను' అని అనర్గళంగా, అక్కడికక్కడే వివరించడం మొదలుపెట్టేడు. ఆ బోర్డులో ఉన్న పండితులకి స్పినోజానీ, బుద్ధుణ్ణీ పోల్చినా ఏ కొంతో అర్థమై ఉండేది, కాని ఈ యాజ్ఞవల్క్యుడెవరు? అసలు, స్పినోజా అనే పేరు వినగానే యాజ్ఞవల్క్యుడనే చింతనాశీలి స్ఫురించడమే ఒక మహాశ్చర్యం. అంతే, ఆ ఒక్క ప్రశ్నతోటే, ఇంటర్వ్యూ పూర్తయిపోయింది. తక్కిందంతా చరిత్ర.

రాధాకృష్ణన్‌ని చదువుతుంటే, సాహిత్యం చదువుతున్నట్టు ఉంటుందని కృష్ణమూర్తి అన్నారని ఎక్కడో చదివాను.ఆ మాట ఎంత నిజమో మరోసారి తలుచుకుంటూ, An Idealist View of Life (1932) నుంచి కొన్ని పేరాలు (పే.152-55) మీతో పంచు-కుంటున్నాను:

కళాత్మకసత్యం అంటే ఏమిటి?

వస్తుగత ప్రపంచంలోని లోతైన సత్యాన్ని ఒక జ్ఞానంలాగా మనముందు విప్పి పరచడమే కళ. అరిస్టాటిలు చెప్పినట్టు అది అనుకరణే, కాని అది అనుకరించేది బాహ్యప్రకృతిని కాదు, ఆంతరంగిక వాస్తవాన్ని. కవిత్వం చూపించే వస్తుగతసత్యం ఫొటోగ్రాఫుల్లో కనబడే వస్తుగతసత్యం లాంటిది కాదు. మనం వట్టి అనుకరణగా భావించే కళకూడా నిజానికి అనుకరణ కాదు. ఆ కృతివెనక కళాకారుడి మనస్సు ఉంది, ఏదో ఒక స్పష్టమైన ఉద్దేశ్యం ఉంది. కంటికి కనిపిస్తున్న ప్రపంచంలో బయటికి కనిపిస్తున్న దాన్ని మించినదాన్ని మరేదో, ఒక సత్యాన్నో, ఒక మంచితనాన్నో, ఒక సౌందర్యాన్నో అతడు చూడటానికి ప్రయత్నిస్తున్నాడు. అలా చూస్తున్నది బయటి ప్రపంచంకన్నా అతడి ఆంతరంగిక ప్రపంచానికి మరింత సన్నిహితమైంది.

అలాగని, ఈ భావం అతడు చూస్తున్నదానికొక అదనపు అలంకారం కాదు. అతడు చూస్తున్న వస్తువులోనే అది ఇమిడిఉంది, దాన్ని మనం ఆ వస్తుగతసత్యం నుంచి లాగెయ్యలేం. కవిత్వం ద్వారా కవి ఆవిష్కరించే సత్యం అక్కడున్నదే. కవి దాన్ని ఆవిష్కరిస్తున్నాడే తప్ప, కొత్తగా సృష్టించడం లేదు.

కవిత్వం వాస్తవసత్యాన్ని వెల్లడించగలదనే భావాన్ని క్రోసే ఒప్పుకోడు. కవి తన ధ్యానస్థితిలో సత్యాన్ని దర్శించాననీ, తన సృజనస్థితిలో దాన్ని ప్రకటిస్తున్నాననీ అనుకుంటే తనని తాను మోసగించుకున్నట్టేననీ, కవిత్వం ప్రధానంగా ఆత్మవ్యక్తీకరణ మటుకేననీ అంటాడతడు. కాని, ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తీకరణని తక్కిన ప్రపంచం ఎందుకు పట్టించుకోవాలనే ప్రశ్నకి అతడి దగ్గర సమాధానం లేదు. మళ్ళా క్రోసేనే, కళ అంటే అంతఃస్ఫురణ అనీ, అంతఃస్ఫురణ ఎల్లప్పుడూ వాస్తవాన్నిగాని, వ్యక్తిని గాని ప్రతిబింబిం- చేదిగా ఉంటుందంటాడు. దానర్థం కవితాత్మక అంతఃస్ఫురణ కూడా మనకేదో ఒక జ్ఞానాన్ని అందిస్తున్నట్టే కదా. కళ మనకి వ్యక్తిగత సంవేదనలని అందిస్తుంది. అంటే వస్తుగతసత్యం గురించి మనకి అంతదాకా తెలిసినదానికన్నా భిన్నమైనదాన్ని దేన్నో మనకు తెలియచెప్తుంది. అలా చూసినట్టయితే, కళ ద్వారా మనకి లభించే జ్ఞానం సైన్సూ, కామన్ సెన్సూ కూడా ఇవ్వలేనిదే. ఇంద్రియజ్ఞానాన్నే మనం పూర్తివాస్తవంగా భావించలేం. కళ్ళు లేనివాడికన్నా కళ్ళున్నవాడు బయటి ప్రపంచాన్ని ఎక్కువ చూడగలుగుతాడు. వోల్టేరు ఊహించినట్టుగా మనకి వెయ్యి ఇంద్రియాలు సమకూరినా కూడా మనం ఆ ఇంద్రియాల ద్వారా గ్రహించగలిగే వాస్తవమే పూర్ణజ్ఞానమని నమ్మలేం. ఇంద్రియాలద్వారా సమకూరే జ్ఞానం ఆ ఇంద్రియశరీరంకన్నా భిన్నం కాదు.

ఒక గులాబి రంగు మానవనేత్రాలకు మాత్రమే దృగ్గోచరసత్యం. అలాగే ఈ విశ్వం గురించి సైన్సు నిర్మించే చిత్రం కూడా మన వైజ్ఞానిక ఉపకరణాలని బట్టే ఆధారపడుతుంది. రంగులు చూసేవాడికి మటుకే రంగులకు సంబంధించిన సంవేదనలు కలుగుతాయి. ఇంద్రియాల ద్వారా గ్రహించేదీ, తార్కికంగా నిర్మించుకునేదీ, మొత్తం జ్ఞానం అంతా కూడా చూసేవాడూ, చూడబడేదానికీ సంబంధించిన కలయికలోంచే ప్రభవిస్తుంది. కాని కళ ద్వారా మనకు లభించే జ్ఞానం ఇటువంటిది కాదు. అక్కడ వస్తుగతసత్యం పట్ల సుకుమారమైన సంవేదనల ప్రతిఫలనం ఉంటుంది.

ఈ అర్థంలో వైజ్ఞానికసత్యం కన్నా కవితాత్మకసత్యం వేరే. ఎందుకంటే, అది సార్వత్రికంగా మనం తెలుసుకోగల రాశిగత సత్యం కన్నా భిన్నంగా, వైయక్తికంగా మటుకే తెలుసుకోగల, వాసిగత సత్యాన్ని అనుభవం లోకి తెస్తుంది. మనం కొలిచి పరీక్షించగల వస్తుగత లక్షణాల గురించి కాక, మనం ఆంతరంగికంగా అనుభూతి చెందగల అనుగ్రహం గురించి మాత్రమే కళ మాట్లాడుతుంది. కవిత్వం చెప్పే సత్యాలు విస్తారంగా వాదోప- వాదాలతో నిరూపించగలిగేవి కావు, అవి అత్యంత సూక్ష్మంగా అనుభూతి చెందగలిగేవి మాత్రమే. ఆ దర్శనం మనం చూడగలగడం దానికదే ఒక నిరూపణ.

ఒకవేళ కవిత్వం ఆత్మవ్యక్తీకరణనే అనుకున్నా కూడా ఆ కవిత్వంలో ప్రకటితమయ్యే ఆత్మ ఏదో ఒక వ్యక్తి తాలూకు సంకుచితాత్మ కాదు. సౌందర్యం ఎదట మనం పొందే సంతోషం ఒక వ్యక్తిగా మాత్రమే పొందుతామనీ, అందుకని అది వైయక్తికమనీ తన 'క్రిటిక్ ఆఫ్ జడ్జిమెంట్'లో కాంట్ వాదిస్తాడు. అయితే ఆ సంతోషానికి ప్రత్యేక ప్రయోజన–మేమీ ఉండదని కూడా మనం గ్రహించాలి. ఆ సౌందర్యం గురించిన మన నిర్ణయం అందరికీ వర్తిస్తుంది కూడా. అందుకనే కవిత్వం ఎంత లోతుగా ఉంటే అంత విశ్వవ్యాప్తంగా అలరిస్తుంది.

విశ్వాన్ని నడిపే ఒక సూత్రాన్ని కనుగొన్నప్పుడు శాస్త్రవేత్త తాను గమనించిన యథార్థాలను ఒక పద్ధతిలో అమర్చి మనముందు ప్రతిపాదిస్తాడు. కళాకారుడు చేసేది కూడా అటువంటిదే. అతడు వస్తుగతప్రపంచానికి చెందిన సూక్ష్మవిషయాల్ని తన అనుభవం ద్వారా మనకన్నా ప్రత్యేకంగా గమనించి, వాటిని తనకై తాను తిరిగి అమర్చుకుని మన ముందుంచుతాడు. తద్వారా జీవితం గురించిన మన అవగాహనని మరింత పెంపొందించి, వాస్తవాన్ని మరింత సుస్పష్టంగా మనకు ఎరుకపరుస్తాడు. వివిధ వస్తుగతవాస్తవాల్ని మరింత లోతుగా అనుసంధానించడం ద్వారా అతడు వాటిని మనం మరింత బాగా అవగాహన చేసుకునేట్టుగా చేస్తాడు. 'అన్నిట్లోకీ అత్యంత పవిత్రమయిందేది?' అని ప్రశ్నించి, గొథే, ఇట్లా జవాబిచ్చాడు: 'ఇప్పుడు గాని, మరెప్పుడన్నా గాని, మనం గాఢంగా, దేన్ని లోతుగా అనుభూతి చెందుతామో, తద్వారా దేనిలో లోతుగా కుదురుకుంటామో అదే' అని.

కళాసృష్టి మానవజాతికి ఇవ్వగల అత్యంత విలువైన బహుమానాలు శాంతీ, సమాధానమూను. ఒక సుందరగీతం విన్నప్పుడో, లేదా గొప్ప కళాకృతిని చూసినప్పుడో, ఆ అరుదైన క్షణాల్లో మనం దాని ప్రభావానికి లోనవడమే కాక, ఆ క్షణాల్లో మన మనస్సు సాధారణ ఇంద్రియజ్ఞానాన్నీ, తర్కాన్నీ దాటి ఒకింత ఎత్తుకి చేరుకుంటుంది. ప్రతి సుందరశిల్పంలోనూ ఒకింత విశ్రాంతి, ప్రతి సుందరపద్యంలోనూ ఒకింత శాంతి ద్యోతకమవుతూ ఉంటాయి. మన తెలివితేటల్ని బట్టి ఒక కళాకృతిని నిగ్గుతేల్చడానికి ప్రయత్నించి ఉపయోగం లేదు. ఆ పాత్రల్నీ, ఆ సంఘటనల్నీ కేవలం ఊహాగానమని కొట్టి పారెయ్యడానికి లేదు. ఒక నాటకంలోని పాత్రలూ, సంఘటనలూ వాస్తవాలు కాకపోవచ్చు కాని వాస్తవంగా ఉనికిలో ఉన్న విషయాలకన్నా మరింత ఉన్నతతరమైన అస్తిత్వం, సత్యం ఆ పాత్రలు సముపార్జించుకుంటాయి, తద్వారా మరింత అర్థవంతంగా మారతాయి. ఆ పాత్రలూ, ఆ సంఘటనలూ కలల్లాగే కల్పనలే కావచ్చు, కాని, వాస్తవాన్ని

అర్థం చేసుకోడానికి అవి మనకి మరింత ఉపకరిస్తాయి. ఆ అభూతకల్పనల్లోంచే సత్యం సాక్షాత్కరిస్తుంది. నిజానికి అక్కడ ఆ నాటకమే 'వస్తువు', తక్కినవన్నీ నీడలు మటుకే. జీవితప్రాముఖ్యం పట్ల మనకొక జాగృతి కలిగించడమే కళాకారుడి ముఖ్యధర్మం. కాంట్ చెప్పినట్టుగా, 'ఏ ఒక్క ప్రత్యేక ప్రయోజనానికీ పెద్దపీట వెయ్యకుండానే' కళ ప్రయోజన–వంతమైన జీవితం పట్ల మనకొక మెలకువ కలిగిస్తుంది. విడివిడి సంఘటనలు ఎందుకు జరిగాయో, ఎలా జరిగాయో వివరించడం కళాధర్మం కాదు. జీవితం ఎంత అర్థవంతమో తెలియపరచడం, ఈ విశ్వం తాలూకు మరింత సౌందర్యం, మరింత న్యాయం, మరింత ఔదార్యం గురించి మనలో ఆలోచనలు రేకెత్తించడమే దాని లక్ష్యం.

ప్రపంచంలోని నిష్ఠురవాస్తవాలకు కళాకారుడు ముఖం చాటెయ్యడు. అతడికి ప్రపంచం తాలూకు దుఃఖాలు, వేదనలతో పాటు, దాని విజయాలూ, సద్గుణాలూ కూడా తెలుసు. నిజమే, ప్రపంచంలో దుర్మార్గాలూ, క్రూరత్వాలూ ఉన్నాయి, కాని అంతమాత్రాన మనం భీతిల్లవలసిన పనిలేదు. ఈ విశ్వం లోపలి గుజ్జు ఆస్వాదయోగ్యమైందే. ఈ ప్రపంచంలోని చీకటి పార్శ్వాన్ని కళాకారుడు చిత్రిస్తాడు కాని, ఆ దృశ్యం మనల్ని కుంగ–దీయదు. హామ్లెట్, కింగ్ లియర్ లాంటి మహానాటకాలు చదువుతున్నప్పుడు మనకీ ప్రపంచరహస్యమేదో కొంత చేజిక్కినట్టే అనిపిస్తుంది. జీవితపు పునాదుల గురించి తాను గ్రహించిన జ్ఞానాన్ని కవి మనతో పంచుకుంటాడు. బయటి సంఘటనలు ఉత్పాత–కారకాలుగా కనిపించవచ్చుగాని లోపల అంతరంగం ప్రశాంతంగానే ఉంటుంది. జూలియట్ మరణిస్తుంది, నిజమే, కాని ప్రేమప్రతిష్ఠను నిలబెట్టాకనే మరణిస్తుంది. తనను తాను పొడుచుకున్న తక్షణమే ఒథెలో మరణించి ఉండవచ్చుగాని, అప్పుడతడింకా ఈ ప్రపంచం పట్ల ఒక ఫిర్యాదు తీరకుండానే మరణించినట్టవుతుంది. కాని, అతడు డెస్డెమోనా నిష్కల్మషత్వాన్ని గుర్తుపట్టినతరువాతనే మరణిస్తాడు, ఇంక అప్పుడు మృత్యువేమంత పెద్ద–విషయం కాకుండా పోతుంది.

బయటి వైఫల్యాలు, పరాజయాలు జీవితం తాలూకు అంతరార్థాన్ని మసకబరచలేవు. వస్తువుల్లో, సంగతుల్లో ఉండే పారమార్థిక మర్యాద ఆ క్షణాల్లో తళుక్కుమంటుంది. పాతనిబంధనలోని సృష్టికాండంలో దేవుడిలాగా, మనం కూడా మన సృష్టినొకసారి సింహావలోకనం చేసుకున్నప్పుడు, అది మొత్తం మీద బాగానే అనిపిస్తుంది. అప్పుడు మనమీ ప్రపంచాన్ని అంగీకరించగలగడమే కాకుండా, దీన్ని మన సొంత ఇంటిగా కూడా భావించగలుగుతాం. అలాగని అదప్పుడు చెక్కుచెదరని పరిపూర్ణతకు చిహ్నంగా కనిపించదు. అందుకు బదులు, అందులో మనం పెరుగుదల, కొనసాగింపు, ఓపిక

పట్టడాలతో పాటు మరింత వేదన, మరింత విషాదాన్ని చూస్తుంటాం. అయినప్పటికీ, ఈ ప్రపంచగమనంలో మనవంతు పాత్ర మనం నిర్వహించి దాన్ని ఎంతోకొంత ముందుకు నెట్టడమే మన ధర్మం. ఒంటరివాడై పోయిన మనిషికి ప్రపంచాన్ని తిరిగి బహూకరిస్తుంది కళ.

అదొక కెథార్సిసు, ఒక భావావేశ ప్రక్షాళన, ఒక సాఫల్యానుభూతి. కళ మనలో ప్రేరేపించే ప్రాణశక్తులే లేకపోతే జీవితం వట్టి జమాఖర్చుల లెక్కగానే మిగిలిపోతుంది. ఈ ప్రపంచంలోని సుఖదుఃఖాలను అనుభవిస్తూనే అవి తనను అంటకుండా జీవించగలిగిన వాడే మహాత్ముడని భగవద్గీతాకర్త అంటున్నాడు. అటువంటి మహితాత్ములు మాత్రమే జీవితాన్ని నిగ్గుతేల్చడమే కాకుండా, తమని కూడా జీవితం నిగ్గు తేల్చేటట్టు చూసుకుంటారు. అటువంటి వారి సన్నిధిలో మనం కూడా జీవితాన్ని కనీసం కొన్ని క్షణాలేనా ఆ విధంగా పరికించగలుగుతాం. మన అత్యంత విషాదభరితక్షణాలే మన మహామధురమయ గీతాలు కూడా. మనం వేదనద్వారా ఏది తెలుసుకుంటామో దాన్నే తిరిగి పాటకట్టి ప్రపంచానికి కానుక చేస్తాం.

ఒక కళాకృతిలోని సౌందర్యాన్ని ప్రశంసించడమంటే మొత్తం మనసుతో చేపట్టవలసిన పని. కేవలం తార్కిక వివేచన సరిపోదు దానికి. కవిత్వాన్ని ఆనందించాలంటే ఒక సహృదయుడు, సమానధర్ముడు కావాలి. కళాకారులు మనకి తమ నేత్రాలిస్తారనీ, అప్పుడు మనం ఆ కళ్ళతో వాళ్ళని చూస్తామనీ షోపెనుహొూవరు అన్నాడు. కళని ఆనందించడానికి కావలసింది నమ్మకమూ, ఒప్పందమూ కాదు, సానుభూతీ, సహానుభూతీను. కనీసం ఆ క్షణానికేనా మనం తక్కిన ఆలోచనలన్నీ వదిలిపెట్టి ధ్యానమగ్నులం కావాలి. 'ష్లీగెలు ఒకవేళ యురిపిడిసుని విమర్శించవలసివస్తే, విమర్శించవచ్చుగానీ, మోకాళ్ళ మీద వాలి మటుకే విమర్శకు పూనుకోవాలని' గొథే హితవు చెప్పాడు. అంటే ముందు అతడు తనని తాను పక్కన పెట్టేసుకోవాలన్నమాట. కళాకృతిని అర్థం చేసుకోవాలంటే అదొకటే మార్గం. సౌందర్యసృష్టీ, సౌందర్యదృష్టీ రెండూ కూడా బుద్ధికి అందే విషయాలు కానేకావు.

5-9-2018

కృష్ణమూర్తి నోటుబుక్కు

కవిత్వమంటే ఏమిటి? ఈ ప్రశ్న ప్రతి కవీ ఎప్పటికప్పుడు వేసుకునేదే. ఈ ప్రశ్న వేసుకుని సమాధానంగా ఎందరో ఎన్నో నిర్వచనాలు చేసారు. ప్రతి నిర్వచనమూ సరైనదే, ఎందుకంటే, ఆ సమాధానం వెనక ఆ కాలానికి సంబంధించిన స్ఫూర్తి, అప్పటి సామాజిక అవసరాలూ ఉంటాయి కాబట్టి.

గత ముప్ఫయ్యేళ్ళబట్టీ నేను కూడా ఈ ప్రశ్న వేసుకుంటూ సమాధానం అన్వేషించు-కుంటూ వస్తున్నాను. ఎన్నో దేశాల ఎన్నో కాలాల కవిత్వాన్ని అధ్యయనం చేస్తూ వస్తున్నాను. ఇప్పటికి నాకు రెండు విషయాలు బోధపడ్డాయి.

ఒకటి, కరెంటు రాగితీగలోపలనుంచి కాకుండా, రాగితీగచుట్టూ ప్రవహించుకుంటూ పోయినట్టు, కవిత్వమనేది మాటల్లో ఉండదు, మాటలచుట్టూ ఉంటుందని. రెండవది, పై మాటకి పొడిగింపే, emotionally charged utterance మాత్రమే కవిత్వమవు-తుందని.

ఇక తక్కినవన్నీ, ఛందస్సు, లయ, అలంకారం, చివరికి క్లుప్తత, గాఢత కూడా ఏమంత ప్రధానం కాదు. ఆ మాటలు చెప్తున్నప్పుడు ఆ కవి భావావేశాలు తీవ్రీకరణ చెందాయా లేదా అంతే. కవి నిజంగా emotionally charged అయితే, అతడు రాసింది వట్టి వచనం, వ్యాసం అయినా కూడా అది మనల్ని స్పందించకుండా ఉండలేదు.

ఈ రహస్యం శ్రీశ్రీకి కూడా తెలుసు. బోదిలేరు, పో, మపాసాల్ని తన ఋషులుగా చెప్పుకుంటూ రాసిన ఒక రచనలో ఆయన ఇలా అన్నాడు:

> అతనిది (మపాసా) మహోన్మాదంలోని మహాకవిత్వం. గద్యం పద్యం అనే సరిహద్దులకి అతీతమైనది. పద్యాలేవీ రాయకపోయినా కవి... షార్ట్ స్టోరీకి,

లిరిక్‌కీ బేధం లేదని నా ఉత్సాహంలో ఒక్కొక్కపుడనేస్తుంటానే దానికతని కథలే కారణం..

నా 'నిర్వికల్పసంగీతం' (1986) లో అశోకుణ్ణీ, గాంధీనీ కవులుగా పరిచయం చేయడానికి ఈ ఉత్సాహమే కారణం. ఇన్నేళ్ళ తరువాత కూడా ఈ భావాలు మార్చుకోవడానికి నాకే కారణం కనిపించడం లేదు.

కృష్ణమూర్తి అన్నాడుట. టాగోరుని చదువుతుంటే తాత్త్వికరచన చదువుతున్నట్టుంటుంది, రాధాకృష్ణన్‌ని చదువుతుంటే కవిత్వం చదువుతున్నట్టు ఉంటుందని. ఆ మాట కృష్ణమూర్తి రచనలకు కూడా వర్తిస్తుంది. 'కృష్ణమూర్తి నోట్‌బుక్', 'కృష్ణమూర్తి జర్నల్', కృష్ణమూర్తి టు హిమ్‌సెల్ఫ్' లను అత్యుత్తమ కవితాత్మకమైన రచనలనడంలో నాకే సందేహమూ లేదు. ఉదాహరణకి 'కృష్ణమూర్తి నోట్ బుక్' లో 17-11-1961 నాటి ఈ వర్ణన చూడండి:

> నేలంతా ఆకాశం రంగు తిరిగింది. కొండలు, పొదలు, పండిన వరిచేలు, చెట్లు ఎండి ఇసుకమేటలు వేసిన నదిశయ్య ప్రతి ఒక్కటీ ఆకాశం రంగు తిరిగేయి. కొండలమీద ప్రతి ఒక్క రాయీ, గండశిలలూ మేఘాలుగా, మేఘాలు శిలలుగా కనిపిస్తున్నాయి. ద్యులోకం పృథ్విగా, పృథ్వి ద్యులోకంగా మారిపోయింది. అస్తమిస్తున్న సూర్యుడు ప్రతిఒక్కదాన్నీ మార్చేసాడు. ఆకాశమిప్పుడొక జ్వాలామండలంగా, ప్రతి ఒక్క మేఘంలో, రాయిలో, రప్పలో ప్రతి ఒక్క ఇసుకరేణువులో నెరుసులు చిమ్ముతూంది. అకాశజ్వాలలో ఆకుపచ్చ, ఊదా, కపిల, ధూమ్రవర్ణాలు నాలుకలు చాపుతున్నాయి. అక్కడ కొండ మీద కపిలకాంతి, బంగారు ముద్ద. దక్షిణం వైపు కొండలమీద రగుల్తున్న సున్నితమైన ఆకుపచ్చ, పలచబడుతున్న నీలిరంగు. తూర్పు వైపు మరొక సూర్యాస్తమయమవుతున్నదా అన్నట్టు ప్రగాఢరక్తవర్ణం, జేగురురంగు, మందారకాంతి, మరుగవుతున్న ఊదా ఛాయ. తూర్పువైపు సూర్యాస్తమయం కూడా పడమటిదిక్కులానే వైభవోజ్జ్వలంగా ఉంది. అస్తంగమిత సూర్యబింబం చుట్టూ అల్లుకున్న కొన్ని మబ్బులూ నిర్మలంగా, పొగలేని నిప్పులాగా, ఎప్పటికీ ఆరని జ్వాలలాగా కనిపిస్తున్నాయి. ఈ మహాగ్ని తన సమస్త సాంద్రతతో ప్రతి ఒక్కదానిలోకీ, పుడమిలోతుల్లోకీ చొచ్చుకుపోయింది. భూమి స్వర్గంగా, స్వర్గం భూమిగా మారిపోయింది. ప్రతి ఒక్కటీ సజీవచైతన్యంతో రంగులు చిమ్ముతూ రంగు భగవద్రూపం ధరించింది. అయితే ఈ భగవంతుడు మనిషి

నిర్మించుకున్న భగవంతుడు కాడు. కొండలన్నీ పారదర్శకాలై, ప్రతి ఒక్క రాయి, శిల తూలికాతుల్యంగా మారిపోయి రంగులో తేలుతున్నాయి....నువ్వా కాంతిలో కలిసిపోయావు, మండుతున్నావు, రగుల్తున్నావు, బద్దలవుతున్నావు, నీకప్పుడు మూలాల్లేవు, నీడల్లేవు, మాటల్లేవు. సూర్యుడు మరింత లోతుకు జారుతున్నకొద్దీ, ప్రతి ఒక్క రంగూ మరింత ఉగ్రంగా, మరింత తీక్ష్ణంగా మారిపోతూన్నకొద్దీ, నిన్ను నువ్వు పూర్తిగా మర్చిపోయావు, నీదనేదేదీ నీకు స్మరణలో లేదప్పుడు. ఆ సాయంకాలానికి తనదంటూ ఎటువంటి స్మృతీ మిగల్లేదు.

29-6-2013

భారతీయ రచయిత

రాజారావు ఇండో-ఆంగ్లికను రచయితల్లో ప్రసిద్ధుడు. రాజారావు సతీమణి సుసాన్ The Sacred Wordsmith Rajarao Memorial Foundation ప్రారంభించి ఆయన అముద్రిత రచనల్ని ప్రచురించే ప్రయత్నం మొదలుపెట్టారు. ఆ ప్రయత్నంలో భాగంగా కొన్ని సాహిత్య వ్యాసాల్ని ఎంపిక చేసి The Sacred Wordsmith: Writing and the World (2022) పేరిట ఇటీవల వెలువరించారు. ఈ పుస్తకంలో కవులమీదా, శబ్దం మీద ఇరవై వ్యాసాలతో పాటు అయిదు అరుదైన ఇంటర్వ్యూలు కూడా ఉన్నాయి. ఈ పుస్తకానికి సుసాన్ ముందుమాట రాస్తూ రాజారావుని భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని కొనసాగించినవాడుగానూ, టాగోరులాగా ప్రాచీన తపోవనాల్లో గురుకులాల్లో విద్యాబోధన చేసిన ఉపనిషదృషిగానూ అభివర్ణించారు. ఈ పుస్తకం మొత్తం చదివేక ఆమె మాటల్లో అతిశయోక్తి లేదనిపిస్తున్నది.

రాజారావు పందొమ్మిదేళ్ళ వయసులోనే భారతదేశం వదిలిపెట్టి ఫ్రాన్సు వెళ్లి-పోయాడు. ఆ తర్వాత జీవితంలో అధికభాగం యూరోపులోనూ, అమెరికాలోనూ జీవించాడు. జీవితకాలం దాదాపుగా ఇండియాకి బయట జీవించినవాడు భారతదేశానికి తనను తాను ప్రతినిధిగా ఎలా చెప్పుకోగలడు? మాతృభాష కన్నడం అయ్యిండీ ఇంగ్లిషు లోనే రచనలు చేస్తూ వచ్చినవాడు భారతీయ సంప్రదాయాన్ని కొనసాగించినవాడెలా కాగలడు?

ఈ ప్రశ్నలు రాజారావు తన జీవితమంతా ఎదుర్కుంటూనే ఉన్నాడు. ప్రతిసారీ ఆయన చెప్తూ వచ్చిందేమంటే, తాను ఇండియాని వదిలిపెట్టలేదనీ, తన దేశాన్ని తన మనసులో మోస్తూనే ఉన్నాడనీ, తానెక్కడకివెళ్ళినా, ఏ దేశాల్లో నివసించినా తన ఆత్మలో మాత్రం భారతదేశమే నిలబడి ఉందనీ. ఇవి నమ్మదగ్గ మాటలే. ఎందుకంటే డా.కేశవరెడ్డి

తన జీవితంలో అధికభాగం డిచ్‌పల్లిలోనే గడిపినా, మానసికంగా మాత్రం తాను పుట్టిన ఒంటిల్లులోనే గడిపేడని ఆయన నవలలు చదివినవాళ్ళకి అర్థమవుతూనే ఉంటుంది. అయితే రాజారావుకి భారతదేశం ఒక జ్ఞాపకంగా మాత్రమే కాదు, ఒక అధ్యయన విషయంగా కూడా తోడుగా నిలబడింది. తనని తాను ఒక రచయితకన్నా కూడా ఒక సాధకుడిగా చెప్పుకోడానికి ఎక్కువ ఇష్టపడే రాజారావు తన సాధనకి భారతీయ వేదాంతమే ఆలంబనగా నిలబడిందని పదే పదే చెప్పుకుంటూ ఉన్నాడు.

అలాగని రాజారావు పూర్తిగా తన స్మృతుల్లో మాత్రమే జీవించలేదు. ఆయన అన్ని విధాలుగానూ ఒక ప్రపంచపథికుడుగా, ప్రపంచపాఠకుడిగా కొనసాగుతూనే వచ్చాడు. ఉత్తరార్థగోళంలోని మహానదులూ, మహాపర్వతాలూ ఆయన్ని ఒక్కలానే ప్రభావితం చేసాయి. ఆయన ఒక నది ఒడ్డున కూర్చుని మరొక నదీస్తుతి చేసాడు. ఋగ్వేదంలో విశ్వామిత్రుడు చేసిన నదీస్తుతిని ఆయన ఈ వ్యాసాల్లో కనీసం మూడు సార్లు ప్రస్తావించాడు. ఆయన డాంటే 'పారడైసో'ని వారణాసిలో చదివాడట. డాంటే పుట్టిన ఫ్లోరెన్సు దగ్గర్లోని అర్నో నది ఒడ్డున తులసీదాసుని చదివాడట. టుస్కనీ ఆకాశంలో సూర్యుణ్ణి చూస్తుంటే ఒక్కొక్కప్పుడు అయోధ్యలో వెలుతురులాగా అనిపిస్తుందట. శంకరాచార్యుణ్ణి ఫ్రాన్సులో ప్రవహించే సీన్ నది అర్థం చేసుకున్నట్టుగా మొత్తం యూరోపు అర్థం చేసుకోలేదంటాడు.

తాను చాలాసార్లు సీన్ నది ఒడ్డున కూచుని కాళిదాసుని చదువుకున్నానని చెప్తాడు. ఫ్రెంచిరచయిత బోసువే ని చదువుతుంటే భర్తృహరి గుర్తొస్తాడంటాడు. ఇటాలియను మహాకవి లియోపార్డిని చదువుతుంటే వారణాసిలో గంగ ఒడ్డున కూచుని కబీరుని చదువు-కుంటున్నట్టుగా ఉంటుంది అంటాడు. ప్రపంచసాహిత్యాన్ని ఇలా చదువుకునే మనిషి రచయిత అయితే ఏమిటి కాకపోతే ఏమిటి? ఇండియాలో ఉంటే ఏమిటి? ఆస్టినులో ఉంటే ఏమిటి? కన్నడ వచనకారుల్ని చదువుతుంటే బాదిలేరు గుర్తొస్తాడని రాసాడే ఆ ఒక్కమాట చాలు, నేను రాజారావుని ఆరాధనాపూర్వకంగా చూడటానికి. అయితే బాదిలేరు లో ఉన్న వ్యామోహం, వ్యసనం మాత్రం వచనకారుల్లో లేవని వెంటనే గుర్తుచేస్తాడు కూడా.

తనని ప్రభావితం చేసిన పుస్తకాలు అనే వ్యాసంలో రామాయణంతో పాటు భారతాన్ని కూడా ప్రస్తావిస్తూ, భీష్ముణ్ణి అర్థం చేసుకోలేనివాడికి భారతీయ అనుభవం ఎప్పటికీ అర్థం కాదంటాడు. ముఖ్యంగా భీష్ముడు తన కళ్ళతో చూసి వర్ణించిన ఈ శ్రీకృష్ణ సౌందర్యాన్ని అర్థం చేసుకోలేకపోతే మనం భారతదేశాన్ని ఎప్పటికీ అర్థం చేసుకోలేమంటాడు.

ఏహ్యేహి ఫుల్లాంబుజపత్రనేత నమోత్సు తే మాధవ చక్రపాణే
ప్రసహ్యా మాం పాతయ లోకనాథ రథోత్తమాత్సర్వ శరణ్య సంజ్ఞ్యే
త్వయా హృతస్యపి మమాధ్య కృష్ణ శ్రేయః పరస్మిన్నిహ చైవ లోకే
సంభావితోస్వ్యంధకవృష్ణినాథ లోకైస్త్రిభిర్వీరతవాభియానాత్

ఆయన్ని ప్రభావితం చేసిన రచయితల్లో షేక్స్పియర్ డాస్టొవిస్కి, రోమేరోలా, పాల్ వేలరీ, ఆంద్రే గైడు, రిల్క, యేట్సు, కాఫ్కా, గోర్కీలు ఉండటంలో ఆశ్చర్యం లేదుగాని, గాంధీజీ 'సత్యశోధన' ఆయన్ని అన్నిటికన్నా గాఢంగా ప్రభావితం చేసిన పుస్తకం అని 'కాంతాపుర' నవల చదివినవారికి ఎవరికైనా ఇట్టే తెలిసే విషయమే.

మనం కూడా ప్రపంచసాహిత్యం చదువుతాం. కాని రాజారావులాంటి వాళ్ల పఠనానుభవం కేవలం ఒక పాఠకుడి అనుభవం కాదు, అది ఒక తీర్థయాత్రీకుడి అనుభవం. ఒక ఆధ్యాత్మిక సాధకుడి అనుభవం. ఈ వాక్యాలు చూడండి:

> But where's the god, you ask, the temple? The tree is the temple, too old to be named; going round and round it, you feel holy. The leaves celebrate and shine in the Sun.

ఆ వృక్షం, ఆ పురాతన అశ్వత్థం సాహిత్యం. వాక్కు. వాఙ్మయమైన ప్రతి ఒక్కటీను. అందుకని ఆ వెంటనే ఇలా రాస్తున్నాడు:

> The books I have read, like the ghats I have trod, are just the steps down to the river. Lord, what holiness there be on this earth!

సుసాన్ రాజారావు ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో రాసినట్టుగా రాజారావులో టాగోరుని గుర్తుతెచ్చేది చాలానే ఉంది. టాగోరుని ఒక రినైజాన్సు మానవుడిగా అభివర్ణిస్తూ, రాజారావు, ఆయనలో లియోనార్డు డావిన్సీలోని అంతర్దృష్టి, గొథేలోని విశ్వవ్యాప్త దృష్టి, విక్టర్ హ్యూగోలోని విప్లవశీలత్వాలతో పాటు టాల్స్టాయిలోని సార్వత్రికత కూడా ఉన్నాయని అంటాడు. రాజారావు కూడా అటువంటి సమ్యక్ దృష్టి కోసమే ప్రయత్నిస్తూ వచ్చాడని మనం ఒప్పుకోవచ్చు.

జీవితంలో సింహభాగం భారతదేశానికి ఆవల జీవించినప్పటికీ, రాజారావు తనకి పరిచయమవుతున్న పాశ్చాత్యప్రపంచపు ప్రతి జీవతంతువునీ తనమనసులోని భారత –

దేశానికి ముడివేసుకుంటూ వచ్చాడనే మనం అనుకోవచ్చు. India's greatness lies in its capacity to absorb అని అన్నాడాయన ఒక ఇంటర్వ్యూలో. స్విట్జర్లాండులో జెనీవాలో కూచుని దూరంగా మౌంట్‌బ్లాంకు శిఖరం కేసి చూస్తున్నప్పుడు తనకి పార్వతీ–పరమేశ్వరులు కనిపించారని చెప్తే ఆ మాటలు నిజమనే అనిపిస్తుంది. 'ప్రతి ఒక్క భారతీయుడూ తానెక్కడికి వెళ్ళినా తన హిమాలయాల్నీ, తన గంగానదినీ తనవెంట మోసుకుపోతూనే ఉంటాడు' అని రాసాడాయన ఒక వ్యాసంలో.

గత శతాబ్ద ప్రారంభంలో టాగోరు, గాంధి, నెహ్రూ వంటివారు భారతదేశాన్ని తక్కిన ప్రపంచం నుంచి వేరుచేసి చూడటానికి ఇష్టపడలేదు. ప్రపంచమూ, భారతదేశమూ పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడంలోంచే ఒక నవజీవనం వికసిస్తుందని వారు నమ్మారు. రాజారావు నమ్మకం కూడా అదే. ఆయనిలా అంటున్నాడు:

> A united world was not created yesterday- it has always existed. Thought has always flown from country to country and back again to its country of origin.

అక్కడితో ఆగకుండా ఈ మాట కూడా అంటున్నాడు:

> People did not live in nations, they lived in the world.

ఇంతకన్నా అవసరమైన మాట ఈనాటి ప్రపంచానికి మరొకటి ఉంటుందనుకోను.

ఈ పుస్తకం రెండవభాగంలో పదకొండు వ్యాసాలు భాషగురించీ, వాక్కు గురించీ, శబ్దం గురించీ ఉన్నాయి. రాజారావు తనని తాను ఒక శబ్దబ్రహ్మ ఉపాసకుడిగా చెప్పుకున్నాడు. ఈ పుస్తకం తెరవగానే వాక్యపదీయం నుంచి భర్తృహరి శ్లోకం ఒకటి ఎత్తిరాసింది కనిపిస్తుంది. అక్కడ మూలం ఇవ్వలేదుగాని, వాక్యపదీయంలో ఆ 1.131 శ్లోకం ఇలా ఉంది:

> తస్మాద్యః శబ్దసంస్కారః సా సిద్ధిః పరమాత్మనః
> తస్య ప్రవృత్తితత్త్వజ్ఞస్తద్బ్రహ్మామృతమశ్నుతే

(కాబట్టి శబ్దసంస్కారమే పరమాత్మ సిద్ధించే మార్గం. ఆ దారి తెలిసినవాడికి అమృత సత్యం లభిస్తుందని చెప్పవచ్చు)

రెండు పదాలు: శబ్దసంస్కారం, అమృతసత్యం. ఎవరు శబ్దసంస్కారాన్ని సాధనచేస్తారో వాళ్ళ సాహిత్యసంస్కారం నిజంగా గొప్పది. అది గంగానదిలాగా తనని చేరవచ్చిన ప్రతి

ఒక్కరినీ పునీతుల్ని చెయ్యగలుగుతుంది. ఈ పుస్తకం చదవకముందు నాకు రాజారావు గురించి ఎక్కువ తెలియదు. కాని ఆయన శబ్దబ్రహ్మాన్ని ఉపాసించాడని తెలిసిన తరువాత నాకిప్పుడు ఆయన ఎంతో విలువైన వ్యక్తిగానూ, రచయితగానూ కూడా కనిపిస్తున్నాడు.

రాజారావు తన సమకాలానికి చెందిన రచయిత కాడు. అలాగని అతడు ప్రాచీన కాలంలో పుట్టి ఉండవలసిన రచయిత కూడా కాదు. తాను నాలుగు-ఏడు శతాబ్దాల మధ్య కాలానికి చెందినవాణ్ణని ఆయన ఒక ఇంటర్వ్యూలో చెప్పుకున్నాడుగాని, సరిగ్గా ఆ సమాధానం వల్లనే ఆయన సాహిత్యం కాలాతీతమైందని చెప్పవచ్చు.

పుస్తకంలోని చివరి అధ్యాయంలో అయిదు ఇంటర్వ్యూలు ఉన్నాయి. అవి రాజారావు మనోభూమికని స్పష్టంగా ప్రతిఫలిస్తున్నాయి. ఆ జవాబులు చాలాసార్లు నాకు ఆర్.ఎస్. సుదర్శనంగారిని గుర్తుకు తెస్తూ ఉన్నాయి. ఆశ్చర్యం లేదు. వేదాంతులు ఏ దేశంలో ఉన్నా, ఏ భాషలో మాట్లాడినా, వాళ్ళందరూ ఒక్కలానే మాట్లాడతారు. ఆ ఇంటర్వ్యూలు చదువుతుంటే రాజారావుని ప్రత్యక్షంగా చూసినట్టూ, ఆ గదుల్లో ఆయన జవాబులిస్తుంటే మనం కూడా పక్కన కూచుని వింటున్నట్టూ అనిపిస్తుంది. చాలా జవాబులు ఇక్కడ మళ్ళా ఎత్తి రాయాలని ఉందిగాని, ఒకే ఒక్క ప్రశ్న, దానికి ఆయనిచ్చిన జవాబులోంచి ఒక్క వాక్యం మాత్రం ఇక్కడ ఉదాహరిస్తాను.

> Shiva Niranjan: Why do you write novels? What do you want to tell your readers through your novels?
>
> Rajarao: I do not want to tell anything. I am a receiver, not a giver..

ఈ ఒక్క వాక్యంతో చెప్పవచ్చు, రాజారావు నిజంగానే భారతీయ ఆధ్యాత్మిక స్రోతస్వినికి వారసుడని. నిజమైన భారతీయ రచయిత అని.

6-2-2024

సచ్చిదానందమూర్తి-1

ఆ రోజు పొద్దున్నే విజయవాడనుంచి తెనాలి వెళ్ళే దారి పొడుగునా వర్షం పడుతూనే ఉంది. భాద్రపదమాసపు చివరిరోజులు రాగానే వానలు వెనకబట్టి ఆకాశంలో దూదిపింజ-ల్లాగా తెల్లటి మబ్బులు తేలియాడాలి. నదీతీరం పొడుగునా, వాగులమ్మటా, వంకలమ్మటా, చెరువుల్లోనూ, దొరువుల్లోనూ రెల్లు విరబూయాలి. కాలంకాని కాలంలో ఉన్నాం. వర్షఋతువు నడిచినంతకాలం ఎండలు కాసి తీరా ఇప్పుడు వానలు మొదలయ్యాయి.

దారి పొడుగునా ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తిగారి గురించే ఆలోచిస్తూ ఉన్నాను. ఆ ఉదయం తెనాలిలో వివేకావిద్యాసంస్థల సెంట్రలుస్కూల్లో ఆచార్య సచ్చిదానందమూర్తిగారి శతజయంతి సభలో నన్ను మాట్లాడమని పిలిచారు. డా.మూర్తి రాసిన Vedic Hermeneutics (1993) అనే పుస్తకం చదివినప్పుడు నాకు కలిగిన సంతోషాన్ని అణచుకోలేక ఆ పుస్తకాన్ని 'వేదార్థ మీమాంస' (2011) పేరిట తెలుగు చేసాను. ఆచార్య రఘురామరాజు ఆ అనువాదాన్ని 'పొరుగునుంచి తెలుగులోకి' సిరీసులో పుస్తకంగా తీసుకొచ్చారు. ప్రతిఫలం మీద దృష్టిలేకుండా చేసిన ఆ పనికి ఇన్నేళ్ళ తరువాత ఫలితం కనిపించింది. లేకపోతే, తత్త్వశాస్త్ర ఆచార్యులెందరో ఉండగా, ఆచార్య మూర్తిగారి శతజయంతిసభలు నా ప్రసంగంతో మొదలుకావడమేమిటి!

ఆచార్య సచ్చిదానందమూర్తి (1924-2011) తెలుగువాళ్ళు గర్వించదగ్గ తాత్త్వికుడు, తత్త్వశాస్త్ర ఆచార్యుడు అని చెప్పడం అందరూ చెప్తారు గాని, ఆయన ఏమి రాసారు, ఆయన జీవితకాలసాధన తాలూకు ప్రధానసందేశం ఏమిటి అన్నదాని గురించి చెప్పే వాళ్ళెవ్వరు? పాశ్చాత్యదేశాల్లో బెర్గ్‌సను నుండి డెరిడా దాకా ఒక తత్త్వవేత్త ప్రసంగించడానికి వస్తే సమావేశమందిరాలు కిక్కిరిసిపోతాయి. కాని మన కాలంలోనే ఒక తత్త్వశాస్త్ర మహోపాధ్యాయుడు పుట్టి వందేళ్ళు గడిచాయంటే స్తబ్ధత తప్ప ఉద్వేగం కనరావడం లేదెందుకని?

ఇటువంటి విషయాల్లో ప్రజల కన్నా ముందు విద్యాధికులూ, సమాచార ప్రసార సాధనాలూ కదా స్పందించవలసింది! కాని ఆచార్య మూర్తి జీవితకాలం పాటు ఏమి అన్వేషించారో, దేన్ని కనుగొన్నారో, తాను దర్శిస్తూ వచ్చింది దేన్ని మనతో పంచుకున్నారో వాళ్ళకి తెలిస్తే కదా ప్రజలకు తెలిసేది! నిజంగానే కాలంకాని కాలంలో ఉన్నాం మనం అనిపించింది.

కానీ ఆ ఉదయం వివేకానంద విద్యాసంస్థల అధిపతి రావిపాటి వీరనారాయణరావు గారి ఆధ్వర్యంలో సచ్చిదానందమూర్తిగారి శతజయంతి సభ జరిగాక నా భావోద్వేగానికి కొంత ఉపశమనం లభించింది. మొదటిది, ఆయన ఆ సభ, స్కూల్లో, పిల్లలమధ్య జరపడం. రెండోది, సచ్చిదానందమూర్తిగారి కుమారుడు కృష్ణగారితో పాటు, గుజ్జర్లమూడి కృపాచారి, డా.దక్షిణామూర్తి, కె. రామరాజులు పాల్గొన్న ఆ సభలో సచ్చిదానందమూర్తిగారి పైన బి.ఎల్. నారాయణగారు రాసిన పుస్తకం ఆవిష్కరించే అవకాశం నాకు లభించింది. మూడోది, ఒకప్పుడు తాడికొండ గురుకులపాఠశాలలో మా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు నాగళ్ళ వెంకటరత్నంగారు ఆ సభకి రావడమే కాక, నా ప్రసంగం ఆద్యంతం వినడం కూడా.

2

సత్యం గురించి మానవుడు చేసే అన్వేషణ ప్రధానంగా రెండురూపాల్లో వ్యక్తమవుతూ వచ్చింది. ఒకటి, విశ్వాసం. అంటే సత్యం భగవంతుడు మాత్రమేననీ, తక్కిన దృశ్య ప్రపంచమంతా నశ్వరమనీ పవిత్రగ్రంథాలు చెప్తూ వచ్చిన విషయాలు. వాటిని విశ్వసించడం ముఖ్యమంటుంది మతం. మతగ్రంథాల్లోని వాక్యాలు దేవుడు ప్రవక్తలకీ, ఋషులకీ అందిన revelation అనీ, వాటిని విధేయంగా విశ్వసించడమే మన కర్తవ్యమనీ భావించడం ఒక మార్గం. రెండోది, ఆ గ్రంథాల్నీ, ఆ సత్యాల్నీ గుడ్డిగా నమ్మకుండా, ప్రశ్నిస్తో, వాటిని ఎప్పటికప్పుడు నిగ్గుతేల్చుకుంటో, వస్తుగతసత్యాన్ని ప్రయోగపద్ధతిలో ఎప్పటికప్పుడు కనుక్కుంటూ, నిరూపించుకుంటూ ఉండాలని చెప్తుంది సైన్సు. మతగ్రంథాలు చెప్పే సత్యం ఏ మతానికి ఆ మతానికి మాత్రమే లభించిన revelation కాగా, తాను చెప్పేది objectively verifiable truth అని సైన్సు చెప్పుకుంటూ ఉంటుంది.

సైన్సు దృష్టిలో శాశ్వతసత్యాలూ, నిశ్చలసత్యాలూ ఉండవు. ప్రశ్నించడం, ప్రయోగ పద్ధతిద్వారా పరీక్షించి సూత్రాలు రాబట్టడం సైంటిఫిక్ మెథడు. కానీ శాస్త్రీయ వివేచన ద్వారా మాత్రమే మనం సత్యాన్ని తెలుసుకోగలమనీ, తక్కిన ఏ మార్గాలూ సత్యానికి

చేరువగా తీసుకుపోలేవనీ వాదించడం మొదలుపెట్టాక సైన్సు సైంటిజంగా మారుతుంది. ఉదాహరణకి సైన్సు ఇంట్యూషనుని నమ్మదు. కాని చాలా సైంటిఫిక్ ఆవిష్కరణలు ఒకటి కనుక్కోబోతే మరొకటి బయటపడటం కూడా సైన్సుచరిత్రలో అరుదు కాదు. కాని దాన్ని సైన్సు సెరెండిపిటీ అంటుంది. అలాగే, ఎంత శాస్త్రీయ పద్ధతిలో విచారణ చేపట్టినప్పటికీ, విషయాన్ని పరిశీలించే ఒక ద్రష్ట, తాను చూసినదాన్ని మనకు తన భాషలో నివేదిస్తున్నంత కాలం సైన్సు కూడా పూర్తిగా ఆబ్జెక్టివు కాలేదని గుర్తుపెట్టుకోవాలి.

అయితే గమనించవలసిందేమంటే, ఈ రెండింటిలోనూ, అంటే సైన్సులోనూ, మతం లోనూ కూడా, మనిషి స్వీయానుభవానికీ, స్వీయానుభూతికీ చోటు లేదు. కానీ సత్యంగానీ, దేవుడుగానీ ఏ మనిషికైనా ముందు స్వీయసత్యంగా ఎరుకపడాలి. స్వీయం అని అంటున్నప్పుడు, ఎవరి ఉనికి మాత్రమే వారికి ధ్రువపడే మొట్టమొదటి సత్యమైనప్పుడు, ఆ తమదైన ఉనికి గురించి మాట్లాడే ఒక విచారణ కూడా మనిషికి అవసరమయ్యింది. అది అటు మతమూ కాదు, ఇటు సైన్సూ కాదు. ఆ మధ్యస్థంగా ఉండేది. దాన్నే తత్త్వచింతన అన్నారు.

తత్త్వం అనేది సంస్కృత పదం. 'తత్' అంటే అది, 'త్వమ్' అంటే నువ్వు. 'అది నువ్వే', 'తత్త్వమసి' అని చెప్పే దర్శనాన్ని తత్త్వం అనీ, దాని గురించి ఆలోచించడాన్ని తత్త్వశాస్త్రం అనీ అన్నారు. యూరోపులో దాన్ని ఫిలాసఫీ అన్నారు. అంటే జ్ఞానం పట్ల ప్రేమ. అది పూర్తిగా గ్రీకు పదం. సత్యం గురించిన ప్రసంగం, దాని గురించి ఒప్పించడం, బాగా మాట్లాడటం అదంతా సోఫిస్ట్రీ. వాక్చాతుర్యం. కాని ముందు నువ్వే ఆ సత్యానివి కమ్మంటుంది ఫిలాసఫీ. దాన్ని జీవితంలో అనుష్ఠించుకొమ్మంటుంది. దానికోసం తక్కిన ప్రలోభాలన్నింటినీ పక్కనపెట్టెయ్యమంటుంది.

కాని గత మూడువేలఏళ్ళుగా, గ్రీసులో, చైనాలో, భారతదేశంలో, తత్త్వశాస్త్రం, ఫిలాసఫీ, దర్శనం వంటి వాటిని అనుసరించేవాళ్ళు మళ్ళా రెండుగా చీలిపోయారు. ఒకరు, తాము నమ్మిన సత్యాల్ని తమ జీవితంలో పరీక్షకు పెట్టుకుని అందుకోసం ఎటువంటి మూల్యం చెల్లించడానికైనా వెనకాడక, తమకీ, తమ చుట్టూ ఉన్నవాళ్ళకీ వెలుగైన వారు. మరొకరు, తాము చదివినదాన్నీ, ఆలోచిస్తున్నదాన్నీ సుస్పష్టంగా వివరించడం, చర్చించడం ప్రధానంగా పెట్టుకున్నవాళ్ళు. ఈ రెండో తరహా పండితులకి, తాము కనుగొంటున్న సత్యాల్ని తమ జీవితంలో అనుష్ఠించడం, లేదా వాటికి తగ్గట్టుగా తమ జీవితాలు జీవించడం ముఖ్యం కాదు. తమ జీవితాల్లో, తమ ఆచరణలో తాము ఎలా ఉన్నామన్నదానితో నిమిత్తం లేకుండా, తమ వాక్యాల్లోనూ, ప్రతిపాదనల్లోనూ, సత్యనిష్కర్షలోనూ మాత్రం

రాజీ పడకూడదనుకుంటారు. నేడు ప్రపంచమంతా విశ్వవిద్యాలయాల్లో కనవచ్చే చాలామంది తత్త్వశాస్త్ర ఆచార్యులు ఈ రెండో కోవకి చెందినవారు.

సచ్చిదానందమూర్తి తత్త్వశాస్త్ర ఆచార్యుడు. జీవితకాలంపాటు విశ్వవిద్యాలయాల్లో తత్త్వశాస్త్రం బోధిస్తూ ఉన్నారు. కాని ఆయన ఉద్యోగజీవితంలో ఉన్నప్పుడూ, ఉద్యోగ విరమణ తర్వాతా, మరీ ముఖ్యంగా తన చివరి సంవత్సరాల్లో మొదటి తరహా తాత్వికుడిగా జీవించారు. ఆయనలో అన్నిటికన్నా విశిష్టమైన అంశం అదే.

తన అస్తిత్వం గురించీ, ఈ ప్రపంచం గురించీ అసలు సత్యం ఏమై ఉంటుంది, అది తనకి ఎరుకలోకి ఎలా వస్తుంది, ఆ ఎరుకను తిరిగి తాను తనచుట్టూ ఉన్నవారితో ఎలా పంచుకోగలను అన్నదే ఆయన జీవితకాలం పాటు చేసిన అన్వేషణ. కాని ఈ వెతుకులాటలో సచ్చిదానందమూర్తి ప్రత్యేకత ఏమిటంటే, ఆయన ఎక్కడా మతగ్రంథాల్ని పక్కన పెట్టలేదు, సైన్సుని నిర్లక్ష్యం చెయ్యలేదు. అలాగని ఏ మతానికీ లేదా మతాలు చెప్తున్న సత్యాలకీ గుడ్డివిధేయుడిగా జీవించలేదు, లేదా సైంటిఫిక్ మెథడు మాత్రమే సత్యానికి చేరువగా తీసుకుపోగలదనీ నమ్మలేదు.

అందుకని ఆయన చింతనలోనూ, రచనల్లోనూ మనల్ని అన్నిటికన్నా ముందు ఆకట్టుకునే అంశం అపారమైన చింతనాస్వాతంత్ర్యం. ఆ స్వాతంత్ర్యం ఆయన జీవలక్షణం అనుకోవాలి. కాని తన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోడానికి ఆయన విస్తృతంగా అధ్యయనం చేస్తూ వచ్చారు. ఒకవైపు హిందూ, బౌద్ధ, జైన మతగ్రంథాలు మాత్రమేకాదు, మరొకవైపు క్రైస్తవ, మహ్మదీయ, దూరప్రాచ్య గ్రంథాలు కూడా ఆయన ఎంత చదవగలరో అంతా చదివారు. వాటితో పాటు, పాశ్చాత్య తత్త్వశాస్త్ర సంప్రదాయానికి చెందిన ప్రసిద్ధ తత్త్వవేత్తల ఆలోచనాధోరణుల్ని నేరుగా అధ్యయనం చేసారు. కానీ అక్కడితో ఆగకుండా ఫిజిక్సు, సైకాలజీ, యాంత్రొపాలజీల్ని కూడా అధ్యయనం చెయ్యడం ఆయన ప్రత్యేకత. మరీ ముఖ్యంగా న్యూక్లియర్ ఫిజిక్సు, లింగ్విస్టిక్ అనాలసిసు, కల్చరల్ యాంత్రొపాలజీలలో ఎప్పటికప్పుడు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వస్తున్న కొత్త ఆలోచనల్ని అందు-కుంటూ, చదివినదాంతో, తన ఆలోచనని సమన్వయపరుచుకుంటూ, తాను దర్శిస్తున్న దానికి అనుగుణంగా తన దైనందినజీవితాన్ని తీర్చిదిద్దుకుంటూ గడిపేడు ఆయన.

ఇరవై, ఇరవై ఒకటవ శతాబ్దాల్లో ఒక మనిషి తత్త్వశాస్త్రం చదివి ఏమి చెయ్యగలడో, ఏమి చెయ్యవచ్చునో సచ్చిదానందమూర్తి తన జీవితం ఒక ఉదాహరణగా నిరూపించారని చెప్పవచ్చు.

Conformity తత్త్వశాస్త్రపు ప్రధానశత్రువు. ఒకవిధంగా చెప్పాలంటే మనిషి మనిషిగా జీవించడానికి కూడా అదే ప్రధానశత్రువు. Conformity అంటే ఎవడు ఏమి చెప్పినా తలూపడం. ప్రశ్నించకుండా అంగీకరించడం. ఈ ధోరణి మతపరంగా మూఢభక్తినీ, సామాజికంగా వీరపూజనీ, రాజకీయంగా నియంతృత్వాన్నీ, కళాపరంగా చౌకబారు వినోదాన్నీ, సాహిత్యపరంగా శుష్కప్రసంగాల్నీ ప్రోత్సహిస్తుంది. మరీ ముఖ్యంగా ఈనాటి సోషల్ మీడియా యుగంలో ఇది మనుషుల్ని తమకై తాము ఆలోచించుకోవలసిన, తమకై తాము బాధ్యత పడవలసిన స్థితినుంచి తప్పించి ట్రోలర్లుగా మార్చేస్తుంది. అటువంటి ట్రోలింగు పర్యవసానాలు ఎలా ఉంటాయో మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం.

ఒక మనిషి conformist కాకుండా ఉండటం అంటే, విగ్రహవిధ్వంసకుడిగానో, లేదా నిత్యశంకితుడిగానో లేదా ఎవరికీ జవాబుదారు కాకుండా ఉండటమనో కాదు. నువ్వొక మతసంప్రదాయంలోనో లేదా ఒక జాతీయతలోనో లేదా ఒక విజ్ఞానశాస్త్ర పద్ధతిలోనో లేదా ఆస్తికుడిగానో నాస్తికుడిగానో ఏదో ఒక మార్గంలో ప్రయాణిస్తోనే, non-conformist గా ఉండవచ్చు. అంటే నువ్వు అనుసరిస్తున్న మార్గం ఒక్కటే ఏకైక మార్గం కాదనీ లేదా అంతిమ సత్యం మీద దానికి మాత్రమే గుత్తాధిపత్యం లేదనీ నమ్మడం. నువ్వు అనుసరిస్తున్న మార్గం అన్నిటికన్నా ముందు నిన్ను ఎప్పటికప్పుడు సరిదిద్దుతూ ఉండాలంటే, నువ్వు కూడా నీ మార్గాన్ని సరిదిద్దుకుంటూ ఉండాలి. అది నిత్యవిచారణ వల్లా, నువ్వు నమ్మేది మాత్రమే సత్యం కాదనే వినయంవల్లా మాత్రమే సాధ్యపడుతుంది. సచ్చిదానందమూర్తి తన జీవితం పొడుగునా చేసింది ఇదే. ఆయన రచనలు చదివినప్పుడు మనకి ప్రధానంగా కనిపించేది ఈ నిర్మలత్వమూ, ఈ వినయసౌశీల్యమే.

ఉదాహరణకి ఆయన జన్మతః విశిష్టాద్వైతి. కాని జీవితకాలం పాటు అద్వైతాన్ని అధ్యయనం చేస్తూ వచ్చారు. వేదాంతం పట్ల ఉన్న ఈ ఆసక్తి వల్ల ఆయన బౌద్ధానికి దూరంకాకపోగా, ఆచార్య నాగార్జునుడిపైనా, మాధ్యమిక బౌద్ధం పైనా ఎన్నో మౌలికమైన పరిశీలనలు చేపడుతూ వచ్చారు. భగవంతుడికి సంబంధించినంతవరకూ ఆయనది రామానుజమార్గం. కాని శ్రుత్యర్థాన్ని ఏ మేరకు అంగీకరించాలి అన్నవిషయంలో న్యాయ–దర్శనానికి చెందిన జయంతభట్ట ఆయనకు మార్గదర్శి.

ఆయన ఎఫ్.ఏ చదువుకుంటున్నరోజుల్లో భగవద్గీతకు వ్యాఖ్యానం రాసారు. తర్వాత రోజుల్లో ఆయనకు తత్త్వశాస్త్రం బోధించిన పి.టి.రాజు దృష్టిలో భగవద్గీతకు అంతకన్నా ఉత్కృష్ట వ్యాఖ్యానం మరొకటి లేదు. ఆయన చివరిరోజుల్లో రాసింది వేదార్థమీమాంస. అంటే దాదాపు అరవైఏళ్ళు పైగా ఆయన 'శ్రుత్యర్థ పర్యాలోచన' చేస్తూనే వున్నారు.

తనది 'శ్రుతి భగవతీ ఉపాసన' అని కూడా చెప్పుకున్నాడు. సత్యాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన సహనం తనకి కల్చరల్ యాంత్రొపాలజీనుంచి లభించింది అని చెప్పుకున్నారు. ఏ మనిషీ ఒంటరిగా సత్యాన్ని గ్రహించలేడనీ, మరొక మనిషివల్ల మాత్రమే, ప్రతి మనిషికి మానవత్వం సిద్ధిస్తుందనీ, ఇది తనకి మార్టిన్ బూబరు I-Thou చింతనవల్లనే బాగా బోధపడిందనీ రాస్తారు.

అంటే ఏమిటి? ఆయన హిందూ వేదాంతపు పాదులోనే సత్యాన్వేషణ మొదలు పెట్టారు. కాని న్యాయదర్శనం చూపించిన వెలుగులో తనని తాను తీర్చిదిద్దుకున్నారు. బౌద్ధదర్శనాల స్ఫూర్తితో తనని తాను విస్తృతపరుచుకున్నారు. పాశ్చాత్యతత్త్వశాస్త్ర సంప్రదాయాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయడంవల్ల తన ఎరుకని తాను సక్రమంగా వ్యక్తం చేయడమెలానో తెలుసుకున్నారు. సైన్సు, సైకాలజీ, యాంత్రపాలజీ, రెలిజియస్ ఎక్స్పీరియెన్సుల సమక్షంలో తన చింతన ఒక డాగ్మా కాకుండా, తానొక conformist గా మారకుండా తనని తాను కాపాడుకున్నారు. అంతిమంగా ప్రపంచదర్శనాలన్నిటికీ నిజమైన వారసుడు కాగలిగేడు. అలా మనం కూడా వారసులం కావడమెట్లానో మనకొక తోవ చూపించి వెళ్ళిపోయారు.

3

ఆచార్య సచ్చిదానందమూర్తి ఇంగ్లిషులో ముప్ఫైదాకా, తెలుగులో పన్నెండు పుస్తకాలు రాసారని చెప్తున్నారు. నేనైతే అన్నిపుస్తకాలూ చదవలేదు. చాలా పుస్తకాలు అందుబాటులో కూడా లేవు. కాని ఆయన భావధారను అర్థం చేసుకోడానికి, ఆయన ఆలోచనాపద్ధతినుంచి స్ఫూర్తి పొందటానికి, ప్రధానంగా మూడు పుస్తకాలతో మొదలుపెట్టవచ్చు. మొదటిది, ఆయన పి.ఎచ్.డి కోసం రాసుకున్న అధ్యయనాన్ని తర్వాత రోజుల్లో విస్తరించి వెలువరించిన Revelation and Reason in Advaita Vedanta (1959). రెండు భాగాలుగా ఉన్న ఈ రచనలో ఆయన మొదటభాగంలో, వేదాంతాన్ని తాను అర్థం చేసుకున్న తీరుని వివరించారు. రెండోభాగంలో, తక్కిన అయిదు దర్శనాల సారాంశాన్నీ వివరిస్తూ శ్రుతిని అంటే revelation నీ, తర్కబద్ధ వివేచననీ సమన్వయించే ప్రయత్నం చేసారు.

తన అధ్యయనం మీంచి ఆయన చేసిన సూత్రీకరణలు మధ్యేమార్గానికి చెందినవి. అంటే శ్రుతి వల్ల లభించేది జ్ఞానమేగాని, అది కవిత్వ, కళాత్మకసత్యంలాంటి సత్యమనీ, వైజ్ఞానికసత్యం కాదనీ చెప్పడమన్నమాట. అది కూడా ఒక విధమైన ప్రజ్ఞానమే. సంగీతం వింటున్నప్పుడు మనలో కలిగే తక్షణ అనుభూతి లాంటిది ఆ అనుభవమనీ, దాన్ని

ఇతమిత్థంగా సూత్రీకరించలేమనీ అంటారు ఆయన. దీన్ని apercu అనే ఫ్రెంచి పదంతో సూచిస్తారు. అలాగే ఒక మనిషి తనకి దైవవాణి వినబడిందని ఏ విధంగానూ ఋజువు చెయ్యలేడనీ, అలాగే అతడు వింటున్నది దైవవాక్కే అనిగానీ లేదా ఒక పవిత్రగ్రంథం దైవానుశాసనం అవునా గానీ అన్నది ఏ విధంగానూ బాహ్యప్రమాణాల్తో నిరూపించగలిగేది కాదనీ అని కూడా అంటారు.

తనకు వినబడుతున్నది దైవవాక్కు అవునో కాదో ఎవరికి వారు తేల్చుకోవలసిన సత్యమనీ, దానికి ఒక productive empathy అవసరమనీ అంటారు. తాను ఏ సంప్రదాయంలో పుట్టిపెరిగాడో, ఏ సంప్రదాయానుసారం దైవవాక్కుని విశ్వసిస్తున్నాడో దాన్ని తనకై తాను విధించుకుని, అనుష్ఠిస్తూ, తన జీవితాన్ని దానికి తగ్గట్టుగా నడుపు-కోలేకపోతే అతడు వింటున్నానని చెప్తున్నది దైవవాక్కు కానేరదని కూడా అంటారు ఆచార్య మూర్తి.

ప్రస్తుత కాలంలో ఈ మాట చాలా విలువైన మాట. మతాల పేరుమీదా, సంప్రదాయాల పేరుమీదా ఒకరినొకరు దూషించుకునేవాళ్ళూ, ఒకరిని చూసి మరొకరు అభద్రతకీ, భయానికీ లోనయ్యేవాళ్ళూ, అన్నిటికన్నా ముఖ్యంగా, తమ సంప్రదాయాన్నే ఓటమిపాలు చేస్తున్నారని గుర్తుపెట్టుకోవాలి. ఒక్కమాటలో చెప్పాలంటే, దైవవాక్కు, దైవానుశాసనం వాటిని అనుష్ఠించేవాడికి మాత్రమే నిజం, అలా అనుష్ఠించినంతమేరకూ, అనుష్ఠించినంతసేపూ మాత్రమే నిజం.

ఇక reason కీ దైవానికీ మధ్య పైకి కనిపించే విభేదం తాత్త్వికదృష్ట్యా చూస్తే నిజంగా విభేదం కాదంటారు. అంటే reason అనే దాన్ని ప్లోటినసూ, కాంటూ ఏ అర్థంలో వాడేరో, ratio అనే పదానికి వ్యతిరేకంగా ఎక్కార్టు intellectus అనే పదం ఏ అర్థంలో వాడేడో, ప్లేటో transcendental feeling అంటున్నప్పుడు దేన్ని సూచిస్తున్నాడో, ఆ అర్థంలో 'తరచిచూసినప్పుడు' సమస్త అనుభవంలోనూ దేవుణ్ణి ఒక necessary postulate గా, ఒక implicit నమ్మకంగా కనుగొనవచ్చంటారు.

అయితే ఈ నమ్మకం నిరూపణకు పనికొచ్చే అనుమాన ప్రమాణంకాదు. కాని ఆరుప్రమాణాల్లో ఒకటైన అర్థాపత్తి ప్రమాణం అని అనవచ్చు. అర్థాపత్తి అంటే మనం చూస్తున్న ఒక వాస్తవం ఆధారంగా హేతుబద్ధమైన ఊహాగానంతో ఒక ప్రతిపాదన చెయ్యడం అన్నమాట. ఉదాహరణకి 'దేవదత్తుడు పగటిపూట అన్నం తినడం లేదు, కాని అతడు ఆరోగ్యంగా ఉన్నాడు, అంటే దానర్థం అతడు రాత్రిపూట బాగానే అన్నం తింటూ ఉండవచ్చు' అనడం లాంటిది.

ఈ సందర్భంగా ఆయన తన సమకాలికుడైన అస్తిత్వవాది కార్ల్ జాస్పర్సు చెప్పిన ఈ వాక్యం ఉదాహరిస్తారు. జాస్పర్సు అంటున్నాడు:

> Our enduring task in philosophical endeavor is to become authentic men by becoming aware of being; or, and this is the same thing: to become ourselves by achieving certainty of God.

ఈ వాక్యం ఈ పుస్తకానికి సారాంశంగా చెప్పవచ్చు. అంటే నువ్వు ఒక మనిషిగా రూపొందడానికి ఒక దైవవాక్కుని విశ్వసిస్తున్నావంటే, ఆ క్రమంలో నువ్వు విశ్వసనీయమైన మానవుడివి కాగలుగుతున్నావంటే, నీ వరకూ దేవుడున్నట్టే అని నిశ్చయించుకోవచ్చు. అయితే, దాన్ని ప్రయోగశాలలో నిర్ధారించలేం కాబట్టి అది వైజ్ఞానిక సత్యం కాకపోవచ్చు, లేదా మతగ్రంథాలు చెప్పాయి కాబట్టి నమ్మితీరవలసిన సత్యం అని మనం చెప్పలేకపోవచ్చు, కానీ, అది సత్యమే. ఎందుకంటే, దేవదత్తుడు పగటిపూట అన్నం తినకపోయినా అతడు ఆరోగ్యంగా ఉన్నాడంటే అందుకు కారణం రాత్రిపూట అన్నం తినడం కావొచ్చేమో అన్నది ఎలా కారణం కాగలదో, నువ్వు ఒక విశ్వసనీయమానవుడిగా మారడం ద్వారా నువ్వు నమ్మిన దైవానికి ఈ లోకంలో నువ్వే ఒక నిరూపణగా నిలబడుతున్నావు.

29-9-2024

సచ్చిదానందమూర్తి-2

సచ్చిదానందమూర్తిగారి పుస్తకాల్లో ముఖ్యంగా మూడు పుస్తకాలు చదవదగ్గవి అని చెప్పాను కదా. అందులో రెండో పుస్తకం, Indian Spirit (1965) పేరిట ఆయన వెలువరించిన వ్యాససంపుటం. ఇందులో ఎనిమిది వ్యాసాలున్నాయి. వాటిల్లో భారతీయ తత్త్వచింతన అనే ఒక వ్యాసం కూడా ఉంది. ఆ వ్యాసమే దానికదే విడిగా ఎన్నో భాషల్లోకి అనువాదమైంది కూడా. ఈ వ్యాసాల్లో ఆచార్య మూర్తి భారతీయ, హిందూ తత్త్వచింతన గురించి, సంస్కృతి గురించీ, నైతికత గురించీ తన ఆలోచనల్నీ, నమ్మకాల్నీ పంచుకున్నారు. పుస్తకానికి రాసుకున్న ముందుమాటలో భారతీయసంస్కృతి పట్ల తనది మానవతావాద దృక్కోణం అని చెప్పుకున్నారు. 'రీజన్ అండ్ రివలేషన్' పుస్తకంలో ఒకచోట తాను హిందూ ఫండమెంటలిస్టుని కానని కూడా చెప్పుకున్నారు. ఈ పుస్తకానికి రాసుకున్న ముందుమాటలో మరొక అడుగుముందుకు వెళ్ళి భారతీయ సంస్కృతి మొత్తాన్ని ఒక్క హిందూపార్శ్వంతోనే గుర్తుపట్టాలని చూడటం మూర్ఖత్వం, సంకుచితత్వం అని కూడా అన్నారు.

ఆ ముందుమాటలో మరొకమాట కూడా నన్ను చాలా ఆకట్టుకుంది. ఒక సంస్కృతిని అర్థం చేసుకోవడం ఒక philosophical task అని అన్నారాయన. ఒక సంస్కృతిని అధ్యయనం చెయ్యడం సాంస్కృతిక కర్తవ్యమో, సామాజికశాస్త్ర కర్తవ్యమో లేదా రాజకీయ కర్తవ్యమో అని ఉంటే నేను ఆశ్చర్యపడి ఉండేవాణ్ణి కాను. కాని సంస్కృతిని పరిశీలించడం, ఆ సంస్కృతిలో నిబిడమై ఉన్న దృక్కోణాల్ని మూల్యాంకనం చెయ్యడం తాత్త్విక కర్తవ్యం అనడంలోనే మూర్తిగారి మూర్తిమత్వం తేటతెల్లమవుతూ ఉంది. అవును కదా, అసలు ఒక సంస్కృతిని చూడవలసింది తాత్త్వికదృష్టితో కదా. అప్పుడు మనం ఆ సంస్కృతిలోని విభిన్నదృక్పథాలపట్లా, వైరుధ్యాల పట్లా తీర్పరులం కాకుండా సహిష్ణుతతో చూడగలుగుతాం.

మన జాతీయోద్యమం మనకి నేర్పిన విలువైన పాఠం ఇది. భారతదేశ సభ్యత, సంస్కృతి ఏ ఒక్కరి సొత్తో కాదనీ, మనం ఇప్పుడిలా ఉన్నామంటే, మన మంచిచెడ్డలన్నిటికీ ఎందరో కారకులనీ, అన్నిటికన్నా ముందు భారతదేశం, కలిసి జీవించడానికే పెద్దపీట వేస్తూ వచ్చిందనీ మనం గుర్తుపెట్టుకుంటే, భారతీయ సంస్కృతిని అర్థం చేసుకోవడం ఒక తాత్త్వికకర్తవ్యం ఎందుకో గ్రహిస్తాం.

భారతదేశం గురించి తెలుసుకోడానికి తనకు ఎవరెవరు తోడ్పడ్డారో, ఏయే గ్రంథాలు బాసటగా నిలిచాయో వివరంగా చెప్పుకున్నారు. అన్నిటికన్నా ముందు ఆయన మహాభారతానికి కృతజ్ఞత ప్రకటించారు. ఆ తర్వాత పురాణాలకీ, ముఖ్యంగా భాగవత పురాణానికీ అని చెప్తూ హెన్రిక్ జిమ్మరు, బి.కె.సర్కారుల వల్ల అర్థశాస్త్రం, నీతిశాస్త్రం గురించి మరింత వివరంగా తెలుసుకోగలిగానని రాసారు. వేదసంహితల్నీ, మీమాంసనీ అర్థం చేసుకోడానికి కున్హన్‌రాజా, గంగానాథ్ ఝా రచనలు తోడ్పడ్డాయనీ, మధ్వ పండితులు, రామానుజులూ, బాలగంగాధర్ తిలక్‌ల వల్ల భగవద్గీతని అర్థం చేసుకో-గలిగానని చెప్పారు. అలానే రైస్ డేవిసు, ఇ.జె.థామసు, రాహుల్ సాంకృత్యాయనుల వల్ల బౌద్ధాన్నీ, నెహ్రూ, కె.పి.జయస్వాలు, అరవిందులు, మాక్స్ వెబరు రచనల వల్ల భారతీయ చరిత్రనీ, సామాజిక శాస్త్రాన్నీ అర్థం చేసుకునే అవకాశం లభించిందని రాసారు. అలానే అల్బెరూనీ, బెర్నియరులాంటి విదేశీపర్యాటకుల రచనల వల్ల అప్పటి కాలాల గురించి తెలుసుకోగలిగేనని చెప్పారు.

భారతదేశచరిత్రనీ, సంస్కృతినీ అధ్యయనం చేయడం మొదలుపెట్టాక మొట్ట-మొదటగా ఎవరికేనా స్ఫురించేది బహుళాభిప్రాయాల ఉనికి గురించి. యూరోపు చరిత్ర చదివినప్పుడు మనకి అర్థమయ్యేదేమిటంటే, సా.శ. నాలుగవ శతాబ్ది నుంచీ మతం, పదిహేడోశతాబ్ది నుంచీ మతం స్థానంలో రాజ్యం అక్కడ బహుళాభిప్రాయాల్ని అణచి-పెడుతూ వచ్చాయని. ఎన్ని రకాల ప్రజాస్వామిక ప్రయోగాలు జరిగినా, జరుగుతూ వస్తున్నా యూరోపులో ఇప్పటికీ బహుళ అస్తిత్వాల్ని నిభాయించుకోగల సహిష్ణుత అలవడనే లేదు. యూరోపు, అమెరికా చరిత్రల్ని చదువుకునే పద్ధతిలోనే భారతదేశ చరిత్రని కూడా నిర్మించాలనుకునేవాళ్ళు అటు మతఛాందసవాదులుగానో లేదా ఇటు సిద్ధాంత-ఛాందసవాదులుగానో ప్రవర్తించడంలో ఆశ్చర్యం ఏముంది? ఇటువంటి ఏకపక్ష దృక్కోణాల మధ్య ఆచార్య మూర్తిలాంటి జిజ్ఞాసువు కనబడితే నాలాంటివాళ్ళకి ప్రాణం లేచొచ్చి-నట్టుంటుంది. ఈ పుస్తకంలో ఆయన ఒక జైన పండితుడి శ్లోకం ఒకటి ఉదాహరించారు. గుణరత్నుడనే ఆ సాధువు ఇలా అన్నాడట:

'బుద్ధుడి బోధలు వినదగ్గవి, జైనుల బోధలు అనుష్ఠించదగ్గవి, వేదాంతుల బోధలు అనుసరించదగ్గవి, కాగా పరమశివతత్త్వం ధ్యానించదగ్గది' అని.

ఎందుకంటే పరమసత్యం అంటూ ఒకటి ఉంటే దాన్ని ఏదో ఒక్కదారిలోనే కనుక్కోలేం. భారతీయ ఆకాశం కింద తలెత్తిన ప్రతి దృక్కోణంలోనూ ఏదో ఒక విలువైన అంశం ఉంటుంది. సత్యాన్ని అవగతం చేసుకోవాలనుకున్నవాళ్ళు వీలైనన్ని పార్శ్వాల్తో పరిచయం పెంచుకోవాలి. బహుళమతానుయాయుల్ని సంప్రదించాలి. ఆ పద్ధతిలో నీకు సత్యం చేజిక్కినా చేజిక్కకపోయినా, ముందు నువ్వు సహజీవనానికి అవసరమైన సహిష్ణుత నేర్చుకోగలుగుతావు.

ఎప్పుడో ముప్పై ఏళ్ళ కిందట సుదర్శనం గారు సచ్చిదానందమూర్తిగారు ఎడిటు చేసిన పుస్తకం ఒకటి నాకిచ్చారు. Readings in Indian History, Politics and Philosophy (1967) అనే ఆ గ్రంథం విలువ నాకు అప్పట్లో పూర్తిగా తెలియలేదు. కాని ఏళ్ళు గడిచాక, భారతీయ విశ్వవిద్యాలయాలూ, సమాచార ప్రసారసాధనాలూ cauldrons of hate గా మారిపోతూండటం చూస్తున్నాక ఆ పుస్తకం ఎంత విలువైనదో అర్థమవుతూ ఉంది. భారతీయసభ్యతనీ, సంస్కృతినీ, దర్శనాల్నీ గౌరవించే ప్రతి ఒక్కరిదగ్గరా ఉండవలసిన పుస్తకం అది. నాకు తెలిసి అటువంటి సంకలనం మరొకటి ఇప్పటి రోజుల్లో రావడం దాదాపు అసాధ్యం.

ఇక మూర్తిగారి రచనల్లో నేను ప్రత్యేకంగా పేర్కొనాలనుకున్న మూడో పుస్తకం Metaphysics, Man and Freedom (1963) అనే రచన. ఇది ఆచార్యమూర్తి 1958-62 మధ్యకాలంలో ఇచ్చిన మూడు ప్రసంగాల సమాహారం. పట్టుమని తొంభై పేజీలు కూడా లేని ఈ చిన్న పుస్తకం సచ్చిదానందమూర్తిగారి జీవితకాల దర్శనసారాంశం అని చెప్పవచ్చు. తత్త్వశాస్త్రం గురించీ, మనిషి గురించీ, అతడి ఆరాటాల గురించీ తెలుసు–కోవాలనుకునేవాళ్ళకి ఇంతకన్నా గొప్ప ప్రారంభ పరిచయగ్రంథం మరొకటి లేదని చెప్పగలను. అలాగని ఇది బిగినర్ల కోసం ప్రాథమికస్థాయిలో రాసిన పుస్తకం కాదు. ఈ ప్రసంగాలు ఆచార్య మూర్తి షికాగోలో, వెనిసులో, ఢిల్లీలో ఉద్దండులైన తన సమకాలిక తత్త్వశాస్త్ర ఆచార్యుల్ని ఉద్దేశించి చేసిన ప్రసంగాలు. కానీ తత్త్వశాస్త్రంతో కనీస పరిచయం కూడా లేనివాళ్ళకి కూడా ఈ ప్రసంగాలు ఎంతో సరళంగా అర్థమవుతాయి.

పుస్తకం చదువుతున్నంతసేపూ ఆ రచనని అవశ్యం తెలుగులోకి తీసుకువద్దామన్న కోరిక బలపడుతూనే వచ్చింది. అందుకు కావలసిన అనుమతికోసం సచ్చిదానంద–

మూర్తిగారి కుమారులు రమేష్‌గారికి ఫోను చేసినప్పుడు ఆయన ఈ పుస్తకాన్ని సచ్చిదానంద మూర్తిగారే తెలుగులో కూడా రాసేరని చెప్పారు. చెప్పడమే కాక 'మనిషి–ముక్తి' (1970) అనే ఆ పుస్తకం కాపీ కూడా నాకు పంపించారు. నవోదయ పబ్లిషర్సు ప్రచురించిన ఈ తెలుగు అనువాదంలో ఆచార్య మూర్తి తన ఇంగ్లిషు పుస్తకం పైన వచ్చిన అయిదు సమీక్షలు కూడా జతపరిచారు. అయితే ఆ అనువాదం చూసేక కూడా ఆ ఇంగ్లిషు పుస్తకాన్ని తెలుగు చెయ్యాలన్న నా కోరిక చల్లారలేదు. భాష ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటుంది కాబట్టి, యాభై ఏళ్ళకిందటి ఈ అనువాదానికి తోడుగా నేను కూడా మరొకసారి అనువదిస్తాను అన్నాను ఆయనతో.

ఒక మనిషి ఒక విషయం మీద సాధికారికత సాధించాడని ఎప్పుడు చెప్పగలమంటే అతడు తాను చెప్పదలుచుకున్నదాన్ని క్లుప్తంగా, సూటిగా, సాధారణశ్రోతలకి కూడా సుబోధకంగా చెప్పగలిగినప్పుడు. తత్త్వశాస్త్రం పట్లా, సత్యమీమాంస పట్లా సచ్చిదానంద–మూర్తి నిజంగానే ఆచార్యస్థానీయుడని ఈ పుస్తకం సాక్ష్యం చెప్తున్నది.

ఇందులో మొదటి ప్రసంగంలో ఆయన మెటఫిజిక్సు గురించి చర్చించారు. మెటఫిజిక్సు అనే మాటకి సరైన తెలుగు పదం లేదు. దాన్ని అధిభౌతికశాస్త్రం అని గానీ, లేదా ఆచార్యమూర్తి వ్యవహరించినట్టుగా అతిభౌతికశాస్త్రమనీ గానీ పేర్కోడం ద్వారా తెలుగు పాఠకుడికి ఏమీ తెలియచెప్పలేరు. ప్రతి శాస్త్రానికీ ఒక విషయవస్తువు ఉంటుంది. ఫిజిక్సు భౌతికపదార్థాన్ని అధ్యయనం చేస్తుంది. యాంత్రపాలజీ మానవుడి గురించి పరిశీలిస్తుంది. వృక్షశాస్త్రం మొక్కలగురించీ, జంతుశాస్త్రం జంతువుల గురించీ మాట్లాడు–తుంది . మరి మెటఫిజిక్సు దేని గురించి మాట్లాడుతుంది? ఇంగ్లిషులో చెప్పాలంటే దాని విషయవస్తువు being as such. ఇంతకీ బీయింగు అనే పదానికి కూడా తెలుగు లేదు. తత్త్వశాస్త్ర అనువాదకులు 'సత్త' అనే పదం వాడతారు. కానీ ఆ పదం వల్ల మనకేమీ తెలియదు. అలానే becoming అంటే?

బీయింగు అంటే 'ఉండటం', బికమింగు అంటే 'కావటం'. కాని ఈ రెండు క్రియాపదాలకీ తెలుగులో ఒక తాత్త్వికపరిభాష స్థాయి లేదు. కాబట్టి ఆ పదాలు కూడా మనకేమీ చెప్పలేవు. సంజీవ్ దేవ్‌గారు బీయింగుని 'భావము' అనీ, బికమింగుని 'భవము' అని అన్నారు. 'భూ సత్తాయాం' అని అమరకోశం చెప్పింది కాబట్టి ఆ రెండు పదాలూ నిజంగానే ఎంతో సముచితమైన పదాలు. కాబట్టి మెటఫిజిక్సుని తెలుగులో 'భావవివేచన' అందాం (ఏళ్ల కిందట నేను 'సత్యాన్వేషణ' పుస్తకం వెలువరించి నప్పుడు అందులో మెటఫిజిక్సుని 'సత్యమీమాంస' అని అనువదించాను.)

భావవివేచన అంటే మౌలికంగా మనం ఉండటం గురించిన చింతన. యూరోపులో తత్త్వశాస్త్రం కావడం మెటఫిజిక్సుగానే మొదలయినప్పటికీ, ఇరవయ్యవ శతాబ్దానికి వచ్చేటప్పటికి అది ఒట్టి స్పెక్యులేషనుగా నిరాకరణకు గురయ్యింది. వట్టి ఊహాగానమో లేదా మాటలగారడీనో అని తత్త్వశాస్త్ర ఆచార్యులే దాన్ని పక్కకు నెట్టేయడం మొదలుపెట్టారు. ఆ నేపథ్యంలో ఆచార్య మూర్తి చేసిన ప్రసంగం ఇది. అందుకని ఆయన తన ఉపన్యాసం మొదలుపెడుతూనే మనం ఇప్పుడొక anti-metaphysical age లో ఉన్నామన్నారు. తాను మెటఫిజిక్సు గురించి మాట్లాడతానంటే తనని ఒక పాతరాతియుగం మానవుడిగా ఎద్దేవా చేసేకాలం అని కూడా అన్నారు. అయినా కూడా ఆయన మెటఫిజిక్సుకి కాలం చెల్లిపోలేదనీ, ఇప్పుడు కూడా ఇంటలెక్చువలుగా, భాషాపరంగా, మనస్తత్వశాస్త్ర పరంగా కూడా భావవివేచన అవసరమనే అన్నారు.

మెటఫిజిక్సు గురించి మూర్తి గారు చర్చించిన ఆలోచనలూ, చేసిన ప్రతిపాదనలూ క్లుప్తంగా వివరించగలిగేవి కాదు. ఆ ప్రసంగం సంగ్రహంగా ఉన్నప్పటికీ అది మనలో విస్తారంగా ఆలోచనలు రేకెత్తిస్తుంది. కాబట్టి ఆ పుస్తకాన్ని అనువదించడమేనా చేయాలి లేదా అందులో చర్చించిన అంశాల మీద మరోసారి వివరంగానేనా రాయాలి.

పుస్తకంలో తక్కిన రెండు అంశాల్లోనూ, ఒకటి మనిషి గురించి. అందులో తాను చర్చించిన ఆలోచనలకి ఆయన కల్చరల్ యాంత్రొపాలజిస్టులనుంచి స్ఫూర్తి పొందానని చెప్పుకున్నాడు. ఆ వ్యాసంలో ఒక అద్భుతమైన వాక్యం ఉంది. Man is the neighbor of Being అని. ఈ ఒక్క వాక్యాన్ని వివరించడం మీదనే ప్రత్యేకంగా ఒక వ్యాసం రాయవలసి ఉంటుంది. మూడో ప్రసంగం 'ఫ్రీడమ్' గురించి. ఫ్రీడము అనే ఇంగ్లీషు పదాన్ని ఆయన తెలుగులో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అని కాక 'ముక్తి' అని అనువదించారు కాబట్టి ఆ అర్థంలో ఆ ప్రసంగాన్ని మరోసారి చదవాలి.

ఇవి కాక సచ్చిదానందమూర్తి రాసిన The Realm of Between (1973) మరొక విశిష్టమైన పుస్తకం. జ్ఞాత, అజ్ఞాత ప్రపంచాల మధ్య భగవంతుడి ఉనికిని అన్వేషించే అధ్యయనం అది. Philosophy of Religion లో ఇంత దాకా వచ్చిన గొప్ప తులనాత్మక పరిశీలనల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు. నేను ఇందాక పేర్కొన్న Readings in Indian Philosophy లో సచ్చిదానందమూర్తి గారి వ్యాసం Our Knowledge of God కూడా ఉంది. ఒక విధంగా ఈ వ్యాసాన్ని Realm of the Between తాలూకు సారాంశంగా కూడా చెప్పుకోవచ్చు.

5

ఆ రోజు శతజయంతి సభకు నన్ను ఆహ్వానించడం వల్ల నాకు మరోసారి సచ్చిదానంద–మూర్తిగారి గురించి తలుచుకునే అవకాశంతో పాటు ఇంతదాకా చదవని ఆయన రచనల్ని చదివే అవకాశం కూడా లభించింది. భారతీయ తత్త్వశాస్త్రాల్ని క్షుణ్ణంగా చదువుకున్న వ్యక్తి రాసిన రచనలు మనకి లభ్యంగా ఉండికూడా మనం వాటిని చదవలేకపోవడం నిజంగా ఒక దురదృష్టం. కనీసం ఇప్పుడేనా నన్ను ఆ దురదృష్టం నుంచి ఎంతో కొంత బయటపడేసినందుకు రావిపాటి వీరనారాయణరావుగారికి ఎన్ని ధన్యవాదాలు చెప్పినా తక్కువే.

30-9-2024

ఒక యోగి ఆత్మకథ

వేమవరపు భీమేశ్వరరావుగారు ఫిజిక్సు లెక్చెరరుగా, ప్రిన్సిపాలుగా పనిచేసి రిటరైయ్యారు. ఇప్పుడాయనకు డెబ్భైఏళ్ళు పైబడ్డ వయస్సు. గత కొంతకాలంగా ఉచిత హొమియోవైద్యసేవలు అందిస్తూ ఉన్నారు. మిగిలిన కొద్దిపాటి తీరికలోనూ, ఈ మధ్యనే, అనువాదసాధన మొదలుపెట్టి, మొదట ఆర్.కె.నారాయణ్ నవల 'మహాత్ముని కోసం నిరీక్షణ' (2016) వెలువరించారు. ఆ అనువాదాన్ని పాఠకులు ఆదరించడంతో మళ్ళా మరొక రెండు పుస్తకాలు తీసుకొచ్చారు. రెండూ ఆర్.కె.నారాయణ్‌వే. ఒకటి, 'లాలీ రోడ్ మరికొన్ని కథల సంపుటి', రెండవది, ఆర్.కె. ఆత్మకథ 'నా రోజుల్లో'.

మొన్న ఆదివారం సాయంకాలం భారతీయవిద్యాభవన్ సమావేశమందిరంలో ఆ రెండు పుస్తకాల ఆవిష్కరణ పెద్ద ఎత్తున జరిగింది. డా.కల్లూరి భాస్కరం అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీ వాసుదేవ దీక్షితులు, శ్రీ ఎ.ఎన్.ఎస్.జగన్నాథ శర్మ, శ్రీ పి.లక్ష్మీ నృసింహంలతో పాటు నేను కూడా పాల్గొన్నాను. జగన్నాథశర్మ ఆర్.కె.నారాయణ్ కథల గురించి మాట్లాడితే, నేను 'నా రోజుల్లో' పుస్తకం గురించి మాట్లాడేను.

'నా రోజుల్లో' ఆర్.కె.నారాయణ్ రాసిన My Days (1974) కి అనువాదం. దాదాపు డెబ్భైయేళ్ళ వయసులో నారాయణ్ తన గురించి చెప్పుకున్న కథ అది. ఆ తర్వాత కూడా ఆయన మరొక పాతికేళ్ళపాటు జీవించే ఉన్నాడు. ఆ పుస్తకంలో చిత్రించిన తన పసితనం, విద్యాభ్యాసం, తాను పూర్తిస్థాయి వృత్తి రచయితగా మారిన క్రమం, తన భార్య అకాల మరణం, తరువాత తనకి సంభవించిన అలౌకికఅనుభవాలు దాదాపుగా ఆయన ట్రయాలజీ అని చెప్పదగ్గ, Swami and Friends (1935), The Bachelor of Arts (1937), The English Teacher (1945) నవలల్లో చిత్రించినవే. కాని, ఆ కాల్పనిక రచనలతో ఆయనకు తృప్తి కలగలేదు.

తన అనుభవాల్ని మరింత సూటిగా, ఆ కాల్పనిక ప్రచ్ఛాయనుంచి తప్పించి నేరుగా తన పాఠకులతో పంచుకోవడం కోసం ఈ పుస్తకం రాసాడనిపిస్తుంది.

నేను ఇంగ్లిషు మూలం చదవలేదు. కాబట్టి ఈ అనువాదం చదవడం చాలా తాజాగానూ, కొత్తగానూ, అంతకన్నా కూడా ఆశ్చర్యజనకంగానూ అనిపించింది. ఆర్.క్. నారాయణ్ అంటే ప్రతిభావంతుడైన ఒక రచయితగా మాత్రమే తెలిసి ఉన్న నాకు, ఈ రచన ఒక కనువిప్పు.

దాదాపు నలభయ్యేళ్ళ కిందటి ఈ రచనని ఇప్పుడు తెలుగులోకి తేవలసిన అవసరం ఉందా? ఉంది. మూడు కారణాల వల్ల. మొదటి రెండూ అంశాలూ, ఆర్.కె.నారాయణ్ అనే మనిషి రచయితగా మారడానికి దోహదం చేసిన కారణాలు. మూడవది, ఆర్.కె. నారాయణ్ అనే రచయిత ఒక మనిషిగా రూపొందిన అంశం.

మొదటిది, ఒక మనిషి పూర్తికాలపు రచయిత కావడం, నాతో సహా, చాలామందికి ఒక కల మాత్రమే. ఆర్.కె.నారాయణ్‌కి అది సాధ్యమయింది. కానీ, సులభంగా మటుకు కాదు, దానికతడు చాలా విలువైన మూల్యమే చెల్లించుకోవలసి వచ్చింది. పూర్తికాలపు రచయిత కావడమనేది ఒక వ్యాపకానికి సంభవించిన విషయం మాత్రమే కాదు, ఒక మనోవృత్తికీ, ఒక సంస్కారానికీ సంబంధించిన విషయమని కూడా ఈ పుస్తకం చదివితే అర్థమవుతుంది. రేపటి గురించి భయం లేనివాడు, ఈరోజు ఒకడి ఎదట చేతులు కట్టుకుని నిలబడలేనివాడు మాత్రమే పూర్తికాలపు రచయిత కావడానికి అర్హుడు అని ఈ రచయిత జీవితానుభవాలు విక్రమార్క సాలభంజికల్లాగా మనల్ని హెచ్చరిస్తుంటాయి.

రెండవది, ఒక రచయితకు రాగల గుర్తింపు, దానికి పట్టే కాలవ్యవధి, అందుకోసం అపారమైన సహనంతో ఓపిక పట్టవలసి రావడం గురించిన అనుభవాలు. ఆర్.కె. నారాయణ్ రాత్రికి రాత్రే లబ్ధప్రతిష్ఠుడు కాలేదు. ఎన్నో వైఫల్యాల, తిరస్కారాల, అవమానాల తరువాత మాత్రమే అతడి పుస్తకాలు ఒకటీ ఒకటీ వెలుగు చూస్తూ వచ్చాయి. అది కూడా ఒక పుస్తకానికి దొరికిన ప్రచురణకర్త మరొక పుస్తకానికి ముందుకు రావకపోవడం, రచయిత ఎంత మందహాసంతో చెప్తున్నప్పటికీ, చెప్పలేనంత బాధాకరమైన సంగతి అని మనకి తెలుస్తూనే ఉంటుంది.

కాని, ఆర్.కె.నారాయణ్ రచయితగా నిలబడ్డాడు. ముల్క్‌రాజ్ ఆనందు, రాజారావులతో పాటు ఇండో-ఆంగ్లియన్ రచయితలత్రయంలో ఒకడిగానూ, హెమింగ్వే, విలియం ఫాక్నరులతో పాటు ఇంగ్లీషు నవలాకారులత్రయంలో ఒకడిగానూ నిలబడ్డాడు.

ఆ విధంగా ఇది కూడా ఒక విజేత ఆత్మకథనే. కాని, ఇంతకన్నా విశేషమైన మరొక పార్శ్వం ఈ రచనను మహోన్నత రచనగా మార్చేసింది. అది, తన 33 ఏళ్ళ వయసులో తన భార్య అకాలమరణం. ఆ తర్వాత నారాయణ్ మరొక అరవై ఏళ్ళ పాటు బతికాడు. మరొక పెళ్ళి చేసుకోకుండా మటుకే కాదు, మరొక స్త్రీ గురించిన తలపు కూడా లేకుండా. అసాధారణమైన ఈ నైతికపార్శ్వంలో నారాయణ్ జీవితగాథ రామకృష్ణ పరమహంసనీ, గాంధీనీ తలపిస్తుంది. ఈ పుస్తకానికి రాసుకున్న ముందుమాటలో భీమేశ్వర రావుగారు, ఈ రచనని 'సత్యశోధన' తోనూ, 'ఒక యోగి ఆత్మకథ' తోనూ పోల్చడం సముచితమనే అనిపిస్తుంది.

అసలొక మనిషి ఎందుకు రచయిత కావాలనుకుంటాడు? నారాయణ్ మాటల్లో చెప్పాలంటే:

> ఏ వ్యక్తికైనా రచన చేయాలంటే ప్రేరణ ఉండాలి. ఆ ప్రేరణ మనలో ఉండే ఉత్సాహం, చుట్టూ ఉన్న సమాజం పట్ల ఆసక్తి, అనువుగా ఉండే మంచి పరిసరాలు, ఏదన్నా సాధిద్దామనే పట్టుదల, భవిష్యత్తు మీద కోరికల నుంచి వస్తుంది. (పే.145)

కాని, తన భార్య అకాలమరణంతో తనకి అవన్నీ లోపించినట్టనిపించింది అని రాసుకున్నాడాయన. కాని ఆయన రచనల్లో ముఖ్యమైన రచనలన్నీ ఆ తర్వాతే రాసాడు.

ఒక మనిషికి సంభవించగల విషాదాలన్నిటిలోనూ సహచరిని లేదా సహచరుణ్ణి కోల్పోవడాన్ని మించింది మరొకటి ఉండదని పెద్దలంటారు. తను ప్రేమించి వెంటబడి పెళ్ళి చేసుకున్న మనిషి అకాలమరణం చెందినప్పుడు, ఆ ఆఘాతం నుంచి ఆయన తనను తాను ఎలా రక్షించుకున్నాడు? ఈ అనుభవాలు చదవడంకోసమేనా ఈ పుస్తకం చదవాలి.

రచనలు మూడు స్థాయిల్లో ఉంటాయి. మామూలుగా మనుషులు పడే సుఖదుఃఖాల గురించి రాసేవి మంచి రచనలు. ఉత్తమ రచనలు వాటికన్నా ఒక మెట్టు పైనుంటాయి. జీవితాన్ని ఉత్సవసదృశంగా భావించి ప్రతి రాత్రినీ వసంత రాత్రిగా, ప్రతి గాలినీ పైరగాలిగా స్వీకరించి చేసే రచనలవి. ఆ రచయితల్ని మనం నెత్తినపెట్టుకుంటాం.

కాని, మహా రచయితలు చేసే రచనలు వాటికన్నా మరొక పెట్టు పైనుంటాయి. ఆ రచయితలు నరకాన్ని చూసిఉంటారు. వాళ్ళ పాత్రలు మృత్యువు ఎదట ముఖాముఖి

నిలబడతారు. తలపడతారు. ఆ నరకం నుంచి బయటకి వచ్చి, మళ్ళా మామూలు మనుషులుగా ఇరుగుపొరుగుతో సాధారణ జీవితం జీవించడం మొదలుపెడతారు. జీవితంలో సంభవించే యుద్ధాన్ని మాత్రమే కాక, యుద్ధానంతర శాంతిని కూడా చిత్రించే అటూవంటి రచనల్నే మనం epics గా పరిగణిస్తాం. 'ఒడెస్సీ', 'ఏనియాడ్', 'డివైన్ కామెడి', 'పెరికిల్స్, ద ప్రిన్సు ఆఫ్ టైర్', 'వార్ అండ్ పీస్' లు మహాకావ్యాలయ్యాయంటే అందుచాతనే. మరింత విస్తృతంగా, తరతరాల కథగా మహాభారతం చెప్పుకొచ్చేదిదే. తన నరకలోక ప్రవేశం తర్వాతనే యుధిష్ఠిరుడు స్వర్గారోహణ చెయ్యగలిగాడని.

ఆర్.కె. నారాయణ్ ఆత్మకథ కూడా ఏ లేశమాత్రమో ఆ స్ఫూర్తి పొందిన రచన.. 'లోకం చూసాను నేను, శోకం చూసాను నేను, లోకంలోన, శోకంలోన నాకం కూడ చూడకపోలేను నేను' అని కవీశ్వరుడు చెప్పిన మాటల్ని నిరూపించే రచన.

14-8-2018

ఒక సాధన కథ

మూడు నాలుగేళ్ళ కిందట సోమయ్యగారి ఇంటికి వెళ్ళినప్పుడు, అప్పుడే మోక్షానందస్వామి తమ ఇంటికి వచ్చి వెళ్ళారనీ, ఆయన అనువదించిన 'విశుద్ధి మగ్గ' పుస్తకం రెండు సంపుటాలు నాకోసం కూడా ఇచ్చి వెళ్ళారనీ చెప్పారు. ఆయన్ని సోమయ్యగారికి గంగారెడ్డి పరిచయం చేసాడు. ఆ తర్వాత హైదరాబాదు బుక్ ఫెస్టివలులో 'ఆర్ట్స్ అండ్ లెటర్స్' వారి స్టాల్లో బౌద్ధసాహిత్యం కొత్త అనువాదాల పరంపర చూసినప్పుడు, వాటిలో అధికభాగం మోక్షానందస్వామి పాలీ నుంచి చేసిన అనువాదాలే కావడంతో కూడా నాకు ఆయన పట్ల ఆసక్తి పెరిగింది. ఆ అనువాదాలు ఎంతో సూటిగానూ, తేటగానూ ఉన్నాయి. ఆ మాట సోమయ్యగారితో చెప్తే, ఆయన ఆంజనేయరెడ్డిగారితో చెప్పి, ఆ పుస్తకాలు అప్పటిదాకా వచ్చినవన్నీ, ఒక సెట్టు నాకు పంపించారు. 'బుద్ధుడి దీర్ఘసంభాషణలు', వినయపిటకానికి చెందిన 'పాచిత్తియ పాలి', 'పారాజిత పాలి'మొదలైన పుస్తకాలు సరళ సుందరమైన తెలుగులో లభ్యం కావడం నాకు చెప్పలేనంత సంతోషాన్ని కలిగించింది.

అప్పణ్ణుంచీ ఆ మహనీయుణ్ణి ఒక్కసారేనా కలుసుకోవాలని అనిపిస్తూ ఉండింది. మొన్న అదిలాబాదు వెళ్ళినప్పుడు ఆయన్ని ఎలాగేనా దర్శించాలన్న కోరికతో గంగారెడ్డిని అడిగితే స్వామితో మాట్లాడి మేము అదిలాబాదు వెళ్ళేటప్పుడో, వచ్చేటప్పుడో ఒకసారి ఆయన ఆశ్రమాన్ని సందర్శించేందుకు ఏర్పాటు చేసాడు.

కాని ఆయన్ని సాయంకాలం నాలుగింటికి కలవాలనుకున్నవాళ్ళం రాత్రి తొమ్మిదింటికి గాని కలవలేకపోయాం. ఆదిలాబాదు-హైదరాబాదు హైవే మీద ఆర్మూరు దగ్గర్లో మోర్తాడు అనే గ్రామంలో ఊరికి దూరంగా ఆయన 'మోక్షానంద బుద్ధవిహార' అనే ఆశ్రమం ఏర్పాటు చేసుకుని ఉన్నారు.

ఆ రాత్రి ఆయన మా కోసం నిరీక్షిస్తూ ఉన్నారు. ఆ ఆశ్రమంలో ఒక పక్క ధ్యానంకోసం, ప్రవచనాల కోసం పెద్ద హాలు ఉంది. మరొక పక్క రెండుగదుల చిన్న ఇంట్లో ఆయన ఒక్కరూ పూర్తి పరివ్రాజక జీవితం జీవిస్తూ ఉన్నారు. ఆవరణలో ఒక పక్క చిన్న తోట, మొక్కలూ ఉన్నాయి.

మేం వెళ్ళేటప్పటికి ఆయన ఏదో బౌద్ధగ్రంథాన్ని అనువదించుకుంటూ ఉన్నారు. ఆ రాత్రి మా కోసం గంగారెడ్డి మిత్రుడొకాయన రొట్టెలూ, కూరా తెచ్చిపెట్టాడు. కాని స్వామి అప్పటికే తన సాయంకాలం ఆహారం తీసుకుని ఉన్నారు. మా అల్పాహారం కోసం ఆయన తానున్న గదిలోనే చోటు చూపించారు. మేము కూచోడానికి చదరలు పరిచారు. మంచినీళ్ళు ఏర్పాటు చేసారు. బహుశా ఆయన ఇంక నిద్రకి ఉపక్రమించే సమయం అది. కాని, ఆయన ఆ రాత్రి దాదాపు మరొక గంటసేపు ఓపిగ్గా మా కోసం కూచుని, నేనడుగుతూ ఉన్న ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్తూ ఉన్నారు.

నేనాయన్ను కలవాలనుకున్నప్పుడు నాకు ఆయన్ని ఏదో ఒకటి ప్రశ్నించాలనో, లేదా ఏదో తెలుసుకోవాలనో ఉద్దేశ్యం ఏమీ లేదు. బౌద్ధసాహిత్యాన్ని తెలుగులోకి తీసుకు రావడానికి ఆయన చేస్తున్న కృషి పట్ల ఆరాధన ఒక్కటే నా మనసులో ఉండింది. కాని ఆ రాత్రి ఆయనతో మాట్లాడిన తరువాత, నా జీవితంలో నేను మొదటిసారి ఒక నిజమైన బౌద్ధ సన్యాసిని కలుసుకున్నానని అనిపించింది. కొన్ని సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ఒకప్పుడు బుద్ధుడి దగ్గరికి తన శిష్యుల్ని పంపించిన బావరి నివసించిన అస్సక జనపదంలో ఇన్నాళ్ళకు మరొక బౌద్ధపండితుడు నివసిస్తున్నాడని అర్థమయింది. ఏ శ్రీలంకలోనో, జపాను, వియత్నాంలలోనో లేదా కనీసం అమెరికాలోనైనా ఇటువంటి బౌద్ధభిక్షువు ఉండి ఉన్నట్లయితే ఈ పాటికి ఆ ఆశ్రమం అంతర్జాతీయ తీర్థస్థలిగా మారిపోయి ఉండేది. కాని మోక్షానంద తనని తాను ఇంకా సాధకుడిగానే పోల్చుకుంటున్నారు. తన విరక్తజీవితంలో తాను చేరవలసినగమ్యానికి ఇంకా చేరుకోవలసిఉందనే అనుకుంటున్నారు.

ఆ రాత్రి ఆ ఆశ్రమం ఆవరణలో నేనాయాన్ని ఒకదాని వెనక ఒకటి ప్రశ్నలు అడుగుతూ ఉండగా మా చుట్టూ పుష్యమాసపు చలిగాలి. నేను చలికి వణుకుతున్నట్టు గమనించినట్టున్నారు. 'మీరు అడిగే ప్రశ్నలన్నిటికీ జవాబుగా నేనొక పుస్తకం ఇస్తాను. అది నేనింతదాకా చేసిన ప్రయాణం గురించిన కథనం. 'నా సాధన కథ'. మీకు ఇష్టమయితే ఆ పుస్తకం తీసుకువెళ్ళి చదవండి.' అన్నారు.

అయిదు నిమిషాలు గడిచాక 'మళ్ళా మాటల్లో పడి మర్చిపోతామేమో, ఆ పుస్తకం ఇప్పుడే మీకిస్తాను' అని లోపలకి వెళ్ళి తీసుకువచ్చి ఇచ్చారు. దానితో పాటు బుద్ధుడి

దీర్ఘసంభాషణల్లో ఒకటైన 'శ్రామణ్య ఫలసూక్తం' కి తాను చేసిన అనువాదం చిన్నపుస్తకం కూడా.

'నా సాధన కథ పుస్తకం గురించి ఎవరూ ఇప్పటిదాకా ఏమీ చెప్పలేదు నాకు. నేను మీ రచనలు చదువుతూ ఉంటాను. మీకు ఆ పుస్తకం చదివితే ఏమనిపించిందో తెలుసుకోవాలని ఉంది' అని కూడా అన్నారు.

నేను ఇంటికి రాగానే వెంటనే 'నా సాధన కథ' (2016) ఆత్రుతగా చదివేసాను. కావటానికి నూటయాభై పేజీల చిన్న పుస్తకమే అయినప్పటికీ అది ఒక ఒక పరివ్రాజకుడి ఆత్మకథ. అంతకన్నా కూడా ఒక సత్యాన్వేషకుడి, సౌందర్యారాధకుడి జీవితయాత్రాకథ. ఆయన్ని కలిసి మాట్లాడుతున్నప్పుడూ, ఆ పుస్తకం చదువుతున్నప్పుడూ కూడా నా మనసులో వియత్నమీయ బౌద్ధసాధువు థిక్ నాట్ హన్‌నే మెదులుతూ ఉన్నాడు. మోక్షానంద కూడా థిక్ నాట్ హన్‌లానే కవి. ఆయన ప్రయాణం కూడా భావకవిత్వం నుంచి బౌద్ధకవిత్వం దాకా నడిచిన అన్వేషణ. ఆయన భావుకత్వం తామరపూలు పూసిన కొలనులాంటిది. ఆ వాక్కు శుభ్రవాక్కు. అందులో శుభ్రత, స్వచ్ఛతలతో పాటు, ఒక సౌందర్యపు మిలమిల కూడా ఉంది. అంత చక్కటి తెలుగు, అంత భావస్ఫోరకమైన వ్యక్తీకరణ ఇప్పటి రచయితల్లో చాలా అరుదుగా కనిపించే విశేషాలు.

ఆరోజు ఆయన నాకు స్థూలంగా చెప్పిందీ, 'నా సాధన కథ' లో వివరంగా రాసిందీ– ప్రధానంగా ఆయన తనలోకి తాను చూపు సారించుకుని తనను తాను ప్రక్షాళనం చేసుకుంటూ వస్తున్న వైనం. ఆయన చెప్పినదాని ప్రకారం ఆయనలో గృహస్థ, అద్వైత, బౌద్ధసంస్కారాలు మూడూ బలంగా ఉన్నాయి. మూడూ ఆయన్ని తమ వైపు పట్టి లాగుతూనే వచ్చాయి. గృహస్థసంస్కారానికి ఆయన భగవద్గీతను ప్రమాణంగా తీసుకున్నారు. నువ్వు గార్హస్థ్యజీవితం జీవిస్తూనే విముక్తుడివి కావచ్చని గీత చెప్తుంది. అద్వైతసంస్కారం, ప్రధానంగా శాక్తాద్వైతంగా, ఆయన్ని ఆకర్షించింది. రామకృష్ణపరమహంస–వివేకానంద స్వాముల సాహిత్యరూపంలో ఆ సంస్కారం ఆయన్ని గాఢంగా ప్రభావితం చేసింది. ఆయన యువకుడిగా ఉన్నప్పుడు సన్న్యాస జీవితం వైపు ఆయన్ని మరల్చడంలో వివేకానంద రచనలే ప్రముఖపాత్ర వహించాయి.

కాని, ఆ రెండు సంస్కారాల మధ్యా, అంటే గృహస్థ, సన్యాస జీవితాల మధ్య ఊగిసలాడుతున్నప్పుడు, తలెత్తిన ప్రశ్నలకూ, ఎదుర్కొన్న సంక్షోభాలకూ ఆ రెండు సంప్రదాయాల్లోనూ ఆయనకు ఊరట లభించలేదు. ప్రశ్నలన్నీ సద్దుమణిగి, చిత్తమడిగే

చోటు ఆయనకి బుద్ధుడి మాటల్లో కనిపించింది. బౌద్ధసాహిత్యం చదువుకుంటూ, ఆ మార్గంలో ఆనాపానసతి సాధన చేస్తూ, తనని తాను ఒక బౌద్ధభిక్షువుగా భావించుకుంటూ వచ్చారు. అయితే, ఒక గురువు ద్వారా దీక్ష పొందడం సముచితంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో దీక్ష స్వీకరించి తన పేరు భంతే దమ్మరక్షితగా మార్చుకున్నారు. కాని ఇప్పటికీ ఆయన మోక్షానంద స్వామిగానే ఎక్కువ మందికి తెలుసు.

ఈ ప్రయాణంలో గృహస్థ, సన్న్యాస సంస్కారాల మధ్య ఆయన పడ్డ నలుగులాటలో ఆయన్ని ఎక్కువ కలతకు గురిచేసిన సంస్కారం మరొకటి ఉంది. దాన్ని ఆయన తన లౌకిక సంస్కారంగా గుర్తుపట్టారు. రెండు సార్లు ఆ సంస్కారం ఆయన్ని కిందకు దిగలాగింది. ఆయన సాధనకథలో ఆ రెండు సంఘటనలూ ఆసక్తి కరమైన అధ్యాయాలు. ఇక్కడ కూడా ఆయన నాకు థిక్ నాట్ హన్‌ను తలపుకు తెస్తున్నారు. ఒక యోగి ప్రేమలో పడితే ఏమవుతుందో మనతో పంచుకోడానికి థిక్ నాట్ హన్ ఏకంగా ఒక పుస్తకమే రాసాడు.

మన చుట్టూ ఎంతో ఆధ్యాత్మిక, భక్తి వాఙ్మయం, గుళ్ళూ, గోపురాలూ, మందిరాలూ, తెల్లవారిలేస్తే ప్రతి ఛానల్లోనూ గొంతెత్తి వినిపించే ప్రవచనకారులకు కూడా తక్కువ లేదు. కాని నిజమైన సాధకులూ, నిజమైన సత్యాన్వేషకులూ మనకి కనిపించడం దాదాపు అరుదు. అది కూడా ప్రచారానికి దూరంగా, పూర్తి విరక్త జీవితం గడుపుతూ, తామింకా సత్యం వెతుక్కుంటూనే ఉన్నామనీ, సాక్షాత్కారం పొందామని పూర్తిగా చెప్పలేమనీ చెప్పుకునే వినయసంపన్నులు ఇంకా అరుదు. మోక్షానందస్వామి అటువంటి నిజమైన ఆధ్యాత్మిక హృదయుడనీ, మన కాలంలో మన మధ్య జీవిస్తున్న మహనీయ బౌద్ధపండితుడనీ, ఆర్తితోనూ, ఆందోళనతోనూ సతమతమవుతున్న మనకి ఎంతో కొంత వెలుగు చూపించగల సాధకుడనీ చెప్పడానికి నాకు సంతోషంగా ఉంది. ఆయన తెలుగువాడైనందుకు గర్వంగా కూడా ఉంది.

'నా సాధన కథ' నుంచి కొన్ని వాక్యాలు:

> ఆ పరతత్త్వం అన్ని నిర్వచనాలకు అతీతమైంది. దాన్ని మనం ఏ రూపంతో ధ్యానించినా ఆ రూపం ద్వారా దానితో సంబంధం ఏర్పడుతుంది. సాపేక్ష ప్రపంచంలో ఈ రూపాలవలన నశ్వరమైన ప్రయోజనం కలిగితే కలగవచ్చు గాని అవన్నీ నామరూపాల పరిధిలోనే కావటంవలన ఆయా సంస్కారాలను ప్రోగుచేయటం వలన వాటితో ఆత్యంతిక దుఃఖనివృత్తి పొందటం సాధ్యం కాదు.

దుఃఖాన్ని పూర్తి అంతం చేయడానికి మార్గాన్ని అన్వేషించిన బుద్ధుడు పై కారణాలవల్లనే నామరూపాలన్నిటినీ నిరాకరించి నిర్వాణాన్ని ఆరిపోయిన దీపంలాంటిదన్నాడు. మానవీయమూ, దివ్యమూ అయిన అన్ని బంధనాలను వదలినప్పుడే దుఃఖం పూర్తిగా తొలగిపోతుందన్నాడు.

మానవుడు తన కర్మను బట్టి స్వర్గలోకాలను, నరకలోకాలను, ప్రేతత్వాన్ని, జంతుజన్మలను పొందుతాడని బౌద్ధం చెప్తుంది. భౌతికమైన ఈ భూమి మీద ఉన్న మనం స్వర్గనరకాలను కూడా ఇటువంటి భౌతిక లోకాలుగానే ఊహించుకుంటాం. కాని అవి మన చేతనకు సంబంధించినవి. మానసికమైన ఆయా సుఖదుఃఖస్థితులు.

కర్మ అంటే పని. మానవుడు తాను చేసిన పుణ్యపాపకర్మల వలననే ఆయా సుఖదుఃఖస్థితులను పొందుతాడు. కర్మలు అనేకం. వాటి ఫలాలు కూడా అనేకమే. కొన్ని శీఘ్రంగా ఫలించవచ్చు. కొన్ని ఆలస్యంగా ఫలించవచ్చు. మనం పట్టుదలతో ప్రయత్నించి కర్మను మార్చుకోవచ్చు అనికూడా బౌద్ధం తెలుపుతుంది.

బుద్ధుడు జాతికి కాక శీలానికే గొప్పతనాన్ని ఇచ్చాడు. జ్ఞానాన్ని పొందటానికి అన్ని వర్ణాలవారికీ అర్హత ఉందన్నాడు. సంఘంలో అందరికీ ప్రవేశం కల్పించాడు. సూక్ష్మదేహాలతో మహాత్ములు, దేవతలు ఉండటాన్ని బౌద్ధం అంగీకరిస్తుంది. వారి అరూప ధాతువులన్నీ సూక్ష్మలోకాలే. కాని ఈ సృష్టికి కర్త, నియంత అని చెప్పబడే దేవుని గురించి అది ఏమీ చెప్పదు.

అణువు నుండి బ్రహ్మాండం వరకు అన్నిటిని మనస్సుతో తెలుసు కుంటున్నాం. అన్నింటిని తెలుసుకునే ఈ మనస్సును దేనితో చూడాలి? అంటే మనస్సుతోనే చూడాలి. ముందుగా ఎటువంటి భావనలను ఏర్పరచుకోకుండా చూడాలి. ఈ శరీరంలో ప్రాణం ఉంది, మనస్సు ఉంది. మనస్సును ప్రాణంలో లీనం చేసినప్పుడు అది తనలోకి తాను ఉపసంహరించుకుంటుంది. ముక్కు ద్వారా శ్వాస నడిచినంతసేపు బహిర్ముఖంగా ఉన్న మనస్సు అప్పుడు తనలోకి తాను ప్రవేశిస్తుంది. తన్ను తాను చూసుకుంటుంది. ఒకవేళ శ్వాసతో రామ అనో, శివ అనో ఇంకా ఏదైన అద్వైతమంత్రాన్నో జోడించి ధ్యానించినప్పుడు ముందుగానే మనం మన చైతన్యంపై రాముణ్ణో, శివుణ్ణో లేదా

అద్వైత భావననో ఆపాదిస్తున్నామన్నమాట. అప్పుడు మన దర్శనం కూడా ఆ భావనను అనుసరించే ఉంటుంది. గ్రంథాల్లో చదివి, లేదా ఇతరులద్వారా విని సత్యాన్ని గురించి ఒక విశ్వాసాన్ని ఏర్పరచుకుని సాధన చేయవద్దన్నాడు బుద్ధుడు. ఎందుకంటే అప్పుడు నీ దర్శనం నీ విశ్వాసాన్నిబట్టే ఉంటుంది. నీ విశ్వాసంతో పనిలేకుండా సహజంగా నీలో ఉన్న శ్వాసను అనుసరించ-మన్నాడు బుద్ధుడు. ఒక విధంగా బుద్ధుడు చెప్పింది మానసికశాస్త్రమే. అది శ్వాసతో మొదలై నిర్వాణంతో ముగుస్తుంది.

'ఇది దుఃఖం, ఈ దుఃఖానికిది కారణం, దాన్ని ఇలా నిరోధించవచ్చు, ఆ నిరోధాన్ని పొందటానికి అనుసరించవలసిన మార్గం ఇది' అని స్పష్టంగా చెప్పాడు. 'నీ సుఖానికి, దుఃఖానికి, బంధానికి, మోక్షానికి కర్తవు నీవే. దేవుడికి ఇందులో ఎటువంటి పాత్రా లేదు' అన్నాడు బుద్ధుడు. (పే. 155-156)

మరి మీరు కృష్ణునికి సంబంధించి, జగన్మాతకు సంబంధించి చాలా అనుభవాలను పొందారు కదా! అవన్నీ భ్రాంతులా అని ఎవరైనా అడగవచ్చు. మనస్సుకు ఉండే శక్తులు అపరిమితమైనవి. పరిశుద్ధమైన మనస్సుపై మనం ఏ రూపాన్ని ఆరోపిస్తే అది ఆ రూపాన్ని ధరిస్తుంది. ఆ రూపంతో మనతో వ్యవహరిస్తుంది. అందువలన వాటిని భ్రాంతులు అనడం వీలుకాదు. అయితే దుఃఖాన్ని పూర్తిగా నిర్మూలించాలంటే మానవీయమైనవిగాని, దివ్యమైనవిగాని అన్ని రకాల బంధనాలనుండి విముక్తం కావలసిందే. భార్యాపిల్లల మీద చిక్కుకున్న మనస్సు బంధానికి కారణమైనట్లే, దేవతల మీద చిక్కుకున్న మనస్సు కూడా సత్యసాక్షాత్కారానికీ, ముక్తికి ఆటంకంగా మారుతుంది. (పే. 108)

9-3-2021

లోపలి దారి

గంగారెడ్డి వజ్రంలాంటి పిల్లవాడు. ఇరవయ్యేళ్ళ కిందట తానింకా డిగ్రీ చదువుకుంటూ ఉండే రోజుల్లో మొదటిసారి మా ఇంటికి వచ్చాడు. సి.వి.కృష్ణారావు గారి దగ్గర నా పేరు విన్నానని చెప్తూ మా ఇల్లు వెతుక్కుంటూ వచ్చాడు. ఆ రోజు వినాయక చవితి. మా పిల్లలతో కలిసి పూజచేసుకున్నాడు. అప్పటి నుంచి మా ఇంట్లో భాగం అయిపోయాడు. నా కళ్ళముందే ఎంతో ఎత్తుకు ఎదిగాడు, ఇంకా ఎదుగుతూనే ఉన్నాడు.

ఆన్‌లైను క్లాసులంటే ఏమిటో ఈ దేశానికి ఇంకా తెలియకముందే ఇరవయ్యేళ్ళ కిందటే, ప్రపంచవ్యాప్తంగా విద్యార్థుల్నీ, ఉపాధ్యాయుల్నీ ఆన్‌లైన్లో కలిపి ఒక ఈ-లెర్నింగు ఇనీషియేటివు మొదలుపెట్టాడు. ఆ తర్వాత ఇంగ్లాండు వెళ్ళి లండనులో ఎం.బి.ఏ చేసాడు. తిరిగి వచ్చాక పెద్ద హెూటలు ప్రారంభించాలనుకున్నాడు. కాని తన ప్రాంతం అంటే నిజామాబాదుజిల్లా ఆర్మూరు, మోతె, బాల్కొండ లాంటి ప్రాంతాల్లో, (అప్పటికింకా తెలంగాణా రాలేదు), ప్రజల కష్టాలు చూసి, రాజకీయాల్లో ప్రవేశిస్తే తానేదైనా చెయ్యగల-ననుకున్నాడు. దాంతో బాల్కొండ ప్రాంతంలో ప్రజలతో కలిసి పనిచెయ్యడం మొదలు పెట్టాడు. ఎన్నికల్లో పోటీ చెయ్యాలని కూడా అనుకున్నాడుగానీ, అనేక రాజకీయ కారణాలవల్ల ఆ ఎన్నికల్లో, అంటే, 2009 లో పోటీ చెయ్యలేదు.

ఈసారి అతణ్ణి సినిమా ఆకట్టుకుంది. దర్శకత్వరంగంలో కృషి చెయ్యాలనుకుని రామానాయుడు ఫిల్మ్ ఇన్స్టిట్యూటులో శిక్షణ తీసుకున్నాడు. ఆ తర్వాత ఆయన తీసిన మొదటి రెండు మూడు యాడ్ ఫిల్ముల తోటే ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. అప్పణ్ణుంచీ యాడ్ ఫిల్ములు, డాక్యుమెంటరీలు తీస్తూ ఉన్నాడు.

ఈలోగా కరోనా వచ్చింది. లాక్‌డౌను వచ్చింది. ఒకరోజు తాను హైదరాబాదు నుంచి నిజామాబాదు వెళ్తుంటే వేలాదిగా వలసకార్మికులు మండుటెండలో నడుచుకుంటూ

వెళ్ళిపోవడం చూసాడు. వాళ్ళకి గుక్కెడు మంచినీళ్ళు కూడా దొరకని కాలం. అది అతడి హృదయాన్ని కలచివేసింది. అంతే, ఆర్మూరు దగ్గర ఒక శిబిరం తెరిచాడు. ఆ తర్వాత, వలసకార్మికుల నడకలు ఆగిపోయేదాకా, అక్కడొక సత్త్రయాగం నడిపాడు. అహర్నిశలు, వలసలు నడిచినన్ని రోజులూ, ఆ కార్మికులకి భోజనాలు ఏర్పాటు చేసాడు. నడవలేనివారికి, తాను పంపగలిగినంత దూరం, రవాణా సౌకర్యం ఏర్పాటు చేసాడు.

కాని ఇంతగా ప్రాపంచిక జీవితంలో తలమునకలుగా కనిపించే ఆ యువకుడిలో వయసుని మించిన ఒక విరాగి ఉన్నాడు. ముముక్షువు ఉన్నాడు. ఆ విరక్తస్వభావం అతడికి ఎక్కడినుంచి వచ్చిందో చాలా కాలం నాకు తెలియలేదు. ఒకసారి అతడు తన తల్లిదండ్రుల్ని పరిచయం చేసాడు. వాళ్ళ నాన్నగారు రాజులుగారిని చూడగానే ఆయన ఒక కర్మయోగి అని గుర్తుపట్టగలిగాను. ఆ యోగవశిష్టుడి యోగవాశిష్టమే గంగారెడ్డికి దక్కిందని అర్థమయింది.

అటువంటి తన తండ్రి, ఈ లోకాన్ని వీడిన తరువాత, ఆ కొడుకు, తన తండ్రిని స్మరిస్తూ, మనందరికీ, ఈ రోజు ఒక 'లోపలి దారి' ని కానుక చేస్తున్నాడు. యూదు, హిందూ, బౌద్ధ, డావో, జెన్, సూఫీ, ఓషో సంప్రదాయాల్లో ఎందరో గురుశిష్యులు చెప్పుకున్న కథలనుంచి అద్భుతమైన కొన్ని కథల్ని సేకరించి పుస్తకంగా వెలువరిస్తున్నాడు. ప్రసిద్ధ కవి సౌభాగ్య తిరిగి రాసిన కథలవి. వాటిలో, సుమారు వెయ్యి కథల్లోంచి, రెండు మూడునెలలపాటు మళ్ళీ మళ్ళీ చదివి 266 కథలు ఎంపికచేసి ఒక సంపుటిగా తీసుకొచ్చాడు. ఆ పుస్తకానికి రాసిన ముందుమాటలో ఇలా రాస్తున్నాడు:

> ఈ కథలన్నీ జ్ఞానసిద్ధి పొందిన జ్ఞానుల కథలు. ఆ అనంతశక్తికి పూర్తిగా శరణాగతి చెందిన కరుణామయులైన సాధువుల కథలు. ఈ కథలు చదువు-తున్నప్పుడు హిందూ, బుద్ధ, తావో జ్ఞానులు భిన్నశాఖలకు చెందినట్లు కనబడుతున్నా, వాళ్ళనుండి ఒకే సత్యాత్మ, ఆ నిర్మలసత్యాన్ని వెల్లడి చేస్తున్నట్లు స్పష్టంగా తోస్తుంది. జ్ఞానులు వేరుగా కనిపిస్తున్నా, వారందరిదీ ఒకే స్వచ్ఛమైన మనస్సు.

ఇంకా ఇలా రాస్తున్నాడు:

> ఇందులోని ఒక్కో కథ చదువుతున్నప్పుడు, ఆ సాధువులు, ఆ కథలోని పాత్రలు కళ్ళముందు కనిపించి మాట్లాడుతున్నట్టు అనిపించింది. ఆ సాధువుల

జ్ఞానపు వెలుగుల ధగధగను, నిర్మలమైన వారి ప్రజన్స్ ను దగ్గరగా అనుభూతి చెందాను. కంటి తడిని ఆపుకోలేకపోయాను. మరపుకు గురైనప్పుడు, దారి తప్పినప్పుడు, ఎవరో తోడుగా నాలోనే ఉన్నారు అనిపించేది. నాలోంచే ఆ సాధువుల రూపంలో మరింత శక్తితో సత్యాన్ని స్పష్టంగా చూడగలుగుతున్నారు అనిపించేది. అహం నశించిన ఈ జ్ఞానులు తమని తాము ఎప్పుడో కోల్పోయారు. కేవలం సత్యశక్తి మాత్రమే వారిని నడిపిస్తుంది. ఆ శక్తి 'మేమెప్పుడూ మీ హృదయాల్లోనే ఉన్నాం. ఎటువంటి ఇన్‌సెకూరిటీ అవసరం లేదు. ఎన్ని కష్టాలు ఎదురైనా దారితప్పకండి, సత్యాన్ని వీడకండి' అని ఓ నిశ్శబ్దరాగంలో, నా చెవిలో పాడుతున్నట్టు అనుభూతి చెందాను. ఆ సాధువులవి నిర్మలమైన జీవితాలు, శూన్యశక్తి కేంద్రాలు.'

ఆ కథలు ఎలా ఉన్నాయో ఒక ఉదాహరణ చూడండి:

కలలు

'నాకెప్పుడు జ్ఞానోదయమవుతుంది?'

'నువ్వు చూసినప్పుడు.'

'ఏం చూడాలి?'

'చెట్లు, పూలు, చంద్రుడు, చుక్కలు.'

'నేను రోజూ చూస్తున్నాను కదా!'

గురువు 'నువ్వు చూస్తున్నవి కాగితం చెట్లు, కాగితం పూలు, కాగితం చంద్రుడు, కాగితం నక్షత్రాలు,. నువ్వు వాస్తవంలో కాదు, నీ మాటల్లో, నీ ఆలోచనల్లో జీవిస్తున్నావు' అన్నాడు.

శిష్యుడు ఆశ్చరపోయాడు. గురువు, 'ఇంకో విషయం మరచిపోయాను. నువ్వు పేపర్ బతుకు బతుకుతున్నావు, పేపర్ మరణాన్నే మరణిస్తావు' అన్నాడు.

23-6-2022

పరమయోగి

పరమయోగి వై. హనుమంతరావుగారు కర్నూలులో మొన్న పొద్దున్న తెల్లవారు జామువేళ వైకుంఠవాసి అయ్యారు. రెండు రోజులు గడిచినా కూడా ఆ వార్త నాలోకి ఇంకినట్టుగా నాకు తోచడం లేదు. గత ముప్ఫైఏళ్ళుగా నాకు తండ్రివలె, తల్లివలె, సోదరుడి వలె ధైర్యాన్నిస్తూ నిలబడ్డ ఒక మనిషి మరిక కనబడరనీ, ఎప్పుడు ఫోను చేస్తే అప్పుడు ఆ ఫోను ఎత్తబోరనీ, నేను ఏ సమస్య చెప్పుకున్నా, 'మీకేమీ కాదు, నేనున్నాను, పోండి' అనే మాటలు వినబడవనీ ఇంకా నా మనసుకు తోచడం లేదు.

కాని ఒక యోగికి మరణం ఉండదు కాబట్టి, అది శోకించవలసిన సందర్భంకాదనే ఎరుక నాలో ఎక్కడో ఉంది. మనుషులంతా, చరాచరాలతో కలిపి, అంతర్గతంగా ఒకే అస్తిత్వంతో అనుధానమై ఉంటారు కాబట్టి, ఇప్పుడు ఆయన ఎక్కడికీ వెళ్ళలేదనీ, ఇంకా మరింత దగ్గరగా వచ్చారనీ విజ్జి చెప్తున్న మాటలు నమ్మదగ్గట్టుగానే ఉన్నాయి.

ముప్ఫైఏళ్ళ కింద పరిచయమయ్యారు. కర్నూల్లో. ఈ ముప్ఫైఏళ్ళుగా ఎన్నో సార్లు ఆయన చేయి నేను విడిచిన సందర్భాలున్నాయిగాని, నా చేయి ఆయన విడిచిన సందర్భం ఒక్కటి కూడా లేదు. నా చిన్నతనంలో మా నాన్నగారు పొలాలమీద తిరిగి పంటల లెక్కలు రాసుకునేటప్పుడు నేను ఆయన వెంటవెళ్తే నా చేయి చాలా గట్టిగా పట్టుకునేవారు. ఆ గ్రిప్పు నా జీవితమంతా ఫీలవుతూనే ఉన్నాను. హనుమంతరావుగారు కూడా నా మనసునట్లానే పట్టుకుని ఉన్నారు. ఆ గ్రిప్పు ఎంత బలమైంది అంటే, చాలా రోజులుగా కర్నూలు వస్తాననీ, చూస్తాననీ ఆయనతో చెప్తున్నవాణ్ణి, రెండు వారాల కిందట నిజంగానే ఆయన్ని వెళ్ళి చూడగలిగానంటే, ఆ గ్రిప్పు వల్లనే అనుకుంటున్నాను.

మన పురాణాల్లోనూ, ఇతిహాసాల్లోనూ ఋషులు త్రికాలజ్ఞులుగా ఉండేవారనీ, ఏదన్నా జరిగినప్పుడు దివ్యదృష్టితో అంతా చూడగలిగేవారనీ చదివాను. ఒక త్రికాలజ్ఞుడు

ఎలా ఉంటాడో హనుమంతరావుగార్ని నా కళ్ళారా చూసాను. మనుషుల్ని చూడగానే, చాలాసార్లు, చూడనవసరం కూడా లేదు, వారి పేరు చెప్పగానే, ఆయన వాళ్ళ జీవితాల్లో ఇంతకు ముందు జరిగినవీ, రేపు జరబోయేవీ కూడా ఎంతో స్పష్టంగా, పుస్తకం చదివినట్టుగా చెప్పెయ్యడం కర్నూల్లో చాలామందికి అనుభవమే. నా వరకూ నా స్వానుభవంలోంచి ఎన్నో ఉదాహరణలు ఇవ్వగలను.

ఆ మిరకిలుని ఆయన ఎప్పుడూ తన స్వార్థానికీ, స్వప్రయోజనాలు తీర్చుకోడానికీ వాడుకోలేదు. తనకు తెలిసిన మనుషులు కష్టాల్లో పడబోతున్నారంటే వాళ్ళని కాపాడటానికే ఆయన ఆ శక్తిని వాడుతూ వచ్చారు. చాలాసార్లు మనుషులు ఆ క్షణాన, ఆయన చెప్పినట్టుగా జరిగినట్టు గ్రహించిన క్షణాన ఎంత ఉద్విగ్నభరితులుగా ఉండేవారో, ఆ మరుక్షణానే, అది చాలా మామూలుగా జరిగిందనీ, అందులో ఆయన ప్రమేయం ఏమీ లేదనీ, ఆయన చేసింది ఏమి లేదనీ అనుకోవడం, ఆయన్నుంచి దూరంగా జరిగిపోవడం కూడా చాలా మామూలు అనుభవమైపోయింది నాకు. మనుషుల్లోని ఈ కృతఘ్నతాభావం ఆయన్ని తీవ్రంగా గాయపరిచేది. చిన్నపిల్లవాడిలాగా వాళ్ళమీద నాతో తరచూ ఫిర్యాదు చేస్తుండేవారు. కాని మనుషుల్లోని ఆ సహజవక్రతని ఎలా నిర్లక్ష్యం చేయాలో నాకు తెలిసేదికాదు.

కానీ, ఆయన వాక్కుకున్న ఆ అద్వితీయ మహిమ ఆయన ఆధ్యాత్మిక వ్యక్తిత్వానికి విజిటింగు కార్డు పాటిది కూడా కాదు. ఆయన యోగి అంటే నిజమైన యోగి. కాషాయ వస్త్రాలూ, ఆశ్రమాలూ, శిష్యగణాలూ అవసరం లేని యోగి. పాంటూ, చొక్కా తొడుక్కున్న యోగి. తనలో ఒక దైవత్వం ఉందని తెలుసుకున్నాక, దాన్ని కాపాడుకోడానికి ఆయన పాటించిన క్రమశిక్షణ నా దృష్టిలో అన్నిటికన్నా గొప్ప మిరకిలు. తెల్లవారుజామున మూడు నాలుగ్గంటలకి లేచి, తన దేవుడి గది తుడుచుకుని, పూజ, ప్రార్థన ముగించుకుని, ఆరింటికల్లా తన ఇంటి తలుపు తెరిచి పెట్టి, తెల్లటి వస్త్రాలు ధరించి, తన కోసం ఏ ఆర్తులు వస్తారా అని ఎదురుచూసేవారు. ఎక్కడికి వెళ్ళినా పచ్చిమంచినీళ్ళు కూడా ముట్టుకోకుండా రోజుల తరబడి గడపడం చూసాను. బయట ఎవరిదగ్గరా తినడం, తాగడం ఆయనకు నిషిద్ధం. ఎందుకు ఈ కఠిననియమం అంటే, ఒక గర్భవతి తన కడుపులోని బిడ్డ కోసం ఏది తినాలో ఏది తినకూడదో ఎంత వ్రతంగా పాటిస్తుందో, తను కూడా అలానే అని చెప్పేవారు.

ఎనభై రెండేళ్ళ జీవితం. చెక్కుచెదరని వ్యక్తిత్వం. రాజీపడని మనస్తత్వం. ఎవరికీ అమ్ముడుపోకుండా జీవించగలిగిన స్వాతంత్ర్యం. తన జీవితంలోని ప్రతిక్షణం మనుషులకి

ఇవ్వకుండానే గడిచిపోతోందని దిగులుపడే ఔదార్యం. అటువంటి ఒక మనిషిని చూసాననీ, ఆయనకు ఎంతో సన్నిహితంగా మెలిగాననీ, ఆయన మా కుటుంబంలో ఒకడిగా, నేను ఆయన కుటుంబంలో ఒకడిగా మెలిగాననీ అనుకోవడమే నాకెంతో ఓదార్పుగా, ధైర్యంగా ఉంది.

ఆయన పరిచయమైన ఈ ముప్పైయేళ్ళ కాలంలో నా ఉద్యోగ జీవితంలో నేనెన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. బహుశా నేనెదుర్కొన్నంత వేధింపు మరే ఉద్యోగీ ఎదుర్కొని ఉండడు. ఆ సమస్యలు నా తల్లిదండ్రులకో, తోబుట్టువులకో చెప్పుకోగలిగేవీ కావు, చెప్పినా వాళ్ళు అర్థం చేసుకోగలిగేవీ కావు. అంగబలం, అర్థబలం, రాజకీయబలం లేని నాకు ఇన్నేళ్ళుగా పెద్ద దిక్కుగా నిలబడ్డ ఒకరిద్దరిలో హనుమంతరావుగారినే మొదట తలవాలి. అతి చిన్న సమస్యనుంచి అతి పెద్ద సమస్యదాకా ప్రతి ఒక్కటీ ఆయనకు చెప్పుకునేవాణ్ణి. ఎప్పుడు పడితే అప్పుడు, అర్థరాత్రిళ్ళు కూడా ఫోను చేసిన రోజులున్నాయి. ఒక్క ఫోను కాల్. ఇదీ సమస్య అని ఆయనకు చెప్పడం. నేను చూసుకుంటానులే అని ఆయన భరోసాగా ఒక్క మాట చెప్పడం. అంతే, ఆ సమస్య మరుక్షణమే మర్చిపోయేవాణ్ణి.

ఏం చేసేవారు? ఆయన నా సమస్య విని ఎవరైనా రాజకీయ నాయకులకో, పెద్ద అధికారులకో ఫోను చేసి ఉండేవారనుకుంటున్నారా? వాళ్ళెవరూ ఆయనకు తెలీదు. నిజానికి నేను చేసే ఉద్యోగం ఏమిటో మా అమ్మకి ఎంత తెలుసో, ఆయనకీ అంతే తెలుసు. మరేమి చేసి ఉండేవారు? ఆయన ఏమి చేసి ఉండకపోతే, జడివాన ముంచెత్తేలాగా కమ్ముకున్న మబ్బులు చూస్తూండగానే దూదిపింజల్లాగా తేలిపోయేవి? అది ఒక విశ్వాసికి మాత్రమే అర్థం కాగల రహస్యం. ఒక విశ్వాసికి మాత్రమే బోధపడగల అనుభవం.

ఆయన పక్కనుంటే గొప్ప ధైర్యంగా ఉండేది. ఒకసారి ఆయన మా ఇంటికి వచ్చారు. ఆయనతో మాట్లాడుతూ ఉన్నాను. ఇంతలో గౌరవనీయుడైన ఒక పార్లమెంటు సభ్యుడు నాకు ఫోను చేసాడు. మొదట రెండు మాటలు సవ్యంగానే మాట్లాడేడు. ఆ తర్వాత ఏమైందో ఏమో, తన ముందు కార్యకర్తలు ఉండిఉంటారు, వాళ్ళముందు తన ప్రతాపం చూపించడానికా అన్నట్టు, అసభ్యంగా, ఇక్కడ రాయలేని మాటలు మాట్లాడటం మొదలుపెట్టాడు. హనుమంతరావుగారికి అప్పుడు నా మొహంలో ఏ కష్టం కనిపించిందో, ఏమిటని ప్రశ్నిస్తున్నట్టు సైగ చేసారు. నన్ను నోటికొచ్చినట్టు దూషిస్తున్నాడని చెప్పాను. 'నోరుమూసుకొమ్మని చెప్పండి' అన్నారు. 'అంతేనా?' అన్నాను. 'అంతే, నేనున్నాను, చూసుకుంటాను' అన్నారు. మరుక్షణమే ఆ గౌరవసభ్యుడికి ఏ భాషలో జవాబివ్వాలో ఆ భాషలో జవాబిచ్చాను. అతడు నిరుత్తరుడై ఫోను పెట్టేసాడు.

ఇలాంటివి, ఎన్నో చెప్పగలను. 'మీ మంచికీ, చెడ్డకీ రెండింటికీ నేనున్నాను' అనేవారు. మంచికోసం గురువులుంటారు. కాని చెడ్డలో కూడా నిన్నర్థం చేసుకుని నీకోసం నిలబడే వాళ్ళని ప్రాణస్నేహితులంటాం. హనుమంతరావుగారు నాకు ప్రాణస్నేహితులుగా ఉన్నారని ఇప్పుడు అర్థమవుతున్నది. ఎంత ప్రాణస్నేహితుడిగా ఆయన నన్ను భావించి ఉండకపోతే, మొన్న హాస్పటల్లో తన బెడ్డు పక్కన నా ఫోను నంబరూ, విజ్జి ఫోను నంబరూ రాసిపెట్టుకుని ఉంటారు!

11-9-2022

వాడ్రేవు చినవీరభద్రుడు

సంతోషం ఒక క్రియాపదం

సత్యశోధకులూ సన్మార్గసాధకులూ

ఒక మనిషి తన తలపులకీ, మాటలకీ, చేతలకీ మధ్య వీలైనంత తక్కువ దూరం ఉండేలా చూసుకోడం మొదలుపెట్టినప్పుడు అతడి జీవితం తాత్త్వికం అవుతుందని చెప్పవచ్చు. ప్రాచీన ఏథెన్సులో సోక్రటీసు, ఎపిక్టెటసు, మార్కసు అరీలియసు, చీనాలో కన్ఫ్యూషియసు, డావోయిస్టులూ, భారతదేశంలో ఉపనిషత్కారులూ, బుద్ధుడూ, గాంధీ, మధ్యాసియాలో సువార్తలూ, సూఫీలూ, అమెరికాలో ఎమర్సనూ, థోరోలు నడిచిన దారి ఇది. యుగయుగాలుగా సత్యాన్వేషులకు మార్గదర్శకత్వం చేస్తూ ఉన్న మహనీయ తాత్త్వికుల గురించీ, దార్శనికుల గురించీ వాడ్రేవు చినవీరభద్రుడు గత పదేళ్ళుగా రాస్తూ వచ్చిన నలభై వ్యాసాల సంపుటి ఇది. తెలుగు తాత్త్వికసాహిత్యానికి ఈ సంపుటం ఒక విలువైన చేర్పు కాగలదని భావిస్తున్నాం.